
'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 325

శనివారం 15-2-2025



'రాయల్' విజయంతో మొదలు
డబ్ల్యూపీఎల్ తొలి పోరులో గుజరాత్‌పై బెంగళూరు మెరుపు గెలుపు - 15లో



పెన్నుల నుంచి పాలిమర్స్ దాకా..
ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు పీఎమ్ఈజీపీ రుణాల వివరాలు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మార్గదర్శిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగాల్సిందే

కౌంటర్‌లో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కర్త రామోజీ మరణించినంత మాత్రాన బాధ్యతల నుంచి మార్గదర్శి తప్పించుకోజాలదు

మార్గదర్శి, రామోజీ వాదనలన్నీ శుద్ధ అబద్ధాలే..

- చట్టవిరుద్ధ డిపాజిట్ల స్వీకరణపై ఫిర్యాదు అందలేదన్నది అవాస్తవం
- మార్గదర్శి అక్రమ డిపాజిట్లపై మాకు ప్రజలు, డిపాజిటర్ల నుంచి ఫిర్యాదులు అందాయి
- డిపాజిట్ల స్వీకరణ చట్ట విరుద్ధమని చెబుతూనే వచ్చాం
- సెక్షన్ 45 ఎస్ వర్తిస్తుందని కూడా చెప్పాం..
- డిపాజిట్ల స్వీకరణకు మేం సర్టిఫికెట్ ఇచ్చామనడం అబద్ధం
- డిపాజిట్ల వసూలుకు మేం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు
- మార్గదర్శి, రామోజీరావుల డిపాజిట్ల స్వీకరణ చట్ట విరుద్ధమే
- ఇది సెక్షన్ 58 బీ (5ఏ) ప్రకారం శిక్షార్హం..
- మార్గదర్శి అనుబంధ పిటిషన్‌ను కొట్టేయండి

సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావుల చట్ట ఉల్లంఘనలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పలు కీలక విషయాలను తెలంగాణ హైకోర్టు ముందుంచింది. తాము వసూలు చేసిన డిపాజిట్ల విషయంలో ఏ ఒక్క డిపాజిటర్ కూడా తమపై ఫిర్యాదు చేయలేదంటూ ఇన్నేళ్లుగా మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావు చెబుతూ వచ్చిన దాంట్లో వాస్తవం లేదని ఆర్‌బీఐ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్ట విరుద్ధంగా వసూలు చేసిన డిపాజిట్లపై తమకు ప్రజల నుంచి, డిపాజిటర్ల నుంచి ఫిర్యాదులు అందాయని వెల్లడించింది. డిపాజిట్ల వసూలు విషయంలో తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్న మార్గదర్శి, రామోజీ వాదన శుద్ధ అబద్ధమని స్పష్టం చేసింది. ఇదే సమయంలో... చట్ట విరుద్ధంగా ప్రజల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కర్త చెరుకూరి రామోజీరావు మరణించిన నేపథ్యంలో, తమపై

మిగతా 12వ పేజీలో ▶



HUF i.e. Petitioner No.1 is a separate distinct legal entity from its members and therefore the criminal proceedings initiated against HUF shall continue even after the death of petitioner no. 2 i.e. the Karta of the HUF. It is an admitted position that Petitioner No.1 has accepted deposits from the public. The same was done by indulging in activities specified in clause (c) of section 45I read with Section 45S of the Reserve Bank of India Act (hereinafter referred to as "RBI Act"), thereby attracting the penal provision of Section 58B(5A) read with Section 45S of the RBI Act.

కర్త మరణించినా కూడా హెచ్‌యూఎఫ్‌పై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగుతాయన్న ఆర్‌బీఐ

రామోజీ నేరాలకు కుమారుడిని జైలుకు పంపుతారా?

తండ్రి నేరం చేసినా.. కుమారుడిని జైలుకు ఎలా పంపుతారంటూ ధర్మాసనానికి నివేదన

- అవకతవకలకు రామోజీనే బాధ్యుడు.. కుటుంబ సభ్యులకు దాంతో ఏం సంబంధమని వితండ వాదన.. నేరం చేసినట్లు పరోక్షంగా అంగీకారం
- 18 ఏళ్లుగా సెక్షన్ 45 (ఎస్) తమకు వర్తించదని వాదించిన రామోజీ.. తాము తప్పే చేయలేదని ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించిన మార్గదర్శి
- రామోజీ లేరు కాబట్టి క్రిమినల్ ప్రొసీడింగ్స్ చెల్లవంటూ తాజాగా వాదనలు.. మరణాన్ని అడ్డుపెట్టుకుని కేసు నుంచి బయటపడే యత్నాలు
- చట్టవిరుద్ధ పనులకు బాధ్యత వహించాలని గుర్తు చేసిన హైకోర్టు.. క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించాల్సిందేనంటున్న ఆర్‌బీఐ
- తదుపరి విచారణ 28కి వాయిదా వేసిన హైకోర్టు

12లో



ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు

2030 కల్లా 500 బిలియన్ డాలర్లకు..

- భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు
- భారీగా చమురు, సహజవాయువు కూడా
- ట్రంప్-మోదీ భేటీలో కీలక నిర్ణయాలు
- వైట్‌హౌస్‌లో అధ్యక్షునితో ప్రధాని భేటీ
- రెండోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారి మోదీని ఆత్మీయంగా ఆహ్వానించిన ట్రంప్
- సుదీర్ఘ కరచాలనం, సుదృఢ ఆలింగనం
- బేరాల్లో తనకంటే మొనగాడంటూ కితాబు
- ముంబై కారకులను పాక్ శిక్షించాల్సిందే
- సంయుక్త మీడియా భేటీలో ట్రంప్
- ముష్కరుడు రాణాను అప్పగిస్తున్నట్టు ప్రకటన
- భారత్ కూడా టారిఫ్‌లు ఎదుర్కోవాల్సిందే
- మోదీ సమక్షంలోనే అధ్యక్షుని స్పష్టీకరణ

- వివరాలు 6లో

ఎఫ్-35.. అంతు 'చిక్కదు'

మోదీకి స్పెషల్ గిఫ్ట్

'అవర్ జర్నీ టుగెదర్' పుస్తకం అందజేసిన ట్రంప్

- వివరాలు 6లో

మార్చి 19న సునీత ఆగమనం
సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఊరట - 6లో

కొత్త ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



- రాహుల్ విధేయురాలికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యతలు
- ప్రస్తుత ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తొలగింపు
- జార్ఖండ్ వ్యవహారాలు కొప్పుల రాజుకు అప్పగింత
- ఆదేశాలు జారీ చేసిన పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

2లో

మోదీ పుట్టుకతో బీసీ కాదు

కాంగ్రెస్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



శుక్రవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఆయన కులం గతంలో ఉన్నత వర్గాల్లో ఉండేది.. గుజరాత్‌కు సీఎం అయ్యాక కులాన్ని బీసీల్లో కలిపారు
- ఇత్తేసి పొత్తు కుదిరారు.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ
- జనాభా లెక్కలు చెప్పని కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కు లేదు
- కులగణనపై డిప్యూటీ సీఎం భట్టి, వర్గీకరణపై మంత్రి దామోదర పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి మోదీని ఉద్దేశించి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ పుట్టుకతో బీసీ కాదని, ఆయన కులం గతంలో ఉన్నత వర్గాల్లో ఉండేదని, గుజరాత్‌కు సీఎం అయ్యాక ఆయన తన కులాన్ని బీసీల్లో కలిపి ఇత్తేసి పొత్తు కుదిరాడని అన్నారు. మోదీ సర్టిఫికెట్ మాత్రమే బీసీదని, మనస్తత్వం ఇందుకు వ్యతిరేకమని విమర్శించారు. తాను బీసీ ప్రధానిని కనుక ఇక ఎవరూ అవసరం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులపై కూడా సీఎం విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జనాభా లెక్కలు చెప్పని కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కు లేదని అన్నారు. మరోమారు నిర్వహిస్తున్న కులగణనలో అయినా వివరాలు ఇవ్వకపోతే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు సామాజిక బహిష్కరణే శిక్ష అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ సమావేశంలో తీర్మానం చేస్తున్నామని, అందరూ ఆమోదించాలని కోరారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఎ.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన కులగణన, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కార్యక్రమం జరిగింది. రాష్ట్రంలో కులగణన చేసిన తీరును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎస్సీలను వర్గీకరించిన తీరును మంత్రి దామోదర రాజనర్సింహ.. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు,

మిగతా 3వ పేజీలో ▶

మోదీ బీసీనా కాదా? బహిరంగ చర్చకు రావాలి
సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్

- వివరాలు 3లో

తప్పులు.. సిలబస్‌లో లేని ప్రశ్నలు

- జేఈఈ మెయిన్ నిర్వహణలో ఎన్‌టీఏ తీరుపై విమర్శలు
- తాజా పరీక్షలో ఎన్నడూ లేని రీతిలో 12 ప్రశ్నల తొలగింపు
- సిలబస్‌లో లేని ప్రశ్నలు సైతం అడుగుతున్న వైనం
- సాంకేతిక లోపం, మానవ తప్పిదం అంటున్న సంస్థ
- విద్యార్థుల సమయం వృథా అవుతోందంటున్న నిపుణులు

సాక్షి, ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్ విషయంలో.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లోపాలతో కూడిన ప్రశ్నల సంఖ్య పెరగడం, తుది ఆన్సర్ కీలో వాటిని తొలగించడం, సిలబస్ పరిధిలో లేని ప్రశ్నలు అడగడం పరిపాటిగా మారింది. ఇటీవల ఫలితాలు విడుదలైన జేఈఈ మెయిన్- 2025 జనవరి సెషన్‌పై సైతం విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్‌టీఏ నిబద్ధతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్‌టీఏ వైఫల్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిపుణులు చెబుతున్నారు.

సమర్థ నిర్వహణలో వైఫల్యం!

జేఈఈ మెయిన్ విషయంలో ఎన్‌టీఏ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ ఏడాది పలు షిఫ్ట్‌లలో నిర్వహించిన పరీక్షల్లో తొలగించిన ప్రశ్నల సంఖ్యనే ఇందుకు నిదర్శనమని సబ్జెక్ట్ నిపుణులు చెబు తు న్నారు. ఈ ఏడాది మొత్తం పది షిఫ్ట్‌లలో పరీక్ష నిర్వహించగా.. ఏకంగా 12 ప్రశ్నలను తొలగించారు. ఇందులో అత్యధికంగా ఫిజిక్స్ సబ్జెక్ట్ నుంచి 8 ప్రశ్నలు ఉంటే.. మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీల నుంచి రెండు చొప్పున నాలుగు ప్రశ్నలు ఉన్నాయి. దీనికి సాంకేతిక లోపం, మానవ తప్పిదం కారణంగా పేర్కొనడం గమనార్హం. జాతీయ స్థాయిలో

మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మీరు గ్రేట్ సార్! సూపర్ సిక్స్ అని చెప్పి సూపర్ 'ఫిక్స్' పథకం అమలు చేస్తున్నారు!



‘అనాబ్ - ఎ-షాహి’ ఎక్కడోయి?

- నాడు హైదరాబాద్ శివారులో విరివిగా సాగైన ద్రాక్ష
- పదేళ్ల క్రితం వరకు పది వేల ఎకరాల్లో సాగు
- ప్రస్తుతం గణనీయంగా తగ్గిన పంట విస్తీర్ణం
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 115 ఎకరాలకే పరిమితం
- నగర విస్తరణ, రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూగర్భ జలాలు అడుగంటడం, పెరిగిన సాగు వ్యయంతో తగ్గిపోయిన పంట

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ముచ్చట గొలిపే పచ్చని పందిళ్లు..పంట బాగా వస్తే ఆకుల్ని మించి గుత్తులుగా వేలాడుతూ కన్పించే పండ్లు. ఏళ్ల క్రితం హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో కనువిందు చేసిన ద్రాక్ష తోటలు ఇప్పుడు దాదాపుగా కనుమరుగయ్యాయి. ధనికుల పంటగా ప్రాచుర్యం పొందిన ద్రాక్ష పది హేనేళ్ల క్రితం మేడ్చల్, కీసర, శామీర్‌పేట్, మహేశ్వరం, మన్నాన్‌పల్లి, గట్టుపల్లి, బాసగూడతండా, రావిర్యాల, మంకాల్, కోళ్లపడకల్, ఆకాన్‌పల్లి, డబిల్‌గూడ, పెండ్యాల్, నాగారం తదితర ప్రాంతాల్లో విరివిగా సాగయ్యేది. ఒక్కో గ్రామం పరిధిలో 350 నుంచి 400 ఎకరాల్లో ఈ తోటలు వేసే వారు. సీజన్‌లో శివారు ప్రాంతాల్లో వెలిసే తాత్కాలిక దుకాణాల్లో చవకగా లభించే పండ్లను నగరవాసులు ఆస్వాదించేవారు. జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల్ని నిలిపి మరీ కిలోల కొద్దీ కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. తదనంతర కాలంలో భూగర్భ జలాలు అడుగంటి నీటి కొరత ఏర్పడటం, పెట్టుబడి ఖర్చులు రెట్టింపవడం, చీడపీడల బెడద ఎక్కువవడం, అంచనాలకు మించి నష్టాలు వస్తుండటంతో క్రమేణా ద్రాక్ష సాగు తగ్గిపోయింది. ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ ఐటీ, అనుబంధ కంపెనీలు నగరానికి క్యూకట్టడం, నగరం విస్తరిస్తూ శివారు ప్రాంతాలు రియల్ వెంచర్లుగా మారడం, భూముల ధరలకు రెక్కలు రావడం కూడా ద్రాక్ష తోటలు కన్పించకుండా పోయేందుకు కారణమయ్యింది. అప్పట్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పదివేల ఎకరాల్లో సాగైన ద్రాక్ష తోటలు..ప్రస్తుతం కేవలం 115 ఎకరాలకే పరిమితమైపోయాయి. ప్రస్తుతం మహారాష్ట్ర, కర్ణాటక నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

నవాబుల కాలంలో..

స్వాతంత్య్రానికి ముందు నిజాం నవాబుల భవంతుల వెనుక భాగం (బ్యాక్‌యార్డ్)లో ద్రాక్ష సాగు చేసేవారు. అయితే చాలాచోట్ల ఒకటి రెండు చెట్లే కన్పించేవి. హైదరాబాద్‌లో తెల్ల ద్రాక్ష పంటకు ‘అనాబ్-ఎ-షాహి’గా నామకరణం చేశారు. టోలిచౌకిలో గద్దె రామకోటేశ్వరరావు తొలిసారిగా ద్రాక్ష పంటను సాగు చేసినట్లు చరిత్ర చెబుతోంది. సాధారణంగా సమశీతోష్ణ మండలంలో పండే పంటను హైదరాబాద్ పరిసరాల్లో పండించి ఆయన ఒకరకంగా చరిత్ర సృష్టించారు. దీంతో అప్పటి ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అప్పట్లో ఎకరానికి ఆరు నుంచి ఏడు టన్నుల వరకు దిగుబడి సాధించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత అప్పటివరకు ఉగాండా, కెన్యా, దక్షిణాఫ్రికా దేశాల్లో స్థిరపడిన వారు అక్కడి అలజడుల కారణంగా హైదరాబాద్‌కు వలస వచ్చారు. పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేసి ‘అనబిషాయి’ సాగు చేశారు. ఆంధ్ర నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన కొందరు కూడా ద్రాక్షను సాగు చేశారు. ఇలా పలువురు ధనవంతులు ఈ పంటపై దృష్టి సారించారు. దీంతో ఆ పంటకు ‘రిచ్‌మెన్ క్రాప్ (ధనికుల పంట)’గా పేరొచ్చింది.

‘అనాబ్-ఎ-షాహి’ అంటే ద్రాక్షలో రారాజు అని అర్థం. నిజాం కాలంలో దీనికి నామకరణం చేశారు.

2005 నుంచి తగ్గుముఖం

దిగుబడితో పాటు లాభాలు అధికంగా ఉండటంతో 1990 తర్వాత స్థానిక రైతులు కూడా ఈ పంట సాగు మొదలు పెట్టారు. 1991లో హైదరాబాద్ వేదికగా గ్రేప్స్ పంటపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం గమనార్హం. కాగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ద్రాక్ష పంటకు రాజధానిగా గుర్తింపు పొందింది. ఇక్కడి రైతులను ఆదర్శంగా తీసుకుని మహారాష్ట్రలో కూడా సాగు ప్రారంభించారు. 2005 వరకు ఇక్కడి వైభవం కొనసాగింది. ఆ తర్వాత అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకప్పటి ఈ పంట భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. దీంతో ఒకప్పుడు నగర వాసులకు తీపిని పంచిన స్థానిక ద్రాక్ష.. ప్రస్తుతం అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి పెద్ద మొత్తంలో ద్రాక్ష దిగుమతి అవుతోంది. స్థానిక రైతులు పోటీలోనే లేని పరిస్థితి ఉంది.

మెజార్టీ ఆదాయం సాగు ఖర్చుకే

నేను గత 15 ఏళ్లుగా ద్రాక్ష పంటను సాగు చేస్తున్నా. ఒకసారి మొక్కను నాటితే 20 ఏళ్లపాటు దిగుమతి వస్తుంది. మొదట్లో ‘థాంసన్’ వెరైటీని సాగు చేశా. తర్వాత ‘మాణిక్ చమన్’ వెరైటీని ఎంచుకున్నా. ఎకరాకు వెయ్యి మొక్కలు చొప్పున నాలుగు ఎకరాల్లో నాటా. మొక్కల ఎంపిక సహా సస్యరక్షణలో చిన్నచిన్న మెళకువలు పాటించి నాటిన రెండేళ్లకే అనూహ్యంగా మంచి దిగుబడిని సాధించా. ప్రస్తుతం ఒక్కో చెట్టు నుంచి 20 కేజీల వరకు దిగుమతి వస్తోంది. ఎకరా పంటకు కనీసం నాలుగు నుంచి ఐదు లక్షల ఆదాయం వస్తుంది. అయితే కూలీ రేట్లు, ఎరువుల ధరలు పెరగడంతో మెజార్టీ ఆదాయం పంట సాగుకే ఖర్చవుతోంది.


– కొమ్మిరెడ్డి అంజిరెడ్డి, రైతు, తుక్కుగూడ

ఇప్పుడు పరిస్థితి మునుపటిలా లేదు



ఇప్పుడు పరిస్థితి మునుపటిలా లేదు. భూములూ అందుబాటులో లేవు. దీంతో ద్రాక్ష సాగు తగ్గిపోయింది. కూలీల ఖర్చులు పెరగడం, దిగుబడి సమయంలో ఈదురుగాలులు, వడగళ్ల వర్షం లాంటి వాటితో పంట నష్టపోవాల్సి వస్తోంది. మాలాంటి అనుభవం ఉన్న పాత రైతులే ద్రాక్షను సాగు చేయలేని పరిస్థితి ఉంది. ఇక కొత్తగా ఎవరైనా ప్రయత్నించినా భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

– చింతల వెంకట్‌రెడ్డి, ఒకప్పటి ద్రాక్ష రైతు, పద్మశ్రీ అవార్డు గ్రహీత



క్లుప్తంగా...

ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు నేడు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న గిరిజన బంజారా ఉద్యోగులకు శనివారం ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజనులు, బంజారాల ఆరాధ్యుడైన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా సెలవును ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వర్గీకరణతో అసమానతలు సమసిపోతాయి

మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణతో అణగారిన కులాల్లో అసమానతలు పోతాయని, సమష్టిగా ఎదిగేందుకు తోడ్పడుతుందని మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో ప్రతినిధులు మంత్రిని కలిసి ఎస్సీ వర్గీకరణకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల ఏ కులానికి, మతానికి నష్టం జరగదని చెప్పారు. దళితుల్లో అత్యంత వెనుకబడిన 57 ఎంబీ ఎస్సీ కులాలకు కుల ధ్రువీకరణ పత్రాలను ఆర్డీవో ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారా ఇవ్వాలని ప్రతినిధులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ కులాలకు స్పెషల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఈఆర్సీ సభ్యుల భర్తీకి నోటిఫికేషన్

24వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)లో ఖాళీగా ఉన్న మెంబర్ (ఫైనాన్స్), మెంబర్ (టెక్నికల్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తిగలవారు ఈ నెల 24లోగా తమ దరఖాస్తులను ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి పేరుతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం, రెండో అంతస్తు, రూమ్ నంబర్ 16, హైదరాబాద్–500004 చిరునామాకు పంపించాలని కోరింది. మరిన్ని వివరాలకు www. telangana. gov. in, www. tgsouthernpower. org, www. tggenco. com www. tgerc. telangana.gov వెబ్ సైట్లను సందర్శించాలని సూచించింది. ఈఆర్సీ సభ్యుల ఎంపిక ప్రక్రియ కోసం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్‌పర్సన్ సభ్యులుగా కమిటీని ప్రభుత్వం నియమించింది.

ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఒకసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన తర్వాత అందులో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఫలితాలు వెలువడిన తర్వాత ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని వ్యాఖ్యానించింది. కరీంనగర్ నియోజకవర్గం నుంచి పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు తన నామినేషన్ తిరస్కరణను సవాలు చేస్తూ పోచబోయిన శ్రీహరి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం కోసం రూ.10,000 సెక్యూరిటీ డిపాజిట్, ఫారమ్–26తో సహా నామినేషన్‌ను సమర్పించానని, అఫిడవిట్ సమర్పణలో వ్యత్యాసాలున్నాయంటూ తిరస్కరించారని శ్రీహరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక జోక్యం చేసుకుంటే ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంటుందంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

రెండేళ్లలో సమీకృత గురుకులాలు

105 నియోజకవర్గాల్లో 105 స్కూళ్ల నిర్మాణం పూర్తవ్వాలి

- ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్’పై సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం
- ప్రతిపాదిత స్కూల్ స్థలాలను వెంటనే పరిశీలించాలి.. రాకపోకలకు అనువుగా ఉన్న ప్రాంతాలను ఎంచుకోవాలి
- వారంలో నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశం



రెసిడెన్షియల్ స్కూళ్లపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల (సమీకృత గురుకుల పాఠశాల)ను రెండేళ్లలో పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించామని చెప్పారు. సమీకృత పాఠశాలల నిర్మాణానికి సంబంధించి స్థలాల సేకరణ, పనుల పురోగతి, ఇతర అంశాలపై శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించి నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తామని తెలిపారు. నియోజకవర్గాల్లో స్థలాల కేటాయింపులు పూర్తయినకొద్దీ అనుమతులు జారీ చేస్తూ.. పనులు ప్రారంభించాలని, గడువులోగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్థలాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వండి

కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లలో స్కూళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, మార్చి 20న పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. దీంతో ఇతర గురుకులాల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు అనువుగా ఉన్నాయో, లేదో పరిశీలించాలని సీఎం సూచించారు. అనువైన స్థలాలు లేని ప్రాంతంలో ప్రత్యామ్నాయంగా స్థలాన్ని సేకరించాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాలకు రాకపోకలు అనువుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యతగా గుర్తించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వీలైనంత త్వరగా స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి, స్థలాల గుర్తింపు ప్రక్రియకు సంబంధించి వారం రోజుల్లో జిల్లా కలెక్టర్లు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రెండేళ్లలో రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో సమీకృత గురుకులాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

మహిళా వర్సిటీలో చారిత్రక కట్టడాల పరిరక్షణ..

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో అత్యున్నత ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. మహిళా విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర అవసరాల కోసం చేపట్టే నిర్మాణాలు యూనివర్సిటీల స్థాయిలో ఉండాలని, ఈ విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని గదులు, ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్, ఇతర నిర్మాణాలు చేపట్టాలన్నారు. వర్సిటీ ప్రాంగణంలోని చారిత్రక, పురాతన కట్టడాలను పరిరక్షించాలని, వాటికి అవసరమైన మరమ్మతుల విషయంలో పురావస్తు శాఖ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

‘పర్యాటక’ బడ్జెట్ పెంచుతాం: సీఎం

పర్యాటక శాఖకు బడ్జెట్ పెంచుతామని, ఆ శాఖ ఆదాయం సమకూర్చడమే కాకుండా ఎక్కడికక్కడ యువతకు ఉపాధి కల్పించే వనరుగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు ఎన్నో ఉన్నా, ప్రచారంపై శ్రద్ధ చూపక, వినూత్న పద్ధతిలో ఆలోచించక ఆశించిన ప్రగతి లేదన్నారు. శుక్రవారం పర్యాటక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలని, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు వేదికలు రూపొందించాలని సూచించారు. ఆలయాలు, అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, వాటిని అభివృద్ధి చేయటంపై దృష్టి సారించాలని ఆదేశించారు. భువనగిరి కోట రోప్ వే పనులపైనా సీఎం ఆరా తీశారు. పర్యాటక పాలసీకి తుది రూపు ఇచ్చే సమయంలో అటవీ, ఐటీ, విద్యుత్, టీజీ ఐఐసీ, వైద్య, క్రీడల శాఖల మధ్య ఇబ్బందులు ఉండకుండా సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

దండాలు పెడితే పదవులు రావు

గల్లీలో పేదల కోసం పనిచేసే వారికే పదవులు: సీఎం రేవంత్‌రెడ్డి

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన శివచరణ్‌రెడ్డి



యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితుడైన శివచరణ్‌రెడ్డితో సీఎం రేవంత్ విజయ సంకేతం

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీకి వెళ్లి దండాలు పెడితే, ఆ నాయకుల అండ ఉందంటే కాంగ్రెస్ పార్టీలో పదవులు వచ్చే రోజులు పోయాయని, గల్లీలో పేదల కోసం పనిచేసే వారికి, కష్టపడే వారికి మాత్రమే పదవులు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పైరవీలతో పదవులు తెచ్చుకునే సంగతిని మర్చిపోవాలని చెప్పారు. డబ్బులతో ఎన్నికల్లో గెలిచే రోజులు కూడా పోయాయని, నిత్యం ప్రజల్లో ఉండేవారినే గెలుపు వరిస్తుందని అన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్‌రెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన చాలామంది నాయకులు జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో రాణించారని, రాజకీయాల్లో యువజన కాంగ్రెస్ మొదటి మెట్టు వంటిదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యూత్ కాంగ్రెస్ నాయకులపై ఉందన్నారు.

కేసీఆర్ బయటకొచ్చి చేసేదేముంది?: కొడితే గట్టిగా కొడదామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటున్నారని, ఆయన కొడితే.. రాష్ట్రాన్ని దోచుకున్న అల్లుడు, కొడుకును గట్టిగా కొట్టాలని రేవంత్ అన్నారు. ఆయన కుర్చీలో కూర్చున్నప్పుడే గట్టిగా బండకేసి కొట్టి ప్రజలు ఓడగొట్టారని, ఇప్పుడు మళ్లీ బయటకు వచ్చి ఆయన చేసేది ఏముందని ఎద్దేవా చేశారు.

మెగా పార్కుల ఏర్పాటుకు సాయం చేయండి

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి
- హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘బయో ఏషియా’కు హాజరు కావాలని ఆహ్వానం



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మెగాపార్కుల ఏర్పాటుకు సహాయం అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చించారు.

‘బయో ఏషియా’కు ఆహ్వానం

హైదరాబాద్‌లో ఈనెల 26న నిర్వహించనున్న ‘బయోఏషియా–2025’కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి శ్రీధర్‌బాబు కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. కాగా, తెలంగాణలో జీవవిజ్ఞాన రంగ అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు తీసుకుంటున్న చర్యలను పీయూష్ గోయల్ ప్రశంసించారు. బయో ఏషియాకు హాజరవుతానని హామీ ఇచ్చారు. కాగా, కరీంనగర్ జిల్లా రుక్మాపూర్, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ గ్రామం వద్ద మెగా లెదర్ పార్కులు (ఎంఎల్‌పీ) ఏర్పాటు చేయాలని, పారిశ్రామిక ప్రోత్సాహక విధానాల విభాగం (డీపీఐఐటీ) నుంచి వీటికి సహాయాన్ని అందించాలని శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. అలాగే జాతీయ పారిశ్రామిక మార్గ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) పరిధిలోని జహీరాబాద్ నోడ్ అభివృద్ధిపై కేంద్ర మంత్రితో శ్రీధర్‌బాబు చర్చించారు. దీనికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఒసాకా ఎక్స్‌పోలో పాల్గొంటాము

తెలంగాణ పెట్టుబడులు, పరిశ్రమల సామర్థ్యాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించేందుకు ఈ ఏడాది జపాన్‌లో జరగనున్న ‘ఒసాకా ఎక్స్‌పో’లో తెలంగాణ ప్రభుత్వం పాల్గొననున్నట్లు పీయూష్ గోయల్‌కు మంత్రి శ్రీధర్‌బాబు అధికారికంగా తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి లేఖను కేంద్ర మంత్రికి అందజేశారు. పీయూష్ గోయల్‌తో జరిగిన సమావేశంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, తెలంగాణభవన్ ఆర్‌సీ గౌరవ్ ఉప్పల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్

తెలంగాణ బాధ్యతల నుంచి దీపాదాస్ మున్షీ తొలగింపు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌ను మారుస్తూ ఏఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. దీపాదాస్ మున్షీని తప్పించి, ఆమె స్థానంలో మీనాక్షి నటరాజన్‌కు బాధ్యతలను కట్టబెట్టింది. ఈ మేరకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇక పార్టీ సీనియర్ నేత కొప్పుల రాజుకు జార్ఖండ్ వ్యవహారాల ఇన్‌చార్జ్ బాధ్యతలు కట్టబెట్టారు. వీరితోపాటే మరో ఏడుగురు సీనియర్ నేతలను వివిధ రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

పూర్తిస్థాయి పర్యవేక్షణ కోసమే

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఇన్‌చార్జ్‌గా ఉన్న మాణిక్‌రావ్ థాక్రేను గోవాకు పంపిన ఏఐసీసీ, కేరళ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న దీపాదాస్ మున్షీకి రాష్ట్ర బాధ్యతలను అదనంగా కట్టబెట్టింది. అప్పటి నుంచి ఆమె పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా ఉంటున్నారు. అయితే పార్టీనేతలకు ఆమె అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, ప్రభుత్వంతో పార్టీని సమన్వయం చేయడంలో విఫలమయ్యారనే విమర్శలొచ్చాయి. ఇటీవల కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ.. పార్టీలో నెలకొన్న అసంతృప్తిని తట్టిలేపింది. ఆమె సారథ్యంలో సీఎల్పీ భేటీ నిర్వహించి సరిదిద్దే ప్రయత్నం చేసినా... ఈ అంశం ఏఐసీసీకి చేరింది. ఆమెస్థానంలో పూర్తిస్థాయి నేతకు బాధ్యతలు కట్టబెట్టాలని నిర్ణయించారు.

రాహుల్ టీమ్ నుంచే..

మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్‌లోని బిర్లాగ్రామ్ నాగ్దాలో జన్మించారు. ఆమె బయోకెమిస్ట్రీలో పీజీ, న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ చేశారు. 1999లో ఎన్ఎస్‌యూఐ నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2002–2005 వరకు మధ్యప్రదేశ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమెను, 2008లో ఏఐసీసీ కార్యదర్శిగా రాహుల్‌గాంధీ ఎంపిక చేశారు. అప్పటి నుంచి రాహుల్ టీమ్‌లో ఉన్న ఆమె 2009లో మంద్‌సౌర్ నుంచి ఎంపీగా పోటీ చేసి.. 1971 నుంచి అక్కడ గెలుస్తున్న లక్ష్మీనారాయణ్ పాండేను ఓడించారు. అనంతరం 2014, 2019 ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. అయినా రాహుల్ టీమ్‌లో కొనసాగిన ఆమె భారత్ జోడో యాత్ర, న్యాయ్‌యాత్రలో క్రియాశీల పాత్ర పోషించారు. 2023 ఆగస్టు 6న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆమెను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పరిశీలకురాలిగా నియమించారు. భూదాన్ పోచంపల్లి నుంచి పాదయాత్ర చేసి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. తాజాగా ఆమెకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ బాధ్యతలు కట్టబెట్టారు. అయితే.. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అంశంపై చర్చించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హడావుడిగా ఢిల్లీ వచ్చారనే ప్రచారం జరిగింది. ఆయన ఢిల్లీ చేరే సమయానికే ఏఐసీసీ నుంచి కొత్త ఇన్‌చార్జ్‌పై ప్రకటన వెలువడింది.

జార్ఖండ్‌కు కొప్పుల రాజు

రాహుల్ టీమ్‌కే చెందిన కొప్పుల రాజును జార్ఖండ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఏఐసీసీ నియమించింది. 15 ఏళ్లుగా పార్టీ మేనిఫెస్టో, విధాన రూపకల్పన, పార్టీపరంగా కేంద్రంపై లేవనెత్తాల్సిన అంశాలపై ప్రధాన సలహాదారుగా ఉన్న ఆయనకు జార్ఖండ్ బాధ్యతలు కట్టబెట్టారు. ఆయన గత ఎన్నికల్లో ఏపీలోని నెల్లూరు నుంచి లోక్‌సభకు పోటీ చేసి ఆయన ఓడిపోయారు.

షాన్‌దార్ ఐఐటీ హైదరాబాద్

- అత్యంత ప్రభావవంతమైన సంస్థల జాబితాలో చోటు
- సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో నాలుగో స్థానం
- విజయవాడలోని ఎస్‌పీఏకు మూడో స్థానం



సాక్షి, న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో అత్యంత ప్రభావవంతమైన భారతీయ విద్యా సంస్థల్లో ఐఐటీ–హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ)కు మూడో స్థానం సాధించగా, మొదటి, రెండు స్థానాల్లో ఐఐటీ– ముంబై, ఐఐటీ–మండీలు ఉన్నాయి. ‘నో యువర్ ఇన్‌స్టిట్యూషన్’, ‘సక్సెస్ స్టోరీస్’విభాగాల్లో సోషల్ మీడియా ప్రచారాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన సంస్థలుగా ఎక్కువమంది వీటికి మద్దతు ఇచ్చారు. అత్యాధునిక పరిశోధన, విద్యార్థుల నేతృత్వంలోని స్టార్టప్‌లు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతికత వినియోగం వంటి అంశాలపై డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన పెంచే లక్ష్యంతో ఈ ప్రచార కార్యక్రమాన్ని గత ఏడాది జూన్‌లో ఉన్నత విద్యా సంస్థ (హెచ్ఈఐ) చేపట్టింది. మొత్తంగా 27 లక్షల మంది ఈ ప్రచార కార్యక్రమానికి మద్దతుగా నిలవగా, 1.54 లక్షల మంది ఐఐటీ– ముంబైకి, విజయవాడ ఎస్‌పీఏపై 1.35 లక్షల మంది, ఐఐటీ–హైదరాబాద్‌కు 1.33 లక్షల మంది ఓటేశారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకత

సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటుతో ఇంటర్‌బోర్డు కొత్త బెంచ్‌మార్క్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో అత్యాధునిక సీసీటీవీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకత పెంచేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి (టీజీబీఐఈ) ఓ విప్లవాత్మక అడుగు ముందుకేసింది. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సిస్టంతో అనుసంధానించారు. టీజీబీఐఈ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కమాండ్ కంట్రోల్ వ్యవస్థ పనితీరును శుక్రవారం విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, జ్యోత్స్నరెడ్డిలతో కలిసి పరిశీలించారు. తెలంగాణ విద్యా వ్యవస్థలో మొదటిసారిగా ప్రవేశపెట్టిన సాంకేతిక వ్యవస్థతో పరీక్ష కేంద్రాలను రియల్‌టైంలో పర్యవేక్షించడంతోపాటు న్యాయమైన పరీక్ష వాతావరణాన్ని ఏర్పాటు చేయొచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో ఏర్పాటు చేసిన 8,000 కంటే ఎక్కువ హైరిజల్యూషన్ కెమెరాలతో అనుసంధానం చేసిన కమాండ్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య వివరించారు. ఈ నూతన వ్యవస్థతో పరీక్షల నిర్వహణను ఏకకాలంలో పర్యవేక్షించడానికి, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా చేయడంతోపాటు ఏవైనా అవకతవకలను నివారించడానికి వీలు ఉంటుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడడంపై అధికారులను మురళి ప్రశంసించారు. ఇది విద్యారంగంలో ఒక మైలురాయిగా, పరీక్ష సంస్కరణలకు కొత్త ప్రమాణంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లాలోని ఒక ప్రభుత్వ కళాశాలను సీసీటీవీ ద్వారా పరిశీలించారు. రాష్ట్ర విద్యా వ్యవస్థపై నమ్మకం, విశ్వాసాన్ని ఈ వ్యవస్థ బలోపేతం చేస్తుందని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న ఇతర విద్యా బోర్డులకు ఆదర్శప్రాయమైన నమూనాగా పనిచేస్తుందని చెప్పారు.

అడవిబిడ్డలకు ‘కెరీర్’ పాఠాలు

ఐటీడీఏలో గిరిజన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

- పాఠశాలల్లో ప్రభుత్వ ఉద్యోగుల అనుభవ పాఠాలు
- శ్రీకారం చుట్టిన భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థుల లక్ష్యాలు తెలుసుకుంటున్న భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: లోకం పోకడ తెలియని అడవి బిడ్డలు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషిచేసేలా ఓ అధికారి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్.. ఆ ప్రాంతంలోని పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్ రూపొందించారు. భద్రాచలంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ అధికారులను ఆహ్వానించి, వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకోవటమే ఈ కార్యక్రమ ఉద్దేశం.

స్వీయ అనుభవాలే ప్రధానం: మండల స్థాయిలో పనిచేసే తహసీల్దార్, ఎంపీడీఓ, డాక్టర్, ఎస్ఐ, బ్యాంకు మేనేజర్ తదితర ప్రభుత్వ అధికారులను స్కూళ్లకు ఆహ్వానించి విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేస్తారు. వారు ఉద్యోగం సాధించే క్రమంలో చేసిన కృషి, ఎదురైన సవాళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఉన్న 80కి పైగా ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈ కార్యక్రమం ఉంటుంది. ‘‘ఎనిమిదో తరగతి చదివేప్పుడు ఓ పోటీలో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్న నా ఫొటో పత్రికలో వచ్చింది. అప్పుడే పెద్దయ్యాక కలెక్టర్ కావాలనే కోరిక ఏర్పడింది. చిన్నప్పుడే కెరీర్ రూట్‌మ్యాప్ స్పష్టంగా ఉంటే గమ్యాన్ని చేరుకోవడం సులువవుతుంది..’’ అని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

మోదీని తిడితే ఏమవుతుందో త్వరలో రేవంత్‌కు తెలిసొస్తుంది

ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: 'సీఎం రేవంత్‌రెడ్డికి పోయేకాలం వచ్చింది. మోదీని తిడితే ఏమవుతుందో కేసీఆర్‌కు తెలిసింది. త్వరలో రేవంత్‌కు కూడా తెలిసొస్తుంది'అని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. ప్రధాని మోదీపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఈటల స్పందిస్తూ 'మోదీ బీసీ కాదు అని మాట్లాడుతున్నారు. మోదీ కులాలకతీతం. అమెరికన్ ప్రెసిడెంట్ కుర్చీ వేసి కూర్చోబెడుతున్నారు. మోదీపై విమర్శలు సూర్యుని మీద ఉమ్మి వేసినట్టు ఉన్నాయి'అని మండిపడ్డారు. రాష్ట్రంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

ప్రభుత్వం తొందరపాటుతో బీసీలకు తీవ్ర నష్టం

- అధ్యయనం చేశాకే రిజర్వేషన్లపై నిర్ణయించాలి... బీసీ కమిషన్ మాజీ చైర్మన్ 'వకుళాభరణం'



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే.. వెనుకబడిన తరగతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గణాంకాల ఆధారంగా ఇప్పటికే డెడికేటెడ్ బీసీ కమిషన్ నివేదిక సమర్పించిందన్నారు. మరోవైపు ఈనెల 16 నుంచి 28 వరకు సర్వే ప్రక్రియను మరోమారు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కమిషన్ సైతం మరోమారు అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ద్వారా రిజర్వేషన్ల పెంపునకు నివేదిక సమర్పించినట్లుగానే, విద్య, ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్లు పెంచేందుకు ప్రత్యేక కమిషన్ నివేదిక కీలకమని స్పష్టం చేశారు. అధ్యయనం పూర్తికాకముందే అసెంబ్లీలో బిల్లు పెడితే శాస్త్రీయత లోపిస్తుందన్నారు. అలాంటి బిల్లుకు చట్టబద్ధత ఉండదన్నారు. అన్ని రకాలుగా ఆలోచన చేశాకే బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ముందుకెళ్లాలని కృష్ణమోహన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేయాలి

బీఆర్ఎస్ ఎంపీ రవిచంద్ర



సాక్షి, హైదరాబాద్: ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి విధిగా వెళ్లి శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఆయన తెలంగాణ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అర్థం పర్థం లేని కాలమ్స్, 57 ప్రశ్నలతో ప్రజలను అయోమయానికి గురి చేయకుండా, సామాజిక వర్గం (కులం) తెలుసుకునేందుకు రెండు మూడు కాలమ్స్‌తో సర్వేను సమగ్రంగా జరిపించాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, ఓబీసీ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కోరారు. ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ప్రధానిపై మరింత ఒత్తిడి పెంచుదామన్నారు. మంత్రిమండలిలో 9 మంది బీసీలకు.. కేవలం ఇద్దరున్నారని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న 6 స్థానాలను బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆట ఆడకుంటే అవుట్ అయిపోతాం

- రాజకీయాల్లో పోటాపోటీగా ఆట ఆడదానికే పరిమితమవుతున్నాం
- రాజకీయాల్లో మార్పు అవసరం ఉంది
- దేవేందర్‌గౌడ్ 'విజయ తెలంగాణ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్



మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్ రాసిన 'విజయ తెలంగాణ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, కేకే, కె.లక్ష్మణ్, బండారు దత్తాత్రేయ, పొన్నం ప్రభాకర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాజకీయాల్లో పోటాపోటీగా ఆట ఆడటానికే పరిమితం అవుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆట ఆడకుంటే అవుట్ అయిపోతామని, అందుకే ఆడుతున్నామని వ్యాఖ్యానించారు. ఈ తరహా రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇదివరకు చట్టసభల్లో చర్చ జరిగేటప్పుడు ప్రతి అంశంపైనా లోతైన కసరత్తు చేసి పాల్గొనే వారని, ఎంతో ఆలోచన చేసి సమాధానం ఇచ్చే పరిస్థితి ఉండేదని అన్నారు. ఇప్పుడు తిట్లు, ఆరోపణలతో సభలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ హోంశాఖ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ రచించిన 'విజయ తెలంగాణ'పుస్తకావిష్కరణ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రలా రాయాలి

'తెలంగాణ ఉద్యమ నేపథ్యం గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. జరిగిన ప్రతి సంఘటన చరిత్ర రూపంలో రాయాలి. కొంతమంది తెలంగాణ ఉద్యమ చరిత్రను తమకనుకూలంగా మలుచుకున్నారు. తెలంగాణ ఉద్యమమంటే ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక రాజకీయ పార్టీ అని రాసే ప్రయత్నం చేశారు. అలాకాకుండా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువకుల త్యాగాలను చరిత్రలో లిఖించాలి. 'విజయ తెలంగాణ'పుస్తకంలో దేవేందర్ గౌడ్ తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రజల కోణంలో పొందుపర్చారు. ఒక ప్రధాన పార్టీలో అగ్రనేతకు సమానంగా గౌరవం పొందిన వ్యక్తిగా చలామణి అయినప్పటికీ.. వాటన్నింటినీ వదులుకుని తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. దేవేందర్ గౌడ్ పాదయాత్రచేసినందుకే ఆనాటి పాలకులు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టారు. తెలంగాణ అంటే టీజీ అని ఉద్యమంలో యువకులు బండ్ల పైనే కాకుండా గుండెలపైనా రాసుకున్నారు. అయితే రాష్ట్ర ఏర్పాటు తర్వాత టీజీ అనే పదాన్ని టీఎస్‌గా మార్చారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కాగానే కేంద్ర ప్రభుత్వ గెజిట్‌లో నిర్దేశించిన టీజీని ప్రజల ఆకాంక్ష మేరకు అమల్లోకి తీసుకువచ్చాం. జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర అధికారిక గీతంగా ఖరారు చేశాం. తెలంగాణ ఉద్యమంలో సర్వస్వం త్యాగం చేసిన 9 మంది ఉద్యమకారులకు ఇంటి స్థలం, కోటి రూపాయలు ప్రకటించాం. దేవేందర్ గౌడ్ లాంటి వ్యక్తులు క్రియాశీలక రాజకీయాల్లో లేకపోవడం తెలంగాణకు తీరని నష్టం..'అని సీఎం అన్నారు.

తెలంగాణ కోసం పార్టీ సిద్ధాంతాలు పక్కనపెట్టారు: కిషన్‌రెడ్డి

దేవేందర్ గౌడ్ రాజకీయాలు, సిద్ధాంతాలకు అతీతంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను పక్కన పెట్టి తెలంగాణ కోసం పార్టీ నుండి బయటకు వచ్చారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్ర మరుగున పడొద్దని, భవిష్యత్తరాలకు వాస్తవ విషయాలే తెలియాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కె.లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

'విజయ తెలంగాణ' పేరు అందుకే

'తెలంగాణ ప్రజలకు ఏదీ ఉచితంగా రాలేదు. పోరాడి సాధించుకున్నారు. అందుకే ఈ పుస్తకానికి విజయ తెలంగాణ అని పేరు పెట్టా..' అని దేవేందర్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ పోరాటాల గడ్డ. మన ప్రాంతానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది. రైతాంగం చేసిన సాయుధ పోరాటం ఓ ప్రత్యేక చరిత్ర. అయితే ఇక్కడి భాష, సంస్కృతి మీద ఎంత దాడి జరిగిందో అందరికీ తెలిసిందే. భవిష్యత్ తరాలకు మన చరిత్ర తెలియాలనే ఈ పుస్తకం రాశాను..' అని చెప్పారు.



హరీశ్‌రావుతో సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు

సాగునీటి కోసం మరో సమరం

- కాంగ్రెస్ హయాంలో సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు నిర్వీర్యం
- ఎత్తిపోతల పథకాల పూర్తికి పోరాటం చేద్దాం
- జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్, ఖేడ్ నేతలతో హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: సాగునీటి కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల్లోని నాలుగు లక్షల ఎకరాలకు సాగు నీరందించాలనే కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చేందుకు.. పార్టీ కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. కోకాపేటలోని తన నివాసంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పార్టీ ముఖ్య నేతలు జైపాల్‌రెడ్డి తదితరులతో హరీశ్‌రావు శుక్రవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన కార్యాచరణ, పోరాట రూపాలపై పార్టీ నేతలతో హరీశ్‌రావు చర్చించారు. ప్రాజెక్టుల పనులను వెంటనే పూర్తి చేయాలనే డిమాండ్‌తో.. ఆయా ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు రైతులను కలుపుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

సీఎం పదవిలో ఉంటూ చిల్లర భాష

రేవంత్‌రెడ్డికి సీఎం పీఠం దక్కినా బుద్ధి పెరగడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్‌కు తెలంగాణ సమాజంలో జీవించే హక్కు లేదంటున్న రేవంత్.. అర్హత ఎవరికి ఉందో ఆయన సొంత నియోజకవర్గం కొడంగల్ లేదా సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి వెళ్లి ప్రజలను అడగాలని సూచించారు. సీఎం పదవిలో ఉంటూ చిల్లర భాష మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం ఛీ కొడుతూ దుమ్మెత్తిపోస్తోందని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి పరిశోధన పూర్తిగా విఫలమైంది

మోదీపై సీఎం వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: 'సీఎం రేవంత్‌రెడ్డి పరిశోధన పూర్తిగా విఫలమైంది. 1994లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే మోదీ పేరు ఓబీసీ జాబితాలో ఉంది'అని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఎక్స్ వేదికగా తప్పుపట్టారు. '42% బీసీ రిజర్వేషన్ నుంచి మరో దారిమళ్లింపు ప్రయత్నం. ప్రధాని కులంపై చర్చ కోరుతున్నారు. అసలు రాహుల్ ఏ కులానికి చెందినవారు? ఆయన మతం ఏమిటి? ఎవరు మతం మార్చుకున్నారనేది చర్చించాలంటే ఢిల్లీలోని 10 జన్‌పథ్ నుంచి ప్రారంభించాలి' అని పేర్కొన్నారు.

'ఆన్‌లైన్'లో రెండో దఫా కుటుంబ సర్వే

- వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం: బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- టోల్ ఫ్రీ నంబర్ కూడా తెస్తున్నాం..
- సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి.. అపోహలు సృష్టించవద్దు
- ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 70 శాతం దాకా బీసీలే గెలుస్తారని వ్యాఖ్య



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్. చిత్రంలో జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే రెండో దఫాకు సంబంధించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్టు బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. ''గతంలో సర్వేలో పాల్గొననివారి కోసం ఈ దఫా సర్వే నిర్వహిస్తున్నాం. వారంతా తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలి. దీనికోసం టోల్ ఫ్రీ నంబర్ తెస్తున్నాం, ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నాం. అదే విధంగా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సైతం సర్వేకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవచ్చు..''అని వెల్లడించారు. శుక్రవారం బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణలతో కలసి నిరంజన్ మీడియాతో మాట్లాడారు. గతంలో జీహెచ్ఎంసీలోని కొన్ని ప్రాంతాల్లో సర్వే పూర్తిగా నిర్వహించలేదని, ఈసారి ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొనాలని కోరారు. జీహెచ్ఎంసీలో ఉన్న 16 లక్షల కుటుంబాల ఫోన్ నంబర్లకు ప్రాపర్టీ ట్యాక్స్ ఆధారంగా ఇప్పటికే ఎస్సెమ్మెస్‌లు పంపామని చెప్పారు.

అపోహలు సృష్టించొద్దు..: ఈ నెల 16 నుంచి 28 వరకు జరిగే 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'కు ప్రతి ఒక్కరూ సహకరించాలని, లేనిపోని అపోహలు సృష్టించవద్దని నిరంజన్ కోరారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఒక కులం ఎక్కువగా వచ్చిందని, మరో కులం తక్కువ వచ్చిందనే అపోహలు మంచివి కాదని, అవి ఘర్షణలకు తావిస్తాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులాల సమాచారం సేకరించి, బీసీలకు తగిన రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

స్థానిక ఎన్నికల్లో 70 శాతం బీసీలే గెలుస్తారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు 70 శాతానికిపైగా గెలిచే అవకాశం ఉందని నిరంజన్ చెప్పారు. ''2006, 2013, 2019 స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల సీట్లు కలుపుకొని సర్పంచ్ స్థానాల్లో 43.5% బీసీలు గెలిచారు. వార్డ్ మెంబర్ స్థానాల్లో 50.4%, ఎంపీపీలుగా 43.4%, ఎంపీటీసీలు 46.7%, జెడ్పీటీసీలు 39.2%.. మున్సిపాలిటీల్లో వార్డు మెంబర్లుగా 59%, చైర్ పర్సన్లుగా గా 51%, మేయర్లుగా 31%, కార్పొరేటర్లుగా 57% బీసీలే గెలిచారు''అని తెలిపారు. దీనినిబట్టి చూస్తే.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తే, మొత్తంగా 65% నుంచి 70% గెలిచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మోదీ బీసీనా కాదా... బహిరంగ చర్చకు రావాలి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ప్రధాని మోదీ బీసీనా కాదా అనే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ చర్చకు రావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. మోదీపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు అవగాహనారాహిత్యంతో కూడుకున్నవి అని ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు. రాజకీయ విమర్శలు చేసే క్రమంలో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న విషయాన్ని మరిచిపోయి.. నోటికొచ్చినట్టు అవాకులు, చెవాకులు పేలడాన్ని ఖండిస్తున్నామన్నారు. మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ...రోజురోజుకూ రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో పట్టుకోల్పోతున్న నేపథ్యంలో అసహనంతో రేవంత్‌రెడ్డి ఇలా మాట్లాడుతున్నారని చెప్పారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా దేశంలో బీసీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న నాయకుడిగా ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందన్నారు.

పదినెలల్లోనే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత

రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత రావడానికి పదేళ్ల పడితే., కాంగ్రెస్ పాలనలో కేవలం పది నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా కందిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రజలంతా కల్వకుంట్ల కుటుంబం చుట్టూ తిరిగేలా పాలన కొనసాగించారని విమర్శించారు. మార్పు రావాలని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు శాసనమండలిని నిర్వీర్యం చేశారని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల గొంతుక అవుతామన్నారు.



సమావేశంలో పాల్గొన్న రేవంత్, భట్టి, పొన్నం, మధుయాష్కీ, సీతక్క, పొంగులేటి, ప్రేమ్‌సాగర్‌రావు, ఉత్తమ్, జూపల్లి, కొండా సురేఖ, తుమ్మల తదితరులు

మోదీ పుట్టుకతో బీసీ కాదు

▶ మొదటి పేజీ తరువాయి

డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

పారదర్శకంగా కులగణన: 'దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రెండు సమస్యలకు పరిష్కారం చూపే దిశలో మేం ప్రయత్నిస్తుంటే ప్రత్యర్థి రాజకీయ పక్షాలు, ఆ పార్టీల నేతలు ఆరోపణలతో, లేనిపోని అపోహలు సృష్టిస్తూ కుల గణన తప్పులతడక అనే అభిప్రాయం కలిగించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరిగి బలహీన వర్గాల లెక్క తేల్చి వారి కోటా, వాటా వారికివ్వాలనేది రాహుల్‌గాంధీ ఆలోచన. ఆ దిశలోనే ముందుకెళ్లి తెలంగాణ ప్రజలకు రాహుల్ ఇచ్చిన మాట ను నిలబెట్టేందుకు పారదర్శకంగా కులగణన చేశాం.

గ్యాంబ్లర్స్‌కు కులగణన ఇష్టం లేదు..

కేసీఆర్ గతంలో కాకి లెక్కలతో సర్వే చేశాడు. చెట్ల మీద విస్తరాకులు కుట్టి ఇదే బైబిల్, ఖురాన్, భగవద్గీత అన్నాడు. ఆయన చేసిన లెక్క సక్కదనమైనది అయితే, ఎస్సీల్లో 59 ఉప కులాలుంటే ఆయన సర్వేలో 82 కులాలు ఎలా వచ్చా యి? రాష్ట్రంలో అందరినీ లెక్కపెడుతున్నప్పుడు కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు వివరాలు ఎందుకు ఇవ్వలేదు? అలా వివరాలు ఇవ్వని కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కు, మాట్లాడే హక్కు లేదు. కులగణన చేయడం ఆ గ్యాంబ్లర్స్‌కు ఇష్టం లేదు. వీళ్ల లెక్క తెలిస్తే గత ప్రభుత్వంలో 4 మంత్రి పదవులు ఎలా తీసుకున్నారని బీసీలు అడుగుతారని, దంచుతారని తెలుసు. వీరి జనాభాకు వార్డు మెంబర్ కంటే ఎక్కువ పదవులేవీ రావు. మనకు తెలియకుండానే ఆ కుట్రలో మనం భాగస్వాములవుతున్నాం. నేను సవాల్ చేస్తున్నా.. మేం చేసిన కులగణనలో ఒక్క తప్పులేదు..'అని ముఖ్యమంత్రి అన్నారు.

ఐదు గ్రూపుల్లో ముస్లింలు కూడా ఉన్నారు

'కొందరు కాంగ్రెస్‌కు నేనే ఆఖరు సీఎం అని అంటున్నారు. అయినా పర్వాలేదు. మా నాయకుడి మాట నిలబెట్టేందుకే ఈ కులగణన చేశాం. నాయకుడిచ్చిన మాటను నిలబెట్టడం మా ధర్మమని, ఏ త్యాగానికైనా సిద్ధమయ్యే ముందుకెళ్లాం. అయినా దొంగ లెక్కలు రాయాలనుకుంటే మా జనాభా 5 శాతం ఎందుకు చూపిస్తాం. 15–20 శాతం చూపిస్తాం కదా? కొందరు మైనార్టీల లెక్కలెలా తీస్తారని అంటున్నారు. గతంలో బీసీల్లో ఐదు గ్రూపులున్నాయి. అందులో ముస్లింలు కూడా ఉన్నారు. అందుకే వారి లెక్క తీశాం..'అని రేవంత్ వివరణ ఇచ్చారు.

కోల్డ్ స్టోరేజీలో పెట్టేలా బీజేపీ కుట్ర

'బీసీల లెక్కలు రాకూడదన్నదే మోదీ, కేడీల ప్రయత్నం. తెలంగాణలో మా ప్రభుత్వం అన్ని కులాల లెక్కలు తీసిందని, అదే పని దేశవ్యాప్తంగా ఎందుకు చేయరని పార్లమెంటులో మోదీని రాహుల్‌గాంధీ నిలదీశారు. అందుకే రాష్ట్ర బీజేపీ నేతలు కూడా దీన్ని తప్పుల తడక అనే ముద్ర వేసి కోల్డ్ స్టోరేజీలో పెట్టాలనుకుంటున్నారు. నిజంగా మోదీకి బీసీలపై ప్రేమ ఉంటే 2021లోనే జనాభా లెక్కలు తీసి అందులో కులగణన చేసేవారు. రేపు చేయబోయే జనగణనలో అయినా బీసీ కులాల లెక్క తేల్చాలి. మోదీ దేశ వ్యాప్తంగా కులగణన చేయడం ద్వారా రాష్ట్రంలోని బీసీల లెక్కలు తేల్చాలి. ఇవిగో మోదీ లెక్కలు, ఇవిగో రాహుల్ లెక్కలు అని ప్రజల ముందు పెట్టాలి..'అని సీఎం అన్నారు.

వారి ఇళ్ల ముందు మేల్కొలుపు డప్పులు కొట్టండి

'ఎస్సీలను వర్గీకరించి రిజర్వేషన్లు పంపిణీ చేశాం. దీన్ని కూడా తప్పు పట్టాలని కొందరు చూస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు దీన్ని చాలెంజ్ చేయండి. ఏ లెక్క, ఏ వార్డు, ఏ కుటుంబంలో తప్పు ఉందో చెప్పమని అడగండి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఇళ్ల ముందు మేల్కొలుపు డప్పులు కొట్టండి. అప్పుడు కూడా వివరాలు ఇవ్వకపోతే సామాజిక బహిష్కరణ శిక్ష విధించండి..'అని సీఎం వ్యాఖ్యానించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవితం ఒక యుద్ధ రంగం. పోరాడి గెలవాలి.
నీ ప్రయత్నం ఉన్నంత వరకు నువ్వు ఓడిపోనట్లే లెక్క!
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 15 ఫిబ్రవరి 2025

బలపడిన మైత్రీబంధం!

ఎవరి అంచనాలకూ అందని తన ఆచరణతో, మాటలతో దిగ్భ్రమపరిచే డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి స్వీకరించి నెల్లాళ్లు కాకుండానే ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశాన్ని సందర్శించారు. మోదీ రెండు రోజుల అమెరికా పర్యటనపై మన దేశంలో మాత్రమే కాదు, అనేక దేశాల అధినేతలు సైతం ఎంతో ఉత్కంఠ కనబరిచారు. అందుకు కారణం ఉంది. వేరే దేశాలు తమ ఉత్పత్తులపై ఎంత సుంకం విధిస్తాయో తామూ వారి ఉత్పత్తులపై అదే స్థాయిలో ప్రతిచర్యాత్మక సుంకం వసూలు చేస్తామని ట్రంప్ చెబుతున్నారు. అదే అమలైతే అన్ని దేశాల వ్యాపార, వాణిజ్యాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ట్రంప్ తొలి ఏలుబడిలో ఆయనతో మోదీకున్న సాన్నిహిత్యం ఎవరికీ తెలి యనిది కాదు. చర్చల్లో ఆయన సుంకాల విషయంలో ట్రంప్‌ను ఒప్పిస్తే, తాము కూడా భారత్ కిచ్చిన వెసులుబాట్లను చూపి గండం నుంచి గట్టెక్కవచ్చని వారి ఆశ. ప్రమాణస్వీకారం చేసింది మొదలుకొని సన్నిహిత మిత్రులా... 'నువ్వా నేనా' అని పోటీపడే ప్రత్యర్థులా అనే విచక్షణ లేకుండా అందరికీ సుంకాల వడ్డింపు తప్పదని ఆయన హెచ్చరిస్తున్నారు. అయితే ఈ అంశంపై ఇరుదేశాల మధ్యా అధికారుల స్థాయి చర్చలు జరిగితే గానీ స్పష్టత రాదు. అధినేతలిద్దరూ నాలుగు గంటల సుదీర్ఘ చర్చల అనంతరం నిర్వహించిన మీడియా సమావేశం గమనిస్తే వారిద్దరి మధ్యా గతం మాదిరే సౌహార్ద సంబంధాలున్నాయని అర్థమవుతుంది. మోదీ 'చాలా ప్రత్యేకమైన వ్యక్తి' అని అభివర్ణించటంతో పాటు 2020లో భార్యాసమేతంగా భారత్ వెళ్లినప్పుడు ఆయన ఇచ్చిన ఆతిథ్యం మరువలేనని ట్రంప్ అన్నారు. మోదీ సైతం 'మీతో ఉన్న అతి గొప్ప స్నేహబంధాన్ని ఇప్పటికీ మా ప్రజలు గుర్తు చేసుకుంటార'ని చెప్పారు. బైడెన్ హయాంలో రెండు దేశాల సంబంధాలకూ నష్టం కలిగే రీతిలో అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకున్నాయని ట్రంప్ అనటం గమనించదగ్గది. అయితే మోదీ పర్యటనకు కొన్ని గంటల ముందే సుంకాల పెంపుదల ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. దీన్నిబట్టే అంచనాలకు దొరకని ట్రంప్ మనస్తత్వాన్ని గ్రహించవచ్చు.

ప్రతిచర్యాత్మక సుంకాలపై ట్రంప్ అభీష్టం నెరవేరితే సంపన్న రాజ్యాల మధ్య అవగాహన ఫలితంగా దాదాపు 80 ఏళ్ల నుంచి ప్రపంచ వ్యాపార, వాణిజ్యాల్లో కొనసాగుతూ వస్తున్న విధానాలకు తిలోదకాలిచ్చినట్టవుతుంది. మధ్యలో ప్రపంచ దేశాల మధ్య సుంకాలు, వాణిజ్యాలపై కుదిరిన గాట్ ఒప్పందం, అటు తర్వాత ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నిబంధనల కింద వర్ధమాన దేశాలకు సుంకాల విషయంలో వెసులుబాట్లు లభించాయి. ఫలితంగా వాటి ఉత్పత్తులపై సంపన్న దేశాల్లో తక్కువ సుంకాలున్నాయి. అదే సమయంలో సంపన్న దేశాల ఉత్పత్తులపై వర్ధమాన దేశాలు అధిక సుంకాలు విధించగలిగాయి. ఇందువల్ల అమెరికా, ఇతర సంపన్న దేశాలకు కలిగిన నష్టమేమీ లేదు. ఎందుకంటే ఆ దేశాల కంపెనీలకు పరిశ్రమల స్థాపన కోసం నామమాత్ర ధరకు భూములు, అనేక ఇతర సదుపాయాలు లభించాయి. వాటి యుద్ధ విమానాలు, డ్రోన్‌లు, ఇతరేతర రక్షణ ఉత్పత్తులు వర్ధమాన దేశాలు కొనుగోలు చేస్తున్నాయి. ఒకచోట కనిపించే లోటు మరోచోట భర్తీ అవుతోంది. వాటి వ్యాపార వాణిజ్యాలు వందల రెట్లు పెరుగుతున్నాయి. కానీ ట్రంప్‌కు ఇవేం పట్టవు. అమెరికాలోని సంపన్న రైతులకు భారీ సబ్సిడీలిస్తున్న కారణంగా వారి సాగు ఉత్పత్తులు కారుచౌకగా ఉంటాయి. ఆ ఉత్పత్తులు భారత్ మార్కెట్‌లో అడుగుపెడితే మన ఉత్పత్తులకు గిరాకీ పడిపోతుంది. అందువల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ట్రంప్ తరచు చెప్పే అత్యంత ఖరీదైన హార్లీ–డేవిడ్ సన్ బైక్‌కి కూడా ఇది వర్తిస్తుంది. చవగ్గా లభించే విదేశీ ఆహారోత్పత్తులూ, విలాసవంతమైన వస్తువులూ కొనడానికి జనం ఎగబడితే మన విదేశీ మారకద్రవ్యమూ కరిగిపోతుంది. మన ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తుంది. కనుకనే మనం భారీ సుంకాలు విధించాల్సి వస్తుంది.

సుంకాల సంగతలా వుంచితే ఇరు దేశాలకూ అనేక అంశాల్లో భావసారూప్యత ఉంది. ఉమ్మడి లక్ష్యాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉగ్రవాదాన్ని అదుపు చేయటం, చైనా దుందుడుకు పోకడలను నియంత్రించటం అందులో ముఖ్యమైనవి. మన దేశం నుంచి చట్టవిరుద్ధంగా 7,25,000 మంది అమెరికాకు వలస పోయారని గణాంకాలు చెబుతున్నాయి. వీరందరినీ వెనక్కి పంపితే తమకు అభ్యంతరం లేదని మోదీ అమెరికాకు స్పష్టంగా చెప్పారు. ఇక మన ప్రయోజనాలకు ఎంతగానో తోడ్పడే ఇరాన్‌లోని చాబహార్ పోర్టుతో తెగతెంపులు చేసుకోవాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. పాకిస్తాన్‌తో ప్రమేయం లేకుండా అఫ్గాన్‌కు చేరడానికి, పశ్చిమాసియా దేశాలతో వాణిజ్యం నెరపడానికి దోహదపడుతుందని చాబహార్ పోర్టు నిర్మాణంలో మన దేశం భారీగా పెట్టుబడులు పెట్టింది. ఇరాన్ తమ శత్రువు గనుక ఆ పోర్టును వదులుకోవాలని ట్రంప్ చెబుతున్నారు. ఇన్నాళ్లుగా భారత్‌కిస్తున్న మినహాయింపు రద్దు చేశారు. ఇదెక్కడి న్యాయం!

మోదీ పర్యటన వల్ల అమెరికా తయారీ ఎఫ్–35 ఫైటర్ జెట్ విమానాల కొనుగోలు, చమురు, సహజవాయు కొనుగోళ్లు, కృత్రిమ మేధ, ఇతర సాంకేతికతలు, అంతరిక్ష అన్వేషణ, అణు ఇంధనం వగైరా అంశాల్లో సహకారం పెంపుపై అవగాహన కుదిరింది. పరస్పర ప్రయోజనకరంగా ఒప్పందాలు కుదుర్చుకోవాలనుకోవటం, ఇరు దేశాల మధ్య వాణిజ్యం మరింత పెరగనుండటం బలపడుతున్న మైత్రీబంధానికి చిహ్నం. అయితే అసంబద్ధమైన సుంకాలతో, అడ్డగోలు విధానాలతో ఈ బంధాన్ని దెబ్బ తీయరాదని అమెరికా గ్రహించాలి. మోదీ పర్యటన అందుకు దోహదపడాలని అందరూ కోరుకుంటారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, పుష్య మాసం, **తిథి:** బ.తదియ రా.10.26 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తర రా.12.36 వరకు తదుపరి హస్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.6.36 నుండి 8.05 వరకు, **అమృతఘడియలు:** సా.4.47 నుండి 6.31 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అన్నదొకటి... అయ్యిందొకటి!

అభిప్రాయం


డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

కాలక్రమంలో వాడుకలో ఉన్న కొన్ని పదాలు అర్థం కోల్పోతాయని, పైగా వాటికి పూర్తి విరుద్ధమైన అర్థాలు పుట్టుకొస్తాయని ప్రముఖ రచయిత జార్జ్ ఆర్వెల్ అంటారు. 8 ఏళ్ల క్రితం 'ఒకే దేశం ఒకే పన్ను' అన్నది లక్ష్యంగా, చక్కని సరళతరమైన పన్ను (గుడ్ అండ్ సింపుల్ టాక్స్– జీఎస్టీ)గా చెప్పబడిన 'జీఎస్టీ' (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్) క్రమంగా తన అర్థాన్ని మార్చుకొంది. 2017 జులై 1న ఎన్డీఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీఎస్టీ చిన్న, సన్నకారు వ్యాపారుల సమస్యలను తీర్చకపోగా వారికి అనేక చిక్కుముళ్లను తెచ్చి పెడుతోంది.

జీఎస్టీ అమలులోకి వచ్చాక దేశంలో పన్ను వసూళ్లు గణనీయంగా పెరిగిన మాట వాస్తవం. ఏటా దాదాపు 8 నుంచి 11 శాతం పైబడి జీఎస్టీ వసూళ్లలో వృద్ధిరేటు కనబడుతోంది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే వస్తు సేవల వినియోగం పెరుగుతుంది. దాంతో సహజంగానే పన్ను వసూళ్ల మొత్తం పెరుగుతుంది. ఇపుడు జరుగుతున్నది అదే! ఒక దశాబ్ద కాలంలో దేశస్థూల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రజల తలసరి ఆదాయమూ హెచ్చింది. కనుక కేవలం జీఎస్టీ అమలు కారణంగానే పన్ను ఎగవేతలు తగ్గాయని, కేంద్రం చెబుతున్నట్లు జీఎస్టీ వల్ల దేశంలో 'పన్ను ఉగ్రవాదం' సమసిపోయిందని చెప్పడం అర్ధసత్యమే.

దేశంలో 8 ఏళ్ళుగా అమలవుతున్న జీఎస్టీ వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని పలు వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. కానీ, వాటిని పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదు. సరళతరమైన పన్నుగా జీఎస్టీని చెప్పుకోవడం వరకు బాగానే ఉంది గానీ, ఆ పన్ను రేట్లు, వివిధ శ్లాబులలోకి వచ్చే వస్తువులు, సేవల విషయంలో కేంద్రం, రాష్ట్రాల నడుమ ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడం గమనార్హం. ముఖ్యంగా, రాష్ట్రాలకు అతి పెద్ద ఆదాయ వనరులుగా ఉన్న పెట్రోల్, డీజిల్, మద్యం వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి చేర్చడానికి మెజార్టీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికి 50కి పైగా సమావేశాలు జరిపినప్పటికీ పలు అంశాలపై కేంద్రం, రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు.

చిక్కుముళ్లు

జీఎస్టీ అమలులో అనేక చిక్కుముళ్లు ఉన్నాయి. ఇందులో పన్ను రేట్ల హేతుబద్ధీకరణ ప్రధానమైనది. జీఎస్టీలో 5, 12, 18, 28 శాతాలుగా పన్ను రేట్లు ఉన్నాయి. 1400 పైబడిన వస్తువులు; 500 రకాల సేవలను ఈ 4 శ్లాబులలో సర్దుబాటు చేశారు. భారీ కసరత్తు అనంతరం రేట్లను ఖరారు చేశామని చెప్పారుగానీ అందులో హేతుబద్ధత, మానవత్వం కనుమరుగయ్యాయన్న విమర్శల్ని సాక్షాత్తూ బీజేపీ నేతలే చేస్తున్నారు. ఉదాహరణకు జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్), ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) ప్రీమియంలపై 18% జీఎస్టీ వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తన సహచర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు బహిరంగ లేఖ సంధించడం కలకలం రేపింది. సామాన్యులకు అవసరమైన జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై 18% జీఎస్టీ వేయడం వల్ల... వారందరూ జీవితం, ఆరోగ్య రక్షణకు దూరం అవుతారని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. ఇక, శ్లాబుల విషయంలో స్పష్టత లోపించడం వల్ల చెల్లింపుదారులకు, వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య వివాదాలు తలెత్తి చివరకు అవి న్యాయస్థానాలకు చేరుతున్నాయి. అలాగే, కోవిడ్ ప్రబలిన 2020, 2021 సంవత్సరాలలో రాష్ట్రాలకు కేంద్రం అందించిన ఆర్థిక సహకారాన్ని తిరిగి రాబట్టుకొనేందుకు 'సెస్సు' విధించి ప్రజలపై అదనపు భారాన్ని మోపింది. ఈ సెస్సును ఉపసంహరించుకోవాలన్న అభ్యర్థనను సైతం కేంద్రం పెడచెవిన పెట్టింది.



జీఎస్టీ పరిధిని క్రమంగా విస్తరిస్తూ పోతున్నారు. శ్లాబ్‌లను మారుస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులపైన, ప్రాణాలు నిలబెట్టే ఔషధాలపైన కనిష్ఠంగా 5% జీఎస్టీని మాత్రమే వేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వెన్న, నెయ్యి, పాలు వంటి పాల ఉత్పత్తుల పైన, ప్యాకింగ్ చేసిన కొబ్బరి నీళ్లు, పండ్ల రసాల పైన 18% జీఎస్టీ విధించడం ఏవిధంగానూ సమర్థనీయం కాదు. చివరకు పెన్నులపైన కూడా జీఎస్టీ విధిస్తున్నారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్టీ మండలి సమావేశంలో... పిల్లలు ఎక్కువగా ఇష్టపడే పాప్ కార్న్‌పై 3 రకాల జీఎస్టీని విధించడాన్ని ప్రజలు తప్పుబట్టారు.

ఎంఎస్ఎంఈలకు శరాఘాతం

జీఎస్టీ అమలులో స్పష్టత, హేతుబద్ధత లోపించడం వల్ల దెబ్బ తిన్న ప్రధాన రంగాలలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగం ఒకటి. దేశీయ తయారీరంగంలో దాదాపు 70% మేర ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తున్న ఎంఎస్ఎంఈ రంగం జీఎస్టీ కారణంగా కుదేలైందన్నది ఓ చేదు వాస్తవం. చిన్న చిన్న వ్యాపారాలను జీఎస్టీ పరిధిలోకి తెచ్చాక... అవి చాలా వరకు మూతపడ్డాయి. ముడి సరుకులపై పన్ను విధించడం, మళ్లీ అంతిమ ఉత్పత్తులపై పన్ను వేయడం వల్ల... దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఆధారపడిన సూక్ష్మ–మధ్య తరహా పరిశ్రమలకు తీరని నష్టం కలిగింది. వాటి సప్లయ్ చెయిన్ తెగిపోయిందని ఆ రంగంపై అనేక ఏళ్లుగా జీవనం సాగిస్తున్నవారు మొత్తుకొంటున్నారు. ఒకవైపు వస్తుసేవలను అంతిమంగా వినియోగించుకొనే వారే పన్ను చెల్లించాలని చెబుతూ... మరో వైపు బహుళ పన్నులు వేస్తున్న పరిస్థితి కొన్ని రంగాల్లో ఉంది.

◆ జీఎస్టీ అమలులోకి వచ్చాక దేశంలో పన్ను వసూళ్లు గణనీయంగా పెరిగిన మాట వాస్తవం. ఏటా దాదాపు 8 నుంచి 11 శాతం పైబడి జీఎస్టీ వసూళ్లలో వృద్ధిరేటు కనబడుతోంది.

◆ పుట్టుకతోనే లోపాలున్న బిడ్డగా జీఎస్టీని కొందరు అభివర్ణించారు. మరికొందరు జీఎస్టీ వల్ల దేశానికి అసలైన ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందంటున్నారు. కానీ, అంతిమంగా ప్రజలకు మేలు జరుగుతున్నదా లేదా అన్నదే కొలమానం.

◆ చిన్న వ్యాపారాలను జీఎస్టీ పరిధిలోకి తెచ్చాక... చాలా వరకు మూతపడ్డాయి. ముడి సరుకులపై పన్ను విధించడం, మళ్లీ అంతిమ ఉత్పత్తులపై పన్నువల్ల... దాదాపు 20 కోట్ల మంది ఆధారపడ్డ సూక్ష్మ–మధ్య తరహా పరిశ్రమలకు తీరని నష్టం కలిగింది.

వివాదాలు ఏర్పడితే వాటిని పరిష్కరించుకోవడానికి జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను అందుబాటులోకి తెచ్చిన మాట నిజమే గానీ... చిన్న వ్యాపారులు ఎంతమంది దానిని ఆశ్రయించగలరు? ఇక, స్థానిక ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఆ యా ఉత్పత్తులపై పన్నులు విధించే హక్కు గతంలో రాష్ట్రాలకు ఉండేది. ప్రజలకు జవాబుదారీతనం ఎక్కువగా వహించేది రాష్ట్రాలే. కానీ, రాష్ట్రాలకు తమ ప్రాంత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించే అవకాశం జీఎస్టీ వచ్చాక తగ్గిపోయింది. రాష్ట్రాల వినతులకు జీఎస్టీ కౌన్సిల్‌లో పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదన్న వాదన ఉంది. జీఎస్టీకి సంబంధించి ఏ యే రాష్ట్రాలు ఎన్నెన్ని అభ్యర్థనలు అందిస్తోంది? అందులో వేటికి ఆమోదం తెలుపుతున్నారు? ఎన్నింటిని బుట్టదాఖలా చేస్తున్నారన్న సమాచారాన్ని వెల్లడించడం లేదు.

నిజానికి, తగిన సన్నద్ధత లేకుండా జీఎస్టీని అమలులోకి తేవడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. జీఎస్టీ అమలులోకి వచ్చి 8 ఏళ్లు గడిచాయి. జీఎస్టీ మండలి 55 పర్యాయాలు సమావేశమైంది. అయినా అనేక అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయి. జీఎస్టీ వసూళ్లల్లో కనబడుతున్న వృద్ధిని చూసి మురిసిపోవడమే తప్ప... ఎదురవుతున్న ఇబ్బందుల్ని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించలేకపోవడం వైఫల్యంగానే పరిగణించాలి. పుట్టుకతోనే లోపాలు ఉన్న బిడ్డగా జీఎస్టీని కొందరు అభివర్ణించారు. మరి కొందరు జీఎస్టీ వల్ల దేశానికి అసలైన ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందంటున్నారు. ఈ రెండూ నిజమే కావొచ్చు. కానీ, అంతిమంగా ప్రజలకు మేలు జరుగుతున్నదా లేదా అన్నదే కొలమానం. రచయిత జార్జ్ ఆర్వెల్ చెప్పినట్లు కొన్ని పదాలు అర్థం కోల్పోవడమే కాక వాటికి పూర్తి భిన్నమైన అర్థాలు పుట్టుకొస్తున్నాయి. ఇందుకు ఉదాహరణ 'సంస్కరణ' అనే పదం. ప్రపంచీకరణ తర్వాత ఈ పదా నికి అర్థం మారిపోయింది. సంస్కరణ అంటే ఆర్థిక భారంగా ప్రజలు భావిస్తున్నారు. జీఎస్టీ అంశంలో కూడా సరళతరమైన పన్ను అనే భావన పోయి జీఎస్టీ అంటేనే మోయలేని భారం అని ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు, మాజీ కేంద్రమంత్రి

సోషల్ మీడియా

సమర వీరులు



పుల్వామాలో 2019లో మనం కోల్పోయిన మన వీర సైనికులకు నివాళులు. వారి త్యాగాన్నీ, దేశం పట్ల అచంచలమైన అంకిత భావాన్నీ రాబోయే తరాలు ఎప్పటికీ మర్చిపోవు.

– నరేంద్ర మోదీ, భారత ప్రధాని

లోతైన మనిషి



భారత ప్రధాని నరేంద్ర మోదీ విస్తృత శ్రేణి అంశాలపై ఆలోచనాత్మకమైన, లోతైన జ్ఞానం కలిగిన నేత. ఈరోజు ఆయనను కలవటం, స్వాగతించటం గౌరవంగా ఉంది. మోదీజీ! మీ అమెరికా పర్యటన చిరస్మరణీయమైనదిగా ఉండాలి.

– వివేక్ రామస్వామి, ఎన్నారై బిజినెస్‌మేన్, పొలిటీషియన్

నోరేనా అది?!



అభ్యంతరకరమైన జోకులు, అమర్యాదకరమైన వ్యాఖ్యలు, బహిరంగ అసభ్యత... ఇదంతా హాస్యం కాదు. గౌరవభంగం. వాక్ స్వాతంత్ర్యం పేరుతో ఈ వెకిలితనాలను అనుమతిస్తే ఒక సమాజంగా మనం విఫలం అవుతాం. పరిణామాలు తప్పక ఉంటాయి. ('ఇండియా గాట్ ట్యాలెంట్ షో'లో యూట్యూబర్ రణవీర్ మాటలు అదుపు తప్పటంపై).

– అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్ ఎంపీ

ప్రథమ లక్షణం



స్టార్టప్ వ్యవస్థాపకు లకు 10 శాతం విజయావకాశాలు ఉంటాయి. ఇది 0 శాతం కంటే చాలా ఎక్కువ. కనీసం ఒక్కసారైనా ప్రయత్నించకపోవటమే అసలైన వైఫల్యం. మీరసలు ప్రారంభించకపోతే ఏది అసాధ్యమో మీకు ఎప్పటికీ తెలియదు. ప్రారంభించి చతికిలపడినా, ఎలా నిలుచుంటే పడిపోకుండా ఉండగలమో అనుభవ పూర్వకంగా తెలుస్తుంది.

– ఆంద్రూ గడ్జెక్కీ, సీఈవో, అక్సైర్ డాట్ కామ్

పిచ్చిమారాజు



కెనడాలో చమురు, గ్యాస్ నిక్షేపాల పెద్ద సముద్రమే ఉంది. కానీ ఈ పరిశ్రమను ట్రూడో (కెనడా ప్రధాని) వదలించుకోవాలని చూస్తున్నారు! చమురు, గ్యాస్ నిక్షేపాలను విక్రయించేందుకు కెనడా చక్కగా భారత్‌తో ఒప్పందం కుదుర్చుకొని భారీగా లబ్ధిని పొంది ఉండవలసింది. ప్చ్... గొప్ప అవకాశం పోగొట్టుకుంది. ట్రంప్ దానిని చేజిక్కించుకున్నారు.

– ప్యాట్రిక్ బ్రౌక్మన్, పొలిటికల్ ఎనలిస్ట్

వాళ్లనే ఇవ్వనివ్వండి!



15 కోట్ల మంది చిన్నారులు నాణ్యమైన విద్యను కోల్పోతున్న, మరో 15 కోట్ల మంది చదువు మానేసిన ఈ దేశంలో... అక్రమంగా దేశం లోపలికి ప్రవేశించిన రోహింగ్యాల కోసం నిధులను ఖర్చు చేయాలని మన న్యాయ వ్యవస్థ కోరుకుంటోంది. అలాగైతే, వారికి సౌకర్యాలను మన న్యాయ వ్యవస్థే సమకూర్చాలని నా ప్రతిపాదన. – ఆనంద్ రంగనాథన్, కన్సల్టింగ్ ఎడిటర్

అద్భుత నిర్వచనం




"భారత్‌లో హిందువుగా ఉండటానికి సిగ్గుపడని వారిని మతతత్వవాది అంటారు" అని – నిజమైన, నకిలీ లౌకికవాదాలకు మధ్య తేడాను సుష్మా స్వరాజ్ గొప్పగా చెప్పారు! ఆమె ప్రసంగాలను మిస్ అవుతున్నా. (14 ఫిబ్రవరి సుష్మా జయంతి) – మిస్టర్ సిన్హా, హైందవ హక్కుల కార్యకర్త

ఇన్ బాక్స్

మహా శాస్త్రవేత్త

పూర్వం 'విశ్వానికి భూమి కేంద్రం' అని నమ్మేవారు. మత గ్రంథాలు కూడా అదే విషయాన్ని ప్రచారం చేశాయి. ఇది చరిత్రలో 'భూ కేంద్ర' సిద్ధాంతంగా ప్రాచుర్యం పొందింది. కానీ భూమి ఒక గ్రహమనీ, ఇది సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉంటుందనీ అనేక మంది శాస్త్రవేత్తలు రుజువు చేశారు. వీరిలో కోపర్నికస్ ముఖ్యుడు. ఈయన ప్రతిపాదించిన సిద్ధాంతమే 'సూర్య కేంద్ర' సిద్ధాంతంగా ప్రాచుర్యం పొందింది. అయితే మతాచార్యులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గెలీలియో గెలీలి వంటి వారు దీనిని నిర్భయంగా సమర్థించారు. శిక్ష అనుభవించారు!


గెలీలియో

గెలీలియో ఇటలీలోని పీసా నగరంలో 1564 ఫిబ్రవరి 15న జన్మించారు. పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరారు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశారు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరారు. ఆయన ఖగోళ శాస్త్రంలో అనేక ఆవిష్కరణలు చేశారు. శని, గురు గ్రహాలపై పరిశోధనలు చేశారు. వాటి ఉపగ్రహాల ఉనికిని గుర్తించారు. టెలిస్కోప్‌ను కనుగొన్నారు. ఆయన పరిశోధనలను 1632లో వెలువడిన 'డైలాగ్ కన్సర్నింగ్ ది టూ చీఫ్ వరల్డ్ సిస్టమ్స్' అనే గ్రంథంలో పొందుపరిచారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను ఇందులో వెల్లడించారు. అయితే ఈ గ్రంథాన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. తర్వాత కాలంలో గెలీలియో తన చూపును కోల్పోయారు. ఇంతటి మహానుభావుడు జైలు శిక్ష అనుభవిస్తూ 1642 జనవరి 8వ తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మత మూర్ఖత్వం బలిగొంది. అయినప్పటికీ గెలీలియో పరిశోధనలు ఆధునిక ఖగోళ శాస్త్రవేత్తలకు ఓ దిక్సూచిలాగా ఉపయోగపడుతున్నాయని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు.

– యం. రాం ప్రదీప్; జన విజ్ఞాన వేదిక సభ్యులు, తిరువూరు
(నేడు గెలీలియో జయంతి)

డ్రాగన్–ఎలిఫెంట్‌ల సయోధ్య సాధ్యమా?

20వ 'సెంట్రల్ కమిటీ ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా' ప్లీనరీలో, ఉన్నత–ప్రమాణాల సోషలిస్ట్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి నాణ్యతా ఆర్థికాభివృద్ధితో అత్యున్నత అత్యాధునిక సోషలిస్ట్ దేశంగా చైనాను రూపొందింపజేయాలని 'డ్రాగన్' సంకల్పించింది. ప్రపంచ ఆర్థిక పురోగతికి 30 శాతానికి మించి దోహదపడుతున్న చైనాలో 2024లో ఆరు నెలల్లోనే 26,870 కొత్త విదేశీ –పెట్టుబడి కంపెనీలు వాణిజ్య రంగంలో అడుగుపెట్టాయి. ఆధునిక సోషలిస్ట్ దేశంగా డ్రాగన్, 'వికసిత భారత్ 2047' లక్ష్యంతో పురోగమిస్తున్న భారత్... రెండూ, 280 కోట్ల జనావళి శ్రేయస్సు దిశలో నడుస్తున్నాయి.

ప్రస్తుతం మన దేశంలోని, ప్రతీ రాష్ట్రం, భారీ కార్పొరేట్ రంగ యాజమాన్యాలు మరింత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల జాయింట్ వెంచర్‌లు, టెక్నాలజీ టై–అప్స్, సమృద్ధిగా ఎగుమతులు సాధించే ఆర్థికాభివృద్ధిని ఆశిస్తున్నాయి. అమెరికా (ట్రంప్ 2.0), చైనా దిగుమతులపై ట్యారిఫ్‌ల పెంపుదల బెదిరింపులు చైనాకు తప్పేటట్టు లేదు. మన ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా వర్తక వ్యాపార సమతూక నిర్వహణకు చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఆహ్వానించడం సమయోచితంగా సూచించారు. 2025లో భారత్–చైనా దేశాధినేతల పరస్పర సహకార సౌహార్ద బాంధవ్యానికి 2024 అక్టోబర్‌లో బ్రిక్స్, కజాన్ సమావేశం కొంత సానుకూలత కల్పించింది. 2024 నవంబర్‌లో భారత్–చైనా విదేశీ వ్యవహారాల మంత్రులు జైశంకర్, వాంగ్‌యీ కూడా రియో డి జెనీరోలో ద్వైపాక్షిక చర్చలలో పాల్గొన్నారు. ప్రపంచంలో ద్వితీయ ఆర్థిక సంపన్న దేశంగా 2024లో గుర్తింపు పొందింది. 2023లో మన దేశంతో 136.2 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వర్తక, వాణిజ్య భారీ భాగస్వామ్యం పొందింది. మన దేశపు అత్యంత నాణ్యతా ఉత్పత్తులకు చైనాలో ప్రోత్సాహం ఉండనే ఉంది. 2024లో మన దేశపు మిర్చి, ఇనుప ఖనిజం, పత్తి, నూలు చైనాకు ఎగుమతులలో వరుసగా 17 శాతం, 160 శాతం, 240 శాతాలకు పైగా వృద్ధి సాధించాయి. చైనా, అంతర్జాతీయ దిగుమతుల ఎక్స్‌పో వంటి ప్లాట్‌ఫారాల పూర్తి వినియోగానికి భారత్‌లోని అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను ఆహ్వా నిస్తూనే ఉంది.


భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

చైనా – భారత్‌ల మధ్య నెలకొని ఉన్న సరిహద్దు వివాదం శతాబ్దాల సంఘర్షణల నేపథ్యం పరిశీలిస్తే... అంత సులభంగా పరిష్కారం కాదని గ్రహించవచ్చు. రుణప్రదాతగా రాజనీతితో వ్యవహరిస్తున్న బడా చైనా సార్వభౌమ ఆధిపత్యపు కోరలలో చిక్కుకొన్న లావోస్, అంగోలా, 16 సబ్ – సహారా దేశాలు, కాంగో, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, కంబోడియా, నైజీరియా, ఈజిప్ట్ వంటి... మధ్య, స్వల్ప, అల్ప ఆదాయ దేశాలు విలవిలలాడుతున్నాయి. 2017లో శ్రీలంక తన మేజర్ నౌకాశ్రయం హాంబన్ తోటను చైనాకు స్వాధీనం చేయవలసి వచ్చింది. టిబెట్‌లో సియాంగ్ నదిపై (అస్సాంలో బ్రహ్మపుత్రా) అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులలో 60,000 మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్రపంచంలోనే అతి పెద్దదైన జల విద్యుత్ కేంద్ర నిర్మాణం తలపెట్టింది. అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమా ఖండూ ఇటీవల జనవరి నెలాఖరులో చైనా అంతర్జాతీయ జల ఒడంబడికలను ఎలా త్రోసిరాజంటున్నదీ చెప్పారు. ఆ భారీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ భవిష్యత్తులో సృష్టించే పెను పర్యావరణ, ప్రకృతి విధ్వంసాన్ని వివరిస్తూ చైనా వైఖరి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని చిక్కుముడుల మధ్య డ్రాగన్–ఎలిఫెంట్ సయోధ్య సాధ్యమా?

– జయసూర్య
సీనియర్ జర్నలిస్ట్ । 94406 64610

సేవతో మోక్షం!


సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్

దేశ విదేశాల్లో ఉన్న కోట్లాదిమంది బంజారా తెగ వారు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్‌ను దైవంగా భావించి కొలుస్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను జరుపుతూ ఏటా కోటి రూపాయలు కేటాయిస్తోంది.

1739 ఫిబ్రవరి 15న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాంజీ నాయక్ తండా గుత్తి (బళ్లారి ప్రాంతం)లో జన్మించారు సేవాలాల్. బంజారాలు అడవుల్లో ఉంటూ పశుపోషణ ప్రధాన వృత్తిగా జీవిస్తారు. హింసావాదాన్ని విడనాడి బంజారాలు అహింసా మార్గాన్ని ఎంచుకోవాలని చెప్పిన మొదటి గురువు సేవాలాల్ మహారాజ్. ప్రతి బంజారాలు జగదాంబ మాతను ఎలాంటి ప్రతిఫలమూ ఆశించకుండా పూజించాలనీ, మత్తు, ధూమపానాలు శాపాలు వంటివనీ ఆయన బోధించారు. గోవధను వ్యతిరేకించారు. ప్రకృతిని ప్రేమించమని చెప్పారు. ఆయన ప్రవచనాలు ధర్మం, నైతికత, సమానత్వం, సమాజసేవను ప్రబోధిస్తాయి. అమ్మవారి పట్ల భక్తి కలిగి ఉండి సేవా మార్గంలో నిష్కల్మషమైన జీవితాన్ని కొనసాగించమని బోధించారు. భక్తి, ధ్యానం, నిరంతర సేవ ద్వారా మోక్షాన్ని పొందవచ్చని వివరించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే కష్టపడి పనిచేయాలనీ, లక్ష్య సాధనకు నిరంతరం ప్రయత్నించాలనీ సందేశాన్ని ఇచ్చారు. వృద్ధులు, అనాథలు, అవసరమైన వారికి సహాయం చేయాలని ఉపదేశించారు.

సేవాలాల్ మహారాజ్ ప్రవచనాలు కేవలం బంజారా సమాజానికే కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలిచాయి. బంజారా జాతి కోసం సేవాలాల్ పడిన పాట్లను ప్రజలు తమ పాటలు, ఆటలు, వేషాదరణ, భోగ్ భండార్‌ల ద్వారా చెబుతూ ఉంటారు. ఇటువంటి తమ ఆరాధ్య దైవం విగ్రహాన్ని పార్లమెంటు ముందు పెట్టాలని బంజారాలు డిమాండ్ చేస్తున్నారు. దయనీయమైన పరిస్థితుల్లో బతుకులీడుస్తున్న బంజారాల స్థితి రాజుల కాలం నుంచి అలాగే కొనసాగుతూ ఉంది. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ వారి బతుకులు అంతగా మారకపోవడం విషాదం!

– డా॥ ఎ. శంకర్ నాయక్, ప్రభుత్వ సిటీ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్, హైదరాబాద్ (నేడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి)



రమణీయం.. రథోత్సవం

రాయికల్ (జగిత్యాల): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో శుక్రవారం భీమన్న రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి రథంపై ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ తిప్పారు. రాయికల్, మల్లాపూర్, మేడిపల్లి మండలాలకు చెందిన వేలాది మంది భక్తులు రథోత్సవంలో మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ సుధీర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, తాజా మాజీ చైర్మన్ మోర హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం మినీ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం సమ్మక్క సారలమ్మల గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జంపన్నవాగు వద్ద స్నానాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర, సారె, ఎత్తు బంగారం, పూలు, పండ్లు, ఒడి బియ్యం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారంతో మేడారం మినీ జాతర ముగియనుంది. ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని ఆయన చెప్పారు.

క్లుప్తంగా...

సత్వరం రోడ్ల మరమ్మతులు

- మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గత వానాకాలంలో దెబ్బతిన్న రోడ్లకు వేగంగా మరమ్మతులు చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా.. వేగంగా ప్యాచ్‌వర్క్ పూర్తి చేయాలని సూచించారు. ఆయన శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సులో అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన కన్సల్టెన్సీ, జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ రోడ్లను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. తీవ్రంగా దెబ్బతిని ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్లను మాత్రమే మరమ్మతులకు ఎంపిక చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

మంత్రి కోమటిరెడ్డితో మందకృష్ణ భేటీ

రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని.. శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మశ్రీ అవార్డు, ఎస్సీ వర్గీకరణను సాధించినందుకు మందకృష్ణను మంత్రి సత్కరించారు.

'యాదాద్రి థర్మల్'లో ప్రమాదం

- వేడి బూడిద పడి కార్మికులకు తీవ్ర గాయాలు



గాయపడిన దినసరి కూలీలు

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ బాయిలర్‌లో శుక్రవారం ప్రమాదం జరిగి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల ప్రారంభించిన రెండో యూనిట్‌లో ఈఎస్‌పీ వైపు వెళ్లే ప్రధాన పైపులైన్ పూర్తిగా స్తంభించడంతో బాయిలర్ నిలిచిపోయింది. దీంతో బూడిద యంత్రాన్ని శుభ్రం చేస్తుండగా వేడిగా ఉన్న బూడిద కూలీలపై పడిపోయింది. దినసరి కూలీలు అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన వై.వెంకటేశ్వర్లు, దుబ్బతండాకు చెందిన హతిరాం, రూప్లానాయక్, దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం గ్రామానికి చెందిన సైదా, వీర్లపాలెం గ్రామానికి చెందిన లింగానాయక్‌లతోపాటు సంస్థలో పని చేస్తున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన వికాస్ జైస్వాల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వేడిగా ఉండటంతో వీరి శరీరం చాలావరకు కాలిపోయింది. వెంటనే స్పందించిన కంపెనీ అధికారులు వీరందరికీ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మంటగలిసిన మానవత్వం


- మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వని యజమాని



శ్మశానవాటికలో భీష్మాచారి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గజ్వేల్ రూరల్: అద్దె ఇంట్లో ఉంటున్న ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మృతదేహాన్ని ఇంటి యజమాని రానివ్వలేదు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలివి. పట్టణానికి చెందిన తంగెళ్లపల్లి భీష్మాచారి, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు. భీష్మాచారి కార్పెంటర్‌గా పనిచేస్తూ పట్టణంలోని ఒక ఇంట్లో అద్దెకుంటున్నాడు. అనారోగ్యంతో ఆర్‌వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీష్మాచారి.. గురువారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు అద్దె ఇంటి యజమాని ఒప్పుకోకపోవడంతో.. రాత్రంతా ఆసుపత్రిలోనే కుటుంబ సభ్యులు గడిపారు. ఎక్కడికి వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో.. నేరుగా పట్టణ శ్మశానవాటికకు తీసుకొచ్చి అంత్యక్రియలను నిర్వహించారు.

శాన్విక.. పద్యాలకు తిరుగులేదిక



ఇల్లంతకుంట(సిరిసిల్ల): అయిదో తరగతిలోనే 117 పద్యాలు కంఠస్థం చేసి పాడి శభాష్ అనిపించుకుంది రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ విద్యార్థిని. గ్రామ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న నక్క శాన్విక.. తెలుగు ఉపాధ్యాయిని రిజ్వానా ప్రోత్సాహంతో 117 పద్యాలు కంఠస్థం చేసింది. మండలంలోని గాలిపల్లి స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన తెలుగు పద్యాల పఠన పోటీల్లో 117 పద్యాలు పాడి వినిపించి మొదటి బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ అభినందించారు. శాన్విక తండ్రి నాగరాజు విదేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లగా.. తల్లి రేణుక వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటుంది.

సత్వర అభివృద్ధికి కేరాఫ్ తెలంగాణ

నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్–2025 విడుదల సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- తలసరి ఆదాయం 3.56 లక్షలు.. జీఎస్‌డీపీ వృద్ధిరేటు 14.5 శాతం
- పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన శాస్త్రీయ వ్యవసాయ సాగు
- సౌర వ్యవసాయ పంపు సెట్లుగా మార్చేందుకు ప్రయత్నం
- వ్యవసాయ రంగం అభివృద్ధికి నాబార్డ్ తోడ్పడాలన్న మంత్రి తుమ్మల
- 2025–26 సంవత్సరంలో రాష్ట్రానికి నాబార్డ్ క్రెడిట్ సామర్థ్యం రూ.3.86 లక్షల కోట్లుగా అంచనా



నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి తుమ్మల, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, నాబార్డ్, రాష్ట్ర అధికారులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ అని, రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 14.5 శాతంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 15.02 లక్షల కోట్లుకాగా.. ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం 3.56 లక్షలుగా ఉందని తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నాబార్డ్ ఆధ్వర్యంలో 'స్టేట్ ఫోకస్ పేపర్ 2025–26'ను విడుదల చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో నాబార్డ్ కీలక భాగస్వామిగా ఉందని, రాబోయే రోజుల్లో మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. వ్యవసాయ రంగానికి రుణ సహాయం చేస్తూ, రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని, డిజిటల్ బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్ పామ్ సాగులో మలేసియా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని.. తెలంగాణలోనూ ఆయిల్ పామ్ సాగును బలోపేతం చేయాలని కోరారు. మహారాష్ట్రలో అల్ఫాన్సో రకం మామిడి సాగు చేస్తున్నారని, అదే తరహా భూమి, ఇతర వనరులున్న తెలంగాణలోనూ అల్ఫాన్సో రకం మామిడి సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. గత పదేళ్లపాటు రాష్ట్రంలో శాస్త్రీయ సాగును నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గ్రీన్‌హౌస్, పాలీహౌస్, డ్రిప్, స్ప్రింక్లర్‌ల ద్వారా పంటల సాగుకు నాబార్డు ప్రోత్సాహం అందించాలని కోరారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లను క్రమంగా సోలార్ పంపుసెట్లుగా మార్చేందుకు ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకర్ల సహకారం అవసరం: తుమ్మల

రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకర్లు మరింత సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాలన్నారు. పశుపోషణ, మత్స్య పరిశ్రమ, కృషి ఆధారిత పరిశ్రమలు వంటివాటిలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

నాబార్డ్ తెలంగాణ సీజీఎం బి.ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి గాను తెలంగాణ కోసం అంచనా వేసిన క్రెడిట్ సామర్థ్యం రూ.3.86 లక్షల కోట్లు అని, ఇది గతేడాది కంటే 37.80 శాతం అధికమని తెలిపారు. వ్యవసాయానికి రూ.1.63 లక్షల కోట్లు, ఎంఎస్ఎంఈకి రూ.2.03 లక్షల కోట్లు , ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.0.19 లక్షల కోట్లు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి , ఆర్‌బీఐ జీఎం అనూజ్ రంజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నాబార్డ్ జీఎం ఆర్.గణపతి తదితరులు పాల్గొన్నారు.


2025-26లో రాష్ట్రానికి రుణ అంచనా రూ.3.86 లక్షల కోట్లు

రైతులు, చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రైతులు, చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన వ్యవసాయ, చేనేత, హస్తకళల శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడంతో అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని గత రాష్ట్ర బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో కేటాయింపులు చేసినట్టు తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతులకు పెట్టుబడిసాయంగా అందిస్తున్న రైతు భరోసాను కొనసాగించేలా వచ్చే బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పూలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. చేనేత కార్మికులకు సబ్సిడీపై నూలు, విద్యుత్ సౌకర్యం వంటి పథకాలు కొనసాగించాలని మంత్రులు అధికారులకు సూచించారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ పార్కుల అభివృద్ధికి కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, చేనేతశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, ఆర్థికశాఖ జాయింట్ డైరెక్టర్ హరిత, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి పాల్గొన్నారు.

పర్సు పోయిందని చెప్పడానికి వస్తే.. మహిళను చితకబాదిన సీఐ



భాగ్య

ఎడపల్లి: పర్సు పోయిందని చెప్పడానికి వచ్చిన ఓ మహిళను సీఐ లాఠీతో విచక్షణారహితంగా చితకబాదిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన బోయ భాగ్య తన కుమారుడితో కలిసి శుక్రవారం ఎడపల్లి మండలం జానకంపేట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలకు వెళ్లింది. జాతరలో ఆమె పర్సు పోగా, అక్కడే ఉన్న పోలీస్ ఔట్ పోస్టులోని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం అక్కడే ఉన్న బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు దగ్గరకు వెళ్లి తన పర్సుపోయిన విషయం చెప్పింది. దీంతో సీఐ రాద్ధాంతం చేస్తున్నావంటూ ఆగ్రహంతో ఆమెను లాఠీతో చితకబాదాడు. దీంతో తన కాళ్లు, నడుము భాగంలో వాతలు వచ్చాయంటూ సీఐ విజయ్‌బాబుపై ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో భాగ్య ఫిర్యాదు చేసింది. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డిని సంప్రదించగా మహిళ ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, విచారణ చేస్తామని తెలిపారు.

యువకుడి ప్రాణం తీసిన సెల్ఫీ



వినోద్

ముస్తాబాద్ (సిరిసిల్ల): నడుస్తున్న రైలులో సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఓ యువకుడు కింద పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన పొట్టి వినోద్‌గౌడ్ (30) తన బంధువు ప్రణయ్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లేందుకు కామారెడ్డిలో గురువారం రైలు ఎక్కాడు. వేగంగా కదులుతున్న రైలులో డోర్ వద్ద కూర్చుని కొద్దిసేపు సెల్ఫీలు తీసుకున్నాడు. తిరిగి లోపలికి వెళ్లే ప్రయత్నంలో కాలు జారి కింద పడిపోయాడు. అది గమనించిన ప్రణయ్ వెంటనే రైలును ఆపేందుకు ప్రయత్నించినా అది మనోహరాబాద్ వెళ్లే వరకు ఆగలేదు. దీంతో ఆవునూర్‌లో ఉన్న బంధువులకు సమాచారం అందించాడు. రాత్రి వరకు రైలు పట్టాల వెంబడి గాలించినా వినోద్ ఆచూకీ లభించలేదు. చివరికి పోలీసులు వినోద్ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా చెట్ల పొదల్లో మృతదేహాన్ని గుర్తించారు.

ఆర్డీఓ సంతకాన్ని ఫోర్జరీ చేసిన రియల్టర్

- సొంతంగా నాలా అనుమతులు సృష్టించి ప్లాట్ల విక్రయం
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



అంజయ్యగౌడ్

చౌటుప్పల్ : నాలా అనుమతుల పేరిట తప్పుడు పత్రాలు సృష్టించి..ఆర్డీఓ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఓ రియల్టర్ బాగోతం బట్టబయలైంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ పి.మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్‌లు శుక్రవారం వెల్లడించారు. సుర్వి అంజయ్యగౌడ్ కొన్నేళ్లుగా చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తంగడపల్లిలో 5 ఎకరాల వ్యవసాయ భూమిని 2019లో కొనుగోలు చేశాడు. అదే ఏడాది మార్చి 25న పట్టాదారుల నుంచి 1.14 ఎకరాల భూమిని చౌటుప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జీపీఏ చేయించుకున్నాడు. తాను కొనుగోలు చేసిన భూమిలో మిగిలిన భూమిని సేల్ డీడ్ చేయించుకున్నాడు. అయితే తాను కొనుగోలు చేసిన భూమే కాకుండా పట్టాదారులకు చెందిన భూమిలో కూడా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నాడు. అయితే చౌటుప్పల్ మండలం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండటంతో నాలా(వ్యవసాయేతరభూమి) కన్వర్షన్ ఉంటేనే ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాలని 2024లో కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, సబ్‌రిజిస్ట్రార్ నాలా అనుమతి ఉన్న లెటర్ కావాలని సూచించాడు. అయితే నాలాకు అనుమతి కావాలంటే పట్టాదారులే దరఖాస్తు చేయాలి. అయితే వారికి అంజయ్య డబ్బులు ఇవ్వాల్సి ఉంది. దీంతో వారు తనకు సహకరించరని భావించి తప్పుడు పద్ధతిని ఎంచుకున్నాడు. దీనికోసం హైదరాబాద్‌లో నివాసముంటున్న చౌటుప్పల్ మండలం దామెర గ్రామానికి చెందిన ఓ రిపోర్టర్‌ను సంప్రదించి అతని సహకారం తీసుకున్నాడు. గతంలో ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన మహేందర్‌రెడ్డి సంతకాలను ఫోర్జరీ చేశాడు. ఆర్డీఓ కార్యాలయ స్టాంపులు(ముద్రలు) కూడా తయారు చేయించాడు. ఆ తర్వాత ప్రొసీడింగ్ నంబర్ బీ/95/2019ని(తేదీ.23.11.2019) మార్పిడి చేసి 14.09.2024న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్యుమెంట్ రైటర్ సర్దాశేఖర్‌ను సంప్రదించి తన వద్ద ఉన్న తప్పుడు పత్రాలు అందించాడు. అంజయ్య తన పేరిట ఉన్న జీపీఏ డాక్యుమెంట్‌ను దంపతులైన పి.నగేష్, ప్రియాంకల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆ తర్వాత ఆ డాక్యుమెంట్‌లతోపాటు నకిలీ నాలా అనుమతుల కాపీలను చూపించి సుర్వి అంజయ్య వందలాది ప్లాట్లను అమ్ముకున్నాడు.

ఇటీవల వచ్చిన ఫిర్యాదుతో...

ఇటీవల ఓ వ్యక్తి సుర్వి అంజయ్య అమ్ముతున్న ప్లాట్లపై ఆర్డీఓకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా, అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించగా, వాస్తవాలను అంగీకరించాడు. దీంతో అంజయ్యను కోర్టులో హాజరుపర్చారు. అనంతరం నల్లగొండ జైలుకు తరలించారు. నిందితుడిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్టు చెప్పారు.

గురుకుల విద్యార్థిని కిడ్నాప్ కలకలం

- చాకచక్యంగా తప్పించుకున్న బాలిక
- ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆందోళన

బాన్సువాడ రూరల్: కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని ఓ గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని కిడ్నాప్ ఉదంతం కలకలం రేపింది. విద్యార్థినికి వరుసకు అన్న అయ్యే ఓ యువకుడు, శుక్రవారం గురుకుల పాఠశాలలో చొరబడి ప్రిన్సిపాల్ అనుమతి తీసుకున్నానంటూ మాయమాటలు చెప్పి బాలికను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. అడ్డుపడిన మహిళా సెక్యూరిటీ గార్డును నెట్టేశాడు. దారిలో పెట్రోల్ లేక బైక్ మొరాయించడంతో ఆ యువకుడు ఇతరుల వద్ద పెట్రోల్‌కోసం డబ్బులు అడుక్కుంటున్న సమయంలో విద్యార్థిని చాకచక్యంగా వ్యవహరించి తనతల్లికి ఫోన్‌చేసి విషయం చెప్పింది. తన కూతురు ప్రమాదంలో ఉందని, సహాయం చేయాలని బాలికకు ఫోన్ ఇచ్చిన వ్యక్తిని ఆమె బతిమాలింది. దీంతో అతను అక్కడున్న స్థానికుల సహాయంతో యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశాడు. తర్వాత బాన్సువాడ పోలీసులకు ఫోన్ చేయడంతో సీఐ అశోక్ వెళ్లి ఆ యువకుడిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇంత జరిగినా విషయం బయటకు పొక్కకుండా పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై సీఐ అశోక్‌ను సంప్రదించగా, పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సదరు యువకుడు గత మూడు రోజులుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నట్లు తెలిసిందని అన్నారు.

జంటనగరాల దాహార్తి తీర్చే అక్కంపల్లి రిజర్వాయర్‌లో కోళ్ల కళేబరాలు!

- వైరస్‌తో చనిపోయిన కోళ్లను వేయడంతో కలవరం
- జాలర్ల సాయంతో వెలికితీసి పూడ్చేసిన అధికారులు
- ఆందోళన వద్దన్న జలమండలి..
- ప్రాథమిక పరిశీలనలో ఎలాంటి అవశేషాలను గుర్తించలేదని వెల్లడి..
- నీటి నమూనాలు సేకరించి.. ల్యాబ్‌కు పంపిన అధికారులు



కోళ్ల కళేబరాలు

సాక్షి, హైదరాబాద్/ పెద్దఅడిశర్లపల్లి: హైదరాబాద్ జంటనగరాలతోపాటు నల్లగొండ తాగునీటి అవసరాలు తీర్చే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్)లో కోళ్ల కళేబరాలు ప్రత్యక్షమయ్యాయి. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. వద్దిపట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీఫామ్ నిర్వాహకులు కోళ్ల కళేబరాలను ఏఎంఆర్‌పీ లింక్ కెనాల్‌లో వేయడంతో అవి ఏకేబీఆర్‌లోకి చేరాయి. శుక్రవారం ఉదయం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు రిజర్వాయర్ నీటిలో కోళ్ల కళేబరాలను గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు ఏకేబీఆర్‌ను పరిశీలించి నీటిలో తేలిన కోళ్ల కళేబరాలను జాలరుల సాయంతో వెలికితీశారు. అనంతరం వద్దిపట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీఫామ్ నిర్వాహకుల నుంచి సమాచారం సేకరించి కోళ్ల కళేబరాలను వేసిన అనుమానితులను గుర్తించి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు రమావత్ రాయమల్లు ఇటీవల వైరస్ సోకి మృతి చెందిన కోళ్లను లింక్ కెనాల్ వేసినట్టు తెలుసుకొని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. రిమాండ్ నిమిత్తం దేవరకొండ కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ నర్సింహులు తెలిపారు. ఓ కోళ్లఫామ్ వద్ద కోళ్లు చనిపోయి ఉండగా, వాటితోపాటు ఏకేబీఆర్‌లో వెలికితీసిన కోళ్ల కళేబరాలను కూడా పూడ్చి పెట్టారు. దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి రిజర్వాయర్‌ను పరిశీలించారు. పుట్టంగండి, ఏకేబీఆర్, తాగునీటి చెరువుల్లో విషతుల్యమైన వ్యర్థాలను వేసి కలుషితం చేస్తే కఠిన చర్యలుంటాయని దేవరకొండ ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు.

బర్డ్‌ఫ్లూతో మృతి చెందాయా?

అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో వందలకొద్దీ కోళ్ల కళేబరాలు ప్రత్యక్షం కావడంతో బర్డ్‌ఫ్లూతో మృతి చెందాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అధికారులు కోళ్ల కళేబరాలు, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లో ల్యాబ్‌కు పంపారు.

అక్కంపల్లిపై ఆందోళన వద్దు

అక్కంపల్లి రిజర్వాయర్‌లో కోళ్ల కళేబరాల సమాచారంతో అప్రమత్తమైన జలమండలి అధికారులు తక్షణమే రంగంలోకి దిగి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రిజర్వాయర్ నీటిలో ఎలాంటి కోళ్ల అవశేషాలు కలవలేదని జలమండలి ప్రకటించింది. జలమండలి క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ టెస్టింగ్ వింగ్ (క్యూఏటీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), థర్డ్ పార్టీ లూసిడ్ సంస్థ కోదండపూర్ నీటి శుద్ధి కేంద్రాలను సందర్శించి నీటి నమూనాలను సేకరించారు. ప్రాథమికంగా ఎలాంటి అవశేషాలు గుర్తించలేదని మూడు బృందాలు వెల్లడించారు.

వారంపాటు ప్రతి గంటకు పరీక్షలు

అక్కంపల్లి రిజర్వాయర్ ఘటనపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐఎస్ ప్రమాణాలతో వచ్చే వారం రోజుల పాటు.. ప్రతి గంటకూ నీటి ప్రమాణాలను పరీక్షిస్తామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. నీటి సరఫరాలో జలమండలి ఇప్పటికే మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ పద్ధతిని పాటిస్తుందని చెప్పారు. దీంతోపాటు ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఇండియన్ స్టాండర్డ్ ప్రమాణాల్ని పాటిస్తూ.. శాస్త్రీయంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలనూ తీసుకుంటామని చెప్పారు.

ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు

2030 కల్లా 500 బిలియన్ డాలర్లకు | ట్రంప్-మోదీ భేటీలో కీలక నిర్ణయాలు | భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు

- భారీగా చమురు, సహజవాయువు
- వైట్‌హౌస్‌లో అధ్యక్షునితో ప్రధాని భేటీ
- రెండోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారి మోదీని ఆత్మీయంగా ఆహ్వానించిన ట్రంప్
- సుదీర్ఘ కరచాలనం, సుదృఢ ఆలింగనం
- అనంతరం మీడియాతో సంయుక్త భేటీ
- భారత్‌పైనా సమాన టారిఫ్‌లు తప్పవు
- మోదీ సమక్షంలోనే ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్: ట్రంప్ 2.0తో మోదీ 3.0 తొలి భేటీ బంపర్ హిట్టయింది. భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా రెండింతలకు పెంచి 500 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయం జరిగింది. అందులో భాగంగా భారత్‌కు అమెరికా అత్యాధునిక ఎఫ్-35 యుద్ధ విమానాలను అందజేయడమే గాక రక్షణ ఉత్పత్తులను ఎగుమతులను ఇతోధికంగా పెంచనుంది. భారీగా చమురు, సహజవాయువు కూడా సరఫరా చేయనుంది. ఇరు దేశాలూ పౌర అణు సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ జరిపిన సమావేశం ఇలాంటి పలు కీలక ఒప్పందాలకు వేదికైంది. రెండు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా అధ్యక్షునితో మోదీ శుక్రవారం (భారత కాలమానం ప్రకారం) వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో భేటీ అయ్యారు. మోదీ మూడోసారి ప్రధానిగా, ట్రంప్ రెండోసారి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించాక వారి మధ్య ఇదే తొలి సమావేశం కావడం విశేషం. మోదీని ట్రంప్ అత్యంత ఆత్మీయంగా స్వాగతించారు. చాలాసేపటిదాకా కరచాలనం చేయడమే గాక ప్రధానిని గట్టిగా హత్తుకున్నారు. 'మీరో అద్భుతమైన వ్యక్తి. గొప్ప మిత్రుడు. మిమ్మల్నెంతగానో మిస్సయ్యాం' అంటూ అత్యంత ఆప్యాయంగా పలకరించారు. అనంతరం భారత్, అమెరికా వాణిజ్య, దౌత్య సంబంధాలు, రక్షణ రంగంలో పరస్పర సహకారంతో పాటు పలు అంశాలపై నేతలిద్దరూ సుదీర్ఘంగా చర్చించుకున్నారు. పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తర్వాత 44 నిమిషాల పాటు మీడియాతో సంయుక్తంగా మాట్లాడారు. అమెరికాకు మోదీ చిరకాల మిత్రుడంటూ మీడియా ముఖంగా కూడా ట్రంప్ పదేపదే ప్రశంసించారు.

భారీ వర్తక ఒప్పందం: ట్రంప్

చైనాతో పాటు పలు దేశాలపై దూకుడైన టారిఫ్‌ల యుద్ధం ప్రకటించిన ట్రంప్, భారత్‌పై టారిఫ్‌ల విషయంలో మాత్రం కాస్త సున్నితంగానే స్పందించారు. కాకపోతే పరస్పర టారిఫ్‌ల విషయంలో మాత్రం అస్సలు మొహమాటపడబోమని మోదీ సమక్షంలో ట్రంప్ కుండబద్దలు కొట్టారు. అమెరికాపై భారత్ విధించే సుంకాలనే తామూ విధించి తీరతామన్నారు. పలు అమెరికా ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న దిగుమతి సుంకాలు చాలా హెచ్చుగా, ఏకపక్షంగా ఉన్నాయంటూ సంయుక్త మీడియా భేటీలోనే ఆక్షేపించారు. అయితే, అమెరికా నుంచి చమురు, సహజవాయువు దిగుమతుల పరిమాణాన్ని భారీగా పెంచేందుకు మోదీ సమ్మతించారని అధ్యక్షుడు వెల్లడించారు. ఆ రెండింట్లో భారత్‌కు తామే అతి పెద్ద సరఫరాదారులం కాబోతున్నట్టు చెప్పారు. ''భారత్‌తో వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు రక్షణ హార్డ్‌వేర్ తదితర ఉత్పత్తుల ఎగుమతులను ఈ ఏడాది నుంచి ఏటా బిలియన్ డాలర్ల మేరకు పెంచనున్నాం. అంతేగాక ప్రపంచంలోకెల్లా అత్యంత అధునాతనమైన ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్లను భారత్‌కు అందజేస్తాం. భారత్‌తో అతి త్వరలో భారీ వర్తక ఒప్పందం కుదరనుంది. పౌర అణు ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. ఇందులో భాగంగా అమెరికా అణు పరిజ్ఞానాన్ని భారత్ తన మార్కెట్లలోకి అనుమతించనుంది'' అని వెల్లడించారు. భారత్-పశ్చిమాసియా-యూరప్ ఆర్థిక కారిడార్ దిశగా కృషి చేయాలని అంగీకారానికి వచ్చామన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుకు ముకుతాడు వేసే దిశగా అధినేతల భేటీలో మరిన్ని నిర్ణయాలు జరిగాయి. వాటిలో భాగంగా భారత్‌కు మరో 6 అత్యాధునిక పీ-8ఐ దీర్ఘశ్రేణి సముద్ర నిఘా విమానాలను విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. జావెలిన్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైళ్లు, స్ట్రైకర్ యుద్ధ వాహనాలను భారత్‌లో సంయుక్త తయారీ తదితరాలకూ సమ్మతించింది.



ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ కరచాలనం

మాగా.. మిగా కలిస్తే మెగా

ట్రంప్ నినదించిన మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ-మాగా) స్ఫూర్తితో మేక్ ఇండియా గ్రేట్ అగైన్ (ఎంఐజీఏ-మిగా) నినాదం ఇస్తున్నానని ప్రధాని మోదీ ప్రకటించారు. రెండూ కలిసి మెగా భాగస్వామ్యంగా మారతాయని ధీమా వెలిబుచ్చారు.

పదేళ్లకు రోడ్‌మ్యాప్: మోదీ

భారత్, అమెరికా పరస్పర సహకారాత్మక బంధం మెరుగైన ప్రపంచానికి బాటలు పరుస్తుందని మోదీ ఆశాభావం వెలిబుచ్చారు. రక్షణ రంగంలో పరస్పర సహకారానికి వచ్చే పదేళ్ల కాలానికి రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటామని చెప్పారు. అంతరిక్ష రంగంలో సహకారాన్ని మరింత పెంపొందించుకుంటామని చెప్పారు. 2025ను అమెరికా-భారత్ పౌర అంతరిక్ష సహకార సంవత్సరంగా అభివర్ణించారు. ''అన్ని విషయాల్లోనూ అమెరికా ప్రయోజనాలకే ట్రంప్ పెద్దపీట వేస్తారు. ఇది నేనెంతగానో అభినందించే విషయం. భారత ప్రయోజనాలకు నేను కూడా అంతే'' అని వివరించారు. వ్యాపారవేత్త గౌతం అదానీ వివాదంపై ట్రంప్‌తో చర్చించారా అని ప్రశ్నించగా వ్యక్తులను గురించి అంశాలేవీ ప్రస్తావనకు రాలేదని చెప్పారు. చైనాతో లద్దాఖ్ వివాదాన్ని ప్రస్తావించగా సరిహద్దు ఘర్షణలు ఎవరికీ మంచివి కావని అభిప్రాయపడ్డారు. ట్రంప్ జోక్యం చేసుకుని చైనా, భారత్, రష్యా, అమెరికా కలసికట్టుగా సాగాలని అభిలషించారు. ట్రంప్‌తో భేటీ అద్భుతంగా సాగిందని అనంతరం మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. రెండు రోజుల అమెరికా పర్యటన ముగించుకుని శుక్రవారం ఆయన భారత్ బయల్దేరారు.

ముంబై దోషుల్ని శిక్షించాల్సిందే

ఇస్లామిక్ రాడికల్ ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అమెరికా సంఘీభావం ప్రకటించింది. దాన్ని రూపుమాపేందుకు సంయుక్తంగా పోరాడతామని ట్రంప్ స్పష్టం చేశారు. 2008 ముంబై ఉగ్ర దాడుల దోషులందరికీ శిక్ష పడేలా చూడాల్సిందేనని పాకిస్తాన్‌కు స్పష్టం చేశారు. ఆ దాడుల్లో నిందితుడైన తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగిస్తున్నట్టు సంయుక్త విలేకరుల భేటీలో అధ్యక్షుడు ధ్రువీకరించారు. ''ప్రపంచంలోకెల్లా అత్యంత హింసాత్మక వ్యక్తుల్లో ఒకరిని భారత్‌కు అప్పగిస్తున్నామని చెప్పేందుకు సంతోషిస్తున్నా. ముంబై ఉగ్ర దాడులకు పాల్పడ్డందుకు అక్కడ న్యాయ విచారణను ఎదుర్కొంటాడు. త్వరలో మరికొందరిని కూడా అప్పగిస్తాం'' అని పేర్కొన్నారు. తద్వారా ఖలిస్తానీ వేర్పాటువాది పన్ను తదితరులకు పరోక్షంగా హెచ్చరిక సంకేతాలిచ్చారు. రాణా అప్పగింత పట్ల అమెరికాకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా తొలినుంచీ కలసికట్టుగా పని చేస్తున్నాయని గుర్తు చేశారు. ముంబై తరహా దాడులను నివారించేందుకు, అల్‌ఖైదా, ఐసిస్, జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా తదితర ఉగ్ర సంస్థల ఆట కట్టించేందుకు సంయుక్త కృషిని కొనసాగిస్తామని ఇరు దేశాల సంయుక్త ప్రకటన కూడా పేర్కొంది. పాక్ మూలాలున్న రాణా కెనడా జాతీయుడు. పాక్-అమెరికా ఉగ్రవాది డేవిడ్ కోల్మన్ హెడ్లీతో పాటు ముంబై దాడుల్లో ప్రధాన నిందితుడు. ప్రస్తుతం లాస్ ఏంజెలిస్ జైల్లో ఉన్నాడు.



వైట్‌హౌస్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ, ట్రంప్ చిరునవ్వులు

మిషన్ 500

భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణాన్ని 2030 కల్లా 500 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా పరస్పర సుంకాలను బాగా తగ్గించుకోవాలని, మార్కెట్ యాక్సెస్‌ను పెంపొందించుకోవాలని తీర్మానించాయి. మోదీ-ట్రంప్ భేటీ అనంతరం ఇరు దేశాలు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ముఖ్యాంశాలు...

- ఈ సంవత్సరాంతానికల్లా ద్వైపాక్షిక వర్తక ఒప్పందం (బీటీఏ) కుదరనుంది. ఇరు దేశాల నుంచి ఉన్నత స్థాయి ప్రతినిధులు లోతుగా చర్చిస్తారు.
- సైనిక భాగస్వామ్యం, వేగవంతమైన వాణిజ్య, సాంకేతిక బంధం దిశగా అవకాశాలను నిశితంగా పరిశీలించేందుకు ఉద్దేశించిన 'కాంపాక్ట్' మిషన్‌ను ముందుకు తీసుకెళ్లే మార్గాలను అన్వేషిస్తారు.
- వస్తువులు, సేవల రంగంతో పాటు అన్నింటా వర్తక వాణిజ్యాలు మరింత వేగవంతం అవుతాయి.
- నాసా-ఇస్రో సంయుక్త ఆక్సియోమ్ మిషన్ ద్వారా భారత వ్యోమగామి తొలిసారి ఐఎస్‌ఎస్‌కు వెళ్లనున్నాడు.
- త్వరలో నాసా-ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్ (నిసార్) మిషన్‌ను ప్రయోగించనున్నాం.
- ట్రాన్స్‌ఫార్మింగ్ ద రిలేషన్‌షిప్ యుటిలైజింగ్ స్ట్రాటజిక్ టెక్నాలజీ (ట్రస్ట్) పథకం ద్వారా రక్షణ, ఏఐ, సెమీ కండక్టర్లు, క్వాంటమ్, బయోటెక్నాలజీ, ఇంధన, అంతరిక్ష తదితర రంగాల్లో ప్రభుత్వాల, ప్రైవేటు స్థాయిలో పరస్పరం మరింత సహాయక సహకారాలు.

భారత్‌లో అమెరికా వర్సిటీల క్యాంపస్‌లు

పలు ప్రఖ్యాత అమెరికా విశ్వవిద్యాలయాలు త్వరలో భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. ట్రంప్‌తో ప్రధాని మోదీ చర్చల్లో ఈ మేరకు నిర్ణయం జరిగింది. ఉన్నత విద్యా రంగంలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవాలని కూడా నిశ్చయించారు. ఇందుకోసం పరస్పర సంయుక్త డిగ్రీలు తదితర పథకాలతో పాటు జాయింట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. అమెరికాలో చదువుతున్న 3 లక్షలకు పై చిలుకు భారత విద్యార్థుల వల్ల అక్కడి ఆర్థిక వ్యవస్థకు ఏటా 8 బిలియన్ డాలర్ల దాకా అందుతోందని నేతలిద్దరూ గుర్తు చేసుకున్నారు. అమెరికాలోని భారత సమాజానిది ఇరు దేశాల బంధంలో అతి కీలక పాత్ర అని మీడియా భేటీలో ట్రంప్ చెప్పారు. లాస్ ఏంజెలిస్, బోస్టన్ నగరాల్లో త్వరలో భారత కాన్సులేట్లు తెరవనున్నట్టు వెల్లడించారు.

మానవ అక్రమ రవాణాపై పోరు: మోదీ

మనుషుల అక్రమ రవాణా భారత్‌కు మాత్రమే పరిమితమైన సమస్య కాదని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ప్రపంచ సమస్యగా అభివర్ణించారు. పెద్ద కలలు కనే సాధారణ కుటుంబాలకు చెందిన అమాయకులను పరాయి దేశాల్లో అక్రమ వలసదారులుగా మారుస్తున్న ఈ జాఢ్యంపై దీనిపై దేశాలన్నీ కలసికట్టుగా పోరాడాల్సి ఉందన్నారు. ''పరాయి దేశంలో అక్రమంగా ప్రవేశించే వారెవరికీ అక్కడ నివసించే హక్కుండబోదు. అమెరికాలో అక్రమంగా ఉంటున్నట్టు తేలిన భారతీయులందరినీ వెనక్కు తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం'' అని స్పష్టం చేశారు. ఈ అంశం ట్రంప్-మోదీ చర్చల్లో కూడా ప్రస్తావనకు వచ్చిందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ తెలిపారు.

తటస్థం కాదు, శాంతివైపే

ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ శాంతివైపే నిలిచింది తప్ప ఏనాడూ తటస్థ వైఖరితో వ్యవహరించలేదని మోదీ స్పష్టం చేశారు. ఈ విషయమై కొన్ని దేశాలకు ఉన్న అభిప్రాయం అపోహ మాత్రమేనన్నారు. ''రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి సాధనకు దౌత్యమే మార్గం తప్ప యుద్ధం కాదు. ఈ దిశగా ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతిస్తున్నా. ఇది యుద్ధాల యుగం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు స్పష్టంగా చెప్పా'' అని చెప్పారు.

బేరాల్లో నాకన్నా మొనగాడు: ట్రంప్

ట్రంప్, మోదీ సంయుక్త మీడియా సమావేశం అత్యంత స్నేహపూర్వకంగా, పలు సందర్భాల్లో సరదా మాటలతో సాగింది. ఇద్దర్లో ఎవరు మెరుగ్గా బేరమాడతారని మీడియా ప్రశ్నించగా ఆ విషయంలో మోదీదే పై చేయంటూ ట్రంప్ టక్కున బదులిచ్చారు. ''మోదీ నా కంటే చాలా గట్టిగా, మెరుగ్గా బేరమాడగలరు. ఆయనతో పోటీ కూడా పడలేను. అందులో అనుమానమే లేదు'' అంటూ నవ్వులు పూయించారు. భేటీ పొడవునా మోదీని అధ్యక్షుడు పదేపదే ప్రస్తుతించారు. ''ఆయనో గొప్ప నాయకుడు. ప్రధానిగా అద్భుతంగా రాణిస్తున్నారు. దేశాధినేతలతో పాటు ఎవరిని చూసినా ఆయన గురించే మాట్లాడతారు. భారత్‌లోనూ, అమెరికాలోనూ మోదీ, నేను ఎంతో సమయం కలిసి గడిపాం. ఆయన ప్రత్యేకమైన వ్యక్తి. అందమైన భారతదేశంలో ఐదేళ్ల కింద పర్యటించా. నా భార్య మెలానియాతో కలిసి అద్భుతమైన సమయం గడిపా. అప్పుడు మోదీ ఇచ్చిన అద్భుతమైన ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఇప్పుడాయనకు అదే తరహాలో ఆతిథ్యం ఇస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నా మిత్రుడు మోదీకి మరోసారి స్వాగతం పలికినందుకు ఎంతో థ్రిల్లవుతున్నా'' అని చెప్పుకొచ్చారు. జనవరి 20న ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక అమెరికాలో పర్యటించిన తొలి విదేశీ నేతల్లో మోదీ ఉన్నారు.

నేడు మరో 119 మంది అక్రమ వలసదార్ల రాక!

చండీగఢ్: అమెరికాలో అక్రమ వలసదార్ల విషయంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్నవారిని గుర్తించి, బలవంతంగా వారి స్వదేశాలకు తరలిస్తోంది. భారతీయ అక్రమ వలసదార్లను కూడా వెనక్కి పంపిస్తోంది. గతవారం 104 మందిని సైనిక విమానంలో భారత్‌కు తిప్పి పంపిన సంగతి తెలిసిందే. ఈ విమానం పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ల్యాండయ్యింది. మొదటి విడతలో 104 మంది భారతీయ అక్రమవలసదార్లు తిరిగిరాగా, రెండో విడతలో 119 మంది రాబోతున్నట్లు తెలిసింది. వారందరినీ తీసుకొని అమెరికా విమానం భారత్‌కు బయలుదేరినట్లు సమాచారం. శనివారం రాత్రి 10 గంటలకల్లా అమృత్‌సర్‌కు చేరుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ 119 మందిలో 67 మంది పంజాబ్, 33 మంది హరియాణా, ఎనిమిది మంది గుజరాత్, ముగ్గురు ఉత్తరప్రదేశ్, ఇద్దరు గోవా, ఇద్దరు మహారాష్ట్ర, ఇద్దరు రాజస్తాన్, ఒకరు హిమాచల్ ప్రదేశ్, మరొకరు జమ్మూకశ్మీర్‌కు చెందినవారు ఉన్నట్లు తెలిసింది.

చెర్నోబిల్ రియాక్టర్‌పై రష్యా డ్రోన్ దాడి

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపణలు • చర్చలు ఇష్టం లేక ఉక్రెయినే చేయించిందన్న రష్యా

కీవ్: తమ రాజధాని కీవ్ ప్రాంతంలో ఉన్న చెర్నోబిల్ అణువిద్యుత్ ప్లాంట్ రక్షణ కవచంపై రష్యా దాడి చేసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. శక్తివంతమైన పేలుడు పదార్థాలతో గురువారం రాత్రి జరిపిన ఈ దాడితో ప్రొటెక్టివ్ కంటెయిన్‌మెంట్ షెల్ దెబ్బతిందని, మంటలు చెలరేగాయని ఆయన చెప్పారు. అయితే, ఈ ఘటనతో ఆ ప్రాంతంలో రేడియో ధార్మిక స్థాయిలు సాధారణంగానే ఉన్నాయన్నారు. మంటలను అదుపు చేశామన్నారు. పుతిన్ చర్చలకు సిద్ధంగా లేరన్న విషయం దీనినిబట్టి అర్థమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఘటనకు రష్యాను బాధ్యురాలిగా చేయాలన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమవనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. దాడి సమాచారాన్ని అమెరికాతో పంచుకుంటామని జెలెన్‌స్కీ చెప్పారు. ఈ ఘటనను అంతర్జాతీయ అణు శక్తి ఏజెన్సీ(ఐఏఈఏ) ధ్రువీకరించింది. అయితే, దాడిలో రక్షణ కవచం దెబ్బతిన్నట్లుగా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదని వివరించింది. అణు రియాక్టర్‌కు బయటివైపు రక్షణగా 2016లో అత్యంత భారీ కాంక్రీట్ నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద 1986 చెర్నోబిల్ దుర్ఘటన జరిగినప్పుడే లోపలి వైపు రక్షణ ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. వీటివల్ల ప్రమాదకరమైన రేడియో ధార్మికత బయటకు లీక్ అయ్యేందుకు అవకాశం లేదు. కాగా, జెలెన్‌స్కీ ఆరోపణలపై రష్యా తీవ్రంగా స్పందించింది. అణు వ్యవస్థలు, అణు విద్యుత్ ప్లాంట్లపై దాడులు జరిగాయంటూ ఉక్రెయిన్ చెప్పేదంతా అబద్ధమని కొట్టిపారేసింది. తమ సైన్యం ఇలాంటివి చేయదని రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ స్పష్టం చేశారు. శాంతి ఒప్పందం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యంతో చర్చలకు అవరోధం కలిగించేందుకు ఉక్రెయినే ఇలాంటివి చేయిస్తోందని ఆరోపించారు.



దెబ్బతిన్న రియాక్టర్ కవచం

ఎఫ్-35.. అంతు 'చిక్కదు'



భారత్‌కు అమెరికా విక్రయించనున్న ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్ జెట్లు ఐదో తరం యుద్ధ విమానాల్లోకెల్లా అత్యాధునికమైనవి.

- ఎఫ్-35లో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఎఫ్-135 ఇంజన్‌ను వాడారు.
- ఇది 8 టన్నుల బరువైన ఆయుధాలతో గంటకు 1,200 కి.మీ. పై చిలుకు వేగంతో దూసుకెళ్లగలదు.
- అత్యాధునిక రాడార్లను, పటిష్టమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా ఏమార్చగలదు.
- నానా పరికరాల గందరగోళం లేకుండా అత్యాధునిక టచ్ స్క్రీన్లతో కూడిన విలాసవంతమైన కాక్‌పిట్ దీని ప్రత్యేకత.
- ఎఫ్-35ఏతో పాటు మరో రెండు రకాలున్నాయి. రన్‌వే అవసరం లేకుండా నిట్టనిలువుగా టేకాఫ్, ల్యాండింగ్ సామర్థ్యం ఎఫ్-35బీ సొంతం. ఎఫ్-35సీ విమానవాహక నౌకల కోసం ప్రత్యేకంగా రూపొందింది. వీటి ఖరీదు రూ.700 కోట్ల నుంచి రూ.1,000 కోట్ల దాకా ఉంటుంది. వీటి శిక్షణతో పాటు నిర్వహణ కూడా చాలా ఖరీదైన వ్యవహారమే. గంటపాటు గాల్లో ఎగిరితే 36 వేల డాలర్లు ఖర్చవుతుంది!
- ఈ విమానాల అభివృద్ధిపై అమెరికా ఏకంగా రూ.2 లక్షల కోట్లు వెచ్చించింది.
- నిర్మాణ భాగస్వాములైన బ్రిటన్, ఇటలీ, నార్వేలను మినహాయిస్తే జపాన్, ఇజ్రాయెల్, దక్షిణ కొరియా వద్ద మాత్రమే ఎఫ్-35లున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

19 లేదా 20న ఢిల్లీ కొత్త సీఎం ప్రమాణం?

న్యూఢిల్లీ: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎంపికపై బీజేపీ పెద్దల కసరత్తు ఇంకా ఒక కొలిక్కిరాలేదు. ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు వెళ్లడంతో కొత్త సీఎం ఎంపిక వ్యవహారం ఆగిపోయింది. ఆయన తిరిగిరావడంతో ఈ ప్రక్రియ వేగం పుంజుకోనుంది. ఈ నెల 19 లేదా 20వ తేదీన కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు బీజేపీ వర్గాలు శుక్రవారం తెలియజేశాయి. బీజేపీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించడానికి తమ పార్టీ అధిష్టానం అతిత్వరలో పరిశీలకులను నియమించనుందని ఎమ్మెల్యేగా ఎన్నికైన మజీందర్‌సింగ్ సిర్సా చెప్పారు. ఈ నెల 19వ తేదీ తర్వాత బీజేపీ ప్రభుత్వ పాలన ప్రారంభమవుతుందని తెలిపారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకుగాను బీజేపీ 48 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే.

10 టన్నుల ప్రొపల్లెంట్ మిక్సర్ అభివృద్ధి

మరో ఘనత సాధించిన ఇస్రో

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో ఘనత సాధించింది. రాకెట్లలో ఉపయోగించే సాలిడ్ మోటార్ల కోసం పది టన్నుల ప్రొపల్లెంట్ మిక్సర్‌ను అభివృద్ధి చేసింది. ఈ విషయాన్ని ఇస్రో శుక్రవారం ప్రకటించింది. ఈ ప్రొపల్లెంట్స్ తయారీ అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. సున్నితమైన, ప్రమాదకరమైన పదార్థాలను జాగ్రత్తగా మిశ్రమం చేయాల్సి ఉంటుంది. ఈ పరిజ్ఞానం కొన్ని దేశాలకే ఉంది. రాకెట్ల ప్రయోగంలో సాలిడ్ ప్రొపల్షన్ వ్యవస్థ పాత్ర చాలా కీలకం. దేశంలో పది టన్నుల ప్రొపల్లెంట్ మిక్సర్‌ను అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారి అని ఇస్రో పేర్కొంది.

మార్చి 19న సునీత ఆగమనం

సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఊరట

వాషింగ్టన్: సుదీర్ఘమైన నిరీక్షణకు తెరపడబోతోంది. భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ భూమిపైకి తిరిగిరాబోతున్నారు. మార్చి 19వ తేదీన భూమిపై అడుగుపెట్టనున్నారు. నెలల తరబడి అంతరిక్షాన్నే ఆవాసంగా మార్చుకున్న వారిద్దరూ తమ అసలైన ఆవాసాలకు చేరుకోనున్నారు. సునీతా విలియమ్స్, విల్మోర్‌ను సాధ్యమైనంత త్వరగా వెనక్కి తీసుకురావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించడంతో సంబంధిత స్పేస్ సైంటిస్టులు తమ కార్యాచరణను వేగవంతం చేశారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్ ఎక్స్ సంస్థ అభివృద్ధి చేసిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఇద్దరు వ్యోమగాములను క్షేమంగా భూమిపైకి చేర్చేలా షెడ్యూల్ ఖరారు చేశారు. మార్చి 12న డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ప్రయోగించబోతున్నారు. క్రూ-10 మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు ఈ స్పేస్‌క్రాఫ్ట్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) చేరుకుంటారు. వీరిలో భారత్‌కు చెందిన ఆస్ట్రోనాట్ శుభాన్షు శుక్లా కూడా ఉంటారు. ఐఎస్ఎస్‌కు ప్రస్తుతం సునీతా విలియమ్స్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె తన బాధ్యతను మరొకరికి అప్పగిస్తారు. దీంతోపాటు డ్రాగన్ నుంచి నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోకి, ఐఎస్ఎస్ నుంచి సునీతా విలియమ్స్, విల్మోర్ డ్రాగన్‌లోకి మార్పిడి చేసుకొనే ప్రక్రియ వారం రోజుల్లోపు పూర్తవుతుంది. అనంతరం మార్చి 19వ తేదీ కల్లా సునీతా విలియమ్స్, విల్మోర్‌తో డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ భూమిపైకి చేరుకుంటుంది.



అసలేం జరిగింది?

సునీతా విలియమ్స్, విల్మోర్‌లు బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో గత ఏడాది జూన్ 5న ఐఎస్ఎస్‌కు బయలుదేరారు. షెడ్యూల్ ప్రకారం ఎనిమిది రోజుల్లో వెనక్కి తిరిగి రావాలి. కానీ, స్టార్‌లైనర్‌లో సాంకేతిక లోపాలతో అది సాధ్యం కాలేదు. స్టార్‌లైనర్‌లో థ్రస్టర్లు విఫలమయ్యాయి. హీలియం గ్యాస్ లీకవుతున్నట్లు గుర్తించారు. మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేకపోయారు. స్టార్‌లైనర్‌లో సునీత, విల్మోర్ వెనక్కి వస్తే వారి ప్రాణాలకే ప్రమాదమని తేలడంతో వారిద్దరూ ఐఎస్ఎస్‌లోనే అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. స్టార్‌లైనర్ ఒంటరిగానే వెనక్కి వచ్చేసింది. మరో ఖాళీ స్పేస్‌క్రాఫ్ట్‌ను పంపించి, వారిద్దరినీ భూమికిపైకి చేర్చాలని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేసిన ప్రయత్నాలు సైతం విఫలమయ్యాయి. ఇద్దరు వ్యోమగాముల రాక వాయిదా పడుతూ వచ్చింది. చివరకు డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో వారిని తీసుకురావడం క్షేమమని తేల్చారు.

నియామకాల్లో సీజేఐ ప్రమేయమా?

రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం: ధన్‌ఖడ్

భోపాల్: సీబీఐ డైరెక్టర్ వంటి ఉన్నతస్థాయి కార్యనిర్వాహక పదవుల నియామకాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భాగస్వామి కావడం ఏ మేరకు సబబని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశ్నించారు. ''చట్టప్రకారమే అయినా సరే, భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాల్లో ఇలాంటి ప్రక్రియలో సీజేఐ ఎలా పాల్గొంటారు? నాటి పాలకులు న్యాయతీర్పు తాలూకు ఒత్తిడికి లొంగడంతో ఈ నిబంధన పుట్టుకొచ్చింది. దీనికి చట్టపరంగా హేతుబద్ధత ఉందా?'' అని ప్రశ్నించారు. శుక్రవారం భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. ''కార్యనిర్వాహక కార్యకలాపాలు న్యాయవ్యవస్థ నిర్ణయాలు, తీర్పుల ద్వారా జరగడం రాజ్యాంగ విరుద్ధం. ఇలాంటి నిబంధనలను పునఃపరిశీలించాల్సిన సమయం వచ్చింది'' అని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనపరమైన వ్యవహారాల్లో శాసన, న్యాయవ్యవస్థల జోక్యం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. కోర్టులకున్న న్యాయసమీక్ష అధికారం సముచితమే అయినా రాజ్యాంగాన్ని సవరించే అధికారం మాత్రం అంతిమంగా పార్లమెంటుదేనని ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా పలు అంశాలపై న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలను కూడా ఆయన పరోక్షంగా తప్పుబట్టారు. ''న్యాయవ్యవస్థ తీర్పుల రూపంలో ప్రజల ముందుకు రావాలే తప్ప ఇతరేతర వ్యక్తీకరణలకు పూనుకోవడం ఆ వ్యవస్థ గౌరవాన్నే భంగపరుస్తుంది. సామాజికాంశాలపై న్యాయమూర్తులు వ్యాఖ్యలు చేయడం ప్రపంచంలో మరెక్కడా జరగదు'' అన్నారు. రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించే సాకుతో అధికారపు అతిశయం ప్రదర్శించరాదంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.



మోదీకి స్పెషల్ గిఫ్ట్

'అవర్ జర్నీ టుగెదర్' పేరుతో పుస్తకం అందజేసిన ట్రంప్

ప్రధాని మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అపూర్వ కానుకతో ఆశ్చర్యపరిచారు. 'అవర్ జర్నీ టుగెదర్' పేరుతో సంతకం చేసిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని గురువారం వైట్‌హౌస్‌లో భేటీ సందర్భంగా ఆయనకు అందజేశారు. దాని కవర్ ఫొటోలో ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ నుంచి దిగుతూ అభివాదం చేస్తూ కన్పిస్తున్నారు. కానుకను మోదీకి అందిస్తూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్! మీరు గ్రేట్' అంటూ పొగడ్తల్లో ముంచెత్తారు. 320 పేజీల ఈ పుస్తకంలో ట్రంప్ తొలి పదవీకాలంలో 2016-2020 మధ్య ఇరు నేతలు పాల్గొన్న కీలక ఘట్టాలకు సంబంధించిన ఫొటోలున్నాయి. 2020లో ట్రంప్ భారత పర్యటన 'హలో ట్రంప్'తో పాటు అంతకుముందు అమెరికాలో జరిగిన 'హౌడీ మోదీ' తదితర కార్యక్రమాల ఫొటోలను పొందుపరిచారు. భార్య మెలానియాతో కలిసి తాజ్‌మహల్ దగ్గర తీసుకున్న ట్రంప్ ఫొటో కూడా ఉంది. ఆయన పదవీకాలపు మధుర ఘట్టాలన్నింటినీ పొందుపరిచారు. సరిహద్దు గోడ నిర్మాణంలో ట్రంప్ చొరవ, స్పేస్ ఫోర్స్ ఏర్పాటు, జిన్‌పింగ్, పుతిన్, కిమ్ జోంగ్ ఉన్ వంటి దేశాధినేతలతో ఉన్నత స్థాయి భేటీల వంటి ఘటనలకు సంబంధించి ఎంపిక చేసిన ఫొటోలను పుస్తకాన్ని తయారు చేశారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటన తనకు గొప్ప గౌరవమని ట్రంప్ మీడియాతో అన్నారు. ''చిరకాలంగా ఆయన నాకు మంచి మిత్రుడు. మా మధ్య అద్భుతమైన బంధముంది. నా నాలుగేళ్ల తొలి పదవీకాలంలో ఆ బంధాన్ని చక్కగా కొనసాగించాం'' అన్నారు. మోదీ కూడా ట్రంప్ నాయకత్వాన్ని ప్రశంసించారు. ''నేనెంతో ఇష్టపడే నాయకుడు ట్రంప్. జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్య మివ్వడం ఆయన నుంచి నేర్చుకున్న ప్రధాన విషయం'' అని చెప్పారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



ఆ ఇద్దరూ అమన్, అలోక్!
కర్ణాటక బీదర్‌లోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో తెగబడ్డ ఇద్దరు దుండగులు బిహార్‌లోని వైశాలి జిల్లా ఫతేపూర్ పుల్వారియాకు చెందిన అమన్ కుమార్, అలోక్ కుమార్‌గా తేలింది. -8లో



స్టూడెంట్ ట్రైబ్..
మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతికత, వినూత్న నైపుణ్యాలను అంది పుచ్చుకుంటోంది ఈతరం యువత. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 34.0/19.0
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పూట పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏడీఈ

రూ.50 వేల లంచం డబ్బులను పట్టుకున్న అధికారులు


డబ్బులతో పట్టుబడిన ఏడీఈ సతీష్

గచ్చిబౌలి: అవినీతికి పాల్పడిన అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం టీజీఎస్‌పీడీసీఎల్ గచ్చిబౌలి ఆపరేషన్స్ విద్యుత్ ఏడీఈ కె.సతీష్ కార్యాలయంలో ఉన్న సమయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. కార్యాలయంలోని టేబుల్ డెస్క్‌లో రూ.50 వేలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో ఓ ఇంట్లో ట్రాన్స్‌ఫార్మర్, సీటీ మీటర్ బిగించడానికి ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ శివారెడ్డి ఏర్పాట్లు చేసుకున్నారు. వీటిని ఏర్పాటు చేసేందుకు రూ.75 వేలు ఇవ్వాలని ఏడీఈ సతీష్ డిమాండ్ చేశాడు. దీంతో మొదట రూ.25 వేలు తీసుకున్నాడు. మిగతా రూ.50వేలు శుక్రవారం అందించగా తీసుకొని టేబుల్ డెస్క్‌లో పెట్టారు. ఇదే సమయంలో ఏసీబీ అధికారులు కార్యాలయానికి చేరుకొని తనిఖీలు చేయగా కెమికల్‌తో కూడిన డబ్బులు డెస్క్‌లో దొరకడంతో స్వాధీనం చేసుకొని సతీష్‌ను నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తరలించారు.

అవినీతి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1064కు అందించాలి..

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అవినీతికి పాల్పడితే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ అధికారులు సూచించారు. సోషల్ మీడియా వాట్సాప్ నంబర్ 94404 46106కు సైతం సమాచారం అందించవచ్చన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వారు స్పష్టం చేశారు.

చమురు పరిశ్రమను పరిరక్షించుకోవాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ తదితరులు

నాంపల్లి: ఇంధన సంరక్షణ, సుస్థిరత ప్రాముఖ్యతలను తెలియజేయడమే లక్ష్యంగా ఆయిల్ ఇండస్ట్రీ (చమురు పరిశ్రమ) సరికొత్త కార్యక్రమాలను చేపట్టడానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే సాక్ష్యం–2024–25 (సంరక్షణ్ క్షమతా మహోత్సవం) పేరిట ప్రత్యేక వేడుకలు చేపడుతోంది. ఈ నెల 14 నుంచి 28 వరకు వీటిని నిర్వహించనున్నారు. శుక్రవారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఈ వేడుకలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించి ప్రసంగించారు. చమురు పరిశ్రమను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన వనరుల సంరక్షణ సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరేలా చూడాలని కోరారు. ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, జీఏఐఎల్ఎల్ వంటి చమురు సంస్థలు 'సాక్ష్యం–2025'ను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆయిల్ ఇండస్ట్రీ కో ఆర్డినేటర్ యతేంద్రపాల్ సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెడ్ బి.అనిల్‌కుమార్, పీయూష్ మిట్టల్, హెచ్‌పీసీఎల్ ఎస్‌సీజెడ్ సీజీఎం రిటైల్ బెన్నీ సి.థామస్, హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ సౌత్ సెంట్రల్ జోన్ ఇన్‌ఛార్జి జీఎం మహేష్ రామ్, జీఏఐఎల్ జోనల్ చీఫ్ జనరల్ మేనేజర్ దేవ్‌కాంత్ సిన్హా, పీఎస్‌టీయూ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.నిత్యానందరావు పాల్గొన్నారు.



కూల్చివేతల్లో మిగిలిపోయిన ఆర్చీ

ఓ జ్ఞాపకమే

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆర్చీలు ఇక చరిత్ర పుటల్లోనే

ఇప్పటికే రెండింటి కూల్చివేత
- నేడో రేపో చివరి ఆర్చీ నేలమట్టం
- రీడెవలప్‌మెంట్‌లో భాగంగా..
- కొత్త స్టేషన్ నిర్మాణ పనులు వేగిరం

సికింద్రాబాద్ అనగానే గుర్తుకు వచ్చేది ఒకటి రైల్వేస్టేషన్.. మరొకటి క్లాక్‌టవర్. ఈ రెండూ నగరానికి 'ఐ' కాన్‌లుగా నిలుస్తున్నాయి. ఇందులో ఒకటైన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నిజాం ఆర్కిటెక్చర్ నిర్మాణాల్లో పేరెన్నికగన్న కట్టడం. కొద్ది రోజుల్లో ఈ కట్టడం మొత్తం కనుమరుగు కానుంది. సైనిక స్థావరాల నుంచి రూపాంతరం చెంది దేశ విదేశాల ప్రయాణికులు గుర్తెరిగిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రధాన భవనం ఇక చరిత్ర పుటల్లో ఓ జ్ఞాపకం కానుంది. ఎందరో ప్రయాణికులకు చక్కని ల్యాండ్ మార్క్‌గా చిరపరిచితమైన నీలిరంగు మేడ కాలగర్భంలో కలిసిపోనుంది. రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా కొత్త భవనాల నిర్మాణాలకు ప్రధాని గతంలోనే శంకుస్థాపన చేసిన నేపథ్యంలో పనులు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన రైల్వేస్టేషన్ నిర్మిస్తున్న నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కట్టడాలను నేలమట్టం చేస్తున్నారు. రైల్వేస్టేషన్ మూడు ఆర్చీల్లో ఇప్పటికే రెండింటిని నేలమట్టం చేశారు. మరొకటి ఒకటి రెండు రోజుల్లో కనుమరుగు కానుంది. - సికింద్రాబాద్

నిజాం ప్రభుత్వ హయాంలో 1874లో సికింద్రాబాద్‌లో రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో మూడు ప్లాట్‌ఫాంలతో కూడిన రైల్వేస్టేషన్‌కు సాధారణ భవనం ఉండేది. ఇండియన్ రైల్వే స్టేషన్‌లో భాగంగా మారిన రైల్వేస్టేషన్‌కు 1952లో మరో భవనాన్ని నిర్మించారు. మూడు ఆర్చీలతో కూడిన నిజాం ఆర్కిటెక్చర్ శైలిలో ఇక్కడ రైల్వేస్టేషన్ భవనాన్ని నిర్మించారు. క్రమేణా 10 ప్లాట్‌ఫాంలకు చేరింది. నిత్యం వందకుపైగా రైళ్లు, 1.60 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలకు ఈ రైల్వేస్టేషన్ కేంద్రంగా మారింది.

మూడు ఆర్చీలు..

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అనగానే అందరికీ గుర్తుకు వచ్చేవి మూడు ఆర్చీలు. ఈ మూడింటి ప్రవేశ ద్వారాల శిఖరాన మూడు భాషల్లో (తెలుగు, హిందీ, ఆంగ్లం) ఒక్కో దానిపై నిలిపిన సికింద్రాబాద్ అనే అక్షరాలు కిలో మీటర్ దూరం వరకు ప్రయాణికులకు కనిపించేవి. సెల్‌ఫోన్ల రాకకు ముందు కొత్తగా రైలు ప్రయాణాల ద్వారా నగరానికి చేరుకునే ప్రయాణికులకు రైల్వేస్టేషన్ ఆర్చీలే కేరాఫ్ అడ్రస్‌లుగా ఉండేవి.
- ఏ భాషలోని ఆర్చీ కింద నిల్చోవాలో ఇక్కడికి కొత్తగా వచ్చే ప్రయాణికులకు వారి బంధువులు చెబుతుండే వారు. ప్రస్తుతం హిందీ, ఇంగ్లిష్ భాషల అక్షరాలు కలిగిన ఆర్చీలు నేలమట్టమయ్యాయి. తెలుగు అక్షరాలు కలిగిన ఆర్చీని రెండు రోజుల్లో కనుమరుగు కానుంది.

వేగంగా నిర్మాణం పనులు..

- ఏడాది కాలంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రూ.720 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఆధునికీకరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఒకవైపు కూల్చివేత పనులు చేపడుతున్న అధికారులు, మరోవైపు బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం పనులు కొనసాగిస్తున్నారు.
- రైల్వేస్టేషన్ ప్రాంగణంలోనే రెస్టారెంట్లు, మల్టీలెవల్ పార్కింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ స్టాళ్లు, ఎస్కలేటర్ల తరహాలో వాకింగ్ ట్రాక్‌లు, లిఫ్టులు అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యాక సందర్శకులకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపింపజేస్తుందని అధికారులు భావిస్తున్నారు.


నిజాం కాలంలో నిర్మించిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్


శరవేగంగా కొనసాగుతున్న అధునాతన రైల్వేస్టేషన్ భవన సముదాయి పనులు

హెచ్‌సీయూ 'ఐఓఈ'కి ఐదేళ్లు!

దేశంలో మూడు విశ్వవిద్యాలయాలకే ఈ గుర్తింపు

- దక్షిణాదిలో హెచ్‌సీయూ ఒకదానికే మాత్రమే..
- ప్రపంచంలోనే అత్యుత్తమ వర్సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఆధునికీకరణకు మరిన్ని నిధులు అవసరం

రాయదుర్గం: ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం 2019లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అత్యుత్తమ హోదాను అందించింది. వర్సిటీకి 'ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్' (ఐఓఈ) హోదా లభించి అయిదేళ్లు కావస్తోంది. అప్పటి నుంచి హెచ్‌సీయూలో మౌలిక వసతులు దశల వారీగా మెరుగుపడుతున్నా మరింత ఆధునికీకరించేందుకు మరిన్ని నిధులు మంజూరు చేయాల్సిన ఆవశ్యకతను కేంద్రం గుర్తించాల్సిన అవసరముంది.

దేశంలో మూడు వర్సిటీలకే..

'ఐఓఈ' హోదాను దేశంలో మూడు కేంద్రీయ విశ్వవిద్యాలయాలకే కేంద్రం గుర్తింపు ఇచ్చింది. వీటిలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ ఉంది. మూడోది 2019లో హెచ్‌సీయూకి కల్పించడం విశేషం. దక్షిణ భారతంలో కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏకైక యూనివర్సిటీగా హెచ్‌సీయూ గుర్తింపు పొందడం గమనార్హం.

టాప్–500లో భాగమే లక్ష్యం..

జాతీయ అవసరాలు, ప్రపంచస్థాయి ప్రమాణాల అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందికి, విద్యా, ఆర్థిక, పరిపాలనాపరమైన మద్దతు ఇవ్వడమే 'ఐఓఈ' లక్ష్యం. ప్రపంచంలోని అత్యుత్తమ 500 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందడమే ఐఓఈ ధ్యేయంగా సిబ్బంది పని చేస్తున్నారు.

ఇప్పటివరకు రూ.500 కోట్లతో..

మానవ వనరుల అభివృద్ధి కేంద్రం, 50 గదుల ప్రత్యేక గెస్ట్ హౌస్, 400 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కో వసతి గృహం, కొత్త పరిపాలనా భవనం, నాంపల్లిలోని గోల్డెన్ థ్రెషోల్డ్ భవనాన్ని పునరుద్ధరించారు. రూ.60 కోట్లతో అత్యాధునిక స్థాయి ల్యాబ్‌లలో వినియోగించే పరికరాలు అందుబాటులో తెచ్చారు. 250 మందికి పైగా అధ్యాపకుల పరిశోధనలు, వృత్తిపరమైన అభివృద్ధికి నిధులను సమకూర్చారు. 1,50,00 ఎస్ఎఫ్‌టీతో కూడిన ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రీసెర్చ్ క్లస్టర్స్, కంప్యూటర్ ట్రైనింగ్ ల్యాబ్‌లు, ఒకొక్కటి 300 మంది కూర్చొనే సౌకర్యం కలిగిన 8 ఆడిటోరియాలను నిర్మించారు. వీటితో పాటు మరిన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు తెస్తాం..



హెచ్‌సీయూకు అంతర్జాతీయంగా గుర్తింపు తేవడమే ఐఓఈ లక్ష్యంగా పని చేస్తున్నాం. గత అయిదేళ్లలో ఎన్నో నిర్మాణాలు, శిక్షణలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించాం. ఇప్పటికే కొన్నింటిని అందుబాటులోకి తెచ్చాం. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ పర్యవేక్షణలో ఐఓఈ బృందం హెచ్‌సీయూ రూపురేఖలను మార్చనుంది.
- ప్రొఫెసర్ ఘనశ్యామ్‌కృష్ణ, హెచ్‌సీయూ ఐఓఈ డైరెక్టర్


హెచ్‌సీయూ

కక్కలేక.. మింగలేక..



నగర బీజేపీలో అంతర్గత పోరు!

- పార్టీ కార్యక్రమాలకు దూరంగా కొందరు నేతలు
- రాజాసింగ్ వ్యాఖ్యలతో వేడెక్కిన రాజకీయం



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ జనతా పార్టీ నగర శాఖలో అసంతృప్తులు కక్కలేక మింగలేని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని జెండా మోస్తున్న నాయకులకు కాదని ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారంటూ నిట్టూర్చుతున్నారు. జిల్లా అధ్యక్షుల నియామకంతో మరోసారి పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. నామినేటెడ్ పోస్టుల కోసం ఎంతో కాలంగా వేచిచూస్తున్న నాయకులు సైతం ఎదురుచూపులు తప్ప పదవులు రావడం లేదంటున్నారు. ఎవరికి ఏ పదవి వస్తుందో, ఎలా వస్తుందో అర్థం కావడం లేదని చర్చించుకుంటున్నారు. మనసులో ఎన్ని రకాల అసంతృప్తులు ఉన్నప్పటికి బహిరంగంగా వచ్చి మాట్లాడేందుకు సాహసం చేయడం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దకుంటే వచ్చే ఎన్నికలపై ప్రభావం చూపిస్తామని పలువురు నేతలు పేర్కొంటున్నారు.

పొమ్మంటే .. వెళ్లిపోతా: రాజాసింగ్

'పార్టీలో చేరినప్పటి నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఇక భరించలేకపోతున్నాను. వెళ్లిపో అంటే బయటకు వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నా'నంటూ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడివే కామెంట్స్ నగర బీజేపీలో ఈ చర్చనీయాంశంగా మారాయి. గోల్కొండ జిల్లా పార్టీ అధ్యక్ష పదవి బీసీ, ఎస్సీల్లో ఎవరికైనా ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. వీటిని లెక్కలోకి తీసుకోకుండా పార్టీ అధిష్టానం వేరొకరికి పార్టీ బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనపై కుట్ర జరుగుతోందంటూ ఆరోపిస్తున్నారు. ఒక వైపు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలతో యుద్ధం చేస్తున్నా. మరో వైపు సొంత పార్టీలో యుద్ధం చేయాల్సి రావడం దురదృష్టమన్నారు. బీజేపీ రాష్ట్రంలో ఎప్పుడో అధికారంలోకి రావాల్సింది, కొంత మంది రిటైరైన వ్యక్తులు ఉన్నంత కాలం అది సాధ్యం రాజాసింగ్ సొంత పార్టీ నాయకులపై దుమ్మెత్తిపోస్తున్నారు.

తాగి నడిపితే అనర్థమే!

మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు



- గ్రేటర్‌లో రోజుకు నలుగురి దుర్మరణం
- గతేడాది మూడు కమిషనరేట్లలో 1,600 మంది మృత్యువాత
- ఇందులో 50% ప్రమాదాలు సైబరాబాద్ పరిధిలోనే..

సాక్షి, సిటీబ్యూరో: మద్యం మత్తులో వాహనాలు నడపరాదని పోలీసులు ఎంతగా చెబుతున్నా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. వారి నిర్లక్ష్యంతో పాటు తోటి వాహనదారులు ప్రాణాలనూ హరిస్తున్నారు. గ్రేటర్‌లో ఏటా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో ప్రతి 24 గంటలకు కనీసం నలుగురు మరణిస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లలో 2024లో రోడ్డు ప్రమాదాల్లో 1,600 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. మరో 8,000 మంది గాయపడ్డారు. అత్యధికంగా ద్విచక్ర వాహనదారులే మృత్యువాత పడుతుండటం గమనార్హం.

- ఐటీ కారిడార్, హైదరాబాద్- ముంబై హైవే, ఔటర్ రింగ్ రోడ్‌లతో కూడిన సైబరాబాద్ కమిషనరేట్‌లోనే 50 శాతం మరణాలు నమోదయ్యాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే 7,181 డ్రైవింగ్ లైసెన్స్‌ల సస్పెన్షన్ కోసం రవాణా శాఖకు పోలీసులు ప్రతిపాదించారు. వీటిలో ఎక్కువ భాగం మద్యం తాగి వాహనం నడిపే మత్తుబాబులవే ఉన్నాయి. గతేడాది కమిషనరేట్‌లో ట్రాఫిక్ పోలీసులు 22 లక్షల చలాన్లు జారీ చేయగా.. రూ.111 కోట్ల భారీ జరిమానాలు విధించారు.

ప్రమాదాలు వీటితోనే..

గ్రేటర్‌లో రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం. వీటితో పాటు గతుకులమయమైన రోడ్లు కూడా ప్రమాదాలకు కారణమే. 80 శాతం రోడ్డు ప్రమాదాలకు కారణం పేలవమైన రోడ్లేనని రోడ్డు భద్రతా నిపుణులు చెబుతున్నారు. వాహనాల వేగాన్ని పర్యవేక్షించడానికి స్పీడ్ లేజర్ గన్లపై ఆధారపడే బదులుగా అధికారులు రోడ్డు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. అంతే కాకుండా ట్రాఫిక్ కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థలను మెరుగుపర్చడం, రోడ్లపై జీబ్రా క్రాసింగ్ వంటి భద్రత సంకేతాలను స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ట్రాఫిక్ ఫ్రీ పనులకు రూ. 2,400 కోట్లు

ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు చేపట్టే ప్రాంతాలు

1. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్
2. కేబీఆర్ పార్కు, ముగ్ధ జంక్షన్లు
3. రోడ్‌నంబర్ 45 జంక్షన్, 4. ఫిల్మ్‌నగర్ జంక్షన్
5. మహారాజా అగ్రసేన్ జంక్షన్
6. కేన్సర్ హాస్పిటల్ జంక్షన్
7. ఖాజాగూడ జంక్షన్, 8. ఐఐఐటీ జంక్షన్
9. విప్రో జంక్షన్, 10. ఫాక్స్ సాగర్ సర్‌ప్లస్ నాలా

- వీటి పొడవు దాదాపు దాదాపు 13.5 కి.మీ. అంచనా వ్యయం దాదాపు రూ. 2,000 కోట్లు.



10 ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు
- 6 రహదారుల విస్తరణలు
- సీఎం గ్రీన్‌సిగ్నల్.. త్వరలో టెండర్లు



సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ తొలి దశలో భాగంగా దాదాపు రూ.2,400 కోట్ల అంచనా వ్యయంతో పది ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు.. ఆరు ప్రాంతాల్లో రహదారుల విస్తరణ పనులకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఈ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతో దాదాపు రెండు వారాల్లో టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రోజురోజుకూ విస్తరిస్తున్న నగరం.. పెరుగుతున్న జనాభాతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ చిక్కులేర్పడుతున్నాయి. సమగ్ర ట్రాఫిక్ స్టడీ మేరకు ఆయా ప్రాంతాల్లో జంక్షన్ల విస్తరణతో పాటు ఫ్లై ఓవర్లు, రహదారుల విస్తరణ తదితరాలు అవసరమని నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో హై సిటీ కింద సదరు పనులు చేపట్టేందుకు రూ.5,942 కోట్ల అంచనా వ్యయంతో 32 పనులకు ప్రభుత్వం గత డిసెంబర్‌లో పరిపాలన అనుమతులు జారీ చేసింది. సదరు పనులకు సంబంధించి అధికారులతో సమీక్షించిన సీఎం తొలిదశలో భాగంగా ప్రాధాన్యత మేరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువగా ఉన్న 16 ప్రాంతాల్లో పనులకు టెండర్లు పిలిచేందుకు ఆమోదం తెలిపారు. పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నారు.

రహదారుల విస్తరణ, అభివృద్ధి జరిగే ప్రాంతాలు

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సైబరాబాద్ కమిషనర్ కార్యాలయం – గచ్చిబౌలి జంక్షన్. అంజయ్యనగర్– రామ్‌కీ టవర్ రోడ్డు.
- చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో అజీమ్ హోటల్–చర్చిగేట్ (సోహెబ్ హోటల్– బాలాపూర్ రోడ్), లక్కీస్టార్ హోటల్–హఫీజ్‌బాబానగర్ (వయా పూల్‌బాగ్), తులసీనగర్– గౌస్‌నగర్, చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్స్– బార్కాస్ రోడ్ (వయా చాంద్రాయణగుట్ట పీఎస్).

వీటి పొడవు 6.5 కి.మీ.

హై సిటీ పేరిట..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్లైఓవర్లు, రోడ్ల పనులకు ఎస్సార్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం), నాలాల అభివృద్ధి పనులకు ఎస్ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం), సీఆర్ఎంపీ (సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం) పేరిట వేర్వేరు పథకాలతో పనులు చేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్నింటినీ 'హై సిటీ' కిందే చేపడుతున్నారు. ఈ పనుల్ని హైసిటీ తొలిదశగా అధికారులు పేర్కొంటున్నారు.

- ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ పనులన్నీ కలిపితే వీటికయ్యే వ్యయం దాదాపు రూ.2400 కోట్లుగా అంచనా.

ఈ పనులు పూర్తయితే వాహన వేగం 15 కేఎంపీహెచ్ నుంచి 35 కేఎంపీహెచ్‌కు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచేందుకు, భవిష్యత్‌లో ఇబ్బందులు తొలగేందుకు ఇవి అవసరమని పేర్కొన్నారు. వీటిలో కేబీఆర్ పార్కు దగ్గర పనులకు ఆస్తుల సేకరణతో పాటు ఇతరత్రా ఇబ్బందులెదురయ్యే అవకాశం ఉంది.

అందంగా 'విందు'

మరిన్ని ప్రాంతాల్లో మహిళా క్యాంటీన్లు, అన్నపూర్ణ కేంద్రాలు

- ప్రత్యేక ఆర్కిటెక్చర్‌తో ఆకట్టుకునేలా..
- ఏర్పాట్లకు సిద్ధమైన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే పలు కూడళ్లను సుందరీకరించడంతో పాటు ఆయా ప్రాంతాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు ప్రత్యేక ఆకృతులతో తీర్చిదిద్దిన జీహెచ్ఎంసీ.. స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా శక్తి క్యాంటీన్లతో పాటు రూ.5కే భోజనం అందించే అన్నపూర్ణ క్యాంటీన్లను కొత్తగా తీర్చిదిద్దాలనుకుంటోంది. కొత్తగా ఏర్పాటు చేసే వాటిని ప్రత్యేక ఆర్కిటెక్చర్‌తో చూపరులను ఆకట్టుకునేలా అందంగా ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఇందుకుగాను శేరిలింగంపల్లి జోన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న వీటికోసం కన్సల్టెన్సీ సర్వీసుల కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. ముందుకొచ్చే ఏజెన్సీల్లో తొలుత టెక్నికల్‌బిడ్లలో అర్హత పొందేవాటి ఫైనాన్సియల్ బిడ్స్ పరిశీలించి పనులప్పగించనుంది. ఎంపికయ్యే ఏజెన్సీ తగిన డిజైన్లతోపాటు నిర్మాణ డ్రాయింగ్స్, ఇంటీరియర్ డిజైన్స్, వ్యయం అంచనా తదితర పనులు చేయాల్సి ఉంది. ఇలా జోన్‌లోని 14 ప్రాంతాల్లో అన్నపూర్ణ క్యాంటీన్లు, 5 ప్రాంతాల్లో మహిళాశక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు కన్సల్టెన్సీ సేవలు పొందనుంది.

వీటితో పాటు దిగువ ప్రాంతాల్లో పనులకు కన్సల్టెన్సీ సేవలు కోరింది.

- లుంబినీ ఎన్‌క్లేవ్ దగ్గర త్రిభుజాకార పార్కులో, మెడికవర్ ఆస్పత్రి పక్కన ఖాళీ ప్రదేశంలో ల్యాండ్ స్కేపింగ్, కూర్చునేందుకు కుర్చీలు, మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు.
- గచ్చిబౌలి ఓఆర్ఆర్ దగ్గర ఫ్లై ఓవర్ కింద ఖాళీ ప్రదేశంలో ల్యాండ్ స్కేపింగ్, కూర్చునేందుకు కుర్చీలు, మహిళాశక్తి క్యాంటీన్‌తో పాటు బస్టాప్ సదుపాయం.
- జయభేరి ఎన్‌క్లేవ్ వాటర్‌ట్యాంక్ సమీపంలోని కొత్తగూడ ఫ్లై ఓవర్ ర్యాంప్ పక్కన ఖాళీ ప్రదేశంలో ల్యాండ్ స్కేపింగ్, కూర్చునేందుకు కుర్చీలు, అన్నపూర్ణ క్యాంటీన్.
- తగిన స్థలం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పబ్లిక్ టాయ్‌లెట్ల ఏర్పాటు.

ట్యాపింగ్ కేసులో ప్రణీత్‌రావుకు బెయిల్

- షరతులతో మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
- పోలీసుల విచారణకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయవద్దని ఆదేశం

సిటీ కోర్టులు (హైదరాబాద్): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అరెస్టయి, జైలులో ఉన్న కీలక నిందితుడు మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుకు శుక్రవారం నాంపల్లి ఒకటో అదనపు సెషన్స్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఎనిమిది వారాల పాటు ప్రతి సోమవారం ఉదయం 11 గంటలకు పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని సూచించింది. పోలీసుల విచారణకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయవద్దని ఆదేశించింది. ఆయన పాస్‌పోర్టును కోర్టులో సరెండర్ చేయాలని స్పష్టం చేసింది.

11 నెలల పాటు జైలులో..

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ–2గా ఉన్న ప్రణీత్‌రావు దాదాపు 11 నెలల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ మంజూరు చేయాల్సిందిగా నాంపల్లి కోర్టులో ఈనెల 11న పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందని, మరో ఇద్దరు నిందితులు భుజంగరావు, రాధాకిషన్‌రావులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ఒకటో అదనపు సెషన్స్ జడ్జి రమాకాంత్ శుక్రవారం బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో చంచల్‌గూడ జైలు ఉన్న ప్రణీత్‌రావు విడుదల కానున్నారు.

న్యాయవాదిని అనుమతించడం కుదరదు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: తన ఫోన్ ట్యాప్ చేశారంటూ కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుపై దాఖలైన కేసులో విచారణకు న్యాయవాదిని అనుమతించాలన్న సాక్షి వంశీకృష్ణ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. అయితే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య మాత్రమే సాక్షిని విచారణకు పిలవాలని పంజగుట్ట పోలీసులను ఆదేశించింది. తనను ఎప్పుడు పడితే అప్పుడు పోలీసులు విచారణకు పిలుస్తున్నారని, న్యాయవాది సమక్షంలో విచారణ జరిగేలా ఆదేశించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి (ఈ కేసులో సాక్షి) వంశీకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. న్యాయవాదిని విచారణకు అనుమతించడం కుదరదని పేర్కొంటూ, విచారణకు సమయాన్ని పాటించాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

నుమాయిష్‌కు అంతర్జాతీయ గుర్తింపు

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు ఉందని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం 84వ నుమాయిష్ ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 20 విద్యా సంస్థలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం డిప్లొమా కోర్సులు మాత్రమే అందిస్తున్న సొసైటీ విద్యాసంస్థల్లో వచ్చే ఏడాది నుంచి ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ఆ ఇద్దరూ అమన్, అలోక్!

బీదర్, అఫ్జల్‌గంజ్ కాల్పులు వీరి పనే

- ఇరువురిదీ బీహార్‌లోని వైశాలీ జిల్లానే
- రూ.5 లక్షల రివార్డు ప్రకటించిన కర్ణాటక
- 2023 నుంచి యూపీ పోలీసులకూ వాంటెడ్



సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు బీహార్‌లోని వైశాలీ జిల్లా, ఫతేపూర్ పుల్వారియాకు చెందిన అమన్ కుమార్, అలోక్ కుమార్‌గా తేలింది. వీరిపై కర్ణాటక పోలీసులు రూ.5 లక్షల రివార్డు సైతం ప్రకటించారు. ఈ మేరకు లుక్ ఔట్ నోటీసులు రూపొందించి దేశ వ్యాప్తంగా అన్ని నగరాలకు పంపారు. ఈ గ్యాంగ్‌లో మొత్తం నలుగురు ఉండే వారని, 2023లో ఉత్తర ప్రదేశ్‌లో ఇదే తరహా నేరానికి పాల్పడినట్లు బీదర్ అధికారులు చెబుతున్నారు.

మీర్జాపూర్‌లోనూ ఓ గార్డు హత్య

ఈ గ్యాంగ్ బైక్‌లపై తిరుగుతూ, పట్టణ శివార్లలో రెక్కీ చేసి, ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనాలనే టార్గెట్‌గా చేసుకుంటోంది. అలోక్ కుమార్ నేతృత్వంలో సాగే ఈ ముఠాలో అమన్, చందన్ కుమార్, రాజీవ్ సాహ్ని సభ్యులుగా ఉండేవారు. వీళ్లు 2023 సెప్టెంబర్ 12న ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో పంజా విసిరారు. రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లి యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనంపై దాడి చేసి కాల్పులు జరిపారు. పట్టపగలు, నడిరోడ్డుపై సెక్యూరిటీ గార్డు జై సింగ్‌ను హత్య చేసి రూ.40 లక్షలు ఉన్న ట్రంకు పెట్టెతో ఉడాయించారు. ఈ కేసు కొలిక్కి తీసుకురావడానికి ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రత్యేకంగా ఓ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ గ్యాంగ్‌లో ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డు ప్రకటించింది.

ఎస్టీఎఫ్‌కు ఇద్దరు మాత్రమే చిక్కారు

ఒక ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, 30 మంది సిబ్బందితో ఏర్పాటైన ఈ ఎస్టీఎఫ్ దాదాపు ఏడాది పాటు దేశ వ్యాప్తంగా గాలించింది. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబర్‌లో చందన్ కుమార్‌ను ముంబైలో, రాజీవ్ సాహ్నిని వైశాలీలో పట్టుకుంది. అప్పట్లో అమన్, అలోక్‌లు వైశాలీ జిల్లాలోని మహిసార్ జనధన్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వీరి కోసం వేట ముమ్మరం చేయగా... ఇరువురూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆపై బీహార్‌లోనూ ఈ ద్వయం పలు నేరాలు చేసినట్లు తేలింది. చివరకు గత నెల 16న బీదర్‌లో పంజా విసిరింది. ఎస్బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ సంస్థ ఉద్యోగి గిరి వెంకటేష్‌ను చంపి, శివకుమార్‌ను గాయపరిచి రూ.83 లక్షలతో ఉడాయించారు. నగరంలో షెల్టర్ తీసుకున్న అమన్, అలోక్ నగదుతో తిరిగి ఇక్కడికే వచ్చి నేరానికి వాడిన ద్విచక్ర వాహనాన్ని ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉంచారు.

రివార్డు ప్రకటించిన కర్ణాటక పోలీసులు

అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్ వెళ్లేందుకు అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకున్నారు. అక్కడ జరిగిన పరిణామాలతో మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరపడం, పారిపోవడం జరిగిపోయాయి. ఈ హత్యాయత్నం ఘటనపై అఫ్జల్‌గంజ్ ఠాణాలోనూ కేసు నమోదైంది. ఈ దోపిడీ దొంగలు నగరం నుంచి కడప, నెల్లూరు మీదుగా చెన్నై వరకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆపై వీరి కదలికలు కనిపెట్టడం కష్టసాధ్యంగా మారింది. దీంతో వీరిపై కర్ణాటక పోలీసులు రూ.5 లక్షల చొప్పున రివార్డు ప్రకటించారు. ఈ మేరకు జారీ చేసిన లుక్ ఔట్ నోటీసుల్లో దుండగుల ఫొటోలను జత చేశారు. వీరికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు కలబురిగి డీఐజీ (9480800030) లేదా బీదర్ ఎస్పీ (9480803401) లేదా బీదర్ డీఎస్పీలకు (9480803420) సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తి గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

ముకుంద జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభం..



కుత్బుల్లాపూర్: వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సరికొత్త డిజైన్లతో బంగారు, డైమండ్ ఆభరణాలను అందుబాటులో ఉంచామని ముకుంద జ్యువెలర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం సుచిత్రలో నూతనంగా ఏర్పాటు చేసిన ముకుంద జ్యువెలర్స్ 6వ శాఖను ఆయన ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కేపీహెచ్‌బీ, సోమాజీగూడ, కొత్తపేట, ఖమ్మం, హన్మకొండలతో తమ ముకుంద జ్యువెలర్స్ షోరూమ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, వినూత్న డిజైన్లతో బంగారు ఆభరణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

యువతికో ఫోల్డర్..

44 మంది యువతులు, 250కి పైగా వీడియోలు

- కొనసాగుతున్న మస్తాన్ సాయి విచారణ
- రంగంలోకి నార్కొటిక్స్ విభాగం అధికారులు
- హార్డ్ డెస్క్‌లో విస్తుపోయే నిజాలు
- డాటాను రీ ఇన్‌స్టాల్ చేస్తున్న పోలీసులు



మణికొండ: నగ్న వీడియోలు, బ్లాక్‌మెయిలింగ్, డ్రగ్స్, అత్యాచారం, హత్యాయత్నం ఆరోపణలు ఎదుర్కొంటున్న మస్తాన్‌సాయిని కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు విచారణ చేపట్టారు. రెండో రోజు శుక్రవారం క్రైం పోలీసులతో పాటు సైబరాబాద్ నార్కొటిక్స్ విభాగం సైబరాబాద్ ఇన్‌చార్జి హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు అతడిని విచారించారు. ఈ సందర్భంగా మస్తాన్‌సాయిని డ్రగ్స్ ఎక్కడి నుంచి తెప్పిస్తావు, ఎంత మందికి ఇచ్చావు, డ్రగ్స్ అలవాటు చేసిన యువతులపై ఎందుకు అత్యాచారం చేశావని, అలా ఎంత మందిని చేశావు, నగ్న వీడియోలను తీయాల్సిన అవసరం ఏమిటని, లావణ్యను ఎందుకు హత్య చేయాలనుకున్నావని ప్రశ్నించినట్లు తెలిసింది. తన హార్డ్ డిస్క్‌లో లావణ్య ఆరోపించినట్లు వేల సంఖ్యలో వీడియోలు లేవని, తన భార్యతో పాటు ఇద్దరు గర్ల్‌ఫ్రెండ్స్‌వి మాత్రమే ఉన్నాయని మరోసారి బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. దాంతో హార్డ్‌డెస్క్‌ను అతడి ముందే ఓపెన్ చేసిన పోలీసులు అవాక్కయ్యారు. అందులో ఒక్కో యువతికి సంబంధించి ఒక్కో ఫోల్డర్ రూపంలో వాట్సాప్ చాట్స్, ఆడియో, వీడియో, స్క్రీన్ రికార్డింగ్‌లను భద్రపర్చినట్లు పోలీసులు గుర్తించారు. హార్డ్‌డిస్క్‌లో 44 మంది యువతులకు సంబంధించి 250కి పైగా వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. తన విల్లాలోని బెడ్‌రూంలో సీక్రెట్‌గా ఏర్పాటు చేసిన ఐదు కెమెరాలతో వీటిని తీసినట్లు విచారణలో మస్తాన్‌సాయి అంగీకరించినట్లు సమాచారం. లావణ్య ఇంట్లోనూ తీసిన వీడియోలు, చాట్ డాటా అతడి సెల్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాటి ఆధారంగా అతడిని ప్రశ్నించినట్లు తెలిసింది. తన మిత్రుడు వినీత్‌రెడ్డి తనకు డ్రగ్స్ సరఫరా చేసే వాడని, పార్టీలు ఉన్నపుడు అతడి వద్ద కొనుగోలు చేసే వాడినని మస్తాన్ సాయి వెల్లడించినట్లు సమాచారం. దీంతో వినీత్‌రెడ్డిని అరెస్టు చేసి, మరోమారు విచారించాలని నార్కొటిక్స్ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. రెండో రోజు విచారణలో మస్తాన్‌సాయి యువతులను డ్రగ్స్ పార్టీల ద్వారా మచ్చిక చేసుకుని వారిని లైంగికంగా వాడుకున్నానని అంగీకరించినట్లు సమాచారం. శనివారం మధ్యాహ్నం వరకు పోలీసులు అతడి మరింత లోతుగా విచారించనున్నారు. అప్పటికీ తమకు రావాల్సిన సమాచారం రాకపోతే శనివారం మరో సారి కస్టడీ పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

క్రీడల్లో మహిళా ఉద్యోగుల భాగస్వామ్యం గర్వకారణం



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న సీఎస్ శాంతకుమారి

మలక్‌పేట: క్రీడా పోటీలలో మహిళా ఉద్యోగుల భాగస్వామ్యం గర్వకారణమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అన్నారు. చంచల్‌గూడ సికా పరేడ్ గ్రౌండ్స్‌లో జైళ్ల శాఖ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్–2025 ముగింపు వేడుకలు శనివారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన సీఎస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ..నేడు అన్ని రంగాలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. జాతీయస్థాయిలో 6వ అఖిల భారత కారాగార ఉద్యోగుల క్రీడా పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. ఖైదీల సంక్షేమానికి చేపడుతున్న సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు వై. రాజేష్, మురళి బాబు, డీఐజీ (హైద్రాబాద్ రేంజ్) డాక్టర్ డి. శ్రీనివాస్, డీఐజీ (వరంగల్ రేంజ్) ఎం. సంపత్, సూపరింటెండెంట్లు నవాబ్ శివకుమార్‌గౌడ్, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు నోటు కేసు విచారణ మార్చి 28కి వాయిదా

సిటీ కోర్టులు : ఓటుకు నోటు కేసుపై శుక్రవారం నాంపల్లిలోని మొదటి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు సెబాస్టియన్, జెరూసలేం మత్తయ్య,సండ్ర వెంకటవీరయ్య హాజరుకాగా సీఎం రేవంత్ రెడ్డి, ఉదయ్ సింహా, వేం కృష్ణ కీర్తన్ గైర్హాజరయ్యారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన కోర్టు నిందితులను ఎగ్జామినేషన్ చేసేందుకు తదుపరి విచారణను మార్చి 28 కి వాయిదా వేసింది.

రంగరాజన్‌పై దాడి కేసులో మరో నలుగురి రిమాండ్

మొయినాబాద్ రూరల్: చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడికి సంబంధించిన కేసులో మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. రామరాజ్యం సైన్యం పేరుతో ఈ ఘటనకు పాల్పడిన వారిలో ఇప్పటికే 14 మందిని అరెస్టు చేయగా, శుక్రవారం మరో నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు. వీరిలో ఖమ్మం జిల్లాకు చెందిన రాజాదేవి, రాజ్యలక్ష్మి, ముకాంబిక, విశాఖపట్నానికి చెందిన జగదీశ్ ఉన్నట్లు తెలిపారు. మిగిలిన వారికోసం గాలింపు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిక రంగరాజన్‌ను పరామర్శించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు జెడ్పీ ఆఫీస్, ఏసీ గార్డ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాన్ రెసిడెన్సి, రెడ్ క్రాస్ స్కూల్ ఏరియా, పరదేశి హోటల్ ఏరియా, స్కిల్ రెసిడెన్సీ, పీతాంబర్ పిటి ఏరియా, ప్రేమ్‌నగర్, ఏసీ గార్డ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో కేర్ హాస్పిటల్, విరించి, సాక్షి దినపత్రిక కార్యాలయం, వాటర్‌వర్క్స్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ప్రజావాణికి 1,233 అర్జీలు

లక్డీకాపూల్ : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,233 దరఖాస్తులు అందాయి. అందుకు ఎక్కువ మంది ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కోసం 974 అర్జీలు పెట్టుకున్నవారు ఉన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 96, విద్యుత్ 76, రెవెన్యూ 36, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 01 దరఖాస్తు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 50 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

కేలండర్ ఆవిష్కరణ

లిబర్టీ: లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ జీహెచ్ఎంసీ ముద్రించిన కేలండర్‌ను జోనల్ కమిషనర్ ఎం.రవికిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి ఆదరణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్



పంజగుట్ట: ప్రేమికుల దినోత్సవం పురస్కరించుకుని ఎర్రమంజిల్ లోని రీజెన్సీ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీలో కలినరీ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో భాగంగా 110 రకాల వంటకాలను వండి ప్రదర్శించారు. ఈ వంటకాలు అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ హోటల్స్ నిర్వాహకులు పరాగ్ లీలా, సోనియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇద్దరు మనుషుల మధ్య ఉండేదే ప్రేమ కాదని మనం వండిన వంటలకు కూడా ప్రేమలో పడతారని వారు అన్నారు. అందుకే ప్రేమికుల రోజు స్పెషల్ కలినరీ బఫెట్ డిజైన్ చేశామని కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి అన్నారు.

పాఠశాల భవనానికి సరోజినీ నాయుడు పేరు పెట్టాలి

బంజారాహిల్స్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనానికి భారత గాన కోకిల, స్వాతంత్య్ర సమరయోధురాలు సరోజినీనాయుడు పేరు పెట్టాలని వికాస్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రాంగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13వ తేదీన సరోజినీనాయుడి జయంతి సందర్భంగా ఆ భవనాన్ని సందర్శించారు. ఈ నెల 22వ తేదీన ఈ నూతన భవన ప్రారంభోత్సవం ఉందని తెలిపారు.

వారిని ఆర్టిజన్లుగా గుర్తించాలి

వెంగళరావునగర్ : గత కొన్నేళ్లుగా అతి సాధారణ జీతాలు తీసుకుంటూ విధులు నిర్వహించే కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (1535) అధ్యక్షుడు కరణం ప్రమోద్‌కుమార్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలో ఉన్న యూనియన్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ జీతాలకు పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ వర్కర్లను పట్టించుకునేనాథుడే లేడన్నారు. సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ వర్కర్లను కూడా ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

మాదిగ అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయాలి

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ ఆమోదం ద్వారా మాదిగ అమరవీరుల ఆత్మలు శాంతించాయని, వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరవీరుల కుటుంబాల్లో ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, రూ.50లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. మాదిగ అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటు కోసం ఎకరం స్థలం కేటాయించాలన్నారు. సమావేశంలో పాన్నాల యాదయ్య, గంగమ్మ, అంజయ్య, ఇందిరమ్మ, శ్రీను, రమేష్, సాప కృష్ణ, శాంతికిరణ్, కొల్లూరు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరు మారకుంటే వేటు!

నాణ్యతపై అశ్రద్ధ వహిస్తే ఏజెన్సీలు బ్లాక్ లిస్ట్‌లోకే..

- మీటర్ రీడర్స్ అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు
- తీవ్ర స్థాయిలో హెచ్చరించిన జలమండలి జీఎం హరిశంకర్
- ప్రతిరోజూ బస్తీల్లో పర్యటించాలని సమీక్షా సమావేశంలో ఆదేశాలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జలమండలి జనరల్ మేనేజర్ హరిశంకర్

బంజారాహిల్స్: రానున్న వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా జలమండలి ఉన్నతాధికారులు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) డివిజన్–6 మేనేజర్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ నగర్‌లోని ఇండియన్ వాటర్‌వర్క్స్ అసోసియేషన్ మీటింగ్ హాల్‌లో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జలమండలి ఓ అండ్ ఎం డివిజన్–6 పరిధిలోని డిప్యూటీ జనరల్ మేనేజర్లతోపాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్, రహమత్‌నగర్, డివిజన్లకు సంబంధించి 12 జలమండలి సెక్షన్ కార్యాలయాల పరిధిలో పనిచేస్తున్న మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, మీటర్ రీడర్లు, ఏఎంఎస్ ఏజెన్సీల ప్రతినిధులు, ఎయిర్‌టెక్ మిషన్ల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలమండలి జీఎం హరిశంకర్ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నీటి కనెక్షన్లకు సంబంధించిన కమర్షియల్ సర్వే 100 శాతం జరగాలని ఆదేశించారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని, విధుల నుంచి తొలగించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని, అందులో భాగంగానే ప్రతిరోజూ నీటి నాణ్యత, వాటర్ ప్రెషర్‌లను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నాణ్యతకు సంబంధించిన యాప్‌లో వివరాలను లైన్‌మెన్ పొందుపర్చాలని సూచించారు. మెయింటెనెన్స్ విభాగానికి చెందిన ఏఎంఎస్ ఏజెన్సీలు పనులు చేపట్టేటప్పుడు భద్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించి తీరాలని, లేనిపక్షంలో సంబంధిత ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు.

విజయవంతంగా తొలిదశ స్పెషల్ డ్రైవ్..

జలమండలి ఎంతో ప్రతిష్టాత్మకంగా నగరంలో చేపడుతున్న సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీలో భాగంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ మొదటి దశ విజయవంతమైంది. దీంతో రెండోదశ 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మరోసారి చేపడుతున్నట్లు జీఎం తెలిపారు. రెండో దశ 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో డీసిల్టింగ్ పనితీరుపై ఆరా తీశారు. సీవరేజీ పనులు చేపట్టేటప్పుడు సిబ్బంది తప్పనిసరిగా భద్రతా పరికరాలను ఉపయోగించాలని ఎయిర్‌టెక్ మిషన్ల యజమానులను ఆదేశించారు.

అధికారుల తీరుపై అసంతృప్తి..

సమీక్షా సమావేశంలో జలమండలి ఓ అండ్ ఎం డివిజన్–6 పరిధిలోని ఆయా సెక్షన్ల పనితీరును సమీక్షించిన జనరల్ మేనేజర్ హరిశంకర్ కిందిస్థాయిలో పనిచేస్తున్న అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆఫీసులకే పరిమితం కాకుండా రాబోయే మూడు మాసాలపాటు ప్రతిరోజూ క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు బస్తీల్లో పర్యటించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డీజీఎంలు వంశీకృష్ణ, వాహబ్, ఇంద్రశీలారాణితో పాటు ఆయా సెక్షన్ల మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని ఆందోళన

లిబర్టీ: ఎస్సీ వర్గీకరణ చేపట్టిన రేవంత్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మాలమహానాడు జాతీయ అధ్యక్షులు వి.ఎల్.రాజు నేతృత్వంలో ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. లిబర్టీ చౌరస్తా నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయం మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి జాతీయ చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, సమితి జాతీయ వర్కింగ్ చైర్మన్ పబ్బతి శ్రీకృష్ణ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జేఎస్.రావు మాట్లాడుతూ మాలల జనాభాను ప్రభుత్వం తక్కువగా చూపి వర్గీకరణ పేరుతో తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతిని మోసం చేసిన మాల ప్రజాప్రతినిధులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి జాతికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క దేవేందర్, మద్దెల ప్రవీణ్‌కుమార్, సంకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులకే అనుమతి

వెంగళరావునగర్ : కార్డుదారులకే తాత్కాలిక విక్రయాలకు అనుమతి లభిస్తుందని జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సర్కిల్–19 కార్యాలయంలో శుక్రవారం వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంసీ జకియా సుల్తానా మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో వీధి వ్యాపారుల సర్వే చేపట్టి కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రంజాన్, శివరాత్రి పర్వదినాల సందర్భంగా హనుమాన్ ఆలయాల గోడల వద్ద చిరు వ్యాపారుల నిమిత్తం కార్డులు ఉన్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. వెండర్లు జీహెచ్ఎంసీ ద్వారా కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఏఎంఓహెచ్ సాలొమన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, డీపీఓ బి.వెంకట్ కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల ప్రదర్శన

వెంకటేశ్వరకాలనీ: అడవులను కాపాడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి ప్రాముఖ్యం వివరించేందుకు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద శుక్రవారం ములుగు జిల్లా ఫారెస్ట్ కాలేజీ విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల్లో లభించే వివిధ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. అడవుల్లో లభించే పలు మూలికలు, చెట్ల ఆకులు, పూలు, పండ్లతో విద్యార్థులు తయారు చేసిన పదార్థాలను ప్రదర్శించి వాటిపై వాకర్లకు అవగాహన కల్పించారు. ఇప్పపువ్వు లడ్డూలతోపాటు తేనె, మునగ పొడి పలు రకాల ఉత్పత్తులను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం కేబీఆర్ పార్కులో వారు పర్యటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అర్జున్, డాక్టర్ శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

పంబాల, మన్నె కులాలను గ్రూప్ 3లోకి మార్చాలి

బేడ(బుడగ) జంగాల సంఘాలు



పంజగుట్ట: విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెంది ఉన్న పంబాల, మన్నె కులాలను ఎస్సీ వర్గీకరణలో గ్రూప్ 1 నుంచి తొలగించి గ్రూప్ 3 లో పెట్టాలని బేడ(బుడగ) జంగాల సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ బుడగ జంగాల సంఘాల ప్రతినిధులు చింతల రాజలింగం, సరిగిరి మన్నెం, కోడిగంటి నర్సింహ మాట్లాడారు. అత్యంత వెనకబడిన 15 కులాలను ఎస్సీ ఎ గ్రూపులో చేర్చి ఒక్క శాతం రిజర్వేషన్ ఇచ్చారని, కాని 15 కులాల్లో మెరుగైన లబ్ధిపొందిన పంబాల, మన్నె కులాలను ఎందుకు కలిపారో అర్థం కావడంలేదన్నారు. గతంలో ఈ రెండు కులాలు ఎస్సీల్లో అత్యంత లబ్ధిపొందిన మాల కులం గ్రూపులో ఉండేవని గుర్తు చేశారు. గ్రూప్ 1లో ఉన్న అత్యంత వెనకబడిన కులాల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సహదేవుడు, సిరువాటి వేణు, కొండపల్లి గిరి, రాంబాబు, గోవిందు, వెంకట్, పర్వతం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన కోర్సుల ప్రారంభం

సాక్షి సిటీ బ్యూరో: ఎలాంటి డిగ్రీ చదివిన వారైనా హెల్త్ సైన్స్ యూనివర్సిటీలో వివిధ లైఫ్ సైన్స్‌లో ఎమ్మెస్ చేయడానికి అర్హత కల్పించే అధునాతన కోర్సులను ఆక్స్ ఫర్డ్ ఇంటర్నేషనల్ గ్రూప్ కు చెందిన హెల్త్ సైన్స్ యూనివర్సిటీ(లండన్), సావరియ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ సంయుక్తంగా ఆవిష్కరించారు. నగరంలోని తాజ్ డెక్కన్ హోటల్ లో నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ, న్యూ ప్రొడక్ట్ లాంచ్ డైరెక్టర్ చార్లీ వైన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లండన్ లోని హెల్త్ సైన్స్ యూనివర్సిటీలో వివిధ లైఫ్ సైన్స్ కోర్సుల్లో ఎమ్మెస్ చేయడంతో పాటు ఎమ్మెస్ చేస్తున్న సమయంలో పార్ట్ టైమ్ జాబ్స్, కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. కొత్తగా అడ్మిషన్స్ తీసుకునే వారికి సావరియ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ 2500 పౌండ్స్ స్కాలర్‌షిప్ సైతం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం యూఎస్, కెనడా దేశాల్లో స్టూడెంట్స్ వీసాలు కఠినతరమైన నేపథ్యంలో యూకే, లండన్ ఉత్తమ ఎడ్యుకేషన్ హబ్ గా మారిందన్నారు.

కబ్జాదారులపై కేసు నమోదు

ఫిలింనగర్: ప్రభుత్వ స్థలంలో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు తొలగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ షేక్‌పేట తహసీల్దార్ వై.అనితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఇద్దరు కబ్జాదారులపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే...వినోభానగర్ కాలనీలో ప్రభుత్వ అధీనంలో 80 గజాల స్థలం ఉండగా, ఇందులో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే జయలక్ష్మి, ఆమె భర్త రవి కలిసి ఈ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని సమాచారం అందడంతో వాటిని కూల్చివేశామన్నారు. సర్వేనెంబర్ 327లో ఉన్న ఈ స్థలాన్ని జీఓ 59 కింద క్రమబద్ధీకరించాలంటూ 2016లోనే దరఖాస్తు చేసుకోగా తిరస్కరించామన్నారు. అయితే జయలక్ష్మి, రవి దంపతులు తరచూ ఈ స్థలంలోకి వచ్చి కబ్జాలకు పాల్పడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిలింనగర్ పోలీసులు జయలక్ష్మి, రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌కు ఫైన్ వేశారని హత్యాయత్నం

వెంగళరావునగర్ : పోలీసులు తన వాహనానికి ఫైన్ వేశారనే కోపంతో మేకప్‌మేన్‌ను ఓ యువకుడు హత్య చేయడానికి యత్నించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వై.రామకృష్ణ స్థానిక రహమత్‌నగర్‌లో ఉంటూ మేకప్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రామకృష్ణకు షూటింగ్‌లో రాజు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి రెండువారాల కిందట రాజు ద్విచక్ర వాహనంపై కూకట్‌పల్లి వెళ్ళారు. అక్కడ రాంగ్‌రూట్‌లో వెళ్ళడంతో ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేశారు. 'నీ వల్లే నాకు ఫైన్ వేశారు, ఆ డబ్బులు ఇవ్వాలి, లేకపోతే నీ అంతు చూస్తాను' అని అనేకసార్లు రామకృష్ణ రాజు బెదిరించాడు. ఈనెల 13వ తేదీ రాత్రి రామకృష్ణ రూంకు వచ్చి చాకుతో అతడి మెడ, వీపుపై పొడిచాడు. ఈ సమయంలో రూంమేట్స్ హేమంత్, అజయ్‌కుమార్ అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాజును అదుపులోనికి తీసుకున్నారు. బాధితుడి నుంచి వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రోద్బలంతో అక్రమ కేసులు

ఆవేదన వ్యక్తం చేసిన రైతు దంపతులు

పంజగుట్ట: అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రొద్బలంతో తన భూమిని కాజేసేందుకు కొంతమంది కుట్రలు పన్నుతున్నారని, తమపై దాడులు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధితులమైన తమపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన దంపతులు ముచ్చపోతుల వెంకన్న, సరిత ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయకపోతే ఈ నెల 21వ తేదీన ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తానని హెచ్చరించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. తమ భూమిలోంచి 34 గుంటలను తన పేరిట పట్టా చేయాలంటూ పక్కభూమి యజమాని నోముల రామయ్య వేధిస్తున్నాడని ఆరోపించారు. ససేమిరా అనడంతో తన భార్య సరితపై విచక్షణారహితంగా దాడి చేశారని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. తనను వ్యవసాయం చేసుకోనివ్వడం లేదని, కరెంటు ఫ్యూజ్‌లు, మోటార్లు ఎత్తుకెళుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై నకిరేకల్ పోలీస్ ఉన్నతాధికారిని 'సాక్షి'వివరణ కోరగా ఇరువర్గాల ఫిర్యాదులు తీసుకున్నామని, ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే ప్రొద్బలం ఏమీ లేదని పేర్కొన్నారు.

మదిని దోచేలా..



ఆనం కారా వన్ డే లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌లో ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న మోడళ్లు

బంజారాహిల్స్: ప్రేమికుల రోజు సందర్భంగా అనమ్‌కారా వన్ డే లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని లేబుల్స్–ది పాప్ అప్ స్పేస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మోడళ్లు సందడి చేశారు. ఇదే వేదికపై స్టాండప్ కామెడీతో సందర్శకులను కడుపుబ్బా నవ్వించారు. ప్రతి మదినీ దోచేలా తీర్చిదిద్దిన ఆభరణాలు, సంప్రదాయ చీరలు, వివిధ రకాల డిజైనర్ దుస్తులను ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచారు. ఆనం కారా వ్యవస్థాపకుడు అమరేందర్ మాట్లాడుతూ సృజనాత్మకతకు మారుపేరుగా ఆనం కారా నిలిచి నేటి ఫ్యాషన్‌ప్రియులను ఆకట్టుకునేలా డిజైన్ల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు.

నేడు యూఎస్ స్టడీ అబ్రాడ్ కార్యక్రమం

సాక్షి సిటీ బ్యూరో: నగరంలోని హోటల్ తాజ్కృష్ణ వేదికగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 'డెస్టినేషన్ యూఎస్ఏ: స్టడీ అబ్రాడ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూఎస్ఏకు చెందిన 11 ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శకతను అందిస్తారు. ఈ కార్యక్రమంలో విద్య, స్కాలర్‌షిప్ అవకాశాల గురించి తెలుసుకోవచ్చు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: 61ఏళ్ళు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సెప్టెంబర్‌లో గత ప్రభుత్వం వీఆర్ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. 2055 మంది వీఆర్ఏ వారసులలో 16,758 మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మిగిలిన 3,797 మందికి ఉద్యోగాలు రాక ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 17న చలో హైదరాబాద్‌కు వీఆర్ఏ జేఏసీ ఇచ్చిన పిలుపుకు మద్దతు తెలుపుతున్నట్లు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏ వారసుల జేఏసీ అధ్యక్షుడు ఆంజనేయులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, పెద్దిగారి సంగీత తదితరులు పాల్గొన్నారు.

మీ ఫిర్యాదు అందింది.. చర్యలు తీసుకుంటాం!

కాంగ్రెస్ నేతకు సీఎంఓ నుంచి లేఖ

బంజారాహిల్స్: హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సందర్భంగా కొంతమంది దరఖాస్తుదారులు, లబ్ధిదారుల నుంచి రూ.2 లక్షల దాకా వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నేత దిలీప్‌రాజ్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సీఎంఓ స్పందించి ఫిర్యాదు అందిందని, జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించామని, చర్యలు తీసుకుంటామని శుక్రవారం ఆయనకు లేఖ రాసింది. హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలో కొంతకాలంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతున్నదని, కొన్ని గ్రూపులు సర్వే పూర్తయిన తర్వాత మీకు ఇళ్లు మంజూరైందంటూ అమాయకులైన మహిళలను మభ్యపెడుతున్నారని, రూ.2 లక్షలు వసూలు చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే రూ.50 వేలు లబ్ధిదారుల నుంచి వసూలు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, స్థానిక ఎమ్మెల్యేకు కూడా ఆయన ఫిర్యాదు చేశారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



బసవతారకం ఆస్పత్రి వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా..

బంజారాహిల్స్: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ విధిగా యూనిఫాం వేసుకోవాలని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా సూచించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆటోస్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు ఆయన బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డిలతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల ప్రతి ఆటోడ్రైవర్ యూనిఫాం వేసుకోవడం, మై ఆటో సేఫ్ అని రాసుకోవాలని చెప్పామని, ఇక్కడ ఉన్న ఆటోవాలాలంతా సూచనలు పాటించడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ రూల్స్ విషయంలో ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా వెళ్లరాదన్నారు. కొంతమంది ఇష్టారాజ్యంగా ఆటోలు నడుపుతూ ఇతరులను ప్రమాదాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. బసవతారకం ఆటోస్టాండ్ డ్రైవర్లంతా మిగతా ఆటోడ్రైవర్లకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

ఐపీఎంకు టీబీ నిర్ధారణ మిషన్



హిమాయత్ నగర్ : మిథాని సామాజిక బాధ్యతలో భాగంగా నారాయణగూడ ఐపీఎం టీబీ డయాగ్నస్టిక్ సెంటర్‌కు ట్రూనాట్ టీబీ మిషన్‌ను బహూకరించింది. ఈ టీబీ నిర్ధారణ మిషన్‌ను శుక్రవారం మిథాని డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడిషనల్ ఇన్‌చార్జి సీఎండీ ఎస్.గౌరీ శంకర్‌రావు ప్రారంభించారు. నగరంలోని 18 చోట్ల టీబీ నిర్ధారణ పరీక్ష యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజేశం తెలిపారు. కార్యక్రమంలో డీటీసీఓ డాక్టర్ డి.చలాదేవి, డాక్టర్ శ్రీగణ, ఎ.రామకృష్ణారావు, కె.మధుబాల, హరికృష్ణ, ఏఆర్ రష్మి, తదితరులు పాల్గొన్నారు.

చర్చిని కూల్చివేయడం అమానుషం

మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు

బంజారాహిల్స్: గచ్చిబౌలిలో ఉన్న గ్రేస్ హార్వెస్ట్ చర్చిని ఓ కార్పొరేట్ సంస్థ వ్యక్తులు కూల్చివేయడం అమానుషమని మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు మండిపడ్డారు. బంజారాహిల్స్‌లోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో ఆయన నగరంలోని పలువురు పాస్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసే విధంగా సదరు కార్పొరేట్ సంస్థ కొంత మంది స్వార్థపరులతో కుమ్మక్కై చర్చిని కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో సంవత్సరాలుగా విశ్వాసులు ప్రార్థనలు చేస్తున్నారని అన్నారు. కూల్చివేత విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు తెలియజేశామని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. సమావేశంలో షారోన్ చర్చి పాస్టర్ రెవరెండ్ ఎం.ప్రభుదాస్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ వింగ్ చైర్మన్ దర్శన్, అశోక్, వినోద్, సంజీవ్, ఎస్తేర్ రాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌రీచ్' ప్రారంభం



పంజాబ్ జాతీయ బ్యాంకు ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్ గోయల్, జోనల్ మేనేజర్ దీపక్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు సంజయ్ మానే, సుజీత్‌కుమార్ ఝా, అర్వింద్ కర్లా తదితరులు

సాక్షి
10
హైదరాబాద్‌, శనివారం, 15, ఫిబ్రవరి, 2025

సిటీ ప్లస్‌

మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతికత, వినూత్న నైపుణ్యాలను అందిపుచ్చుకుంటోంది ఈతరం యువత. ఇటు చదువుకుంటూనే అటు భవిష్యత్‌ ప్రణాళికల గురించి మార్గ నిర్దేశం చేసుకుంటోంది. ఇలాంటి తరుణంలో విద్యార్థులకు అత్యున్నత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తోంది 'స్టూడెంట్‌ ట్రైబ్‌'. ఒక స్టార్టప్‌ లాంటి ఈ వేదిక ఏదైనా డిగ్రీ, ఆ పైన చదువులు చదువుతున్న విద్యార్థులకు ఈ తరం సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను అందజేస్తూ.. మరోవైపు పరిశ్రమలో వారికి అవకాశాలను చేరువ చేస్తోంది. 6 లక్షలకుపైగా స్టూడెంట్‌ నెట్‌వర్క్‌తో విభిన్న వేదికల్లో విద్యార్థులకు అవగాహన అవకాశాలను కల్పిస్తోంది.
- సాక్షి సిటీబ్యూరో





స్టూడెంట్‌ ట్రైబ్‌..

నైపుణ్యం, అవకాశాలకు వేదిక

వర్క్‌షాప్‌లో వెబినార్లు తదితర కార్యక్రమాలతో సేవలు

6 లక్షలకుపైగా అతి పెద్ద స్టూడెంట్‌ నెట్‌వర్క్‌

టాప్‌ బ్రాండ్లు, పరిశ్రమలకు విద్యార్థుల అనుసంధానం



స్టూడెంట్‌ ట్రైబ్‌ అనేది స్టూడెంట్‌ కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్‌. ఈ వేదిక దాదాపుగా 6 లక్షలకు పైగా విద్యార్థులతో, రెండు తెలుగు రాష్ట్రాల్లో 500 పైగా కాలేజీలతో అనుసంధానమై ఉంది. సోషల్‌ మీడియా వేదిక ఇన్‌స్టాగామ్‌లో 4.5 లక్షల ఫాలోవర్స్‌ ఉన్నారు. విద్యార్థులను నైపుణ్యాలకు అనువైన బ్రాండ్స్‌కు అనుసంధానం చేస్తోంది. గిగ్‌ వర్క్‌ ఇంటర్న్‌షిప్‌, వలంటీర్‌, ఫుల్‌ టైమ్‌గా ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. విద్యార్థులు చదువుకుంటూనే సంపాదన, స్కిల్స్‌ మెరుగు పర్చుకోవడంతో పాటు సర్టిఫికెట్లు పొందవచ్చు. స్థిరమైన భవిష్యత్‌ వృద్ధికి అంతులేని అవకాశాలను సృష్టిస్తోంది. టెక్నాలజీ నుంచి మార్కెటింగ్‌, డిజైన్‌ వరకు ప్రతి అవకాశాన్ని దగ్గర చేరుస్తోంది. టైర్‌-2, టైర్‌-3 నగరాల్లో సేవలు అందించడంతో పాటు వారికి అవసరమైన నైపుణ్యాలు, అవకాశాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. విద్యార్థులు సంపాదించిన డబ్బు అటు చదువు, ఇటు ప్యాకెట్‌ మనీకి ఉపయోగపడుతుంది. బ్రాండింగ్‌, ఉపాధి అవకాశాలు, నైపుణ్యం అభివృద్ధి అనే మూడు అంశాలపై సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకంగా ఒక యాప్‌ ఆవిష్కరించి అవకాశాలు, వర్క్‌షాప్‌లు, వెబినార్స్‌ తదితర కార్యక్రమాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందులో పొందుపరుస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు. బీబీఏ, బీకాం, బీఎస్సీ, ఇంజినీరింగ్‌ వంటి ఏదైనా డిగ్రీ చేసిన విద్యార్థులు ఈ సేవలను ఉచితంగానే పొందవచ్చు.

అవకాశాలకు పుష్పకవిమానం..

నేను 2024లో డిగ్రీ బీకాం పూర్తి చేశాను. డిగ్రీ చేస్తున్న సమయంలోనే స్టూడెంట్‌ ట్రైబ్‌ను ఫాలో అవుతున్నాను. దీనికి సంబంధించిన యాప్‌లో ఎప్పటికప్పుడు అవసరమైన అవకాశాలు, వర్క్‌షాప్స్‌ గురించి తెలుసుకున్నాను. ఇందులో భాగంగానే స్టూడెంట్‌ ట్రైబ్‌లో అకౌంట్‌ మేనేజర్‌గా ఫుల్‌టైమ్‌ జాబ్‌ పొందాను. నాలాంటి ఎంతోమంది విద్యార్థులకు ఈ వేదిక పుష్పక విమానంగా సేవలందిస్తోంది.
- కీర్తన



కార్పొరేట్‌ స్థాయి నైపుణ్యం



విద్యార్థులు చదువుకుంటూనే అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈ వేదికను ప్రారంభించాం. వారి కోసం ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ యాకథాన్‌ నిర్వహించాం. ఇందులో ప్రముఖ సినీ తార సమంత వంటి సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ మధ్యనే అప్‌స్కిల్లింగ్‌ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. జావా మెకానికల్‌ ఇంజినీరింగ్‌ వంటి విభిన్న నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇందులో ప్రత్యేకంగా విద్యార్థినులకు కార్పొరేట్‌ స్థాయి నైపుణ్యాలను అందిస్తున్నాం. దీని కోసం వివిధ కార్పొరేట్‌ సంస్థలకు చెందిన నిపుణులు, ప్రతినిధులు, సీఈవోలను ఆహ్వానించి విద్యార్థులకు అనుసంధానం చేస్తున్నాం. ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. ఏఐ, బ్లాక్‌చెయిన్‌ వెబినార్‌, మెకానికల్‌ ఇంజినీరింగ్‌ వర్క్‌షాప్స్‌, సైబర్‌ సెక్యూరిటీ, డిజిటల్‌ మార్కెటింగ్‌ వర్క్‌షాప్‌ వంటివి నిర్వహించాం.
- చరణ్‌ లక్కరాజు, స్టూడెంట్‌ ట్రైబ్‌ వ్యవస్థాపకులు.

చిత్ర సందేశం..





కళాకారుడు నాయక్‌ వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ప్రముఖ రచయిత్రి అంజు పొద్దార్‌ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో నాయక్‌ సిటీ పేరుతో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో చిత్రం ఒక్కో సందేశాన్ని అందిస్తోందని అన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగే ప్రదర్శనలో 50 చిత్రాలను అందుబాటులో ఉంచారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. – మాదాపూర్‌

నోరూరదా మరి..



ఒక్కటా.. రెండా.. ఎన్నెన్నో వంటకాలు.. ఆహా అనిపించే రుచి.. పదార్థాల్లో శుచి.. ఇది ఏదో పెద్ద రెస్టారెంట్లో అనుకుంటే పొరపాటే.. రానున్న రోజుల్లో క్యాంటీన్లు నిర్వహించేందుకు శిక్షణ పొందిన మహిళలు వారంతా.. గచ్చిబౌలిలోని 'నిథమ్‌' ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణకు మహిళలకు శిక్షణ ఇచ్చారు. ముగింపు వేడుకను శుక్రవారం నిర్వహించగా తెలంగాణ స్నాక్స్‌, రకరకాల అన్నం, బిర్యానీలు, స్వీట్లు, బేసిక్‌ గ్రేవీలు, బిస్కెట్లు, కప్‌కేక్‌లు, చాకోచిప్స్‌ కుకీస్‌, ఉల్లిపాయ సమోసా, ఆలుగడ్డ సమోసా, చుడువ, రకరకాల టీ వంటి వాటిని మహిళలే స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. శిక్షకులు, సెర్ప్‌, నిథమ్‌ అధికారులు వాటి రుచి చూసి మెచ్చుకున్నారు. కార్యక్రమంలో నిథమ్‌ ఇన్‌చార్జీ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ గణేష్‌, చెఫ్‌ మహేష్‌, సెర్ప్‌ డీపీఎం హమీద్‌, నిథమ్‌ ప్లేస్‌మెంట్‌, ట్రైనింగ్‌ ఆఫీసర్‌ మిషెల్లీ జే ఫ్రాన్సిస్‌, ఇతర అధికారులు ఉన్నారు.
– రాయదుర్గం



పసందైన ప్రేమ విందు

రెండు మనసుల మధ్య ఉండేది మాత్రమే ప్రేమ కాదని.. పసందైన వంటకాలపై ఉన్న అభిమానం కూడా ప్రేమేనని పలువురు హోటల్‌ మేనేజ్‌మెంట్‌ విద్యార్థులు నిరూపించారు. వాలెంటైన్స్‌ డే సందర్భంగా సోమాజిగూడలోని రీజెన్సీ హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కాలేజ్‌ ఆధ్వర్యంలో కలినరీ ఫుడ్‌ ఫెస్టివల్‌ శుక్రవారం నిర్వహించారు. 60 మంది విద్యార్థులు 110 వంటకాలను ప్రదర్శించారు. మెర్క్యూర్‌ హోటల్‌ జీఎం పరాగ్‌, లీలా హోటల్‌ హెచ్‌ఆర్‌ సోనియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రీజెన్సీ కలినరీ ఆర్ట్స్‌ అండ్‌ హోటల్‌ మేనేజ్‌మెంట్‌ ప్రిన్సిపాల్‌ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
– సాక్షి, సిటీ బ్యూరో



కొత్త.. రుచుల కోకా

కట్టుకున్నదీ పేట..

ఒకప్పుడు శివారు ప్రాంతంగా ఉన్న కోకాపేట్‌ ఇప్పుడు ఐటీ నిపుణుల ప్రవాహంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కార్పొరేట్‌ కల్చర్‌కు తోడు స్కై స్క్రాపర్స్‌, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు నగరానికి విలాసవంతమైన కేంద్రంగా మారుతోంది. దీంతో ఉన్నతస్థాయి ఫైన్‌-డైనింగ్‌ రెస్టారెంట్‌ల నుంచి కేఫ్స్‌, స్ట్రీట్‌ ఫుడ్‌ వరకూ ఇక్కడ అందుబాటులోకి వచ్చేశాయి. రుచికరమైన భోజనం, స్పీడ్‌ బ్రేక్‌ ఫాస్ట్‌, అల్పాహారం లేదా వర్క్‌ ఫ్రమ్‌ హోమ్‌ చేయాలనుకుంటే అధునాతన కేఫ్‌ కోసం వెతుకుతున్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి తప్పకుండా సిద్ధంగా ఉంటుంది.







ఒకప్పుడు కొన్ని తినుబండారాలకే పరిమితమైన ఈ ఏరియాలో ఇప్పుడు ఫైన్‌ డైనింగ్‌ రెస్టారెంట్‌లు, ట్రెండీ కేఫ్‌లు మాత్రమే కాదు స్ట్రీట్‌ఫుడ్‌లతో డైనమిక్‌ మిక్స్‌గా రూపాంతరం చెందింది. కోకాపేట్‌లో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఫుడ్‌ బ్రాండ్స్‌ ఇక్కడకు విస్తరిస్తున్నాయి, వినూత్న మెనూలను మోసుకొస్తున్నాయి.

- సంప్రదాయ రుచులు ఆధిపత్యం చెలాయించే నగరంలోని మరికొన్ని సంప్రదాయ ప్రాంతాల వలె కాకుండా, కోకాపేట్‌లో మల్టీ క్యుజిన్‌ రెస్టారెంట్‌లు, ఆర్టిసానల్‌ బేకరీలు ప్రయోగాత్మక ఫ్యూజన్‌ కిచెన్‌లు స్థానిక కాస్మోపాలిటన్‌ కల్చర్‌ను ప్రతిబింబిస్తాయి. వీకెండ్‌ బ్రంచ్‌ స్పాట్‌లు, రూఫ్‌ టాప్‌ డైనింగ్‌ అనుభవాలు, లేట్‌-నైట్‌ డెజర్ట్‌ కేఫ్‌లు కూడా ఈ ప్రాంతంలో పెరుగుతున్నాయి, ఇవి యువ వృత్తి నిపుణుల జీవనశైలికి అద్దం పడుతున్నాయి.
- ఇవి డైన్‌-ఇన్‌ స్పేస్‌లకు మాత్రమే పరిమితం కాలేదు-క్లౌడ్‌ కిచెన్స్‌తో డెలివరీ-మాత్రమే కలిగిన బ్రాండ్‌లు కూడా ఇక్కడ తగిన స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇవి ఇంటి నుంచి పని చేసేవారికి ప్రయాణంలో ఉన్న వారికి అవసరమైన సేవలు అందిస్తాయి. కోకాపేట్‌లో ఇప్పుడు అందుబాటులో ఉన్న వైవిధ్యమైన దాని నానాటికీ విస్తరిస్తున్న ఆహార సంస్కృతికి నిదర్శనం. కోకాపేట్‌ ప్రసిద్ధ బ్రాండ్‌ల మిశ్రమానికి నిలయంగా ఉంది. కోకాపేట్‌లోని కరాచీ కేఫ్‌, రోస్టరీ కాఫీ హౌస్‌, కేఫ్‌ శాండ్‌విచో, ప్రెజ్మో, కేఫ్‌ ట్వంటీ వన్‌, క్రెమా కేఫ్‌, రిఫ్లెక్షన్స్‌.. వంటి టాప్‌ కేఫ్‌ బ్రాండ్స్‌..





ఫైన్‌ డైనింగ్‌: స్మోక్‌ స్నో- ది పూల్‌సైడ్‌ కిచెన్‌, అతియా కిచెన్‌, ఇష్తా, తబుల రస, ఫిషరీస్‌ వార్ఫ్‌, లిటిల్‌ ఇటలీ, కృతుంగ తదితర రెస్టారెంట్స్‌ ఇక్కడ కొలువుదీరాయి.

సైబర్‌ సెక్యూరిటీపై విద్యార్థులకు శిక్షణ

ఇసీసీయుతో కేఎల్‌హెచ్‌ ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బాచుపల్లిలో ఉన్న కేఎల్‌హెచ్‌ వర్సిటీ.. సైబర్‌ సెక్యూరిటీలో ప్రత్యేకత కలిగిన ఏఐ ఆధారిత సంస్థ అయిన ఇసి కౌన్సిల్‌ విద్యాలయం(ఇసీసీయూ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యూహాత్మక సహకారం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సైబర్‌ సెక్యూరిటీ కోర్సులను కేఎల్‌హెచ్‌ పాఠ్యాంశాల్లోకి చేర్చడం, విద్యార్థులకు శిక్షణ అత్యాధునిక పరిశ్రమ పరిజ్ఞానం అందించే లక్ష్యాలను చేరుకునేందుకు వీలు కల్పిస్తుందని విద్యార్థులకు సైబర్‌ సెక్యూరిటీ కెరీర్‌ అవకాశాలను మెరుగు పర్చుకునేందుకు ఉపకరిస్తుందని కేఎల్‌హెచ్‌ బాచుపల్లి క్యాంపస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎల్‌.కోటేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇసి కౌన్సిల్‌ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌, లతా బావిసి మాట్లాడుతూ సంక్లిష్ట సైబర్‌ బెదిరింపులను పరిష్కరించడానికి అవసరమైన ప్రతిభ సృష్టించే దిశగా మా భాగస్వామ్యం ముందడుగన్నారు.





వహ్‌.. ఆకృతి



నగరంలోని తాజ్‌కృష్ణ హోటల్‌లో శనివారం నిర్వహించిన ఆకృతి ఎలైట్‌ వెడ్డింగ్‌ స్పెషల్‌ లైఫ్‌స్టైల్‌ ఎగ్జిబిషన్‌ ఆకట్టుకుంది. టర్కీ కౌన్సిల్‌ జనరల్‌ యల్మాన్‌ ఒకాన్‌ సందర్శించారు. 14 నుంచి 16 వరకు ఎగ్జిబిషన్‌ అందుబాటులో ఉంటుందని శశి నెహతా తెలిపారు.
- సాక్షి, సిటీబ్యూరో





బిల్డర్లతో బేరసారాలకు అవకాశం..
రాయితీలు పొందే వీలు

మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న బిల్డర్ ప్రాజెక్ట్‌లను ఎంచుకోవాలి

అభివృద్ధికి అవకాశాలున్న ప్రాంతాల్లో ఇల్లు కొనడం బెటర్

మార్కెట్ పడిపోతున్నప్పుడు కొనడం, పెరుగుతున్నప్పుడు అమ్మటమే లాభసాటి స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ చేసే పని! ఇదే సూత్రం రియల్ ఎస్టేట్‌కూ వర్తిస్తుంది. ప్రతికూల సమయంలో కొనుగోలు చేస్తే రేటు కలిసి వస్తుంది. మార్కెట్ బాగున్నప్పుడు విక్రయిస్తే రాబడి రెండింతలవుతుంది. హోమ్ బయ్యర్ నుంచి ఇన్వెస్టర్‌గా ఎదగాలంటే చేయాల్సిందిదే. స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు మాదిరిగానే స్థిరాస్తి రంగానికి కూడా కండీషన్స్ అప్లై అనేది ఉంటుంది. ప్రాంతం ఎంపిక మొదలు డెవలపర్ ట్రాక్ రికార్డ్, ఆర్థిక పరిస్థితి, ప్రాంతం అభివృద్ధి అవకాశాలు, ప్రాజెక్ట్‌లోని వసతులు వరకు అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని కొనుగోలు చేయాలి. అప్పుడే పెట్టుబడికి తగిన ప్రతిఫలాలను అందుకోవడం సాధ్యం.

-సాక్షి, సిటీబ్యూరో

మార్కెట్ బాలేనప్పుడు
కొనుడే కరెక్ట్!



అభివృద్ధిని ముందుగానే అంచనా వేయాలి..

ప్రాంతం అభివృద్ధిని ముందుగా అంచనా వేయగలిగితే దాని ప్రతిఫలాలను వంద శాతం ఆస్వాదించవచ్చు. మెరుగైన మౌలిక వసతులు, భద్రత, కనెక్టివిటీ, నిత్యావసరాలు, అందుబాటు ధర వంటి వాటిని సమీక్షించుకొని ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆయా అంశాల్లో బాచుపల్లి, దుండిగల్, మల్లంపేట, బౌరంపేట ప్రాంతాలు హాట్ డెస్టినేషన్. ఎందుకంటే.. 200 అడుగుల రోడ్లు, ఫ్లై ఓవర్, స్కైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పైగా ఓఆర్ఆర్ దుండిగల్ ఎగ్జిట్ మాత్రమే కాకుండా మల్లంపేట వద్ద మరో ఎగ్జిట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటితో ఇతర జిల్లా కేంద్రాలు, పలు ప్రాంతాలతో కనెక్టివిటీ పెరిగింది.

- కనెక్టివిటీ ఇబ్బందుల కారణంగా గతంలో ఆఫీసుకు దగ్గరలో ఉండే ప్రాజెక్ట్‌లలో కొనుగోలు చేసేందుకే కస్టమర్లు మొగ్గు చూపేవాళ్లు. కానీ, ఇప్పుడు మెట్రో రైలు, ఫ్లైఓవర్లు, స్కైవేలు, ఓఆర్ఆర్, లింక్ రోడ్లు వంటి వాటితో కనెక్టివిటీ మెరుగైంది. దీంతో ప్రధాన నగరంలోని బడ్జెట్‌తోనే 5-6 కి.మీ. దూరమైనా సరే పెద్ద సైజు అపార్ట్‌మెంట్ లేదా విల్లా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

భూమి ధర మేరకే నిర్ణయం...

శివారు ప్రాంతాల్లో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయంటే దానర్థం రేట్లు పడిపోయాయని కాదు. గత 3-4 ఏళ్లుగా స్థలాల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రస్తుతం స్థిరంగా నిలిచిపోయాయి. భూమి ధరను బట్టే ఓపెన్ ప్లాట్, అపార్ట్‌మెంట్, విల్లా వంటి ప్రాజెక్ట్ చేయాలని బిల్డర్లు నిర్ణయించుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త డెవలపర్ ల్యాండ్ కొని, ప్రాజెక్ట్ చేసే పరిస్థితి లేదు. ఒకవేళ ఉన్నా గతంలో స్థల సమీకరణ చేసిన డెవలపర్లు నిర్మించే ప్రాజెక్ట్‌లతో పోలిస్తే ధరలు ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు బాచుపల్లిలో రెండేళ్ల క్రితం ఎకరం రూ.12-13 కోట్లకు కొనుగోలు చేసిన ప్రణీత్ గ్రూప్ అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తోంది. చదరపు అడుగుకు రూ.5,500 చొప్పున విక్రయిస్తోంది. ఇప్పుడిదే ప్రాంతంలో ఎకరం రూ.20 కోట్లు-25 కోట్లుగా ఉంది. ఇలాంటి చోట కొత్త బిల్డర్ నిర్మించే ప్రాజెక్ట్‌లో ధర చదరపు అడుగుకు రూ.7 వేలు ఉంటే తప్ప గిట్టుబాటుకాని పరిస్థితి. దీంతో ధర తక్కువగా ఉన్న చోట కొనుగోలు చేయడమే కస్టమర్లకు లాభం. పైగా తుది దశకు చేరుకున్న పాత ప్రాజెక్ట్‌ల్లో కొనుగోలు చేస్తే గృహ ప్రవేశం చేసేయొచ్చు.

రేపటి అవసరాన్ని గుర్తించి కొనాలి..

- ప్రతికూల సమయంలో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటిల్లో కొనడమే ఉత్తమమని చాలామంది సలహా ఇస్తుంటారు. కానీ, ఒడిదుడుకుల మార్కెట్‌లో అమ్మకాలు లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేసే సామర్థ్యం ఉందా అని ఆలోచించాలి. అందుకే ప్రతికూలంలోనూ బిల్డర్ ట్రాక్ రికార్డ్, ఆర్థిక సామర్థ్యం, గతంలో డెలివరీ చేసిన ప్రాజెక్ట్‌లు వంటి అంశాలను చూసి రెండేళ్లలో పూర్తయ్యే ప్రాజెక్ట్‌లో కొనుగోలు చేసినా నష్టం ఏమీ ఉండదు. పైగా రెడీ టు ఆక్యుపైతో పోలిస్తే వీటిల్లో ధర తక్కువగా ఉంటుంది. విస్తీర్ణం, ఇతరత్రా అంశాలపై బిల్డర్‌తో బేరసారాలు చేసే అవకాశం కూడా ఉంటుంది.
- భవిష్యత్తు అవసరాన్ని గుర్తించి వినియోగదారులు గృహాలను కొనుగోలు చేయాలి. చాలామంది ప్రస్తుతం సంపాదించే ఆదాయానికి పరిమితమై నిర్ణయం తీసుకుంటారు. కానీ, రేపటి రోజున ఆదాయ సామర్థ్యం పెరగొచ్చు. పెద్ద ఇళ్ల అవసరం ఏర్పడొచ్చు. అందుకే ఈ రోజు 2 బీహెచ్‌కే కొనేచోట 2-3 ఏళ్లలో డెలివరీ చేసే ప్రాజెక్ట్‌లో 2.5 బీహెచ్‌కే కొనుగోలు చేయడం ఉత్తమం. పైగా నిర్మాణంలో ఉంటుంది కాబట్టి 2 బీహెచ్‌కే ధరకే వస్తుంది.



లగ్జరీ గృహాల ధరల్లో భారీ వృద్ధి

విలాసం

- గత ఐదేళ్లలో 42 శాతం పెరిగిన ఇళ్ల విలువ
- దేశంలోనే రికార్డు సాధించిన హైదరాబాద్
- 2018లో ధర చదరపు అడుగుకు రూ.7,450 : ప్రస్తుతం రూ.10,580
- 23 శాతంతో మధ్య తరగతి ఇళ్ల ధరల వృద్ధిలోనూ నగరమే టాప్
- అందుబాటు ఇళ్ల రేట్ల పెరుగుదల్లో 16 శాతంతో రెండోస్థానం
- అనరాక్ గ్రూప్ తాజాగా చేసిన అధ్యయనంలో వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కొత్త రికార్డులను సృష్టిస్తోంది. కోకాపేట, మోకిల పరిధిలో రికార్డుస్థాయిలో భూములు అమ్ముడుపోగా.. తాజాగా లగ్జరీ గృహాల ధరల వృద్ధిలో మరో మైలు రాయిని చేరుకుంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే భాగ్యనగరంలో విలాసవంతమైన ఇళ్ల ధరలు 42 శాతం మేర పెరిగాయి. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉండే ఈ ప్రీమియం యూనిట్ల రేట్లు గత ఐదేళ్లలో హైదరాబాద్‌లో రికార్డు స్థాయిలో పెరిగాయని అనరాక్ గ్రూప్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. నివేదికలోని పలు కీలకాంశాలివే..

- హైదరాబాద్‌లో 2018లో విలాసవంతమైన ఇళ్ల ధరలు చదరపు అడుగుకు రూ.7,450గా ఉండగా.. 2024 నాటికి ఏకంగా రూ.10,580కి పెరిగాయి. ఇదే సమయంలో బెంగళూరు, ముంబై నగరాల్లో లగ్జరీ ఇళ్ల ధరలు 27 శాతం మేర పెరిగాయి. కోవిడ్ అనంతరం లగ్జరీ గృహాల సరఫరా, డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి కారణమని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనూజ్ పూరి తెలిపారు. 2018లో బెంగళూరులో ప్రీమియం ఇళ్ల ధరలు చ.అ.కు రూ.10,210గా ఉండగా.. ఇప్పుడది రూ.12,970కి పెరిగింది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో రూ.23,119 నుంచి రూ.29,260కి చేరింది.

విభాగాలవారీగా ధరల వృద్ధి ఇలా.. (శాతంలో..)

నగరం	రూ.40 లక్షలు లోపు	రూ.40 లక్షల నుంచి కోటిన్నర	రూ.కోటిన్నర్పైన..
ఎన్సీఆర్	19	17	22
కోల్‌కతా	14	17	12
ఎంఎంఆర్	15	17	27
పుణె	12	15	19
హైదరాబాద్	16	23	42
చెన్నై	15	16	15
బెంగళూరు	13	20	27



ఎన్సీఆర్- నేషనల్ క్యాపిటల్ రీజియన్
ఎంఎంఆర్- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్

దేశంలోని సగటు..

2018 నుంచి 2024 నాటికి దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో సరసమైన గృహాల విలువలు సగటున 15 శాతం మేర పెరిగితే.. విలాసవంతమైన గృహాల విలువ 24 శాతం వృద్ధి నమోదైంది. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర కలిగిన ఇళ్ల ధరలు చ.అ.కు సగటున 2018లో 12,400గా ఉండగా.. 2024 నాటికి 15,350కి పెరిగాయి.

అందుబాటు గృహాల్లో 15 శాతం..

ఏడు ప్రధాన నగరాల్లో రూ.40 లక్షలలోపు ధర ఉండే సరసమైన గృహాల విలువలు 15 శాతం మేర పెరిగాయి. 2018లో సగటు ధర చ.అ.కు రూ.3,750గా ఉండగా.. ఇప్పుడది రూ.4,310కి పెరిగింది. అఫర్డబుల్ కేటగిరీలో ఎన్సీఆర్‌లో అత్యధికంగా 19 శాతం మేర ధరలు పెరిగాయి. ఈ విభాగపు ధరల వృద్ధిలో హైదరాబాద్‌ది రెండో స్థానం. ఐదేళ్లలో మన నగరంలో 16 శాతం మేర ధరలు పెరిగాయి. అందుబాటు గృహాల ప్రారంభ ధర చ.అ.కు రూ.4 వేలుగా ఉంది. ఐదేళ్ల కాలంలో టాప్-7 నగరాల్లో రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర మధ్య ధర ఉండే మధ్య తరగతి విభాగంలోని ఇళ్ల విలువల్లో 18 శాతం మేర వృద్ధి చెందాయి. 2018లో సగటు ధర చ.అ.కు రూ.6,050లుగా ఉండగా.. ఇప్పుడది రూ.7,120కి పెరిగింది. ఈ విభాగంలోనూ అత్యధికంగా 23 శాతం ధరల వృద్ధి హైదరాబాద్‌లోనే నమోదైంది. మన నగరంలో మిడ్‌సైజ్ గృహాల ప్రారంభ ధర చ.అ.కు రూ.5,780గా ఉంది.



- స్టార్ హోటళ్లను తలపించేలా విడిది సౌకర్యాలు
- పర్యాటకులను ఆకర్షించేలా ఆధునిక వసతులు
- వేసవి సెలవుల నేపథ్యంలో డిమాండ్

టూరిస్ట్ ఇళ్లు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవుల్లో సేద తీరడానికి పలు కుటుంబాలు పర్యాటక ప్రదేశాలకు వెళ్తుంటాయి. కానీ, అక్కడి వసతి ఎలా? హోటళ్లలో ఉండాలంటే.. కాస్త ఖర్చు ఎక్కువే. నచ్చిన వంట వండుకోలేం. సరైన ఆతిథ్యాన్ని స్వీకరించలేం. వాళ్లు పెట్టినవాటిలో నుంచి ఎంపిక చేసుకొని తినాలి. దీనికి పరిష్కారం చూపించేవే పర్యాటక విడిదులు. స్టార్ హోటళ్లను తలదన్నేలా ఆధునిక వసతులు అందించడమే ఈ టూరిస్ట్ ఇళ్ల ప్రత్యేకత.

ఇళ్లు.. హోం స్టేలుగా!

భాగ్యనగరం అంటేనే చక్కని ఆతిథ్యానికి చిరునామా. అందుకే విదేశీ పర్యాటకులు ఇక్కడి ఆత్మీయత, ఆతిథ్యానికి ముగ్ధులవుతుంటారు. ఈ ఆనందాన్ని ద్విగుణీకృతం చేసేందుకు పర్యాటక శాఖ హోం స్టే పథకం ప్రవేశపెట్టింది. ఇదే తరహాలో పలు ప్రైవేట్ సంస్థలూ సేవలందిస్తున్నాయి. నగరంలోని గృహ యజమానులు తమ ఇళ్లను అద్దెకు ఇచ్చే బదులుగా ఇలా హోంస్టే సంస్థలతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఆకట్టుకునేలా గృహాలను తీర్చిదిద్ది, అన్ని సౌకర్యాలు కల్పించి, పర్యాటకులకు తాత్కాలికంగా కిరాయికి ఇస్తున్నారు.

అన్ని రకాల వసతులు..

ఎయిర్ బీఎస్‌బీ, వీఆర్బో, బుకింగ్.కామ్, మేక్ మై ట్రిప్, ట్రావెల్ స్టేషన్, హోమ్ టుగో వంటి సంస్థలు హోం స్టే సేవలను అందిస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రధాన నగరాలతోపాటు పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లు, తీర్థయాత్రలు అన్నిచోట్లా టూరిస్ట్ ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. కిచెన్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి అన్ని రకాల వసతులు ఈ హోం స్టేలలో ఉంటాయి. సౌకర్యాలను బట్టి అద్దె ఒక రాత్రికి రూ.5 వేల నుంచి ఉంటాయి. ఆయా పర్యాటక ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న హోం స్టేల వివరాలను సంస్థలు తమ వెబ్‌సైట్లలో పొందుపరుస్తున్నాయి. వారికి అనువైన వసతిని వెతుక్కోవచ్చు. ఇందులోనే ధరలను కూడా నిర్ణయిస్తారు. వండి వడ్డించే భోజనం వివరాలు కూడా ఉంటాయి. విమానాశ్రయం నుంచి నేరుగా బస చేసే ఇంటికి వచ్చి ఆతిథ్యాన్ని అందుకోవచ్చు.

క్లుప్తంగా...

ఈపీటీఆర్‌ఐను గాడిలో పెట్టాలి

అటవీశాఖ మంత్రి సురేఖ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ శిక్షణ సంస్థను (ఈపీటీఆర్‌ఐ) గాడిలో పెట్టాలని, అందుకు అవసరమైన సమగ్ర నివేదిక అందజేయాలని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ అహ్మద్ నదీంను అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సంస్థ ఆధునీకరణకు ప్రభుత్వ నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రైవేటుకి ఇచ్చే పనులను ఈపీటీఆర్‌ఐకి నామినేషన్ పద్ధతిలో మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సురేఖ శుక్రవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ఐలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మక సంస్థ సమస్యల నిలయంగా మారడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈపీటీఆర్‌ఐ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్న మంత్రి.. వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు మంత్రి సర్టిఫికెట్లు అందజేశారు. సురేఖ వెంట పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్, ఈపీటీఆర్‌ఐ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ స్వరాజ్, డాక్టర్ జి.రమేశ్ ఉన్నారు.

పార్టీలో వేధింపులు భరించలేకపోతున్నా..

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవేదన



అబిడ్స్ (హైదరాబాద్): బీజేపీలో 2014లో చేరినప్పటి నుంచి వేధింపులు భరిస్తున్నానని.. ఇక భరించలేనని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి అవసరం లేదు వెళ్లిపో.. అంటే ఇప్పటికిప్పుడే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని ఎస్సీ లేదా బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలని సూచించగా, తాను సూచించిన పేర్లను పక్కనపెట్టి.. ఎంఐఎంతో తిరిగే వారికి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షునిగా ఉమా మహేందర్‌ను నియమించడంపై ఆయన తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీలోని కీలక నేతకు ఫోన్ చేసి ప్రశ్నిస్తే.. ఎన్నిక విషయం తనకు తెలియదన్నారని చెప్పారు. ఆ జవాబుతో తనపై దాగి ఉన్న కుట్ర కోణం బయటపడిందని రాజాసింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన వీడియో లో తన ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇప్పటి వరకు బీఆర్‌ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్‌లతోనే యుద్ధం చేస్తూ వచ్చానని చెప్పారు. సొంత పార్టీలోనూ యుద్ధం కొనసాగించాల్సిన పరి స్థితి రావడం దురదృష్టకరమని వాపోయారు. జిల్లా అధ్యక్ష పదవిని.. పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ సూచించిన వ్యక్తికి ఇవ్వడమనేది ప్రతి చోటా జరుగుతుందని స్పష్టం చేశారు. మరి బీజేపీలో తన సూచన ఎందుకు పక్కన పెట్టాల్సి వచ్చిందో చెప్పాలని ఆయన కోరారు. వెంటనే గోల్కొండ, గోషామహల్ అధ్యక్షుడిని మార్చాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు.

నేను పుస్తకాలు చదవలేదు.. ప్రజల మనస్తత్వం చదివా

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: యువతకు ఉపయోగపడే ఐటీ ఐఆర్ ప్రాజెక్టును తీసుకురావాలని తాను బీజేపీ ఎంపీలను అడిగితే, తనకు ఐటీఐఆర్ ఫుల్‌ఫాం తెలియదంటూ ఎద్దేవా చేయడం మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు తగదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. నిజంగా తాను పుస్తకాలు చదువుకోలేదని, కేవలం ప్రజల మనస్తత్వం మాత్రమే చదివానని చెప్పారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తాను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కందికి ఐఐటీ తీసుకువచ్చానని చెప్పారు. తాను పార్టీ ఎమ్మెల్యేను కాకపోయినా, తన నియోజకవర్గానికి ఐఐటీ ఇచ్చిన గొప్ప గుణం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ది అని అన్నారు.

17న తెలంగాణ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు

మాజీమంత్రి శ్రీనివాస్‌యాదవ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా ఈ నెల 17న తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌లో భారీ కేక్‌ను కట్ చేయడంతో పాటు.. కేసీఆర్ జీవిత విశేషాలతో కూడిన ప్రత్యేక సీడీని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన శుక్రవారం పార్టీ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీ కులగణనలో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అనుసరించే వైఖరిని ఈ నెల 17న ఖరారు చేస్తామని వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. వ్యూహం మేరకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు.

రామోజీ నేరాలకు కుమారుడిని జైలుకు పంపుతారా?

పరోక్షంగా రామోజీ నేరం చేసినట్లు కోర్టుకు తెలిపిన మార్గదర్శి

సాక్షి, అమరావతి: చట్టవిరుద్ధంగా డిపాజిట్ల స్వీకరణ విషయంలో గత 18 సంవత్సరాలుగా న్యాయస్థానాల సాక్షిగా అడ్డగోలుగా అబద్ధాలు వల్లెవేస్తూ వచ్చిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ హెచ్‌యూఎఫ్ ఎట్టకేలకు న్యాయస్థానం ఎదుట నిజం అంగీకరించక తప్పలేదు. ఈ కేసు నుంచి బయటపడేందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ వాస్తవాన్ని తెలంగాణ హైకోర్టు ముందుంచింది. తమ హెచ్‌యూఎఫ్ కర్త అయిన రామోజీరావు చేసిన డిపాజిట్ల స్వీకరణకు ఆయన కుమారుడిని (ప్రస్తుత కర్త) బాధ్యుడిని చేయరాదంటూ వాదిస్తోంది. తండ్రి చేసిన నేరానికి కుమారుడిని శిక్షిస్తారా? అంటూ ప్రశ్నిస్తోంది. ఒకవేళ తండ్రి నేరం చేసినా కుమారుడిని జైలుకు పంపించడం ఎంత వరకు సమంజసమని నిలదీస్తోంది. తద్వారా రామోజీరావు చట్టవిరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేశారన్న నిజాన్ని హైకోర్టు ముందు పరోక్షంగా అంగీకరించినట్లయింది. రామోజీరావు మరణాన్ని అడ్డుపెట్టుకుని ఈ కేసు నుంచి బయటపడేందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్‌తో పాటు రామోజీ స్థానంలో హెచ్‌యూఎఫ్ కర్తగా వ్యవహరిస్తున్న ఆయన కుమారుడు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే డిపాజిట్ల స్వీకరణ విషయంలో రామోజీ చేసిన నేరానికి తమను బాధ్యులుగా చేయడం తగదంటూ గట్టిగా వాదిస్తున్నారు. తండ్రి చేసిన నేరానికి కుమారుడిని బాధ్యుడిగా చేయరాదంటూ 'వైకేరియస్ లయబిలిటీ' సిద్ధాంతాన్ని తెరపైకి తీసుకొచ్చారు. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్ పాల్పడిన అక్రమాలు, అవకతవకలకు దాని కర్త అయిన రామోజీరావు మాత్రమే బాధ్యుడవుతారని చెప్పడం ద్వారా కేసు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాక కొత్త కర్త (కిరణ్) నియామకంతో మార్గదర్శి హెచ్‌యూఎఫ్ పునరుద్ధరించినట్లయిందని, అందువల్ల తమను ప్రాసిక్యూట్ చేయడానికి వీల్లేదంటూ కొత్త వాదనను కూడా తెరపైకి తెచ్చింది. అయితే హైకోర్టు మాత్రం మార్గదర్శి వాదనకు భిన్నంగా స్పందించింది. చట్టవిరుద్ధ పనులకు బాధ్యత వహించాల్సిందే కదా..! (సివిల్ లయబిలిటీ) అని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కి తేల్చి చెప్పడం ఇక్కడ గమనించాల్సిన విషయం . ఇదే సమయంలో రామోజీ చేసిన నేరానికి మార్గదర్శి ఫైనాన్షియర్స్ హెచ్‌యూఎఫ్ బాధ్యత వహించాల్సిందేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తేల్చి చెప్పింది. చట్టవిరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేసినందుకు క్రిమినల్ ప్రొసీడింగ్స్ ఎదుర్కోవాల్సిందేనంటూ రాతపూర్వకంగా హైకోర్టుకు నివేదించింది. రామోజీ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఇన్నేళ్లుగా కోర్టుల ముందు చెబుతూ వస్తున్నవన్నీ అసత్యాలు, అవాస్తవాలేనని కూడా హైకోర్టుకు వివరించింది.



విచారణ 28కి వాయిదా...

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శి ఫైనాన్సియర్స్ కేసుపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి.శ్యామ్‌కోషి, జస్టిస్ కె.సుజన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. మార్గదర్శి హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావు మరణించినందున ఆయన కుటుంబ సభ్యులపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ చెల్లవని నివేదించారు. ఆర్‌బీఐ చట్ట నిబంధలను రామోజీరావు ఉల్లంఘించారంటూ మార్గదర్శి హెచ్‌యూఎఫ్ ప్రస్తుత కర్త అయిన రామోజీరావు కుమారుడు కిరణ్‌ను ఎలా శిక్షిస్తారని ప్రశ్నించారు. తండ్రి నేరం చేసినా కుమారుడిని జైలుకు పంపించడం సమంజసం కాదని పదేపదే ధర్మాసనానికి నివేదించారు. చట్టప్రకారం కిరణ్, ఇతర కుటుంబ సభ్యులపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ సాధ్యం కాదని పేర్కొన్నారు. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్ కార్యకలాపాలు చేపట్టినందున కర్త రామోజీరావు మాత్రమే అవకతవకలకు బాధ్యుడవుతాడని, ఇతర కుటుంబ సభ్యులకు వాటితో సంబంధం ఉండదంటూ గంటకు పైగా సాగిన వాదనల్లో ఆయన హైకోర్టుకు నివేదించారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తన కార్యకలాపాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో అది చేసిన తప్పులకు బాధ్యత వహించాలి కదా? అని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. కోర్టు సమయం పూర్తి కావడంతో తదుపరి విచారణ తొలుత 21కి వాయిదా పడింది. తర్వాత మార్గదర్శి తరఫు మరో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వ్యక్తిగత కారణాలతో 21న విచారణకు హాజరుకావడం సాధ్యం కాదని, మరో తేదీని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది.


మార్గదర్శిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడం నిష్ప్రయోజనమంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన వాదనను ఆర్‌బీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావు ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలను డిపాజిట్ల రూపంలో వసూలు చేశారని, ఇది ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45ఎస్‌కి విరుద్ధమని పునరుద్ఘాటించింది. అంతేకాక ఇలా ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడం ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 58 బీ (5ఏ) ప్రకారం శిక్షార్హమని హైకోర్టు దృష్టికి తెచ్చింది. కాబట్టి రామోజీరావు మరణించినప్పటికీ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాల్సిందేనని స్పష్టం చేసింది. పలు చట్టాల కింద హెచ్‌యూఎఫ్‌ను ప్రత్యేక న్యాయపరమైన సంస్థగా, చట్టపరమైన వ్యక్తిగా గుర్తించడం జరిగిందని వెల్లడించింది. హెచ్‌యూఎఫ్ అనేది చట్టం సృష్టించిన ఓ జీవి అని పేర్కొంది. హెచ్‌యూఎఫ్ కర్త అనేది.. దాని సభ్యుల నుంచి భిన్నమైన, చట్టపర ప్రత్యేక సంస్థ అని తేల్చి చెప్పింది. అందువల్ల మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగాల్సిందేనని ఖరాకండిగా చెప్పింది.


డిపాజిట్ల వసూలుకు ఎన్నడూ అనుమతించలేదు..

కర్త రామోజీరావు మరణించినంత మాత్రాన మార్గదర్శి ఫైనాన్షియర్స్ తన బాధ్యత నుంచి తప్పించుకోజాలదని ఆర్బీఐ స్పష్టం చేసింది. తనపై మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన ఆరోపణలన్నింటినీ ఖండిస్తున్నట్లు తెలిపింది. ఆ ఆరోపణలన్నీ తప్పుడు, అసత్య, తప్పుదోవ పట్టించేవేనని స్పష్టం చేసింది. మార్గదర్శి హెచ్‌యూఎఫ్ ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి వస్తుందని మొదటి నుంచీ తాము చెబుతూ వస్తున్నామంది. చట్ట ఉల్లంఘనల గురించి, సెక్షన్ 45 ఎస్ వర్తిస్తుందన్న వాస్తవాన్ని ఎప్పటికప్పుడు మార్గదర్శి దృష్టికి తెస్తూనే ఉన్నామని తెలిపింది. డిపాజిట్ల స్వీకరణకు అనుమతినిస్తూ తాము సర్టిఫికెట్ జారీ చేశామన్న మార్గదర్శి వాదన శుద్ధ అబద్ధమని తేల్చి చెప్పింది. డిపాజిట్ల వసూలుకు తాము ఎన్నడూ మార్గదర్శికి అనుమతినివ్వలేదని స్పష్టం చేసింది. రామోజీ మరణించిన నేపథ్యంలో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడం నిష్ప్రయోజనమంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేయాలని హైకోర్టును ఆర్బీఐ అభ్యర్థించింది. అంతేకాక నాంపల్లి కోర్టులో దాఖలైన ఫిర్యాదును కొట్టేయాలని కోరుతూ మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సైతం కొట్టేయాలని హైకోర్టును కోరింది. ఈ మేరకు ఆర్‌బీఐ కౌంటర్ దాఖలు చేసింది.




the Reply filed by the Petitioner. In the said submission ... is contended with relevant annexures that RBI did receive various complaints from depositors/public. Therefore, the contention that no complaint was received by RBI is unfounded and has been substantially refuted in the aforesaid submissions filed by RBI previously in the present Criminal Petition.

చట్ట విరుద్ధంగా వసూలు చేసిన డిపాజిట్లపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్న మార్గదర్శి వాదనను ఖండిస్తూ తమకు ఫిర్యాదులు అందాయన్న ఆర్‌బీఐ



taken a stand that the Petitioner HUF is covered ... proscription of Section 45S of the RBI Act. RBI has always communicated to the Petitioner that Section 45S of the RBI Act is applicable to them and invited its attention to the penal provisions of the RBI Act. RBI never granted any Certificate of Registration to the Petitioners or authorized them to accept deposits from Public. It is further submitted ... present I.A.

చట్ట ఉల్లంఘన గురించి ఎప్పటికప్పుడు మార్గదర్శి దృష్టికి తెస్తున్నామంటూ కౌంటర్‌లో పేర్కొన్న ఆర్‌బీఐ



the Reply filed by the Petitioner, along with relevant annexures, filed by this Respondent, clearly establish that the activities carried out by the Petitioner were violative of Section 45S, punishable with Section 58B(5A) of the RBI Act and proceedings in respect of the same shall be continued against HUF i.e. Petitioner No.1 even after the death of the second Petitioner i.e the Karta of the HUF since it has a separate distinct legal entity distinct from its members.

16. It is therefore humbly prayed before this Hon'ble court to dismiss the present I.A. as well as the quash petition as the same are devoid of any merit and pass such other order in the interest of justice.

మార్గదర్శి కార్యకలాపాలు చట్టవిరుద్ధం, అలాగే శిక్షార్హమని కౌంటర్‌లో పేర్కొన్న ఆర్‌బీఐ

'ఖైదీలకు అందుబాటులో జైలు మాన్యువల్ ఉంచాలి'

సాక్షి, హైదరాబాద్: జైళ్లలోని ఖైదీలకు జైలు మాన్యువల్ ప్రతులను అందుబాటులో ఉంచేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. జైళ్లలో ప్రతులు అందుబాటులో ఉంచకపోవడంతోపాటు అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది జి.జాబాలి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. అయితే ఇలాంటి పిటిషన్లను అనుమతించవద్దని ప్రభుత్వ న్యాయవాది కోరారు. వివరణ ఇవ్వడానికి గడువు కావాలని కోరగా న్యాయమూర్తి తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా వేశారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి

సాక్షి, హైదరాబాద్: మనుషుల అక్రమ రవాణా నిర్మూలన దిశగా అందరూ బాధ్యతతో కృషి చేయాల్సిన అవసరం ఉందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో దివ్య దేవరాజన్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు సునీత కృష్ణన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చునని పేర్కొన్నారు. శుక్రవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, సెర్ప్‌ల ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. ప్రజలతో సన్నిహితంగా ఉండే సెర్ప్ / మహిళా సంఘాల సభ్యులు యువతుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను గమనించి.. వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సునీత కృష్ణన్ మాట్లాడుతూ ప్రజ్వలసంస్థ ద్వారా ఇప్పటి వరకు 30 వేల మంది అమ్మాయిలు, మహిళలను కాపాడినట్టు తెలిపారు. ఈ శిక్షణ సందర్భంగా మానవ అక్రమరవాణా, లైంగిక వ్యాపారం, బాధితురాలిపై పడే ప్రభావాలపై అవగాహన కల్పించారు.

తప్పులు.. సిలబస్‌లో లేని ప్రశ్నలు

▶ మొదటి పేజీ తరువాయి

జేఈఈ మెయిన్‌తో పాటు నీట్ యూజీ, సీమ్యాట్, తదితర పదుల సంఖ్యలో పరీక్షలను నిర్వహిస్తున్న ఎన్‌టీఏ వాటిని సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవ డంలో విఫలమవుతోందని.. ప్రశ్నలు రూపొందించే ఎగ్జామినర్స్ విషయంలో, అదే విధంగా వాటిని పకడ్బందీగా పరిశీలించే విషయంలో అప్రమత్తంగా ఉండట్లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏటేటా పెరుగుతున్న తప్పులు

జేఈఈ మెయిన్ ప్రశ్నల్లో తప్పుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. 2024 సెషన్–1లో ఆరు ప్రశ్నలు; సెషన్–2లో నాలుగు ప్రశ్నలు తొలగించగా.. 2023లో సెషన్–1లో నాలుగు ప్రశ్నలు, 2022 సెషన్–1లో నాలుగు, సెషన్–2లో ఆరు ప్రశ్నలు తొలగించారు. ఇలా తొలగించిన ప్రశ్నల విషయంలో అభ్యర్థులకు పూర్తి మార్కులు (4 మార్కులు) కేటాయిస్తామని ఎన్‌టీఏ పేర్కొంటోంది. అయితే ఇలాంటి తప్పుల కారణంగా విద్యార్థులు పరీక్ష హాల్లో సమయం వృథా చేసుకోవాల్సి వస్తోందని సబ్జెక్ట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిలబస్ నుంచి తొలగించినా..

జేఈఈ మెయిన్ పరీక్షల్లో సిలబస్‌లో లేని ప్రశ్నలు కూడా వస్తున్నాయి. 2025 జనవరి సెషన్ పరీక్షలనే పరిగణనలోకి తీసుకుంటే మొత్తం పది షిఫ్టులలో నిర్వహించిన పరీక్షల్లో.. ఫిజిక్స్ ప్రాపర్టీస్ ఆఫ్ సాలిడ్స్ అండ్ లిక్విడ్స్ చాప్టర్‌కు సంబంధించి న్యూటన్ లా ఆఫ్ కూలింగ్ నుంచి 22 ప్రశ్నలు, అదే విధంగా కార్నెట్ లా నుంచి కూడా ఒక ప్రశ్న అడిగారని అంటున్నారు. అయితే గత ఏడాది నుంచి న్యూటన్స్ లా ఆఫ్ కూలింగ్‌ను, అంతకుముందు ఏడాది కార్నెట్ లాను సిలబస్ నుంచి తొలగించారని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల విద్యార్థులు అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేకపోతున్నారని, ఇది ఫలితంపై ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు.

రాధాకృష్ణన్ కమిటీ చెప్పినా..

జాతీయ స్థాయిలో ప్రముఖ ప్రవేశ పరీక్షలైన జేఈఈ మెయిన్, నీట్, సీయూఈటీ, యూజీసీ నెట్ పరీక్షల్లో పారదర్శకత కోసం పలు సిఫారసులు చేసిన ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీ.. ఈ పరీక్షల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఎన్‌టీఏపై ఉందని, అన్ని ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు ఉండేలా ప్రశ్నపత్రం రూపొందించాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఎన్‌టీఏ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నీట్ యూజీపై ఆందోళన

జేఈఈ మెయిన్‌లో తప్పుల నేపథ్యంలో..మే 4న నిర్వహించనున్న నీట్ యూజీ నిర్వహణపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈ పరీక్షకు కూడా దాదాపు పది లక్షల మంది హాజరవుతారు. ప్రశ్నల్లో తప్పులు, అనువాద దోషాలు చోటు చేసుకుంటే అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని.. ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుండా ఎన్‌టీఏ జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రత్యేకంగా ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణ కోసమే ఎన్‌టీఏ ఏర్పాటు కావడాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు. అన్ని పరీక్షల్లో లోపాలు లేనివిధంగా ప్రశ్నలు ఇచ్చేలా ముందుగానే పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

> **ప్రశ్నల డేటాను నిరంతరం సమీక్షించాలి**
>
> కంప్యూటర్ ఆధారిత పరీక్షల్లో ముందుగానే నిర్దిష్ట అల్గారిథమ్స్ రూపొందించి ప్రశ్నలు అడిగే విధానాన్ని ప్రోగ్రామింగ్ చేస్తున్నారు. అంటే ఏదైనా ఒక చాప్టర్ నుంచి నాలుగు ప్రశ్నలు ఇవ్వాలనుకుంటే ఆ మేరకు ముందుగానే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్ చేస్తారు. ఇలాంటి సందర్భాల్లో ఒక ప్రశ్న ముందే తప్పుగా ఉంటే అదే పునరావృతం అవుతుంది. ఎప్పటికప్పుడు క్వశ్చన్స్ డేటా బ్యాంక్‌ను సమీక్షిస్తుండటం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు. పెన్, పేపర్ విధానంలో స్పష్టంగా రాసే వీలున్న స్క్వేర్ రూట్స్, ఇతర సైంటిఫిక్ సింబల్స్ కంప్యూటర్‌లో సరిగా ప్రతిబింబించవు. ఇది కూడా ప్రశ్నల్లో తప్పులకు కారణం అవుతోంది. మొత్తంగా 12 ప్రశ్నలను తొలగించడం అనేది అసాధారణ పరిణామమే.
>
> – ఆర్‌వీ శ్రీధర్
> (జేఈఈ–మెయిన్ ఫిజిక్స్ సబ్జెక్ట్ నిపుణుడు

జేఈఈ మెయిన్ జనవరి సెషన్‌లో తొలగించిన ప్రశ్నల కోడ్ నంబర్లివే..	ఫిజిక్స్	కెమిస్ట్రీ	మ్యాథమెటిక్స్
	656445270, 7364751025, 656445566,6564451161, 656445870, 7364751250, 564451847, 6564451917	656445728, 6564451784	6564451142, 6564451898

పరస్పర బదిలీలు నెలాఖరుకల్లా పూర్తి!

- ఈనెల 20లోపు శాఖల వారీగా ప్రతిపాదనలు పంపాలన్న జీఏడీ
- ఆ తర్వాత వారంలోగా పరిశీలించి క్లియరెన్స్ ఇస్తామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల పరస్పర బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. ఇప్పటికే ఆన్‌లైన్ పద్ధతిలో ఉద్యోగులు సంబంధిత శాఖలకు దరఖాస్తులు సమర్పించగా.. అధికారులు వాటిని పరిశీలించి ప్రతిపాదన ఫైళ్లు సిద్ధం చేసుకున్నారు. తాజాగా ఈ ప్రతిపాదనలను పంపించాలని సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ) రాష్ట్ర ప్రభుత్వ శాఖలను ఆదేశించింది. ఈమేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (సర్వీసెస్) బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ఆదేశిస్తూ అంతర్గత ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 20వ తేదీ కల్లా అన్ని ప్రభుత్వ శాఖలు ప్రతిపాదిత ఫైళ్లను సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాలని అందులో స్పష్టం చేశారు. వాటిని క్లియర్ చేసిన తర్వాత ఆయా ప్రభుత్వ శాఖలు ఈనెల 28 కల్లా బదిలీ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమలులో భాగంగా ఉద్యోగుల కేటాయింపునకు సంబంధించి అప్పటి ప్రభుత్వం జీవో 317ను జారీ చేసింది. స్థానికత, సీనియారిటీ ప్రాతిపదికన మల్టీ జోనల్, జోనల్, జిల్లా స్థాయిలో ఉద్యోగుల విభజన చేపట్టారు. ఈ ప్రక్రియ వల్ల తీవ్ర నష్టం జరిగిందంటూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కోర్టును ఆశ్రయించగా.. మరికొందరు ప్రభుత్వానికి వినతులు సమర్పించుకున్నారు. ఉద్యోగుల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ప్రభుత్వం జీవో 317పై పునఃసమీక్ష నిర్వహించాలని నిర్ణయించి, ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించింది. అదే సమయంలో తక్షణ ఉపశమనం కల్పించేందుకు గత ఏడాది డిసెంబర్‌లో పరస్పర బదిలీలకు పచ్చజెండా ఊపింది. ఇదే క్రమంలో స్పౌజ్, మెడికల్ కేటగిరీ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు కూడా స్వీకరించింది. ఈ దరఖాస్తులను పరిశీలించిన అధికారులు... వాటి ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. ఈ ఫైళ్లను ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాల్సి ఉంది. కాగా, తాజాగా సాధారణ పరిపాలన శాఖ ఈ ఫైళ్ల సమర్పణకు అవకాశం కల్పించింది. ఈనెల 20వ తేదీ నాటికల్లా వాటిని జీఏడీ కార్యాలయానికి సమర్పిస్తే.. వాటిని పరిశీలించిన తర్వాత ఆమోదం తెలుపనుంది. ఆ తర్వాత శాఖల వారీగా అర్హత సాధించిన ఉద్యోగులకు పరస్పర బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారు. అదేవిధంగా స్పౌజ్, మెడికల్ కేటగిరీల్లో దరఖాస్తులు సమర్పించిన అంశంపైనా జీఏడీ స్పష్టత ఇచ్చింది. ఇప్పటికే ఈ రెండు కేటగిరీల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వాటి ప్రతిపాదనలను కూడా జీఏడీకి సమర్పించాలని సూచించింది. ఈనెల 28వ తేదీ కల్లా స్పౌజ్, మెడికల్ కేటగిరీ దరఖాస్తులపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 15-2-2025

● సమ్‌థింగ్ స్పెషల్

90 ఏళ్లుగా డైరీలు రాస్తూనే ఉంది!

కొందరు డైరీలు రాయరు. కొందరు డైరీ రాసే అలవాటును మధ్యలోనే వదిలేస్తారు.

అమెరికాకు చెందిన ఎవీ రిస్కీ అలా కాదు. వంద సంవత్సరాల రిస్కీ తొంభై సంవత్సరాలుగా డైరీలు రాస్తూనే ఉంది...

ఎవీ రిస్కీ తండ్రికీ డైరీలు రాయడం అంటే ఎంతో ఇష్టం. కూతురు చిన్న వయసులో ఉన్నప్పుడు కొత్త సంవత్సరం రోజున డైరీని కానుకగా ఇచ్చాడు. ఇక అప్పటినుంచి మొదలైన డైరీ రాసే అలవాటు ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. దాదాపు తొమ్మిది దశాబ్దాలుగా ప్రతిరోజూ డైరీ రాస్తోంది. ఇది ఆమెకు జీవితకాలపు అలవాటు అయింది. చిన్ననాటి నుంచి మొదలైన ఈ అలవాటు వల్ల ఆమె వ్యక్తిగత ప్రయాణంతోపాటు చుట్టూ మారుతున్న ప్రపంచాన్ని కూడా డాక్యుమెంటూ చేస్తూ వస్తోంది.





నయాగరా అనే చిన్న పట్టణంలో పెరిగిన రిస్కీ ప్రతి సీజన్ గురించి రాసింది. కుటుంబ ప్రయాణాల నుంచి చారిత్రాత్మక సంచలన ఘటనల వరకు ఎన్నో చేసింది. కష్టకాలంలోనూ, ప్రతికూల పరిస్థితుల్లోనూ డైరీ రాయడం ఆపలేదు. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పుడు కూడా డైరీ రాయడం మానలేదు. ఎప్పుడైనా డైరీని చేరుకోలేనంత అనారోగ్యంగా ఉంటే చిత్తు కాగితాలపై నోట్సు రాసి ఆ తరువాత డైరీలో రాసేది.

ప్రతిరాత్రి డైరీ రాయడం పూర్తి చేసిన తరువాత గత సంవత్సరం ఆరోజు విషయాలను తెలుసుకోవడం తనకు ఆసక్తిగా ఉంటుంది.

'వాషింగ్టన్ పోస్ట్' ఎవీ రిస్కీ గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో ఆన్‌లైన్ సెన్సేషన్‌గా మారింది.



చేనేతను ఫ్యాషైన్ చేద్దాం!

ఇకత్ చీరతో వేడుకలో వెలిగిపోతాం. నారాయణపేట మెటీరియల్‌తో డిజైనర్ బ్లవుజ్ కుట్టించుకుంటాం. మన సంప్రదాయ వస్త్రధారణ మనల్ని ఫ్యాషన్ పెరేడ్‌లో తళుక్కుమని తారల్లా మెరిపిస్తోంది. ఇవి ఇంత అందంగా ఎలా తయారవుతాయి. ఒక డిజైన్‌ని విజువలైజ్ చేసి వస్త్రం మీద ఆవిష్కరించే చేనేతకారులు ఏం చదువుతారు...

ఈ ప్రశ్నలకు జవాబులు వెతికే ప్రయత్నం చేశారు మిసెస్ ఇండియా విజేత సుష్మ. ఈ వస్త్రాలను నేసే చేతులను, ఆ వేళ్ల మధ్య జాలువారుతున్న కళాత్మకతను దగ్గరగా చూడాలనిపించింది. పోచంపల్లి బాట పట్టారామె. కళాత్మకత అంతా చేనేతకారుల చేతల్లోనే తప్ప వారి జీవితాల్లో కనిపించలేదు. నూటికి రెండు–మూడు కుటుంబాలు ఆర్థికంగా బాగున్నాయి. మిగిలిన వాళ్లంతా ఈ కళను తమ తరంతో స్వస్తి పలకాలనుకుంటున్న వాళ్లే. మరి... ఇంత అందమైన కళ తర్వాతి తరాలకు కొనసాగకపోతే? ఒక ప్రశ్నార్థకం. దానికి సమాధానంగా ఆమె తనను తాను చేనేతలకు ప్రమోటర్‌గా మార్చుకున్నారు. చేనేతకారుల జీవితాలకు దర్పణంగా నిలిచే డాక్యుమెంటరీలు చిత్రీకరించారు. తాను పాల్గొనే ఫ్యాషన్ పెరేడ్‌లు, బ్యూటీ కాంటెస్ట్‌లలో మన చేనేతలను ప్రదర్శిస్తున్నారు. ఆ చేనేతలతోనే విజయాలు సొంతం చేసుకుంటున్నారు. స్వతహాగా ఎంటర్‌ప్రెన్యూర్ అయిన సుష్మా ముప్పిడి మన హస్తకళలు, చేనేతలను ప్రపంచవేదిక మీదకు తీసుకెళ్లడానికి మార్గం సుగమం చేశారు.

వైఫల్యమూ అర్థవంతమే!

చీరాలకు చెందిన సుష్మ ముప్పిడి బీటెక్, ఎంబీఏ చేశారు. కొంతకాలం గుంటూరులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం, పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంతోపాటు మరో ప్రైవేట్ కాలేజీలో పార్ట్‌టైమ్ జాబ్ చేశారు. ఒక కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉద్యోగం... ఈ జర్నీలో ఏదో మిస్ అవుతున్న ఫీలింగ్. ఉద్యోగం కోసం తన హండ్రెడ్‌పర్సెంట్ ఇస్తోంది. పిల్లల కోసం గడిపే సమయం తగ్గిపోతోంది. వెనక్కి చూస్తే తనకు మిగిలిందేమిటి? సివిల్ సర్వీసెస్ ప్రయత్నం సఫలం కాలేదు. ఉనికి లేని సాధారణ ఉద్యోగంతో తనకు వచ్చే సంతృప్తి ఏమిటి? సమాజానికి పని చేయడంలో సంతృప్తి ఉంటుంది, తనకో గుర్తింపునిచ్చే పనిలో సంతోషం ఉంటుంది. ఇలా అనుకున్న తర్వాత యూత్‌లో సోషల్ అవేర్‌నెస్ కోసం కార్యక్రమాలు నిర్వహించారు. ఆ ప్రయాణంలో అనుకోకుండా బ్యూటీ కాంపిటీషన్‌లో పాల్గొనవడం విజేతగా నిలవడం జరిగింది. సోషల్ ఇనిషియేటివ్, వెల్ స్పోకెన్, బెస్ట్ కల్చరల్ డ్రెస్, మిసెస్ ఫ్యాషనిస్టా వంటి గుర్తింపులతోపాటు 'యూఎమ్‌బీ ఎలైట్ మిసెస్ ఇండియా 2024' విజేతగా నిలిచారు. ఈ ఏడాది మార్చి ఒకటిన ఇటలీలోని మిలన్ నగరంలో, ఎనిమిదవ తేదీన ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో జరిగే ఫ్యాషన్ షోలలో భారత చేనేతలు అసోం సిల్క్, మల్బరీ సిల్క్‌లను ప్రదర్శించనున్నారు. జూన్‌లో యూఎస్, ఫ్లోరిడాలో జరిగే మిసెస్ యూనివర్సల్ వేదిక మీద మనదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు సుష్మ. ఇవన్నీ ఆత్మసంతృప్తినిచ్చే పనులు. ఇక తనకు రాబడి కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆఫీస్ నుంచి యూఎస్, దుబాయ్, సింగపూర్‌లలో డైమండ్ బిజినెస్ నిర్వహిస్తున్నారు. ''జీవితంలో గెలవాలి, నా కోసం కొన్ని సంతోషాలను పూస గుచ్చుకోవాలి. నన్ను నేను ప్రశంసించుకోవడానికి సమాజానికి నా వంతు సర్వీస్ ఇవ్వాలి'' అన్నారు సుష్మ. ''వయసు దేనికీ అడ్డంకి కాదు. అంతా మన అభిరుచి మీద ఆధారపడి ఉంటుంది. మీ కలలను నిజం చేసుకోవాలంటే ఒక ముందడుగు వేయండి. సక్సెస్ అవుతామా, విఫలమవుతామా అనే సందేహాలు వద్దు. ఏ ప్రయత్నమూ చేయకపోవడం కంటే ప్రయత్నించి విఫలమైనా కూడా అది అర్థవంతమయిన వైఫల్యమే. కాబట్టి మిమ్మల్ని మీరు తగ్గించుకోకూడదు'' అని మహిళలకు సందేశమిచ్చారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఇది నా చేయూత

పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిరిసిల్లలకు వెళ్లి స్వయంగా పరిశీలించాను. మన చేనేత కుటుంబాలు కళకు దూరం కాకుండా ఉండాలన్నా, ఇతరులు ఈ కళాత్మక వృత్తిని చేపట్టాలన్నా ఇది ఉపాధికి సోపానంగా ఉండాలి. అందుకోసం చేనేతలను కార్పొరేట్ స్థాయికి చేరుస్తాను. సమావేశాలకు ఉపయోగించే ఫైల్ ఫోల్డర్స్, ఇంట్లో ఉపయోగించే సోఫా కవర్స్, వేడుకల్లో ధరించే బ్లేజర్స్ వంటి ప్రయోగాలు చేసి మన చేనేతలను ప్రపంచవేదికలకు తీసుకెళ్లాలనేదే నా ప్రయత్నం. నేను ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎల్లలు దాటి విదేశాలకు విస్తరించాను. కాబట్టి నాకున్న ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుని మన చేనేతలను ప్రమోట్ చేయగలుగుతున్నాను. కలంకారీ కళ కోసం అయితే ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించి కలంకారీ కళాకారులకు ఉచితంగా స్టాల్స్ ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశాను. పారిస్, యూఎస్ కార్యక్రమాల తర్వాత ఆ పని. సివిల్స్ సాధించినా కూడా ప్రత్యేకంగా ఒక అంశం మీద సమగ్రంగా పని చేయడం సాధ్యం కాకపోవచ్చు. ఇప్పుడు నేను ఒక కళాత్మక సమాజానికి ఇస్తున్న సర్వీస్ నాకు అత్యంత సంతృప్తినిస్తోంది. ప్రపంచ ఫ్యాషన్ వేదిక మీద మన భారతీయ చేనేతకు ప్రాతినిధ్యం వహించాలి. మన నేతలకు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం కల్పించాలనేది నా లక్ష్యం.

– సుష్మ ముప్పిడి, మిసెస్ ఇండియా



మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెలకువలు, అందుతున్న రుణాలు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్'షి'ప్" పేరుతో ప్రతి శనివారం అందిస్తున్నాం! ఈ వారం స్కీమ్ పీఎమ్‌ఈజీపీ... ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్.

● పీఎమ్‌ఈజీపీ రుణాలు

పెన్నుల నుంచి పాలిమర్స్ దాకా...

పీఎమ్‌ఈజీపీ... ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్. 2008లో మొదలైన ఈ పథకం గ్రామీణ, పట్టణ నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి కల్పించి వారి ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఎమ్ఎస్ఎమ్ఈ (MSME) పర్యవేక్షణలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమీషన్ కేవీఐసీ ద్వారా ఇది అమలవుతోంది. రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు రుణసౌకర్యం అందుతోంది. అభ్యర్థులు పది శాతం పెట్టుబడి పెట్టుకుంటే బ్యాంకుల ద్వారా 90 శాతం రుణ సహాయాన్ని పొందవచ్చు. అయితే మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు, దివ్యాంగులు, మాజీ ఆర్మీ సిబ్బంది మాత్రం అయిదు శాతం పెట్టుబడి పెట్టుకుంటే బ్యాంకులు 95 రుణాన్ని అందిస్తాయి. అంతేకాదు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, ఫిజికల్లీ చాలెంజ్‌డ్, ట్రాన్స్‌జెండర్స్, గ్రామీణ ప్రాంతం వారికి 35 శాతం రాయితీ కూడా లభిస్తుంది. జనరల్ కేటగిరీలోని వారికేమో పట్టణాల్లో 15 శాతం, గ్రామీణ ప్రాంతంలో 25 శాతం సబ్సిడీ కేటాయించారు.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి... ముందుగా అభ్యర్థులు పీఎమ్‌ఈజీపీ పోర్టల్‌లోకి వెళ్లి అప్లికేషన్ ఫామ్ ప్రింట్ తీసుకోవాలి. అందులో వివరాలను స్పష్టంగా, పూర్తిగా నింపాలి. తర్వాత దాన్ని గ్రామీణ ప్రాంతాల వారైతే కేవీఐసీకి, పట్టణప్రాంతం వారైతే డీఐసీకి అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు చేసుకున్న 10 నుంచి 15 రోజుల్లో అధికారుల నుంచి స్పందన ఉంటుంది. అధికారుల తనిఖీ అనంతరం వారి సూచన మేరకు.. కేంద్రప్రభుత్వ సంస్థలు ఇస్తున్న ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ శిక్షణ తీసుకోవాలి. ఆ శిక్షణకు సంబంధించిన పరీక్ష కూడా పాసై, సర్టిఫికెట్ పొందాలి.

అర్హతలు... 18 ఏళ్లు నిండి, కనీసం ఎనిమిదవ తరగతి పాసై ఉండాలి. స్వయం సహాయక బృందాలు కూడా అర్హులే! ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.



కావాల్సిన పత్రాలు... 1. వ్యాపారానికి సంబంధించిన పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్, 2. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో సహా వివరాలు నమోదు చేసిన అప్లికేషన్ ఫామ్, 3. ఐడీ, అడ్రస్ ప్రూఫ్, ఆధార్, పాన్ కార్డ్, 4. శిక్షణ పొందిన ఆంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సర్టిఫికెట్. 5. ఎక్స్‌పీరియెన్స్, ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్స్.

వ్యాపారాలు... పేపర్ నాప్కిన్స్, పేపర్ బ్యాగ్స్, పేపర్ ప్లేట్స్.. అనుబంధ ఉత్పత్తులు, నాన్ ఓవెన్ బ్యాగ్స్, పెన్నుల తయారీ, షాంపూ, డిటర్జెంట్‌లు, ఆర్టిఫిషియల్ ఆర్నమెంట్స్ తయారీ, ప్యాక్డ్ వాటర్, ఎల్‌ఈడీ లైట్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు వంటి ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రికల్ పరికరాలు, రసాయన పాలిమర్లు, టెక్స్‌టైల్స్, ఫారెస్ట్ ఇండస్ట్రీ వంటివాటికీ ఈ పథకం కింద రుణాలు పొందవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాధారిత, పాడి, వర్తక విభాగాల్లోనూ దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. 2022– 2025 మధ్య కాలంలో ఈ పథకానికి 13,554.42 కోట్ల రూపాయలను కేటాయించారు.



– బి.ఎస్. రత్న, బిజినెస్ కన్సల్టెంట్, దలీప్

మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ : ownership.sakshi@gmail.com
నిర్వహణ : సరస్వతి రమ

● కొత్త దారి

పొలాలే బడులుగా రైతులకు సరికొత్త వ్యవసాయ పాఠాలు చెబుతుంది సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని రామవరం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిణి (ఏఈవో) కరంటోతు శ్రీలత. ఆమె పాఠాలు వృథా పోలేదు. సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత నుంచి మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు వరకు ఎన్నో విషయాలను అవగాహన చేసుకొని కొత్తదారిలో ప్రయాణిస్తున్నారు అన్నదాతలు...

అన్నదాత మెచ్చిన రైతుబిడ్డ



అక్కన్నపేట మండలం పంతులు తండాకు చెందిన శ్రీలతకు ఏఈవో ఉద్యోగం వచ్చినప్పుడు 'నాకు ఉద్యోగం వచ్చింది' అనే సంతోషం కంటే 'ఈ ఉద్యోగం వల్ల ఎంతోమంది రైతులకు సహాయంగా నిలబడవచ్చు' అనే సంతోషమే ఎక్కువ. రైతు కుటుంబంలో పుట్టిన శ్రీలతకు రైతుల కష్టాలు, నష్టాలు తెలియనివేమీ కాదు. సాగులో మెలకువలు పాటించకపోవడం వల్ల పంట దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. అయితే మెలకువలు పాటించకపోవడం నిర్లక్ష్యం వల్ల కాదు... అవగాహన లేకపోవడం వల్లే జరుగుతోందని గ్రహించిన శ్రీలత రంగంలోకి దిగింది.

ఆమె పొలం దగ్గరికి వస్తే ఎక్కడి నుంచో అగ్రికల్చరల్ ఆఫీసర్ వచ్చినట్లు ఉండదు. తెలిసిన వ్యక్తో, చుట్టాలమ్మాయో వచ్చినట్లుగా ఉంటుంది. ఎలాంటి బేషజాలు లేకుండా అందరితో కలిసిపోయి వారి సమస్యలు తెలుసుకుంటుంది. పొలం దగ్గరికి వచ్చినప్పుడు శ్రీలత కూడా రైతుగా మారిపోతుంది. తానే స్వయంగా ట్రాక్టర్‌తో వరి పొలం దున్నుతుంది. వరిలో కాలిబాటల ప్రయోజనాల గురించి చెబుతుంది. ఎరువులు ఎంత మోతాదులో చల్లాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్షంగా చేసి చూపిస్తోంది.

వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ నూతన సాగు పద్ధతులను తెలుసుకుంటూ, వాటిని తన క్లస్టర్ పరిధిలోని రామవరం, గండిపల్లి, కుందన్‌వానిపల్లి, మైసమ్మవాగు తండా రైతులకు చెబుతుంటుంది. రసాయనిక మందుల వినియోగం లేకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తోంది. గిరిజన గ్రామాల్లో సైతం మల్చింగ్ పద్ధతిలో కూరగాయలు ఎక్కువగా సాగు చేసేలా చేస్తోంది. పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల భూసారం దెబ్బతింటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత గురించి ఒకటికి పది సార్లు చెప్పడమే కాదు సేంద్రియ ఎరువులను ఎలా తయారు చేసుకోవాలని అనే అంశంపై ప్రత్యేక వీడియోను తయారు చేసింది. జీవ ఎరువుల వినియోగంపై కూడా ప్రత్యేక వీడియోను తయారు చేసి రైతులకు అవగాహన కలిగిస్తోంది.

– గజవెల్లి షణ్ముఖరాజు, సాక్షి, సిద్దిపేట
– మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

క్షేత్రస్థాయిలోకి...

రైతు అంటే నా దృష్టిలో ఒక పొలానికి యజమాని మాత్రమే కాదు... మన ఇంటి వ్యక్తి. మనకు అన్నం పెట్టే అన్నదాత. రైతుకు మంచి జరిగితే లోకానికి మంచి జరిగనట్లే. నా ఉద్యోగం ద్వారా రైతులకు ఏదో రకంగా మేలు చేసే సలహాలు, సూచనలు ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది.

- శ్రీలత

ముల్లంగి పేరు చెప్పగానే సాంబారే గుర్తుకొస్తుంది కానీ పోషకాలు సమృద్ధిగా ఉండటంతో పాటు వంటకాలకు ప్రత్యేక రుచిని తెచ్చే ముల్లంగితో కరకరలాడే పకోడీలూ చేసుకోవచ్చు. అంతేనా... పచ్చని పూసల రాశిగా మురిపిస్తూ.. సూప్‌గా ఓ రుచిని, పాస్తాతో మరో రుచిని అందించే పచ్చి భఠానీకి కాసింత పుదీనా చేర్చి సూప్ చేశామంటే వాహ్వా అనాల్సిందే... ఈ వారం వంటిల్లులో ఈ రెండు వంటలూ ఆస్వాదించండి.



బఠానీ-పుదీనా సూప్

సాయంకాలాలు లేదా రాత్రి టైమ్‌లో తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలనుకుంటారు. అందుకు ఈ బఠానీ సూప్ సరైనది.

కావలసినవి: పచ్చి బఠానీ గింజలు – కప్పుడు, బంగాళదుంప ముక్కలు – అర కప్పుడు (ఉడికించినవి), పుదీనా ఆకులు – తగినన్ని, వెజిటబుల్ బ్రోత్ (గుప్పెడు పాలకూర, 2 వెల్లుల్లి రెబ్బలు, 2 లవంగాలు, 2 బిర్యానీ ఆకులు, 4 మిరియాలు.. కలిపి ఉడికించి, వడకట్టుకున్న మిశ్రమం) – 2 కప్పులు, **ఆలివ్ ఆయిల్** – 2 టేబుల్ స్పూన్లు, **ఉప్పు, మిరియాల పొడి** – తగినంత, **ఉల్లిపాయలు** – అర కప్పుడు.

తయారీ విధానం: ఆలివ్ నూనె వేడి చేసి, అందులో ఉల్లిపాయలు వేయించాలి ● దీంట్లో బంగాళదుంప ముక్కలు, వెజిటబుల్ బ్రోత్ కలిపి 10 నిమిషాలు మరిగించాలి ● బఠానీలు వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి. ఉప్పు, మిరియాల పొడి వేసి మంట తీసేసి, సన్నగా కత్తిరించిన తాజా పుదీనా ఆకులు కలపాలి ● ఫ్లేవర్ కోసం మరిన్ని ఉల్లిపాయ ముక్కలు, క్యారట్ తరుగు, పాలకూర ఆలివ్ ఆయిల్‌లో మగ్గించి కలపుకోవచ్చు ● తులసి ఆకులు, తెల్లని నువ్వులు లేదా కొద్దిగా సారపప్పు జత చేసుకోవచ్చు ● ఛీజ్ లేదా బటర్ వంటివీ రుచికి వాడుకోవచ్చు.

వంటిల్లు



ముల్లంగి పకోడి

కావలసినవి: ముల్లంగి తరుగు – కప్పు, **శనగపప్పు** – కప్పు (నీళ్లలో నానబెట్టాలి), **బియ్యప్పిండి** – 2 టేబుల్‌స్పూన్లు, **ఉల్లిపాయ** – 1 (తరగాలి), **పచ్చిమిర్చి** – 2 (తరగాలి), **వెల్లుల్లి రెబ్బలు** – 2 (కచ్చాపచ్చాగా దంచాలి), **జీలకర్ర** – అర టీ స్పూన్, **కరివేపాకు** – 2 రెమ్మలు, **నూనె** – వేయించడానికి తగినంత, **ఉప్పు** – తగినంత.

తయారీ: ● నానబెట్టిన శనగపప్పును రుబ్బుకోవాలి. ● దీంట్లో ముల్లంగి, బియ్యప్పిండి, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు, కరివేపాకు తరుగు వేసి కలపాలి. ● బాగా కలిపితే, నీళ్ల అవసరం లేకుండానే పిండి ముద్దలా అవుతుంది. ● బాణలిలో తగినంత నూనె పోసి, వేడయ్యాక, చిన్న చిన్న పిండి ముద్దలు తీసుకొని, వేయాలి. రెండు వైపులా వేయించి తీయాలి. ● ఇలా వేయించిన పకోడీని పుదీనా చట్నీతో లేదా సాస్‌తో వడ్డించాలి.

బ్యూటిప్స్

చర్మానికి జీవకళ



● కొబ్బరి నీళ్లను వేళ్లతో అద్దుకుంటూ ముఖానికి అప్లై చేస్తూ, మసాజ్ చేసుకోవాలి. పది నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. నిస్తేజంగా మారిన ముఖ చర్మం జీవకళతో తొణికిసలాడుతుంది.

● టీ స్పూన్ టొమాటో గుజ్జు, శనగపిండి, చిటికెడు పసుపు, అర టీ స్పూన్ నిమ్మరసం, కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి, కళ్లమీద గుండ్రంగా తరిగిన కీరా ముక్కలు ఉంచి ఇరవై నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. తర్వాత ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తుంటే కళ్లకింద నల్లని వలయాలు తగ్గుముఖం పట్టి, ముఖం కాంతిమంతం అవుతుంది.

● రెండు టీ స్పూన్ల గోధుమ పిండిలో తగినన్ని పాలు పోసి, ఉండలు లేకుండా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, వేళ్లతో సున్నితంగా రుద్దాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. జీవం లేని ముఖ చర్మం కళకళలాడుతుంది.

● ఉప్పు కంటెంట్ లేని టేబుల్ స్పూన్ బటర్‌ని బ్లెండ్ చేయాలి. అందులో స్ట్రాబెర్రీ గుజ్జును కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఈ ప్యాక్ ముడతలను నివారిస్తుంది. చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.

అయ్యయ్యో

కోటి రూపాయల నగలను కొన్ని వందలకే అమ్మింది!

చైనాలోని షాంఘైకి చెందిన లీ తన తల్లికి చెందిన రూ.1.22 కోట్ల (ఇండియన్ కరెన్సీలో) విలువైన నగలను కేవలం 721 రూపాయలకే అమ్మింది! ఆ వచ్చిన డబ్బుతో లిప్ రింగ్స్, చెవి పోగులు కొనుగోలు చేసింది.

'విలువైన జేడ్ బ్రేస్‌లెట్‌లు, నెక్లెస్‌లు, డైమండ్‌లను తీసుకెళ్లి లోకల్ మార్కెట్‌లో అమ్మావు. ఎందుకు ఇలా చేసావు... మతిగానీ పోయిందా?' అని అడిగితే సదరు లీ చెప్పిన జవాబు... 'అవి నకిలీవి అనుకుని రీసైక్లింగ్ షాప్‌లో అమ్మాను'



ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే... ఒకరోజు తన తల్లి వాంగ్‌తో... 'లిప్ రింగ్స్‌తో ఉన్న ఒక అమ్మాయిని చూశాను. ఎంత అందంగా ఉందో! నాకు కూడా అలాంటివి కావాలి. 60 యువాన్లు ఇస్తే సరిపోతుంది' అన్నది. తల్లి ఇచ్చిందో లేదో, ఆ తరువాత ఏం జరిగిందో తెలియదుగానీ... ఒకరోజు వాంగ్ ఇంట్లో విలువైన నగలు మాయం అయ్యాయి. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గంటల వ్యవధిలోనే ఆ నగలను వాంగ్‌కు అప్పజెప్పారు.

ఈ ఘటన నేపథ్యంలో నెటిజెన్‌లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 'పిల్లలకు పాకెట్ మనీ ఇవ్వడం ద్వారా ఇలాంటి దొంగతనాలను నివారించవచ్చు' అని కొందరు సూచించారు. మరికొందరు మాత్రం 'లీ'ని తీవ్రంగా తప్పుబట్టారు.

● ఇకబెనా

ఇది సుమచరితం

పూల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఎన్ని పుస్తకాలు రాసినా రాయ డానికి ఇంకా ఉంటుంది. ఇకబెనా అనేది జపాన్‌కు చెందిన ఫ్లవర్ ఆర్ట్. ఇకబెనా లో చేస్తున్న సేవకి గాను 'జపాన్ ఫారిన్ మినిస్టర్స్ కమెండేషన్ అవార్డు' అందుకున్నారు రేఖారెడ్డి. జపాన్ ఫ్లవర్ ఆర్ట్‌ను భారతీయ చేనేత కళతో సమ్మిళితం చేస్తూ తన 'లూమ్స్ అండ్ బ్లూమ్స్, పెటల్స్ అండ్ ప్యాలెట్, మిశ్రణం' రచనలను పరిచయం చేశారు రేఖారెడ్డి.



పువ్వులు, రంగులు జీవితంలో భాగం. లైఫ్ కలర్‌ఫుల్‌గా ఉంచుకోవడంతోపాటు సుమభరితంగానూ ఉండాలి. భారతీయ సంస్కృతి పూలు ఆస్వాదనకు, ఆడంబరానికి, రస మయమైన, విలాసవంతమైన జీవితానికి ప్రతీకలు. అలాగే దైవానికి చేసే నిత్యపూజలో పూలది ప్రధానపాత్ర. మన పూల అలంకరణ ఈ తీరులోనే ఉంటుంది. జపాన్ వాళ్లు మాత్రం తాము అనుసరించే నిరాడంబర జీవనశైలిలో పూలతో ఆధ్యాత్మికపథం నిర్మిస్తారు. బౌద్ధం నుంచి నేర్చుకున్న వైరాగ్యతను పూల అలంకరణ ద్వారా నిత్యధ్యానం చేస్తారు. మనిషి జీవితాన్ని పువ్వుతో పోలుస్తారు. త్రికోణాకారపు అమరికలో పైన స్వర్గం, కింద భూమి, మధ్యలో మనిషి... ఈ మూడింటికి ప్రతిరూపం ఇకబెనా ఫ్లవర్ అరేంజ్‌మెంట్. ఒక మొగ్గ, ఒక అర విరిసిన పువ్వు, మరొకటి పూర్తిగా విచ్చుకున్న పువ్వు... ఈ మూడు భవిష్యత్తు, వర్తమానం, భూత కాలాలకు సూచికలు. మనిషి జీవన చక్రానికి ప్రతీక. ఫ్లవర్ అరేంజ్‌మెంట్ కూడా ధ్యానం వంటిదే. ఒకరు దేవుని ముందు కూర్చుని ధ్యానం చేస్తారు. ఒకరు ప్రకృతి ఒడిలో ధ్యానం చేస్తారు. రోజూ కొంత సమయం ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌లో నిమగ్నమైతే మనసుకు ఆహ్లాదంగా ఉంటుంది. ధ్యానం తర్వాత కలిగే అలౌకిక ఆనందం వంటిదే ఇది కూడా.







ఇరు దేశాల సంస్కృతుల సమ్మేళనం

జపాన్ సంస్కృతిలో భాగమైన ఇకబెనాలో భారతీయ సంస్కృతిని మమేకం చేస్తూ పసుపు కుంకుమలతో పరిపూర్ణం చేశారు. 'బ్లూమ్స్ అండ్ లూమ్స్' కాన్సెప్ట్ జపాన్ ఇకబెనాను భారతీయ చేనేతతో సమ్మిళితం చేయడం. 'మిశ్రణం'లో మన ఆహారంలో ఉన్న పోషకాలు – జపాన్ పూల అలంకరణతో అనుసంధానం చేయడం. పెటల్స్ అండ్ ప్యాలెట్స్‌లో పూలు-రంగుల మధ్య విడదీయలేని బంధాన్ని వర్ణించారు. రెండు దేశాల సంస్కృతుల సమ్మేళనమే ఇవన్నీ. స్టేజ్ టాక్‌లో ఆతిథులను సమ్మోహనపరిచిన ఈ ప్రయోగాలే ఆమెను 'జపాన్ ఫారిన్ మినిస్టర్స్ కమెండేషన్ అవార్డు'కు ఎంపిక చేశాయి.

సిట్ రైట్



ఇటీవల డాక్టర్‌ల దగ్గరకు వస్తున్న కేసుల్లో ఒళ్లు నొప్పులు, కీళ్లనొప్పులు, వెన్నునొప్పి, మెడ నొప్పి, తలనొప్పి ప్రధానంగా కనిపిస్తున్నాయి. కండరాల నొప్పులు, కీళ్లనొప్పులు, వెన్ను కింది భాగం (లోవర్ బ్యాక్) నొప్పి కేసులను నిశితంగా పరిశీలించిన స్పైన్ స్పెషలిస్టులు నూటికి ఇరవై శాతం వరకు ఈ రకమైన వెన్నునొప్పులకు బ్యాడ్ సిట్టింగ్ పోశ్చర్‌లే కారణమని చెబుతున్నారు. నాణ్యత లోపించకుండా క్వాలిటీ వర్క్ ఇవ్వడంలోనూ కూర్చునే భంగిమ పాత్ర కీలకమే. అందుకే సరిగ్గా కూర్చుందాం.

ఇలా కూర్చోవాలి

కుర్చీలో కూర్చున్నప్పుడు భుజాలు, బట్ భాగం కుర్చీ వెనుక భాగాన్ని తాకాలి. బట్ భాగం కుర్చీని తాకని పక్షంలో కుర్చీ మార్చుకోవడం లేదా కుషన్ అమర్చుకోవడం మంచిది. అరగంటకొకసారి కదిలి కూర్చున్న భంగిమకు విశ్రాంతినిచ్చి తిరిగి సరైన తీరులో కూర్చోవాలి. కథల్లో వర్ణించినట్లు విశ్రాంతిగా కుర్చీలో జారగిలపడి కూర్చోవడం అనే భంగిమలో గంటలసేపు ఉండకూడదు, దేహం సాంత్వన పొందే రెండు-మూడు నిమిషాల సేపు మాత్రమే ఉండాలి. అరగంట, గంట పనికి ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకుని పని చేస్తే ఫర్వాలేదు. కానీ ఎక్కువ గంటలు పని చేయాల్సి వస్తే ల్యాప్‌టాప్‌ను కూడా డెస్క్ మీద ఉంచి పని చేయడమే కరెక్ట్. ఎక్కువ గంటలు కూర్చుని పనిచేసే వాళ్లు అబ్డామినల్ స్ట్రెంగ్త్ కోసం రోజూ అరగంట పాటు ఎక్సర్‌సైజ్ చేయాలి. ఇందు కోసం పెద్ద బాల్ మీద కానీ కుర్చీలో కానీ కూర్చోవాలి. ఈ భంగిమలో పాదాల మధ్య అడుగు దూరం ఉంచాలి. గాలి వదులుతూ కుడి మోకాలిని ఫొటోలు చూపినట్లు పైకెత్తాలి, అదే సమయంలో ఎడమ చేతిని కూడా పైకెత్తాలి. మెల్లగా మామూలు స్థితికి రావాలి. రెండవసారి అదేవిధంగా ఎడమ మోకాలు, కుడిచేత్తో చేయాలి. ఇలా కనీసం పదిసార్లు చేస్తుంటే... కూర్చున్న భంగిమలు సరిలేని కారణంగా ఎదురయ్యే అవాంఛిత ఒత్తిడుల నుంచి దేహం సాంత్వన పొందుతుంది. కడుపు కండరాలు, అంతర్గత అవయవాలు శక్తిమంతమవుతాయి.

ఆహార పథ్యాలు, వ్యాయామాలతోనే కాకుండా కొన్ని రకాల చిట్కాలని అనుసరించడం ద్వారా కూడా సన్నగా, నాజూకుగా కనపడవచ్చు. అదెలాగంటే ఫ్యాషన్ అనేది స్టైల్‌గా మాత్రమే కాకుండా నాజూగ్గా... అందంగా కనపడేలా కూడా చేస్తుంది.ఇందుకోసం చేయవలసిందల్లా శరీరంలో మీకు సమస్యగా అనిపించే ప్రాంతాలను గుర్తించడమే- అది మీ నడుము భాగమా లేదా మీ తొడలలో లేదా మీ పిరుదులలో సమస్యగా ఉందా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం మీ గదిలో ఏకాంతంగా అద్దం ముందు నిల్చుని ప్రతి శరీర భాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకొని, లోపాలను దాచి పెట్టుకోటానికి ప్రయత్నించాలి. లేదంటే కుటుంబ సభ్యులు, సన్నిహితుల సహకారం తీసుకోవడంలో తప్పు లేదు. శరీరంలోని ఈ భాగాలు శరీరం కన్నా పెద్దగా కనపడకుండా చూసుకోవాలి.

క్యారట్
శరీరంలో రక్తాన్నే కాదు... ఆ రక్తంలో ప్లేట్‌లెట్ కౌంట్‌ని కూడా పెంచుతుంది. దీన్ని తీసుకోవడం వల్ల ఆ సమస్యతో బాధపడేవారు త్వరగా ఉపశమనం పొందారని సర్వేలో తేలింది. క్యారెట్‌ని నేరుగానైనా, సలాడ్ రూపంలోనైనా ఎలా తీసుకున్నా ఫలితం ఉంటుంది.





మనం తీసుకునే ఆహారం శారీరక ఎదుగుదలకే కాదు, మనసు మీద కూడా ప్రభావం చూపిస్తుంది. కొన్ని రకాల ఆహారాలు మనసును నిరుత్సాహంగా మార్చితే, కొన్నిరకాల ఆహారాలు మనసును ఉత్తేజపరుస్తాయి. కార్బోహైడ్రేట్లు సెరోటోనిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తాయి. ఇది ఫీల్‌గుడ్ హార్మోన్. అందుకే మన రోజువారీ ఆహారంలో కార్బొహైడ్రేట్‌లు ఉండేటట్లు చూసుకోవాలి. అలాగే మితిమీరిన చక్కెర స్థాయిలు లేని కార్బోహైడ్రేట్‌లను తీసుకోవడం మంచిది. తిన్న తర్వాత త్వరగా జీర్ణమై రక్తంలో చక్కెర స్థాయిలను పెంచే ఆహారానికి బదులుగా కూరగాయలు, బీన్స్, పొట్టు తీయని ధాన్యాలను తీసుకోవాలి.

ఆయుర్వేదం ప్రకారం భోజనం చివరిలో నెయ్యి, బెల్లం మిశ్రమాన్ని తినడం వల్ల జీర్ణ క్రియ మెరుగుపడుతుంది. జీవక్రియ సవ్యంగా సాగుతుంది. శరీరంలోని వ్యర్థాలన్నీ బయటకు పోయి ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా జీవశక్తి పెరుగుతుంది. నెయ్యి, బెల్లం రెండిట్లోనూ పోషక ప్రయోజనాలు ఎక్కువే. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు ఎముకల ఆరోగ్యాన్ని పెంచి, రోగనిరోధక శక్తిని కూడగడితే, బెల్లంలో మెగ్నీషియం, క్యాల్షియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల భోజనానంతరం నెయ్యి, బెల్లం తినడం వల్ల శరీరానికి కావలసిన ఇతర పోషకాలు పుష్కలంగా అందుతాయి. పోషకాహార లోపం రాకుండా శరీరం సవ్యంగా పనిచేస్తుంది. అయితే, తినమన్నారు కదా అని పెద్ద పెద్ద ముక్కలు తినేయకూడదు. చిన్న ముక్క తింటే చాలు.

● మీకు తెలుసా?

కెనడాలో ఫ్యామిలీ డే



ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి14 ని వాలెంటైన్స్‌డే గా జరుపుకుంటే, కెనడాలోని చాలా ప్రావిన్సులలో, ఫిబ్రవరిలో మూడవ సోమవారాన్ని ఫ్యామిలీ డే గా జరుపుకుంటారు. ఈరోజు అక్కడ సెలవు దినం. దీనిని సాధారణంగా కుటుంబ దినోత్సవం అని పిలుస్తారు – అయితే కొన్ని ప్రావిన్సులు వేర్వేరు కారణాల వల్ల ఈ రోజును జరుపుకునేటప్పుడు వాటి స్వంత పేర్లను ఉపయోగిస్తాయి. ఆల్బెర్టా, బ్రిటిష్ కొలంబియా, న్యూ బ్రున్స్విక్, ఒంటారియో సస్కట్చేవాన్ ప్రావిన్సులలో కుటుంబ దినోత్సవం గానూ, మానిటోబాలో లూయిస్ రీల్ దినోత్సవంగా; నోవా స్కోటియాలో వారసత్వ దినోత్సవంగానూ జరుపుకుంటారు.

● యోగా

ఫలకాసనతో పొందే ఫలాలు

పొట్ట కండరాలను, భుజాలు, చేతులను బలపరిచే ఈ ఆసనాన్ని సంస్కృతంలో కుంభకాసనం అని కూడా అంటారు. ప్లాంక్ ఆసనంగానూ పేర్కొనే ఈ ఆసనం ఇతర యోగా భంగిమలు చేయడానికి శరీరాన్ని సిద్ధం చేస్తుంది. యోగా మొదలుపెట్టేవాళ్లకు ఇది సరైన ఆసనం. ఏకాగ్రత, ఓర్పును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అంటే, ఒక్క ఫలకాసన ద్వారా రోజువారీ జీవనంలో ఆరోగ్యకరమైన ఫలాలను పొందవచ్చు అన్నమాట.

ఈ ఆసనాన్ని ఎలా చేయాలంటే...

● ఈ ఆసనం రెండు చేతులు, రెండు పాదాల వేళ్ల మీద భారం పడేలా ఉంటుంది. ● మ్యాట్‌పైన బోర్లా పడుకొని, భుజాలు, మణికట్టు, చేతి వేళ్లకు అనుగుణంగా కాళ్లను స్ట్రెచ్ చేస్తూ వెనక్కి చాపి, ఈ ఆసనాన్ని ప్రారంభించాలి. ● కాలి ముని వేళ్ల, అర చేతులు భూమిని నొక్కి పడుతున్నట్టుగా ఉంచి, శరీరాన్ని పైకి లేపాలి. ● నాభిని లోపలికి నెడుతూ, చూపును నేల మీద సారిస్తూ, మెడ, వెన్నుముకను నిటారుగా ఉంచాలి. ● ఈ భంగిమలో ఐదు సార్లు దీర్ఘ శ్వాస తీసుకోవడం, వదలడం చేస్తూ ఉండాలి.

ఈ ఆసనంలో రక్తప్రసరణ వేగం పెరిగి, శరీరం చురుగ్గా మారుతుంది. చేతులు, పాదాల వేళ్ల మీద శరీరాన్ని బ్యాలెన్స్ చేయాలి కాబట్టి ఏకాగ్రత పెరుగుతుంది. ఈ ఆసనాన్ని రోజూ సాధన చేయడం వల్ల ఉదర సమస్యలు తగ్గడమే కాదు, కండరాలు బలపడతాయి.



సాక్షి సినిమా

లవ్ అప్‌డేట్స్ గురూ

ప్రేమికుల రోజు సందర్భంగా ప్రేమ నేపథ్యంలో రూపొందుతోన్న సినిమాల నుంచి 'లవ్ అప్‌డేట్స్ గురూ' అంటూ శుక్రవారం కొందరు తమ సినిమాల నుంచి పాటలు, లుక్స్ రిలీజ్ చేయగా, మరికొందరు సినిమా విడుదల తేదీలను ప్రకటించారు. ఆ వివరాల్లోకి వెళదాం...


● శ్రీలీల, నితిన్


● సిద్దు జొన్నలగడ్డ

● నితిన్, శ్రీలీల జోడీగా నటించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'వేర్‌ఎవర్ యు గో'.. అంటూ సాగే రెండో పాటని హీరో మహేశ్‌బాబు లాంచ్ చేశారు. ఈ పాటని కృష్ణకాంత్ రాయగా, అర్మాన్ మాలిక్ పాడారు.

● సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నీరజా కోన దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి సరికొత్త పోస్టర్ విడుదలైంది.


● కిరణ్ అబ్బవరం


● కిరణ్ అబ్బవరం హీరోగా, రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'దిల్ రూబా'. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 14న విడుదల కావాల్సింది. అయితే తాజాగా మార్చి 14న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించి, కిరణ్ అబ్బవరం పోస్టర్‌ని రిలీజ్ చేశారు.


● మాళవిక, సుహాస్

● సుహాస్, మాళవికా మనోజ్ జంటగా రామ్ గోధల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. హరీష్ నల్ల నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియాపై విడుదల చేయనున్నారు. ఈ మూవీ నుంచి సుహాస్, మాళవికా మనోజ్‌ల సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ● హర్ష్ రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కోర్ట్–స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీష్ దర్శకత్వంలో హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ సినిమా మార్చి 14న విడుదల కానుంది. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ప్రేమలో..' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ పాడారు.


● అజయ్ భూపతి, మోహిత్

● మోహిత్ పెద్దాడ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'నా లవ్ స్టోరీ'. వినయ్ గోను దర్శకత్వంలో దొమ్మరాజు అమరావతి, శ్రీకాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని దర్శకుడు అజయ్ భూపతి విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోస్టర్ యునిక్‌గా ఉంది. స్టూడెంట్స్ హాస్టల్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు'' అన్నారు.


● హర్ష్, శ్రీదేవి

క్యూట్ కాంత


● భాగ్యశ్రీ బోర్సే

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా గులాబీ రంగు చీరలో సింప్లీ సూపర్బ్‌గా కనిపించారు భాగ్యశ్రీ బోర్సే. దుల్కర్ సల్మాన్ సరసన భాగ్యశ్రీ బోర్సే 'కాంత' అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రంలోని పింక్ శారీలో క్యూట్‌గా ఉన్న భాగ్యశ్రీ లుక్‌ని విడుదల చేశారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ''1950ల మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'కాంత'. అప్పటి మానవ సంబంధాలు, సామాజిక సంక్లిష్టతలను ఆవిష్కరించే చిత్రం ఇది. ఈ బహు భాషా చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జాను.

సినిమా తీయడం సులభం కాదు

– మంచు మనోజ్


● మనోజ్, రాయలసీమ భరత్

''ఈ రోజుల్లో సినిమా తీయడం అంత సులభం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో ప్యాషన్‌తో 'జగన్నాథ్' చిత్రం తీశారు. కోటి రూపాయలతో తీసిన సినిమా చిన్నది, వెయ్యి కోట్లతో తీసినది పెద్ద చిత్రం అనడానికి లేదు. ఏదైనా సినిమానే. కాకపోతే ఆ సినిమా బాగుందా? బాగాలేదా అనేదే ఉంటుంది'' అని నటుడు మంచు మనోజ్ అన్నారు. రాయలసీమ భరత్, ప్రీతి జంటగా నటించిన చిత్రం 'జగన్నాథ్'. భరత్, సంతోష్ దర్శకత్వంలో పీలం పురుషోత్తం నిర్మించారు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన మంచు మనోజ్ మాట్లాడుతూ– ''భరత్‌కి 'జగన్నాథ్' తొలి సినిమా అయినప్పటికీ ఎంతో ప్రొఫెషనల్‌గా నటించాడు. ఈ మూవీ హిట్ కావాలి'' అన్నారు. రాయలసీమ భరత్ మాట్లాడుతూ– ''సినిమాల మీద ఇష్టంతో ఇండస్ట్రీకి వచ్చాను. ఐదేళ్లు కష్టపడి 'జగన్నాథ్' చిత్రం పూర్తి చేశాం. మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం–నేపథ్య సంగీతం: శేఖర్ మోపూరి.

ఎమోషన్... థ్రిల్


● పూర్ణ, త్రిగుణ్

''ప్రస్తుతం థ్రిల్లర్ నేపథ్యంలో వస్తున్న చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ముఖ్యంగా యువత బాగా చూస్తున్నారు. ఆ నేపథ్యంలో రూపొందిన 'డార్క్ నైట్' చిత్రం టీజర్ బాగుంది'' అని డైరెక్టర్ వీవీ వినాయక్ పేర్కొన్నారు. హీరోయిన్ పూర్ణ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'డార్క్ నైట్'. జీఆర్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ మూవీలో విధార్థ్, త్రిగుణ్ (అదిత్ అరుణ్), సుభాశ్రీ రాయగురు, రమా ఇతర పాత్రలు పోషించారు. పటోళ్ల వెంకట్ రెడ్డి సమర్పణలో సురేష్ రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని వీవీ వినాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ–''మా ప్రాంతం నుంచి వచ్చిన సురేష్ రెడ్డిగారు 'డార్క్ నైట్' చిత్రంతో నిర్మాతగా పరిచయమవడం సంతోషంగా ఉంది. ఈ సినిమా విజయంతో ఆయన మరిన్ని చిత్రాలు తీసి, తెలుగు పరిశ్రమలో ప్రముఖ వ్యక్తిగా నిలబడాలని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఎమోషనల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'డార్క్ నైట్'. జీఆర్ ఆదిత్య ఆద్యంతం ఊహించని ట్విస్ట్‌లతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేలా ఈ సినిమాని మలిచాడు. మార్చిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు సురేష్ రెడ్డి కొవ్వూరి. ఈ చిత్రానికి సంగీతం: మిస్కిన్, కెమేరా: కార్తీక్ ముత్తుకుమార్.

దేవి సమస్య ఏంటి?


● అర్చనా అయ్యర్

వెనకాల గుడి, చుట్టూ పక్షులు, ఎర్ర బారిన కళ్లు, విషణ్ణ వదనంతో 'ఈ అమ్మాయికి ఏమైందబ్బా' అనేలా కనిపించింది దేవి. ఇంతకీ ఆమె సమస్య ఏంటి? అనేది 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్' చిత్రంలో చూడాల్సిందే. ఆది సాయి కుమార్ హీరోగా రూపొందుతున్న సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. ఈ చిత్రంలో దేవి అనే ముఖ్య పాత్రలో నటిస్తున్న అర్చనా అయ్యర్ లుక్‌ని విడుదల చేశారు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ''ఈ చిత్రంలో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్ పాత్ర చేస్తున్నారు. సరికొత్త కథ, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

ప్రపంచ క్రికెట్ క్రీడాభిమానులకు

కనువిందైన కానుక

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ది గ్రేటెస్ట్ రైవల్రీ: ఇండియా వర్సెస్ పాకిస్తాన్ సిరీస్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.



భారతదేశంలో సినిమా తరువాత ఏది ఇష్టం అంటే సగటు భారతీయుడు ఠక్కున చెప్పేది క్రికెట్ అనే. నాటి రేడియో రోజుల నుండి నేటి డిజిటల్ ప్రొజెక్షన్ రోజుల వరకు ఎదుగుతున్న సాంకేతికత కన్నా మెరుపు వేగంలో ఎదుగుతోంది ఈ క్రికెట్ అభిమానం. మరీ ముఖ్యంగా ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్ అంటే దేశం మొత్తానికి ఆ రోజు అప్రకటిత సెలవు లాంటిది. దాయాదుల పోరు అని చాలామంది ముద్దుగా పిలుచుకునే ఈ మ్యాచ్ ఎప్పుడు ఎక్కడ జరిగినా ప్రపంచం నలుమూలల నుండి ఆకాశమంత ఆదరణ ఉంటుంది. ఈ క్రమంలోనే నెట్‌ఫ్లిక్స్ ఇరు దేశాల క్రికెట్ ఆటపై 'ది గ్రేటెస్ట్ రైవల్రీ: ఇండియా వర్సెస్ పాకిస్తాన్' అనే సిరీస్ రూపొందించింది. నాలుగు భాగాలతో ఉన్న ఈ సిరీస్‌లో భారతదేశం సాధించిన నాటి ప్రపంచ కప్ నుండి నేటి ప్రపంచ కప్ వరకు ప్రతిదీ విశ్లేషించిన ప్రయత్నం అత్యంత ప్రశంసనీయం. సిరీస్‌లో పత్రికా విలేకరుల నుండి పరోక్ష, ప్రత్యక్ష ఆటగాళ్లతో వివరించిన విధానం ఓ అద్భుతమనే చెప్పాలి. ఈ సిరీస్ ద్వారా ప్రపంచ క్రికెట్ క్రీడాభిమానులకు ఎన్నో వివరణలు, విశ్లేషణలు, రహస్యాలు దృశ్య రూపంలో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్ జరిగితే ఎంత ఉత్కంఠగా ఉంటుందో అంతకు వేయి రెట్లు ఉత్కంఠ, ఉత్సాహం ఈ సిరీస్ చూస్తున్నంతసేపు ప్రేక్షకులకు కలుగుతుందనడంలో సందేహమే లేదు. క్రికెట్ మ్యాచ్ టీవీలలో ప్రసారమనేది మామూలే కానీ, అదే క్రికెట్ వెనుక జరిగిన తతంగం చూపడమనేది వంద క్రికెట్ మ్యాచులు ఒకేసారి చూడడం లాంటిది. ఓటీటీ వేదికైన నెట్‌ఫ్లిక్స్ ఈ విషయంలో మాత్రం ప్రేక్షకుల నాడి సరిగ్గా పట్టుకుంది. ఈ సిరీస్ మొత్తం తెలుగులోనూ లభ్యం. కాబట్టి కాసేపు ఈ క్రికెట్ రైవల్రీ ఏంటో చూసేయండి.

– ఇంటూరు హరికృష్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	200	75,939
నిఫ్టీ ▽	102	22,929

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,952	△ 7
డోజోన్స్	44,589	▽ 122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,732	▽ 32
డాక్స్	22,483	▽ 130
షాంఘై	3,346	△ 14
నికాయ్	39,149	▽ 496

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	85,998	△ 250
బంగారం (99.5 స్వచ్ఛత)	85,654	△ 249
వెండి (కిలో)	97,953	△ 2,404

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.99	88.67
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	107.01	111.94
€	యూరో	ఒకటి	88.90	93.31
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	46.00	67.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.77	57.57
S$	సింగపూర్ డాలర్	ఘామపనకర	62.50	67.15
SAR	సౌదీ రియాల్	ఘామపనకర	22.25	23.81
UAE D	యూఏఈ దిర్హామ్	ఘామపనకర	22.75	24.53
¥	చైనా యువాన్	ఘామపనకర	11.07	12.90



కార్పొరేట్లకు.. రూపాయి టెన్షన్

కరెన్సీ విలువ క్షీణతపై ఆందోళన | గుదిబండగా విదేశీ వాణిజ్య రుణాలు | గత అప్పులకు అధికంగా చెల్లించాల్సి రావడమే కారణం

రూపాయి పతనంతో ధరలు పెరిగిపోయి సామాన్యులు పడే కష్టాలు అటుంచితే కార్పొరేట్లకు కూడా టెన్షన్ తప్పట్లేదు. ముఖ్యంగా విదేశీ వాణిజ్య రుణాలు (ఈసీబీ) తీసుకున్న కంపెనీలకు పెద్ద చిక్కే వచ్చిపడింది. గత రుణాలను తీర్చేందుకు మరింత ఎక్కువగా చెల్లించాల్సి రానుండటమే ఇందుకు కారణం. సాధారణంగా కార్పొరేట్లు తమ వ్యాపార అవసరాల కోసం, దేశీయంగా వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉంటే విదేశీ మార్కెట్ల నుంచి తక్కువ వడ్డీ రేటుపై రుణాలు తీసుకుంటూ ఉంటాయి. చౌకగా వచ్చిన నిధులను వ్యాపార విస్తరణకు లేదా అధిక వడ్డీ రేటు మీద తీసుకున్న రుణాలను తీర్చేసేందుకు ఉపయోగించుకుంటూ ఉంటాయి. గత రెండేళ్లుగా మిగతా కరెన్సీలు ఒడిదుడుకులకు లోనవుతున్నా రూపాయి మాత్రం దాదాపు స్థిర స్థాయిలోనే కొనసాగింది. దీంతో కార్పొరేట్లు గణనీయంగా విదేశీ రుణాలు సమీకరించాయి. ఈ మధ్య సంగతే చూస్తే గతేడాది ఏప్రిల్–నవంబర్ మధ్య కాలంలో నికరంగా 13.5 బిలియన్ డాలర్ల విదేశీ రుణాలు వచ్చినట్లు ఆర్‌బీఐ డేటా చెబుతోంది. గతేడాది నవంబర్‌లో దాదాపు 2.83 బిలియన్ డాలర్ల ఈసీబీలను సమీకరించే ప్రతిపాదనలను కంపెనీలు సమర్పించాయి. రూపాయి విలువ పడిపోకుండా, స్థిరంగా ఉన్నన్నాళ్లూ విదేశీ రుణాల వ్యవహారం బాగానే ఉంటోంది. కానీ ఎక్కడా ఆగకుండా పడిపోతుంటేనే సమస్యాత్మకంగా మారుతోంది. ''ఆర్‌బీఐ లెక్కలను బట్టి చూస్తే రూపాయి వేల్యుయేషన్ ఇప్పటికే అధిక స్థాయిలో ఉంది. దాని విలువ ఇంకా తగ్గాల్సి ఉంది. అమెరికా టారిఫ్‌లు విధిస్తే మరింతగా పడే అవకాశం ఉంది'' అంటూ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఇటీవల ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీన్ని బట్టి చూస్తే కార్పొరేట్లకు రూపాయి బాధ ఇంకా తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి.

లాభాలపైనా..

సాధారణంగా విమానయాన సంస్థలు ఎయిర్‌క్రాఫ్ట్‌ల లీజింగ్‌లు, ఇంధన కొనుగోళ్లు, ఇతరత్రా ఖర్చులను డాలర్ల మారకంలో నిర్వహిస్తుంటాయి. ఈ నేపథ్యంలో రూపాయి పతనంతో ఎయిర్‌లైన్స్ ఖర్చులూ పెరిగిపోయి లాభాల మార్జిన్లు తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు ఇండిగోను తీసుకుంటే ఇటీవలి మూడో త్రైమాసికంలో లాభం ఏకంగా 18 శాతం పడిపోయింది. రూపాయి క్షీణతతో విదేశీ టూర్లు మరింత భారంగా మారే అవకాశం ఉండటంతో ప్రయాణాలను వాయిదా లేదా రద్దు చేసుకునే అవకాశాలు ఉండటంతో టూరిజం, హాస్పిటాలిటీ లాంటి రంగాల మీద కూడా పడొచ్చని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. అలాగే దిగుమతులపైన ఆధారపడిన లేక గణనీయంగా విదేశీ కరెన్సీలో రుణభారం ఉన్న రంగాల విషయంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

హెడ్జింగ్ అంతంతే..

విదేశీ రుణాలు తీసుకున్నప్పుడు రూపాయి పడిపోతే నష్టపోకుండా ఉండేందుకు, తిరిగి చెల్లించేటప్పుడు ఎక్కువ భారం పడకుండా ఉండేందుకు కంపెనీలు హెడ్జింగ్ వ్యూహాన్ని పాటిస్తుంటాయి. సుమారు గత మూడేళ్లుగా భారీగా విదేశీ నిధులు సమీకరించినవి, సమీకరించడంపై కసరత్తు చేస్తున్న వాటిలో ఆర్‌ఈసీ (500 మిలియన్ డాలర్లు), టాటా మోటార్స్ ఫైనాన్స్ (200 మిలియన్ డాలర్లు), ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ (125 మిలియన్ డాలర్లు), టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్‌తో పాటు (100 మిలియన్ డాలర్లు) బజాజ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మొదలైనవి ఉన్నాయి. అయితే, దేశీ కంపెనీలు తీసుకున్న ఈసీబీల్లో దాదాపు మూడో వంతు రుణాలకు హెడ్జింగ్ రక్షణ లేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, 2023–24లో దాదాపు 38.4 బిలియన్ డాలర్ల రుణాలు రాగా ఇందులో సుమారు 11.52 బిలియన్ డాలర్ల మొత్తానికి హెడ్జింగ్ రక్షణ లేదు. ఇలా హెడ్జింగ్ చేసుకోని కంపెనీలన్నింటికీ ప్రస్తుత రూపాయి పతనం సమస్యగా మారినట్లు పేర్కొన్నాయి. ఇటీవలి ఆర్‌బీఐ స్టేట్ ఆఫ్ ది ఎకానమీ నివేదిక ప్రకారం 2024 ఏప్రిల్–నవంబర్ మధ్య కాలంలో సమీకరించిన మొత్తం ఈసీబీల్లో 40 శాతాన్నే పెట్టుబడి వ్యయాల కోసం కంపెనీలు ఉపయోగించుకున్నాయి. అంటే మిగతా 60 శాతాన్ని ఖరీదైన ఇతరత్రా రుణాలను తీర్చేందుకు ఉపయోగించుకుని ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భారం ఇలా..

2020లో భారత్, అమెరికాలో వడ్డీ రేట్ల మధ్య దాదాపు అయిదు శాతం వ్యత్యాసం ఉన్న తరుణంలో రూపాయి మారకంలో కన్నా విదేశీ మారకంలో రుణాలు తీసుకోవడం చాలా ఆకర్షణీయంగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అవే రుణాలు ఇప్పుడు గుదిబండలుగా మారుతున్నాయి. అప్పట్లో గానీ రూ. 2,000 కోట్లు విదేశీ రుణం తీసుకుని ఉంటే పెరిగిన వడ్డీ భారంతో పాటు రూపాయి కూడా క్షీణించడం వల్ల 22 శాతం అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఉదాహరణకు డాలరు విలువ రూ. 75గా ఉన్నప్పుడు 500 మిలియన్ డాలర్లు రుణం తీసుకుని ఉంటే, దేశీ కరెన్సీ విలువ 5 శాతం క్షీణించిన పక్షంలో అదనంగా రూ. 2,500 కోట్ల భారం పడుతుందని సీఆర్ ఫారెక్స్ అడ్వైజర్స్ ఎండీ అమిత్ పాబ్రి తెలిపారు. ఇలా ఒకవైపు అమెరికాలో వడ్డీ రేట్లు పెరగడంతో పాటు, రూపాయి బలహీనపడిపోవడం వల్ల విదేశీ రుణాలను తీర్చడం భారంగా మారుతోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

లవ్ యూ.. బంగారం!



ఒక్కరోజే రూ.1,300 జంప్
ఢిల్లీలో రూ.89,400
వెండి @ రూ.లక్ష

న్యూఢిల్లీ: పసిడి ధరలు టాప్ గేర్‌లో పరుగెడుతున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో జ్యుయలర్లు, రిటైల్ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ముందుకు రావడంతో ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.1,300 పెరిగి ఆల్‌టైమ్ గరిష్టం రూ.89,400కు చేరుకుంది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం ఇంతే మేర పెరిగి రూ.89,000 వద్ద ముగిసింది. వెండి సైతం కొనుగోళ్ల మద్దతుతో కిలోకి రూ.2,000 లాభపడి రూ.లక్ష మార్క్‌ను మరోసారి చేరుకుంది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌లో ఏప్రిల్ డెలివరీ 10 గ్రాముల బంగారం కాంట్రాక్ట్ ధర రూ.184 పెరిగి రూ.85,993కి చేరగా.. వెండి ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రూ.2,517 (2.64 శాతం) లాభపడి రూ.97,750 స్థాయిని అందుకుంది. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఆరు డాలర్లకు పైగా లాభపడి 2,952 డాలర్లను సమీపించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటనతో అంతర్జాతీయ వాణిజ్యంపై అనిశ్చితి నెలకొన్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వరుసగా ఏడో వారంలో బంగారంలో అప్‌ట్రెండ్ కొనసాగినట్టు కోటక్ సెక్యూరిటీస్ తెలిపింది.

నెలన్నరలో రూ. 11,400 అప్

ఈ ఏడాది జనవరి 1న బంగారం 10 గ్రాముల ధర రూ.78,000 వద్ద ఉంది. కేవలం నెలన్నర రోజుల్లోనే రూ.11,400 ర్యాలీ చేయడం గమనార్హం. ఇదే కాలంలో ఈక్విటీలు నష్టాలు మిగిల్చితే.. పసిడి 14.6 శాతం రాబడిని ఇచ్చింది. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే, అతి సమీపంలోనే పసిడి రూ.లక్ష మార్క్‌ను చేరుకున్నా ఆశ్చర్యం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

23,000 దిగువకు నిఫ్టీ

8వ రోజూ మార్కెట్ నేలచూపులు



ముంబై: దేశీయంగా కార్పొరేట్ కంపెనీల ఫలితాలు నిరాశపరచడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో స్టాక్ సూచీలు ఎనిమిదో రోజూ నేలచూపులు చూశాయి. ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటన ఇన్వెస్టర్లను కలవరపరిచింది. ఐటీ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో శుక్రవారం సెన్సెక్స్ 200 పాయింట్లు నష్టపోయి 75,939 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102 పతనమై 22,929 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 699 పాయింట్లు క్షీణించి 75,440 వద్ద, నిఫ్టీ 256 పాయింట్లు కోల్పోయి 22,775 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి.

- సూచీల వారీగా సర్వీసెస్, ఇండస్ట్రియల్, క్యాపిటల్ గూడ్స్ సూచీలు 3% క్షీణించాయి. విద్యుత్, యుటిలిటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ ఇండెక్సులు 2.50%, కమోడిటీస్, రియల్టీ సూచీలు రెండుశాతం నష్టపోయాయి.
- అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో చిన్న, మధ్య తరహా షేర్లు కుప్పకూలాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3.6% పతనమై 45,411 వద్ద, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.5% క్షీణించి 39,732 వద్ద ముగిశాయి. డిసెంబర్ జీవితకాల గరిష్టం నుంచి బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 21%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 20% క్షీణించాయి.

8 రోజులు.. రూ.25.31 లక్షల కోట్లు ఆవిరి

మార్కెట్ వరుస పతనంతో గత 8 రోజుల్లో రూ.25.31 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.400 లక్షల కోట్లకు దిగివచ్చింది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
భారత ఫార్మాకు కొత్త అవకాశాలు | శాంతించిన కూరగాయలు, ఆహార ధరలు

బీఎస్‌ఎన్‌ఎల్ లాభాల సిగ్నల్

క్యూ3లో రూ. 262 కోట్లు

న్యూఢిల్లీ: టెలికం రంగ ప్రభుత్వ దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 262 కోట్ల నికర లాభం ఆర్జించింది. వెరసి సుమారు 17 ఏళ్ల తదుపరి తిరిగి లాభాల్లోకి ప్రవేశించినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలియజేశారు. ఇది ప్రస్తావించదగ్గ కీలక మలుపు అంటూ వ్యాఖ్యానించారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఇంతక్రితం 2007లో మాత్రమే త్రైమాసికవారీగా లాభాలు ఆర్జించడం గమనార్హం! కంపెనీకిది అతిముఖ్యమైన రోజుగా సింధియా పేర్కొన్నారు. కంపెనీ కొంతకాలంగా సర్వీసులను విస్తరించడంతోపాటు వినియోగదారులను పెంచుకోవడంపై దృష్టిపెట్టిన సంగతి తెలిసిందే. కాగా.. బీఎస్‌ఎన్‌ఎల్ మొబిలిటీ, ఫైబర్ టు హోమ్(ఎఫ్‌టీటీహెచ్), లీజ్‌డ్ లైన్ సర్వీసులలో 14–18 శాతం వృద్ధిని సాధించినట్లు సింధియా తెలిపారు. మరోవైపు సబ్‌స్క్రయిబర్ల సంఖ్య సైతం 2024 డిసెంబర్‌లో 9 కోట్లకు ఎగసినట్లు వెల్లడించారు. జూన్‌లో ఈ సంఖ్య 8.4 కోట్లు మాత్రమే.

ఆరేళ్లలో వేకా రూ. 100 కోట్ల పెట్టుబడులు



అశ్విన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తలుపులు, కిటికీలకి సంబంధించిన యూపీవీసీ ప్రొఫైల్స్ తయారీ సంస్థ వేకా వచ్చే ఆరేళ్లలో కార్యకలాపాల విస్తరణపై రూ. 100 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది రూ. 16 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఎన్‌సీఎల్–వేకాలో 100 శాతం వాటాలను కొనుగోలు చేసి కంపెనీని టేకోవర్ చేసిన సందర్భంగా వేకా ఏజీ జర్మనీ సీఈవో ఆండ్రియాస్ హార్ట్‌లీఫ్ ఈ విషయాలు తెలిపారు. జేవీలో వేకాకు గతంలో 50 శాతం వాటాలు ఉండగా, తాజాగా ఎన్‌సీఎల్ నుంచి మరో 50 శాతాన్ని కొనుగోలు చేసింది. టేకోవర్‌తో ప్రస్తుతం ఎన్‌సీఎల్ వేకా చైర్మన్‌గా ఉన్న అశ్విన్ దాట్ల ఇకపై డైరెక్టరుగా కొనసాగనుండగా, ఎండీగా యూఎస్ మూర్తి కొనసాగుతారు. ప్రణాళికల్లో భాగంగా వేకా ప్రధానంగా ఎక్స్‌ట్రూషన్‌పైన, ఎన్‌సీఎల్.. ఫ్యాబ్రికేషన్‌పైనా దృష్టి పెట్టనున్నట్లు ఈ సందర్భంగా అశ్విన్ వివరించారు. కంపెనీకి ప్రస్తుతం హైదరాబాద్‌లో 28 లైన్లతో ఒక ఎక్స్‌ట్రూషన్ ప్లాంటు, బెంగళూరులో ఫ్యాబ్రికేషన్ ప్లాంటు ఉన్నట్లు చెప్పారు. కంపెనీ గతేడాది రూ. 442 కోట్ల ఆదాయం ఆర్జించగా, 15 శాతం వార్షిక వృద్ధి అంచనా వేస్తున్నట్లు మూర్తి తెలిపారు.

విజేత జట్టుకు రూ. 19 కోట్ల 41 లక్షలు

చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ వివరాలు వెల్లడించిన ఐసీసీ



దుబాయ్: ఎనిమిదేళ్ల తర్వాత పునరాగమనం చేస్తున్న చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన ప్రైజ్‌మనీ వివరాలను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వెల్లడించింది. ఈనెల 19 నుంచి మార్చి 9వ తేదీ వరకు పాకిస్తాన్, యూఏఈలలో ఎనిమిది జట్ల మధ్య జరిగే చాంపియన్స్ ట్రోఫీకి మొత్తం 69 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ కేటాయించారు. 2017తో పోలిస్తే మొత్తం ప్రైజ్‌మనీలో 53 శాతం పెరుగుదల ఉందని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. చివరిసారి చాంపియన్స్ ట్రోఫీ 2017లో ఇంగ్లండ్‌లో జరగ్గా... పాకిస్తాన్ జట్టు విజేతగా నిలిచింది.

- 2025 చాంపియన్స్ ట్రోఫీలో విజేత జట్టుకు 22 లక్షల 40 వేల డాలర్లు (రూ. 19 కోట్ల 41 లక్షలు)... రన్నరప్ జట్టుకు 11 లక్షల 20 వేల డాలర్లు (రూ. 9 కోట్ల 70 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. సెమీ ఫైనల్లో ఓడిన రెండు జట్లకు 5 లక్షల 60 వేల డాలర్ల చొప్పున (రూ. 4 కోట్ల 85 లక్షలు) అందజేస్తారు.
- ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన జట్లకు 3 లక్షల 50 వేల డాలర్ల (రూ. 3 కోట్ల 3 లక్షలు) చొప్పన ప్రైజ్‌మనీ దక్కుతుంది. ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచిన జట్లకు 1 లక్ష 40 వేల డాలర్ల (రూ. 1 కోటీ 21 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభిస్తుంది.
- గ్రూప్ దశలో గెలిచిన ప్రతి మ్యాచ్‌కూ ఆయా జట్లు 34 వేల డాలర్ల (రూ. 29 లక్షల 46 వేలు) చొప్పున అందుకుంటాయి.
- ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటున్నందుకుగాను పార్టిసిపేషన్ ఫీజు కింద ఎనిమిది జట్లకు 1 లక్ష 25 వేల డాలర్ల (రూ. 1 కోటీ 8 లక్షలు) చొప్పున ఐసీసీ అందజేస్తుంది.
- 1996లో వన్డే ప్రపంచకప్ టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన తర్వాత... ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీ రూపంలో పాకిస్తాన్ మరో ఐసీసీ మెగా ఈవెంట్‌కు వేదికగా నిలువనుంది.
- భారత జట్టు తమ మ్యాచ్‌లను తటస్థ వేదిక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్‌లో ఆడుతుంది. పాకిస్తాన్ అంచె టోర్నీ మ్యాచ్‌లు కరాచీ, లాహోర్, రావల్పిండిలో నిర్వహిస్తారు.
- గ్రూప్ 'ఎ'లో భాగంగా భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఈనెల 20న బంగ్లాదేశ్‌తో ఆడుతుంది. ఆ తర్వాత టీమిండియా 23న పాకిస్తాన్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో తలపడుతుంది. గ్రూప్ 'బి'లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ జట్లున్నాయి. భారత్ సెమీఫైనల్, ఫైనల్ చేరుకుంటే ఈ రెండు మ్యాచ్‌లు కూడా దుబాయ్‌లోనే జరుగుతాయి. ఒకవేళ భారత్ ఫైనల్ చేరుకోకపోతే ఫైనల్ పాకిస్తాన్‌లో నిర్వహిస్తారు.

జాతీయ క్రీడల్లో 'టాప్' సర్వీసెస్



డెహ్రాడూన్: మరోసారి తమ ఆధిపత్యం చాటుకుంటూ సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్‌ఎస్‌సీబీ) 38వ జాతీయ క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం ముగిసిన ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో సర్వీసెస్ 68 స్వర్ణాలు, 26 రజతాలు, 27 కాంస్యాలతో కలిపి మొత్తం 121 పతకాలతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. గత ఆరు జాతీయ క్రీడల్లో ఐదుసార్లు (2007, 2011, 2015, 2022, 2025) సర్వీసెస్ పతకాల పట్టికలో 'టాప్ ర్యాంక్'ను సాధించడం విశేషం. గోవా ఆతిథ్యమిచ్చిన 2023 జాతీయ క్రీడల్లో మహారాష్ట్ర జట్టు పతకాల పట్టికలో నంబర్‌వన్‌గా నిలిచింది. ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ 14 పతకాలతో (7 స్వర్ణాలు, 1 రజతం, 6 కాంస్యాలు) 18వ స్థానంలో... తెలంగాణ 18 పతకాలతో (3 స్వర్ణాలు, 3 రజతాలు, 12 కాంస్యాలు) 26వ స్థానంలో నిలిచాయి. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్‌లను ఖరారు చేశారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా సర్వీసెస్ జట్టుకు 'రాజా భలీంద్ర సింగ్ ట్రోఫీ'ని అందజేశారు. తదుపరి జాతీయ క్రీడలు 2027లో మేఘాలయలో నిర్వహిస్తారు.

'రాయల్' విజయంతో మొదలు



రిచా ఘోష్

'పరుగుల వరద ఖాయం'... టాస్ సమయంలో విశ్లేషకురాలు మిథాలీరాజ్ చేసిన వ్యాఖ్య ఇది. ఆమె చెప్పినట్లుగానే డబ్ల్యూపీఎల్ తొలి పోరులో 400కు పైగా పరుగులు నమోదయ్యాయి. ఇరు జట్లూ భారీ షాట్లతో విరుచుకుపడి పూర్తి వినోదాన్ని పంచాయి. ముందుగా ఆష్లీ గార్డ్‌నర్, బెత్ మూనీ మెరుపులు గుజరాత్‌కు భారీ స్కోరును అందిస్తే రిచా ఘోష్, ఎలైస్ పెరీ తమ ఆటతో అదరగొట్టారు. ఫలితంగా లీగ్‌లో అత్యధిక పరుగుల ఛేదనతో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) శుభారంభం చేసింది.

తొలి పోరులో బెంగళూరు మెరుపు గెలుపు

- 6 వికెట్లతో గుజరాత్ జెయింట్స్ పరాజయం
- ఆర్‌సీబీని గెలిపించిన రిచా, పెరీ
- గార్డ్‌నర్ ప్రదర్శన వృథా

వడోదర: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) సీజన్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు రికార్డు లక్ష్య ఛేదనతో ఘనంగా ప్రారంభించింది. శుక్రవారం జరిగిన తొలి పోరులో ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్ జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ (37 బంతుల్లో 79 నాటౌట్; 3 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా, బెత్ మూనీ (42 బంతుల్లో 56; 8 ఫోర్లు) కూడా అర్ధసెంచరీ సాధించింది. అనంతరం బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 202 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిచా ఘోష్ (27 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఎలైస్ పెరీ (34 బంతుల్లో 57; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు చేయగా, కనిక ఆహుజా (13 బంతుల్లో 30 నాటౌట్; 4 ఫోర్లు) రాణించింది. రిచా, కనిక ఐదో వికెట్‌కు 37 బంతుల్లోనే అభేద్యంగా 93 పరుగులు జత చేశారు.

సిక్స్‌ల జోరు...



ఆష్లీ గార్డ్‌నర్

ఓపెనర్ మూనీ ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించినా... మరో ఎండ్‌లో 6 పరుగుల వ్యవధిలో వోల్‌వార్ట్ (6), హేమలత (4) వెనుదిరిగారు. అయితే మూనీ దూకుడు కొనసాగించింది. వేర్‌హామ్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదిన ఆమె 37 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. మూనీ వెనుదిరిగిన తర్వాత గార్డ్‌నర్ విధ్వంసం మొదలైంది. ప్రేమ ఓవర్లో ఆమె వరుసగా మూడు సిక్స్‌లు బాదింది. డియాండ్రా డాటిన్ (13 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా జోరు ప్రదర్శించడంతో గుజరాత్ స్కోరు దూసుకుపోయింది. 25 బంతుల్లోనే గార్డ్‌నర్ హాఫ్ సెంచరీని అందుకుంది. జోషిత వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్లో కూడా గార్డ్‌నర్ 3 సిక్స్‌లతో చెలరేగింది. చివరి రెండు బంతుల్లో హర్లీన్ 2 ఫోర్లు బాది స్కోరును 200 దాటించింది.

కీలక భాగస్వామ్యం...

భారీ లక్ష్య ఛేదనలో 14 పరుగులకే తొలి 2 వికెట్లు కోల్పోయి ఆర్‌సీబీ ఇబ్బందుల్లో పడింది. ఒకే ఓవర్లో కెప్టెన్ స్మృతి మంధాన (9), డానీ వ్యాట్ (4)లను గార్డ్‌నర్ వెనక్కి పంపించింది. ఈ దశలో పెరీ, రాఘ్వీ బిష్త్ (27 బంతుల్లో 25; 3 ఫోర్లు) భాగస్వామ్యంతో జట్టు కోలుకుంది. ముఖ్యంగా పెరీ తన అనుభవంతో కొన్ని చక్కటి షాట్లు ఆడగా, తొలి డబ్ల్యూపీఎల్ మ్యాచ్ ఆడుతున్న రాఘ్వీ అండగా నిలిచింది. 19 పరుగుల వద్ద హర్లీన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన పెరీ 27 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించింది. మూడో వికెట్‌కు 55 బంతుల్లో 86 పరుగులు జోడించిన పెరీ, రాఘ్వీ తక్కువ వ్యవధిలో అవుటయ్యారు. బెంగళూరు విజయం కోసం 46 బంతుల్లో 93 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో గుజరాత్‌దే పైచేయిగా కనిపించింది. కానీ రిచా, కనిక భాగస్వామ్యం అసాధారణ ఆటతో జట్టును గెలిపించింది. '0' వద్ద రిచా ఇచ్చిన క్యాచ్‌ను సిమ్రన్ వదిలేయడం కూడా బెంగళూరు జట్టుకు కలిసొచ్చింది.



ఎలైస్ పెరీ

ఒకే ఓవర్లో 23 పరుగులు...


ఆర్‌సీబీ 30 బంతుల్లో 63 పరుగులు చేయాల్సి ఉండగా గార్డ్‌నర్ వేసిన 16వ ఓవర్ ఆటను పూర్తిగా మలుపు తిప్పింది. ఈ ఓవర్లో రిచా ఏకంగా 4 ఫోర్లు, 1 సిక్స్ బాదడంతో మొత్తం 23 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత ప్రియ ఓవర్లో కూడా 2 ఫోర్లు, 1 సిక్స్ కొట్టిన రిచా 23 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించింది. అనంతరం డాటిన్ బౌలింగ్‌లో మరో సిక్స్‌తో రిచా మ్యాచ్‌ను ముగించడం విశేషం.

స్కోరు వివరాలు

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: మూనీ (సి) స్మృతి (బి) ప్రేమ 56; వోల్‌వార్ట్ (బి) రేణుక 6; హేమలత (సి) ప్రేమ (బి) కనిక 4; ఆష్లీ గార్డ్‌నర్ (నాటౌట్) 79; డాటిన్ (సి) వ్యాట్ (బి) రేణుక 25; సిమ్రన్ (బి) వేర్‌హామ్ 11; హర్లీన్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1–35, 2–41, 3–85, 4–152, 5–182. **బౌలింగ్:** రేణుక 4–0–25–2, కిమ్ గార్త్ 4–0–34–0, జోషిత 4–0–43–0, కనిక 3–0–19–1, వేర్‌హామ్ 3–0–50–1, ప్రేమ 2–0–26–1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (ఎల్బీ) (బి) గార్డ్‌నర్ 9; డానీ వ్యాట్ (బి) గార్డ్‌నర్ 4; పెరీ (సి) వోల్‌వార్ట్ (బి) సయాలీ 57; రాఘ్వీ (సి) సయాలీ (బి) డాటిన్ 25; రిచా ఘోష్ (నాటౌట్) 64; కనిక (నాటౌట్) 30; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (18.3 ఓవర్లలో 4 వికెట్లకు) 202. వికెట్ల పతనం:** 1–13, 2–14, 3–100, 4–109. **బౌలింగ్:** కాశ్వీ 2–0–22–0, గార్డ్‌నర్ 3–0–33–2, డాటిన్ 3.3–0–41–1, తనూజ 3–0–29–0, సయాలీ 4–0–44–1, ప్రియ 3–0–29–0.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో



3 హత్యలు ఇద్దరు నిందితులు 1 ఏఐ

19 ఏళ్ల మర్డర్ మిస్టరీకి ముగింపు పలికిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

కేరళలో కోల్డ్ కేసును ఛేదించిన కృత్రిమ మేధ

1992లో వచ్చిన బ్రహ్మ సినిమా చూశారా? అందులో హీరోకి చిన్నప్పటి ఫొటో ఇస్తే.. పెద్దయ్యాక ఎలా ఉంటారో బొమ్మ గీసి ఇచ్చేస్తాడు. విలన్లు ఓ అమ్మాయిని చంపడం కోసం ఆమె చిన్ననాటి ఫొటో ఇచ్చి.. పెద్దయ్యాక ఎలా ఉంటుందో గీసి ఇవ్వాలని కోరతారు.. అయితే, హీరో ఆమె బొమ్మ కాకుండా చనిపోయిన తన భార్య బొమ్మ గీసి ఆ అమ్మాయిని కాపాడతాడు. అది ఆ సినిమా కథ.. ఇప్పుడు ఇలాంటి పనులకు ఆ బ్రహ్మ అవసరం లేదు. కొత్తగా వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ).. అంతకంటే ఎక్కువ పనులే చేస్తోంది. దైనందిన జీవితంలోనే కాదు.. నేర పరిశోధనలోనూ కీలకపాత్ర పోషిస్తోంది. పోలీసులకు సవాల్‌గా నిలిచిన కేసుల చిక్కుముళ్లను సునాయాసంగా విప్పి.. నేరస్తులను కటకటాల వెనక్కి నెడుతోంది. కేరళలో 19 ఏళ్లుగా మూలన పడి ఉన్న కేసును ఈ అభినవ బ్రహ్మ సునాయాసంగా ఛేదించింది.

..: సాక్షి సెంట్రల్ డెస్క్ :..



రంజని



దివిల్, రాజేశ్

19 ఏళ్ల క్రితం..

అది కేరళ కొల్లాం జిల్లాలోని అంచల్ పట్టణం.. 2006 ఫిబ్రవరి 10 సాయంత్రం ఆరు గంటలు.. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పనిచేసే శాంతమ్మ అప్పుడే ఇంటికొచ్చి లోపలకు వెళ్లారు. అంతే.. ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. గది మొత్తం రక్తసిక్తంగా కనిపించింది. తన ఒక్కగానొక్క కుమార్తె, రంజని, ఆమె 17 రోజుల కవలు పిల్లలు రక్తపు మడుగులో విగతజీవులుగా పడి ఉన్నారు. ఎవరో వారు ముగ్గురినీ అత్యంత పాశవికంగా గొంతు కోసి చంపేశారు. 17 రోజుల పసిపిల్లలనే కనికరం లేకుండా దారుణానికి తెగబడ్డారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. అక్కడ లభించిన ద్విచక్ర వాహనం ఆధారంగా ఆర్మీలో పనిచేస్తున్న దివిల్, రాజేశ్ ఈ హత్యలకు కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కానీ ఎంతగా గాలించినా వారి ఆచూకీ దొరకలేదు. 2010లో ఈ కేసు సీబీఐకి బదిలీ అయింది. అయినా నిందితుల జాడ తెలియలేదు.

ఏఐ రాకతో..

ప్రస్తుతం నేరపరిశోధనలోనూ ఏఐ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో రంజని, ఆమె పిల్లల హత్య కేసును ఏఐ సాయంతో పరిష్కరించాలనే ఆలోచనతో దర్యాప్తు అధికారులు మళ్లీ రంగంలోకి దిగారు. ఇప్పటికే ఈ ఘటన జరిగి 19 ఏళ్లు పూర్తయింది. తమ దగ్గర ఉన్న ఆధారం రాజేశ్ ఫొటో ఒక్కటే. అది కూడా 19 ఏళ్ల క్రితం నాటిది. ఆ ఫొటో సాయంతో అతడిని పట్టుకోవడం ఎలా అని ఆలోచించిన అధికారులకు ఓ ఐడియా వచ్చింది. వెంటనే రాజేశ్ పాత ఫొటోను ఉపయోగించి.. అతడు 19 ఏళ్ల తర్వాత ఎలా ఉంటాడో ఏఐ సాయంతో ఓ ఫొటో సృష్టించారు. అనంతరం వివిధ సామాజిక మాధ్యమాల్లో ఉన్న లక్షలాది ఫొటోలను ఏఐను ఉపయోగించి జల్లెడ పట్టగా.. ఓ పెళ్లి ఫొటోలో ఉన్న వ్యక్తి 90 శాతం మేర మ్యాచ్ అయ్యాడు. వెంటనే వివరాలు సేకరించిన దర్యాప్తు అధికారులు పుదుచ్చేరి వెళ్లి రాజేశ్‌ను, అతడి ద్వారా దివిల్‌ను గుర్తించి అరెస్టు చేశారు.

ఇంతకీ ఏం జరిగింది?

ఒకే గ్రామానికి చెందిన రంజని, దివిల్ ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో ఆమె గర్భవతి అయింది. దీంతో దివిల్ ఆమెకు దూరంగా ఉండటం ప్రారంభించాడు. 2006 జనవరిలో ఆమె కవల పిల్లలకు జన్మనిచ్చింది. తనను మోసం చేసిన దివిల్ పై న్యాయపోరాటానికి సిద్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న దివిల్.. రంజని అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నాడు. ఇందుకోసం ఆర్మీలోనే తనతో పనిచేస్తున్న రాజేశ్ సహాయం కోరాడు. వారి పథకంలో భాగంగా రాజేశ్ అంచల్ వచ్చి.. తనను అనిల్ కుమార్‌గా రంజనికి పరిచయం చేసుకున్నాడు. దివిల్‌పై పోరులో సహకరిస్తానని నమ్మబలికాడు. ఈ నేపథ్యంలో తన పిల్లలకు తండ్రి దివిల్ అని.. అతడికి డీఎన్ఏ పరీక్షలు చేయించాలని కేరళ మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన రంజని.. ఆ మేరకు ఉత్తర్వులు పొందింది. దీంతో సాధ్యమైనంత త్వరగా రంజనిని అంతం చేయాలని దివిల్, రాజేశ్ నిర్ణయానికి వచ్చారు. ఫిబ్రవరి 10న రంజని ఇంటికి వచ్చిన రాజేశ్.. పిల్లల పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పి శాంతమ్మను పంచాయతీ ఆఫీసుకు పంపించాడు. ఆమె వెళ్లిన వెంటనే రంజనిని గొంతు కోసి చంపేశాడు. తర్వాత 17 రోజుల ఇద్దరు పసికందులను కూడా అలాగే చంపి, అక్కడ నుంచి జారుకున్నాడు. తర్వాత ఇరువురూ ఏమీ తెలియనట్టుగా పఠాన్ కోట్‌లోని ఆర్మీ బేస్ క్యాంపునకు వెళ్లిపోయారు. దర్యాప్తులో భాగంగా వీరిని నిందితులుగా గుర్తించిన పోలీసులు పఠాన్ కోట్ ఆర్మీ బేస్ కు వెళ్లారు. అయితే, అప్పటికే ఇరువురూ అక్కడ నుంచి పరారయ్యారు. అక్కడ నుంచి పుదుచ్చేరి వెళ్లిపోయి విష్ణు, ప్రవీణ్ కుమార్ అనే తప్పుడు పేర్లతో ఇంటీరియర్ డిజైనర్లుగా అవతారమెత్తారు. ఈ క్రమంలో ఓ వివాహ వేడుకలో తీసిన ఫొటోలో ఉన్న రాజేశ్‌ను ఏఐ గుర్తించడంతో ఇరువురూ కటకటాల వెనక్కి వెళ్లారు.



మహాకుంభ సంప్రోక్షణకు ఏర్పాట్లు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు మహాకుంభ సంప్రోక్షణ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కొండ కింద స్వామి వారి ఫొటో ఫ్రేమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

నాగ్‌పూర్ వందేభారత్‌కు ఇక 8 కోచ్‌లే

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు ప్రవేశపెట్టిన వందేభారత్ రైలు కోచ్‌లను తగ్గించనున్నారు. ప్రస్తుతం 18 చైర్ కార్లు, 2 ఎగ్జిక్యూటివ్ కార్లతో నడుస్తున్న ఈ రైలును 8 కోచ్‌లకు పరిమితం చేయనున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ కుదింపు అమల్లోకి రానుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రస్తుతం 7 వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. ఇతర రూట్లలో ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ ఉండగా, సికింద్రాబాద్ -నాగ్‌పూర్ ((20101/20102) మార్గంలో 20 శాతం ఆక్యుపెన్సీ మాత్రమే ఉంటోంది. దీంతో కోచ్‌ల సంఖ్యను 8కి కుదించాలని అధికారులు నిర్ణయించారు. ఈ రైలులో 7 చైర్‌కార్‌లు, 1 ఎగ్జిక్యూటివ్ కార్ మాత్రమే ఉంటాయి.

సెలెక్ట్ కమిటీలో ఈటల, దగ్గుమళ్ల

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆదాయ పన్ను బిల్లు–2025 పరిశీలనకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా 31 మంది ఎంపీలతో సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపీ బైజయంత్ పాండాను నియమించారు. కాగా సెలెక్ట్ కమిటీలో తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు ఎంపీలకు అవకాశం ఇచ్చారు. తెలంగాణ నుంచి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, ఏపీ నుంచి చిత్తూరు టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావును ఎంపిక చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ శుక్రవారం బులెటిన్ విడుదల చేశారు.

యాసిడ్ తాగించి.. కత్తితో పొడిచి..!



బాధితురాలు గౌతమి

- అన్నమయ్య జిల్లాలో టీడీపీ నేత కుమారుడి అకృత్యం
- పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువతిపై ఉన్మాదంతో పైశాచిక దాడి
- నిందితుడి తండ్రి కదిరి, మదనపల్లె టీడీపీ ఎమ్మెల్యేలకు సన్నిహితుడు



నిందితుడు గణేష్

గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా), మదనపల్లె, పీలేరు: ఏపీలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండతో కామ పిశాచాలు వరుసగా అఘాయిత్యాలకు తెగబడుతున్నాయి. ఒకరు కాదు.. ఏకంగా ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు తమ కుటుంబం వెనుక ఉన్నారని.. రెడ్ బుక్ రాజ్యాంగ పాలనలో తమను ఏమీ చేయలేరనే ధీమాతో అన్నమయ్య జిల్లాలో ఓ ఉన్మాది నిశ్చితార్థం జరిగిన యువతిపై అత్యంత కిరాతకంగా యాసిడ్‌తో దాడి చేసి కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. మరి కొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన బాధితురాలు ఆస్పత్రి మెట్లు ఎక్కి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతోంది. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలం నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెలో శుక్రవారం ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. నిందితుడి తండ్రి సంకారపు మురళి మదనపల్లె, కదిరి టీడీపీ ఎమ్మెల్యేలకు సన్నిహితుడు కావడం గమనార్హం. మదనపల్లె టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రధాన అనుచరుడైన మురళికి టీడీపీలో క్రియాశీల సభ్యత్వం కూడా ఉంది.

వేధింపులతో ఉద్యోగం మానేసి..

ప్యారంపల్లెకు చెందిన దాసరి జనార్దన్, రెడ్డెమ్మల కుమార్తె గౌతమి (21) డిగ్రీ తరువాత బ్యూటీషియన్ కోర్సు చేసి మదనపల్లెలోని ఓ బ్యూటీ పార్లర్‌లో పని చేస్తోంది. మదనపల్లెలోని అమ్మచెరువు మిట్ట ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు మురళీ కుమారుడు గణేష్ (24) ప్రేమ పేరుతో బాధితురాలిని తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడు. అతడి ఆగడాలు భరించలేక బాధితురాలు మూడు నెలల కిందట ఉద్యోగం వదిలేసి సొంత గ్రామమైన ప్యారంపల్లెలో తల్లిదండ్రుల వద్దే నివసిస్తోంది. పీలేరుకు చెందిన మేనత్త కుమారుడితో వచ్చే ఏప్రిల్ 29న ఆమెకు వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఏడాదిగా బాధితురాలిని వేధిస్తున్న నిందితుడు గణేష్ ఆమెను అంతమొందించేందుకు 15 రోజుల కింద ప్యారంపల్లెకు వెళ్లి రెక్కీ నిర్వహించాడు. శుక్రవారం ఉదయం బాధితురాలి తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లోకి చొరబడి గడియ వేశాడు. తనతోపాటు తెచ్చుకున్న యాసిడ్ బాటిల్‌తో ఆమెపై దాడి చేసి బలవంతంగా తాగించాడు. తలపై కూడా పోశాడు. పథకం ప్రకారం వెంట తెచ్చుకొన్న కత్తితో ఆమెపై దాడి చేసి పలుచోట్ల కత్తితో పొడిచాడు. అనంతరం ఆమె వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యాడు.

పొలం నుంచి పరుగులు తీస్తూ..: బాధితురాలి ఇల్లు గ్రామం చివరిలో ఉండటం, అందరూ పొలం పనులకు వెళ్లడంతో ఈ దాష్టీకం ఎవరి కంట పడలేదు. అయితే తన తల్లి సెల్‌ఫోన్‌ను ఇంటి వద్దనే ఉంచి వెళ్లడంతో తండ్రికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. పొలం నుంచి పరుగులు తీస్తూ ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు అపస్మారక స్థితిలో ఉన్న తమ కుమార్తెను చూసి కుప్పకూలిపోయారు. తొలుత 108 వాహనంలో గుర్రంకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ ఎవరూ లేకపోవడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బెంగళూరులోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక న్యాయమూర్తి బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించారు.

దుశ్చర్యను ఖండించిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లాలో ఓ యువతిపై ప్రేమోన్మాది యాసిడ్‌తో దాడి చేయటాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించి ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో దిగజారిన శాంతి భద్రతలకు ఇదొక నిదర్శమని, రెడ్‌బుక్ పాలనకు పరాకాష్ట అని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఇకనైనా వారి భద్రతపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

అధికారముందనే అహంకారమా?

'ఎక్స్' వేదికగా చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ సహా 143 ఎన్నికల హామీల అమలులో విఫలమైన సీఎం చంద్రబాబు వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విషయంలో చంద్రబాబు సర్కార్ వ్యవహరిస్తున్న తీరు అత్యంత అన్యాయంగా ఉందని మండిపడ్డారు. గన్నవరం కేసుకు సంబంధించి టీడీపీ నేతలు తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చి తప్పుడు కేసు పెట్టించారని దళిత యువకుడు స్వాక్షాత్తూ జడ్జి ముందు వాంగ్మూలమిచ్చి అధికార పార్టీ కుట్రలను బట్టబయలు చేశారని గుర్తుచేశారు. తమ బండారం బయటపడి తప్పిదాలు బహిర్గతం కావడంతో దాన్ని మార్చేందుకు చంద్రబాబు దుర్మార్గాలకు తెర తీస్తున్నారని ధ్వజమెత్తారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపై తప్పుడు కేసు మోపటాన్ని కూడా తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కళ్యాణ మండపం ప్రాంగణంలో అబ్బయ్య చౌదరి డ్రైవర్‌ను బూతులు తిట్టిన టీడీపీ ఎమ్మెల్యే తిరిగి అబ్బయ్య చౌదరిపై ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించడం దుర్మార్గమన్నారు. 'మీ తప్పులను ప్రజలు తమ డైరీల్లో రికార్డు చేసు కుంటున్నారు.. వీటికి తగిన మూల్యం చెల్లించ తప్పదు'అని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం తన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'రాష్ట్రంలో చట్టానికి, న్యాయానికి చోటు లేకుండా పోయింది. అధికార దుర్వినియోగంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమ అరెస్టులతో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. వంశీ విషయంలో చంద్రబాబు కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరు అన్యాయంగా ఉంది' అని మండిపడ్డారు. 'సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న ఈ కేసులో న్యాయ ప్రక్రియను అపహాస్యం చేయడం అధికారముందనే అహంకారంతో మీరు చేస్తున్న అరాచకం కాదా? ఇది అధికార దుర్వినియోగం కాదా? వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. వంశీ భద్రతకు ఎలాంటి సమస్య తలెత్తినా ఈ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలి' అని పేర్కొన్నారు.

బెస్ట్ బ్రాండింగ్ టీమ్‌గా భారతి సిమెంట్



సాక్షి, హైదరాబాద్: హైబిజ్ టీవీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2వ ఎడిషన్‌లో బెస్ట్ బ్రాండింగ్, అడ్వర్టైజ్‌మెంట్ టీమ్‌గా భారతి సిమెంట్ టీం సభ్యులు విజయ్ కుమార్, పవన్ కుమార్‌లు అవార్డును అందుకున్నారు. వివిధ రకాల వ్యాపారాల్లో రాణిస్తున్న సంస్థలు, వ్యక్తులకు హై బిజ్ టీవీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: కుంభమేళాకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి–దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు చర్లపల్లి నుంచి (07121/07122) ప్రత్యేక రైలు ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు దానాపూర్ చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో 19వ తేదీ మధ్యాహ్నం 3.15 గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. అలాగే ప్రయాణికుల రద్దీ మేరకు చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్డుకు ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. ఈ మేరకు చర్లపల్లి నుంచి స్పెషల్ ట్రైన్ (07025/07026) ఈ నెల 21వ తేదీ రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.15కు శ్రీకాకుళం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 22న మధ్యాహ్నం 2.15కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6కు చర్లపల్లికి చేరుకుంటుంది.

'గో రూరల్' ఆస్తులు జప్తుచేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సులపై వాణిజ్య ప్రకటనల ప్రదర్శన ద్వారా వచ్చిన ఆదాయాన్ని సంస్థకు చెల్లించకుండా మోసగించిన గోరూరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (జీఆర్ఐపీఎల్) సంస్థ ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఆ సంస్థకు చెందిన రూ.6.47 కోట్ల విలువైన స్థిరాస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద జప్తు చేసినట్టు ఈడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులపై వాణిజ్య ప్రకటనల ప్రదర్శనకు ఆర్టీసీ, జీఆర్ఐపీఎల్ మధ్య గతంలో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఆర్టీసీ బస్సులపై జీఆర్ఐపీఎల్ మాత్రమే ప్రకటనలు ప్రదర్శించి వచ్చిన ఆదాయాన్ని ఆర్టీసీకి చెల్లించాలి. కానీ, ఆ సంస్థ నిబంధనలు అతిక్రమించి పోస్టర్ టౌన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గో ట్రాన్సిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, లైమ్‌లైట్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ఇతర సంస్థల ద్వారా కూడా బస్సులపై ప్రకటనలు ప్రదర్శించింది. దీంతోపాటు వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సొంత రుణాల చెల్లింపు, ఆభరణాలు, వాహనాలు, స్థిరాస్తుల కొనుగోలుకు, ఇతర అవసరాలకు వాడుకుంది. దీంతో ఆర్టీసీకి రూ.21.72 కోట్ల నష్టం వాటిల్లింది. దీనిపై ఆర్టీసీ ఫిర్యాదు మేరకు జీఆర్ఐపీఎల్ సంస్థ, దాని ప్రమోటర్లు, డైరెక్టర్లపై కేసులు నమోదయ్యాయి.

పీఏసీఎస్‌ల గడువు మరో ఆరు నెలలు



- పాలకమండళ్ల పదవీకాలం పొడిగించిన ప్రభుత్వం
- డీసీసీబీ పాలకమండళ్లు కూడా.. ఉత్తర్వులు జారీ
- ఈ విషయాన్ని ముందే చెప్పిన 'సాక్షి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 9 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీ), 904 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) పాలక మండళ్ల పదవీకాలాన్ని ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించింది. శుక్రవారంతో పీఏసీఎస్‌ల పదవీకాలం ముగియగా, 24న డీసీసీబీల పదవీకాలం ముగుస్తుంది. దీంతో వీటి పదవీకాలాన్ని మరో ఆరునెలలు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు పొడిగిస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో నంబర్ 74) జారీ చేసింది. దీంతో సంగెం పీఏసీఎస్ మినహా 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు జరిగిన 904 పీఏసీఎస్ పాలక మండళ్లన్నీ యథావిధిగా కొనసాగనున్నాయి. పీఏసీఎస్ చైర్మన్లుగా ఎన్నికైనవారి నుంచే డీసీసీబీ చైర్మన్లను, డైరెక్టర్లను ఎన్నుకుంటారు. దీంతో డీసీసీబీ పాలకమండళ్ల పదవీకాలం కూడా ఆటోమేటిక్‌గా పెరుగుతుంది. 2020 ఫిబ్రవరి 15న పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరగ్గా, ఫిబ్రవరి 25న 9 డీసీసీబీల ఎన్నికలు జరిగాయి.

డీసీసీబీల పునర్విభజన అవశ్యం

ప్రస్తుతం రాష్ట్రంలో 14 గ్రామ పంచాయతీలకు ఒక సహకార సంఘం పనిచేస్తోంది. ఇటీవల డీసీసీబీ చైర్మన్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి పీఏసీఎస్‌ల పదవీకాలం పొడిగించాలని కోరారు. ఆ సమయంలో సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి రైతాంగానికి మెరుగైన సేవలు అందించేందుకు సంఘాల పునర్విభజనకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన డీసీసీబీలను కూడా పునర్విభజించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

ముందే చెప్పిన 'సాక్షి'..

డీసీసీబీ పాలక మండళ్ల గడువును ఆరు నెలల పాటు ప్రభుత్వం పొడిగించబోతోందని 'సాక్షి' మీడియా ముందే చెప్పింది. గురువారం సంచికలో 'డీసీసీబీల పదవీకాలం పొడిగింపు?' శీర్షికన వార్తా కథనం సాక్షిలో ప్రచురితమైంది. 9 డీసీసీబీ చైర్మన్లలో కరీంనగర్ మినహా 8 చోట్ల కాంగ్రెస్ వాళ్లే ఉండడం, 700 వరకు పీఏసీఎస్‌ల చైర్మన్లు కూడా కాంగ్రెస్ నేతలే ఉండడంతో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను కాకుండా వీరినే మరో ఆరు నెలలు పదవిలో ఉంచే అవకాశం ఉందని ఆ కథనంలో తెలిపింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శనివారం : 15-2-2025



ఏకశిల గుట్టపై ఎత్తయిన బురుజు



సైనికులు విశ్రాంతి తీసుకునే గదులు


ఏకశిల గుట్టపై అద్భుతమైన ఆలయం



వరంగల్‌కు వన్నె!

ఓరుగల్లుకు ఘన చరిత్ర

- ఏకశిల కొండపై నుంచి నగర వీక్షణం
- గుట్టపై ఆలయం, సైనిక బురుజు, విశ్రాంతి గదులు
- అందాల కొండపై ఆహ్లాదకర వాతావరణం
- పర్యాటకాభివృద్ధి చేయాలని స్థానికుల వినతి



ఖిలా వరంగల్:

రాజులు పోయారు.. రాజ్యాలు అంతరించాయి. రాచరికపు వైభోగాలు కనుమరుగయ్యాయి. కానీ నాటి కట్టడాలు, జ్ఞాపకాలు నేటికీ చెక్కు చెదరలేదు. శతాబ్దాల చరిత్ర.. శత్రు దుర్భేధ్య నగరం.. శిల్ప కళా వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది ఏకశిల కొండ. నాడు ఏకశిల నగరం, ఓరుగల్లుగా పలు పేర్లతో ప్రఖ్యాతిగాంచింది. కాలక్రమేణా దీనికి వరంగల్ పేరు స్థిరపడింది.

వారసత్వ నగరంగా..

భారతదేశంలోని ఉత్తమ వారసత్వ నగరాల్లో ఒకటిగా ఓరుగల్లు గుర్తింపు పొందింది. ఇది రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉంది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద నగరం. ఓరు.. అంటే ఒకటి, గల్లు.. అనే పదానికి రాయి అని అర్థాలున్నాయి. 11వ శతాబ్దంలో ఈ అందమైన నగరాన్ని నిర్మించారు. ఈ ప్రాంతాన్ని 300 ఏళ్ల కాకతీయులు పాలించారు. ఈ కాలాన్ని స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చు. రాజధానిగా చెప్పుకుంటున్న ఖిలా వరంగల్ కోట అద్భుతమైన పురాతన కట్టడాలు, అనేక స్మారక చిహ్నాలు, వాస్తు శిల్ప కళా సంపదకు నిలయం.

వరంగల్ పేరు ఎలా వచ్చిందంటే..

కాకతీయుల రాజధానిగా చెప్పుకునే ఖిలా వరంగల్ కోటలో ఏకశిల గుట్ట (ఎత్తయిన రాతి కొండ)గా ఉంది. ఏక (ఒక) శిల (రాయి) ఏకశిలా నగరం.. దీన్నే ఓరు (ఒకటి) గల్లు (రాయి) అని.. ఈ ఎత్తయిన కొండ పేరుతోనే ఓరుగల్లు నగరంగా పిలుస్తుంటారు. శతాబ్దాల కాలం నుంచి ఏకశిల, ఓరుగల్లు నగరం కనుమరుగై.. ప్రస్తుతం వరంగల్‌గా పేరొందింది. అందాల కొండ ఏకశిల గుట్టను ఎక్కి చూస్తే.. నగరంతోపాటు చుట్టు పక్క గ్రామాలు, కొండలు, గుట్టలు, కనువిందు చేస్తాయి. ఈకొండపై ఆలయం, బురుజు, సైనిక స్థావరం, విశ్రాంతి గదులు, ఆనవాళ్లు నేటికీ ఉన్నాయి. ఈ కొండపై ఉన్న ఎత్తయిన బురుజుపై ఫిరంగి, భారీ తోపులు ఏర్పాటు చేశారు. శత్రు సైన్యం రాకను పసిగట్టినప్పుడు ఫిరంగులు, తోపుల్ని పేల్చడం వల్ల.. కోట చుట్టూ ఉన్న సైన్యం అప్రమత్తమయ్యేదని చరిత్రకారులు చెబుతున్నారు.

కొండపై ఆలయం

ఏకశిల కొండపై అద్భుతమైన శిల్ప కళా సౌందర్యంతో కూడిన ఓ ఆలయం ఉంది. ఆలయంలో 28 స్తంభాలతో గర్భగుడి, విశాలమైన కల్యాణ మండపం ఉంది. శిల్ప కళా సౌందర్యంతో కనిపించే ఈ ఆలయ గర్భగుడి దేవతా విగ్రహాలు లేక బోసిపోయి కనిపిస్తోంది. ఆనాడు సైనికులు సైతం ఇక్కడ శివారాధన చేసిన తర్వాతే విధుల్లో చేరేవారని చారిత్రక నిపుణులు చెబుతున్నారు.

కొండపై సైనిక స్థావరం

హనుమకొండ పద్మాక్షి దేవాలయం కేంద్రంగా మూడు కొండలను ఏకం చేసి కాకతీయుల తొలి రాజధానిని ఏర్పాటు చేశారు. కాకతీమాత అనుగ్రహంతో గణపతి దేవ చక్రవర్తి 1199 నుంచి 1262 మధ్యకాలంలో రాజధానిని ఓరుగల్లుకు మార్చేసి 300 ఏళ్ల పాటు సుస్థిర పాలన అందించారు. తొలుత 3వేల ఆడుగుల ఎత్తయిన ఏకశిల కొండపై సైనిక స్థావరం ఏర్పాటు చేశారు. ఇందుకు కొండపై ఎత్తయిన బురుజే సాక్ష్యం. బురుజు ఎక్కేందుకు అంతర్భాగంలోనే వేర్వేరుగా మెట్ల మార్గాలు ఏర్పాటు చేశారు. మెట్ల మార్గం ఎక్కి చూస్తే నగరం తోపాటు చుట్టూ ఉన్న కొండలు గుట్టలు, అందమైన నగరం కనువిందు చేస్తాయి. బురుజుపై తోపులు పెట్టి పేల్చిన ఆనవాళ్లు నేటికీ ఉన్నాయి. సైనికులు గాయపడకుండా.. నిలువెత్తు పటిష్టమైన నాలుగు రాళ్లు నాలుగు వైపులా నిలబెట్టి ఉంటాయి. దీనిపైకి పర్యాటకులు ఎక్కి.. రాతి కట్టడాలు.. ఆహ్లాదకర వాతావరణాన్ని తిలకించి ఆస్వాదిస్తున్నారు.

సైనికులకు విశ్రాంతి గదులు

ఆనాడు కొండపై సైనికులకు విశ్రాంతి గదులు నిర్మించారు. ఫిరంగుల్లో మందు నింపేందుకు ప్రత్యేక గదులు వేర్వేరుగా ఉండేవని చెబుతారు. ఈ నిర్మాణాలన్నీ 20 ఏళ్ల క్రితం వరకు బాగానే ఉన్నప్పటికీ.. ఆదరణ లేక శిథిలమై కూలిపోయాయి. ఈగుట్టపైకి రహస్య సొరంగ మార్గాలు ఉండేవని.. వాటి ద్వారా చేరుకుని సైనికులకు మార్గనిర్దేశం చేసేవారని చరిత్రకారులు చెబుతున్నారు.

అభివృద్ధికి దూరంగా..

ఏకశిల గుట్ట నేటికీ అభివృద్ధికి దూరంగా ఉంది. గుట్టపై విశాలమైన ప్రాంగణం కనిపిస్తుంది. కనీసం ఐదువేల మంది ఇక్కడ విశ్రాంతి తీసుకోవచ్చు. గుట్టపై పర్యాటకులు చల్లని వాతావరణం, ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తూ.. నగర అందాలను వీక్షిస్తూ సేదదీరుతుంటారు. కానీ గుట్టపై దాహార్తి తీరేందుకు మంచినీటి సౌకర్యం లేదు. మెట్ల మార్గం ద్వారా పర్యాటకులు ఎంతో కష్టపడి ఎక్కినా.. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక అవస్థలు పడుతుంటారు. ఒకే రాయితో ఏర్పడిన సుందరమైన చారిత్రక గుట్టను ఆధునికీకరిస్తే.. పర్యాటకుల రాక మరింత పెరుగుతుందని, తద్వారా స్థానిక యువతకు స్వయం ఉపాధి మెరుగుపడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

పీఆర్ చట్టంలోని ఇబ్బందికర సెక్షన్లు సవరించాలి

పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ సృజనకు టీపీఎస్‌ఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ చట్టం -2018లో పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి ఇబ్బందికరంగా ఉన్న కొన్ని సెక్షన్లను సవరించేలా చర్యలు తీసుకోవాలని పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ సృజనకు తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం (టీపీఎస్‌ఏ) విజ్ఞప్తి చేసింది. జీవో 317 కారణంగా బదిలీలు, స్థానికత విషయంలో నష్టపోయిన కార్యదర్శులను తిరిగి వారి సొంత జిల్లాలు, జోన్లకు పంపించాలని, స్పౌజ్, మెడికల్ కేసులు, పరస్పర బదిలీలు చేపట్టాలని సంఘం కోరింది. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలను జనాభా, ఆదాయం ప్రాతిపదికన నాలుగు గ్రేడ్లుగా విభజించి, క్లస్టర్ విధానాన్ని సవరించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే జూనియర్ పంచాయతీ సెక్రెటరీల నియామకపు తేదీ నుంచి సర్వీస్‌ను లెక్కిస్తూ రెగ్యులరైజేషన్ కాలాన్ని నాలుగేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించి ప్రొబేషన్ ప్రకటించాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం పీఆర్‌ఆర్‌డీ కార్యాలయంలో డైరెక్టర్ సృజనకు సంఘం అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీఎస్‌ఏ డైరీ, కేలండర్‌లను డైరెక్టర్ సృజన ఆవిష్కరించారు.

గిరిజనుల ఆరాధ్యుడు.. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్

నేడు సేవాలాల్ మహారాజ్ జయంతి

- జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి
- ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి



పెద్దఅడిశర్లపల్లి: ఆయన భారత గిరిజన ప్రజలకు ఆరాధ్య దైవం. లంబాడీలను అహింసావాదంవైపు నడిపించిన దార్శనికుడు. బ్రహ్మచర్య నిష్టను ఆచరించి ఎంతో మంది గిరిజనులను ఆకర్షించిన వ్యక్తి. ఆయనే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్. 17వ శతాబ్దంలో అవతరించిన ఆయన, గిరిజనులకు ఆరాధ్య దైవమయ్యారు. నేడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను సేవాలాల్ బంజార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు సెలవుదినంగా ప్రకటించాలని గిరిజనులు కోరుతున్నారు.

గిరిజన రాజుగా..

అసలు శ్రీ సేవాలాల్ మహారాజ్ ఎవరు..? ఆయనకు మూడు దశాబ్దాలుగా గిరిజనుల్లో ఇంత ఆదరణ ఎందుకు ఉంది? ఆయన రాజా? లేక దార్శనికుడా? లేక ఆధ్యాత్మిక గురువా? అనేది చాలా మందిని తొలుస్తున్న ప్రశ్న. తెలంగాణలో గిరిజనులు ఆరాధించే ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 1739 ఫిబ్రవరి 15న ఏపీలోని అనంతపురం జిల్లాలో గుత్తి సమీపంలోని ఓ మారుమూల తండాలో జన్మించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన అప్పట్లోనే దేశమంతటా తిరిగి లంబాడీ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చారు. అందుకే ఆయన వారికి ఆరాధ్య దేవుడయ్యాడు. రాజపుత్ర సంతతికి చెందిన గిరిజన జాతుల్లో లంబాడీ జాతికి చెందిన దంపతులకు జన్మించడం వల్ల ఆయనను సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్‌గా, గిరిజన రాజుగా, లంబాడీ గురువుగా కొలుస్తారు. అప్పట్లోనే నిజాం రాజులకు ఎదురొడ్డి నిలిచిన ఘనత సేవాలాల్ మహారాజ్‌ది.

కఠోర నిష్ట

సేవాలాల్ మహారాజ్ పూజా విధానం చాలా కఠినతరంగా ఉంటుంది. సేవాలాల్ గుడిని దర్శించిన భక్తులందరూ ఉదయం, సాయంత్రం కలుసుకోవాల్సి ఉంటుంది. బలన్ బోగ్ మరియు బేలన్‌బోగ్ అనే ఆధ్యాత్మిక సాధన కార్యక్రమం జరుగుతుంది. ఈ సమయంలో భగవంతునికి నివేదించి ధర్మబోధన చేస్తారు. ప్రతీ బంజార యువకుడు కనీసం జీవిత కాలంలో ఒక్క సారైనా బంజార సేవాలాల్ గుడిని దర్శించాలని విశ్వసిస్తుంటారు. అనంతపురం గుత్తి సమీపంలోని ఓ గిరిజన తండాలో భీమానాయక్, ధర్మిణి దంపతులకు జన్మించిన రమావత్ సేవాలాల్ క్రమక్రమంగా దార్శనికుడిగా, అహింసావాదిగా పేరు సంపాదించారు. తర్వాత కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో ఆయనకు గిరిజనులు ఆలయాన్ని నిర్మించారు. సేవాలాల్ మహారాజ్ జన్మించిన ఊరును ప్రస్తుతం పురితండాగా పిలుస్తున్నారు.

సంత్ శ్రీ సేవాలాల్ మార్గాన్ని ఆచరించాలి



గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ చూపించిన మార్గాన్ని రాష్ట్రంలోనే కాకుండా, దేశంలోని ప్రతి గిరిజనుడు ఆచరించాల్సిన అవసరం ఉంది. ఆయన ఆదర్శాలను ప్రచారం చేస్తూ, జయంతి ఉత్సవాలకు రాష్ట్రంలోని ప్రతి గిరిజనుడు జరుపుకోవాలి.

– రమావత్ చిరంజీవి, అంగడిపేట

జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



గిరిజనులు ఎంతో భక్తితో జరుపుకునే సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతోపాటు, జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.

–రమావత్ శ్రీనునాయక్, సేవాలాల్ బంజార సంఘం నాయకుడు, గుడిపల్లి మండలం

కూర్మపల్లిని అలా ఎలా విడదీస్తారు?

- ప్రత్యేక పంచాయతీ గెజిట్‌ను సస్పెండ్ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రామచంద్రాపూర్ పంచాయతీ నుంచి కూర్మపల్లిని విడదీయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నిబంధనలకు విరుద్ధంగా విడదీశారని ప్రాథమిక అంచనాకు వచ్చిన న్యాయస్థానం.. ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తూ జారీ చేసిన గెజిట్‌ను సస్పెండ్ చేసింది. పంచాయతీని విడదీయడాన్ని సవాల్ చేస్తూ పి.నవీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున బి.భగత్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రామచంద్రాపూర్ పంచాయతీకి కూర్మపల్లి 500 మీటర్లలోపే ఉందని అభిప్రాయపడ్డారు. గ్రామ సభ నిర్వహించినా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయడానికి కోరం సరిపోని విషయాన్ని పరిగణనలోకి తీసుకోవలసి ఉందని వ్యాఖ్యానించారు. గతేడాది జూలై 15న ఇచ్చిన గెజిట్‌ను సస్పెండ్ చేస్తూ.. తదుపరి విచారణ మార్చి 13కు వాయిదా వేశారు.

నల్లమలకు పులుల కళ

- గుండం అటవీ ప్రాంతంలో కనిపించిన పెద్దపులి



మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిసర ప్రాంతంలో జంగిల్ సఫారీ పర్యాటకులకు తరచూ పెద్దపులులు దర్శనమిస్తూ కనువిందు చేస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం పర్యాటకులు సఫారీ వాహనంలో ప్రయాణిస్తున్న క్రమంలో.. గుండం అటవీ పరిసర ప్రాంతంలోని పొదల మధ్య పెద్దపులి కనిపించింది. దీంతో పర్యాటకులు పులిని సెల్‌ఫోన్లలో బంధించారు. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు అభయారణ్యంలో పర్యాటకులకు ఐదుసార్లు పెద్దపులులు కనిపించడం గమనార్హం. పెద్దపులిని పరిశీలించిన అటవీశాఖ అధికారులు అది ఆడపులిగా గుర్తించారు. ఇదే ప్రాంతంలో రెండు పిల్లలతో మరో ఆడ పులి, మరో మగ పెద్ద పులి కూడా సంచరిస్తున్నట్లు తెలిపారు.

కేసీఆర్ అప్పులు తెచ్చి ఆస్తులు సృష్టించారు

- బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్
- తెలంగాణపై సీతారామన్ వ్యాఖ్యలు సరికాదు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో తెలంగాణ గురించి బాధ్యతారహితంగా మాట్లాడారని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఆమె చెప్పినట్లుగా తెలంగాణ అప్పుల కుప్ప కాలేదని, తెచ్చిన అప్పులతో కేసీఆర్ రాష్ట్రంలో ఆస్తులు సృష్టించారని అన్నారు. పదేళ్ల పాటు సాగిన కేసీఆర్ పాలన పట్ల నిర్మల చిన్న చూపుతో మాట్లాడారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జన్‌ధన్ ఖాతాలు, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దేశమంతా ఇచ్చి, తెలంగాణకు మాత్రమే ఇచ్చినట్లుగా నిర్మల వ్యాఖ్యలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పెరిగిన తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణను అవమానిస్తున్న నిర్మలా సీతారామన్.. బీజేపీ పాలిత రాష్ట్రాలకే నిధులు తరలించారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు.

విషం చిమ్మే మాటలు వద్దు

కేంద్రమంత్రి నిర్మలకు మాజీ మంత్రి పొన్నాల హితవు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణపై విషం చిమ్మే మాటలను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికైనా మానుకోవాలని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హితవు పలికారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాలకు ఇచ్చే నిధులు తక్కువ చేయడమే సీతారామన్ చేసిన గొప్పా? అని ప్రశ్నించారు. దేశ ఆదాయంలో 85 శాతం అప్పులు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. దేశంలో ఎనిమిదిసార్లు ఒక మహిళగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన సీతారామన్ అంటే గౌరవం ఉందన్నారు. కానీ తెలంగాణ ఆర్థిక పరిస్థితులపై ఆమె చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రపంచంలో అగ్ర రాజ్యాలుగా చెప్పుకునే దేశాల్లో అప్పులు ఎలా ఉన్నాయో సీతారామన్‌కు తెలియదా? అని 'పొన్నాల'ప్రశ్నించారు.

ఇజ్రాయెల్‌లో తెలుగువారి ఇక్కట్లు

- టామ్‌కామ్ ద్వారా పెద్ద ఎత్తున వీసాలు పొందిన నిరుద్యోగులు
- నెలలో సగం రోజులు కూడా పనులు దొరకని దుస్థితి
- నిర్మాణ రంగంలో భారతీయులను పనిలోకి తీసుకోవడానికి నిరాకరిస్తున్న చైనా కాంట్రాక్టర్లు



ఇజ్రాయెల్‌లో కన్‌స్ట్రక్షన్ రంగంలో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం దళారీ వ్యవస్థను రూపుమాపడానికి ప్రవేశపెట్టిన టామ్‌కామ్ ద్వారా ఇజ్రాయెల్ నిర్మాణ రంగంలో ఉపాధి కోసం వెళ్లిన నిరుద్యోగులు..అక్కడ పనులు దొరక్క తీవ్రఇక్కట్లు పడుతున్నారు. ఇజ్రాయెల్‌లోని నిర్మాణరంగంలో పెద్ద ఎత్తున కాంట్రాక్టర్లు చైనాకు చెందినవారు కావడంతో భారతీయ కార్మికులు అనగానే పనులు లేవంటూ తిప్పి పంపుతున్నారంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే నిర్మాణ రంగంలో మల్టిపుల్ నైపుణ్యాలు లేని కారణంగానే వారికి పనులు నిరాకరిస్తున్నట్టు తెలుస్తోంది. సమస్య తీవ్రతను ఇజ్రాయెల్‌లోని భారత రాయబార సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళితే వారు కూడా చేతులు ఎత్తేసినట్టు సమాచారం. తాము పని కల్పించలేమంటూ కార్మికులే పని వెతుక్కోవాలని వారు సూచిస్తున్నట్టు బాధితులు వాపోతున్నారు. కార్మికులు వెళ్లిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ పరిధిలో పనులు దొరకని పక్షంలో ఆ కంపెనీని వదిలి బయటకు వెళ్లి రెఫ్యూజీలుగా పని చేసుకుందామంటే ఇజ్రాయెల్ దేశ చట్టాలు కఠినంగా ఉన్నాయి. దీంతో ఆ అవకాశమే లేకుండా పోయింది.

పాలస్తీనాకు బ్రేక్ వేయడంతో...

ఇజ్రాయెల్‌లో పాలస్తీనాకు చెందినవారు అధిక సంఖ్యలో ఉపాధి పొందేవారు. అయితే ఈ రెండు దేశాల మధ్య పోరు కొనసాగుతుండటంతో ఇజ్రాయెల్ ..పాలస్తీనా వలస కార్మికుల రాకపోకలకు బ్రేక్ వేసింది. ఫలితంగా ఇజ్రాయెల్‌లో కార్మికుల కొరత తీవ్రమైంది. ఇజ్రాయెల్ పౌరులు ఎక్కువగా ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. దీంతో ఆ దేశంలో కార్మికులుగా పనిచేసేందుకు పరాయి దేశస్తుల అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో వలస కార్మికులకు దండిగా వీసాలను జారీ చేసేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇజ్రాయెల్‌లో వ్యవసాయ, భవన నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆ దేశం జారీ చేస్తున్న వీసాల ప్రక్రియలో దళారుల జోక్యాన్ని నివారిస్తూ టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్) చర్యలు తీసుకుంది. టామ్‌కామ్ ఇజ్రాయెల్ వీసాలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించి తెలంగాణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగులకు వీసాలు కేటాయించి ఇజ్రాయెల్‌కు పంపించారు.

నిర్మాణ రంగంలో అనుభవం లేని కార్మికులు

హైదరాబాద్‌లోనే టామ్‌కామ్, న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) సంస్థల ఆధ్వర్యంలో వలస కార్మికుల రిక్రూట్ చేపట్టారు. అయితే ఈ కార్మికులకు నిర్మాణ రంగంలో పనిచేసిన అనుభవం పెద్దగా లేని కారణంగా ఇజ్రాయెల్‌లో కాంట్రాక్టర్లు వారిని నిరాకరిస్తున్నట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. ఇతర దేశాల నుంచి ఇజ్రాయెల్‌కు వచ్చిన కార్మికులు సివిల్, కరెంట్, టైల్స్, ప్లంబింగ్ లాంటి మల్టిపుల్ పనులు చేయడంలో నిష్ణాతులుగా ఉండటంతో అక్కడి కాంట్రాక్టర్లు వారికే ప్రాధాన్యం ఇస్తూ భారతీయ కార్మికులకు పనిఇవ్వడం లేదని తెలుస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే కుటుంబపోషణ కోసం అప్పులు చేసి దేశం కాని దేశంలో తాము ఇక్కట్లు పడటమే కాకుండా తమ కుటుంబ సభ్యులను రోడ్డు మీదకు తెచ్చినట్టు అవుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు ఇజ్రాయెల్‌లోని రాయబార సంస్థ అధికారులతో మాట్లాడి తమకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ బాధితులు వేడుకుంటున్నారు.

క్లుప్తంగా...

ఉపాధ్యాయులకు సీసీఎల్ ఇవ్వాలి
ఏపీటీఎఫ్ అమరావతి

సాక్షి, అమరావతి: స్కూల్ కాంప్లెక్స్‌లను రెండో శనివారం నిర్వహిస్తున్న కారణంగా, ఆ రోజు పనిచేసినందుకు ఉపాధ్యాయులకు కాంపన్సేటరీ క్యాజువల్ లీవ్ (సీసీఎల్) ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, రాధాకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అదే విధంగా మండల/నియోజకవర్గ స్థాయిలో సబ్జెక్టు కాంప్లెక్స్‌లు కూడా నిర్వహించాలని కోరారు.

కర్నూల్‌లోనే కేఆర్ఎంబీ బోర్డు
ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కేఆర్ఎంబీ (కృష్ణా నదీ నిర్వహణ) బోర్డును కర్నూల్‌లో ఏర్పాటు చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా విజయవాడలో ఏర్పాటు చేయాలని కేంద్రానికి లేఖ రాయడం పట్ల ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ. ఈశ్వరయ్య ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాయలసీమలోనే కృష్ణా బోర్డును ఏర్పాటు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. గోదావరి జలాలను బనకచర్లకు తెస్తామంటూ మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గడచిన ఎనిమిది నెలల పాలనలో రైతులకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం ప్రారంభించకపోగా ఉన్న పథకాలు, సౌకర్యాలను తొలగిస్తున్నారన్నారు. కేంద్రానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నప్పటికీ బాబు ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు తేలేకపోతోందన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. అవినీతి రహిత పాలన చేస్తామని అందలమెక్కిన సీఎం చంద్రబాబు ప్రభుత్వం.. సాండ్, ల్యాండ్, మైనింగ్, వైన్స్ ఇలా అన్నింటిలోనూ దోపిడీ సాగిస్తోందన్నారు. రెవెన్యూ శాఖలో అవినీతి తిమింగలాలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని విచారం వ్యక్తం చేశారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి
- హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేసిన శ్రీరెడ్డి

సాక్షి,అమరావతి: తనపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో నమోదైన కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సినీ నటి మల్లిడి విమల అలియాస్ శ్రీరెడ్డి హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాల్లో 3 వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు వచ్చాయి. శ్రీరెడ్డిపై నమోదైన కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని గుంటూరు నగరపాలెం, విశాఖ టూ టౌన్, కాకినాడ సర్పవరం పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనితలను ఉద్దేశించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ శ్రీరెడ్డిపై రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు.

కామన్ పీజీ సెట్ రద్దు చేయాలి

మంగళగిరి టౌన్: ఎన్నికల ముందు పీజీ సెట్‌ల నిర్వహణపై ఇచ్చిన హామీని టీడీపీ కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడం విద్యార్థుల్ని మోసం చేయడమేనని, తక్షణమే కామన్ పీజీసెట్‌ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జి డిమాండ్ చేశారు. శుక్రవారం గుంటూరు జిల్లా, మంగళగిరి పరిధిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో కార్యదర్శి కృష్ణమూర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి పీజీ ప్రవేశాలు నిర్వహించడం వల్ల 2021 నుంచి 2024 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వర్సిటీల్లో 30 నుంచి 40 శాతం వరకు అడ్మిషన్స్ లేక ఖాళీగా మారాయన్నారు. 2024 ఎన్నికల హామీల్లో భాగంగా ఉమ్మడి పీజీ అడ్మిషన్లు రద్దు చేసి ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ ప్రవేశాలు పెట్టేవిధంగా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని, తక్షణమే ఆ హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

అసలు కథ చెప్పని 'తండేల్'

2018లో 22 మంది రాష్ట్ర మత్స్యకారులను జైలులో పెట్టిన పాకిస్తాన్

- వారి విడుదలపై పట్టించుకోని అప్పటి ప్రభుత్వ పెద్దలు
- వైఎస్ జగన్ చొరవతోనే పాక్ జైలు నుంచి విడుదల
- 2018లో జగన్ పాదయాత్రలో ఉండగానే వారి విడుదలకు కృషి ప్రారంభం
- వైఎస్సార్‌సీపీ ఎంపీల ద్వారా విదేశాంగ శాఖపై ఒత్తిడి
- అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత ఒత్తిడి
- కేంద్రం ఆర్టికల్ 370 రద్దుతో ఆశలు సన్నగిల్లినా పట్టు విడువని జగన్
- ఎట్టకేలకు విడుదలకు పాక్ అంగీకారం.. 2020 జనవరి 6న విడుదల
- వాఘా సరిహద్దు వద్ద వారికి స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ మంత్రులు
- విడుదలైన వారికి రూ.5 లక్షలు చొప్పున వైఎస్ జగన్ ఆర్థిక సాయం
- మత్స్యకారుల వలసలు ఆపేందుకు పలు చర్యలు చేపట్టిన జగన్
- సీ పోర్టు, ఫిషింగ్ హార్బర్, జెట్టీ పనులు ప్రారంభం
- సినిమాలో చూపకపోయినా చెప్పాల్సిన బాధ్యత ఉందన్న బాధిత కుటుంబ సభ్యులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పద్నాలుగు నెలలు పాకిస్తాన్ జైలులో మగ్గిపోయిన 22 మంది మత్స్యకారులను విడుదల చేయించింది ఎవరు? వారిని వాఘా సరిహద్దుల నుంచి ఇంటి వరకు తీసుకొచ్చింది ఎవరు? వారి కష్టాలకు చలించిపోయి ఇచ్చిన మాట ప్రకారం రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేసిందెవ్వరు? ఇంకెవరూ వలస పోకుండా, ఎవరికీ అలాంటి దుస్థితి రాకుండా శ్రీకాకుళం జిల్లాలో పోర్టు, హార్బర్, జెట్టీల నిర్మాణం మొదలుపెట్టింది ఎవరు? వలస బతుకులకు ఫుల్‌స్టాప్ పెట్టాలని ప్రయత్నించిందెవరు?... మత్స్యకారుల వలస జీవితం ఇతివృత్తంగా తెరకెక్కించిన 'తండేల్' సినిమా ఈ ప్రశ్నలన్నింటినీ మరోసారి తెర ముందు ఉంచింది. సినిమాలో సగం నిజమే చెప్పినా.., చూపించని కోణాలు ఎన్నో ఉన్నాయి. బాధితులు మాత్రం మీడియా ముందుకు వచ్చి గుండె తెరిచి వాస్తవాలు వివరించారు. తమను విడిపించి తీసుకువచ్చింది, రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేసింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విస్పష్టంగా చెప్పారు. తరాల తరబడి శ్రీకాకుళం జిల్లాను పాలిస్తున్న రాజకీయ కుటుంబాలు కలలో కూడా ఊహించని విధంగా జిల్లాలో పోర్టు పనులు ప్రారంభించడం, ఫిషింగ్ హార్బర్, జెట్టీ పనులు ప్రారంభించడం వైఎస్ జగన్ చలవేనని సోషల్ మీడియా మోతమోగిపోయేలా చెబుతున్నారు.

ఇదీ జరిగింది..

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంకు చెందిన 10 మంది, బడివానిపేటకు చెందిన ముగ్గురు, ముద్దాడకు చెందిన ఒకరు, విజయనగరం జిల్లా తిప్పలవలసకు చెందిన ఆరుగురు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు ఇలా మొత్తం 22 మంది మత్స్యకారులు చేపల వేట కోసం 2018 జూలైలో గుజరాత్ రాష్ట్రం వీరావల్‌కు వెళ్లారు. వీరంతా ఒక బృందంగా ఏర్పడి నాలుగు పడవల్లో అరేబియా సముద్రంలోకి వెళ్లారు. పడవలు సముద్రంలో తీవ్ర ఆటుపోట్లకు గురవడంతో పొరపాటుగా పాకిస్తాన్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించారు. 2018 నవంబర్ 28న అక్కడి కోస్టు గార్డు అధికారులకు దొరికిపోయారు. పాకిస్తాన్ అధికారులు వారందరినీ కరాచీ సబ్ జైలులో పెట్టారు. అక్కడ సరైన తిండి, దుస్తులు లేక అక్కడ వారు పడ్డ అవస్థలు వర్ణనాతీతం. జైలు అధికారులు ఉదయం ఒక్క రొట్టె ఇచ్చేవారు. మధ్యాహ్నం, రాత్రి రెండేసి రొట్టెలు ఇచ్చేవారు. వాటితోనే సరిపెట్టుకోమని చెప్పేవారు. రొట్టెలు వద్దంటే అన్నం ఇచ్చేవారు. ఆదివారం మాత్రం కొంచెం మాంసాహారం పెట్టేవారు. ఈద్ అనే స్వచ్ఛంద సంస్థ దుస్తులతో పాటు రూ.5 వేల నగదు ఇచ్చింది. అక్కడ కూలి పనులు చేస్తే కొంత డబ్బు వచ్చేది. ఆ డబ్బుతో జైల్లోనే విక్రయించే కిరాణా సరుకులు కొనుక్కొని వంట చేసుకునేవారు. అదీ అరకొర భోజనమే. ఇలా కష్టాలు అనుభవిస్తూ క్షణమొక యుగంలా గడిపారు. మరో పక్క వేటకు వెళ్లిన వీరి ఆచూకీ తెలియకపోవడంతో ఇక్కడ ఉన్న కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. చివరకు వారితో పాటు వేటకు వెళ్లిన మరో మత్స్యకారుడి ద్వారా వారంతా పాకిస్తాన్ అదుపులో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ మత్స్యకారుల కుటుంబాలు తమ వాళ్ల కోసం గ్రామ సర్పంచ్ నుంచి ప్రభుత్వ పెద్దల వరకు అందరినీ ఆశ్రయించాయి. ఎవరూ పరిష్కారం చూపలేదు. పాకిస్తాన్‌లో మత్స్యకారులు తిండికి కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిసి వారి కుటుంబీకులు తల్లడిల్లిపోయేవారు.

ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్ హామీ

ఆ సమయంలో నిండు గర్భిణిగా ఉన్న రామారావు అలియాస్ రాజు సతీమణి నూకమ్మ, బందీగా ఉన్న మరో మత్స్యకారుడు ఎర్రయ్య సతీమణి శిరీష మిగిలిన మత్స్యకారుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన న్యాయవాది గురుమూర్తి సాయంతో జిల్లా యంత్రాంగానికి, నాయకులకు, ప్రభుత్వానికి విన్నపాలు అందజేశారు. అయినా ఫలితం లేదు. అదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేస్తున్నారు. 2018 డిసెంబర్ 2న రాజాం నియోజకవర్గం లచ్చయ్యపేట గ్రామం వద్దకు వచ్చిన వైఎస్ జగన్‌ను బాధిత మత్స్యకార కుటుంబాలు కలిశాయి. పాకిస్తాన్ జైల్లో బందీలుగా ఉన్న తమ వాళ్లను విడిపించాలని కోరాయి. అప్పటి రాష్ట్ర మంత్రి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే కళా వెంకటరావును కలిసినా పట్టించుకోలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ వెంటనే స్పందించారు. పాక్ చెరలో ఉన్న మత్స్యకారుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తమ ఎంపీలను పంపిస్తానని, మత్స్యకార కుటుంబ సభ్యులు విదేశాంగ శాఖ మంత్రిని కలిసేలా చేస్తానని చెప్పారు. అధికారంలోకి వస్తే వెంటనే విడిపిస్తానని భరోసా ఇచ్చారు.

వైఎస్ జగన్ ప్రభుత్వం చొరవతో విడుదల

పాదయాత్రలో ఉన్నప్పటికీ, వైఎస్ జగన్ మత్స్యకారుల సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దీంతో 2019 ఫిబ్రవరిలో మత్స్యకారుల నుంచి కుటుంబ సభ్యులకు ఉత్తరాలు రావడం మొదలైంది. ఇది కుటుంబ సభ్యులకు కొంత ఉపశమనం కలిగించినా, తిరిగి ఇంటికి వస్తారో, లేదో అన్న భయం వెంటాడుతూనే ఉండేది. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారుల విడుదలకు కేంద్రంపై ఒత్తిడి మరింతగా పెంచారు. ఆ తర్వాత కేంద్రం 370వ అధికరణం ఎత్తివేయడం, 35 (ఎ)తొలగింపు వంటి పరిణామాలతో వీరి విడుదలపై ఆశలు సన్నగిల్లాయి. అయినా వైఎస్ జగన్ పట్టువిడవకుండా ఎంపీల ద్వారా విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరిపారు. దీంతో మత్స్యకారుల విడుదలకు పాకిస్తాన్ ప్రభుత్వం అంగీకరించింది. 2020 జనవరి 6న మత్స్యకారులను విడుదల చేసింది. ఆరోజు సాయంత్రం 7 గంటల సమయంలో వాఘాలోని భారత్–పాక్ సరిహద్దు వద్ద 20 మంది మత్స్యకారులను అప్పగించింది. వారికి అప్పటి వైఎస్సార్‌సీపీ మంత్రులు, అధికారులు స్వాగతం పలికారు. మిగతా ఇద్దరు డాక్యుమెంట్లు, ఇతర సాంకేతిక కారణాల వల్ల తర్వాత విడుదలయ్యారు. విడుదలైన వారందరినీ వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు ఢిల్లీ తీసుకొచ్చి అక్కడి నుంచి విమానంలో రాష్ట్రానికి తెచ్చారు. వారంతా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. జగన్ వారందరికీ స్వీట్లు తినిపించి, ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఇకపై మత్స్యకారులు ఇలా వలసలు వెళ్లే అవసరం లేకుండా రాష్ట్రంలోనే పోర్టు, జెట్టీ, ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని భరోసా ఇచ్చారు.

> వైఎస్ జగన్ మాకు పునర్జన్మ ఇచ్చారు. చావు అంచుల వరకు వెళ్లిన మమ్మల్ని దేవుడిలా కాపాడారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపారు.
>
> తండేల్ చిత్రంలో హీరోగా చూపించిన గనగళ్ల రామారావు, ఇతర బాధిత మత్స్యకారులు ఆనాడు చెప్పిన మాటలు



2020జనవరి 6న వాఘా సరిహద్దు నుంచి విడుదలై వస్తున్న మత్స్యకారులు



విడుదల చేయించినందుకు కృతజ్ఞతగా వైఎస్ జగన్ చేతికి ముద్దుపెడుతున్న మత్స్యకారుడు



విడుదలైన మత్స్యకారులతో వైఎస్ జగన్ (పేపర్ క్లిప్పింగ్)

జగన్ పునర్జన్మనిచ్చారు

తండేల్ సినిమా హీరో పాత్రకు మూలమైన రామారావు సోదరి ముగతమ్మ. ఈమె భర్త అప్పారావు, కొడుకులు కళ్యాణ్, కిషోర్ కూడా అప్పట్లో పాక్ జైల్లో బందీ అయ్యారు. 'తండేల్' సినిమాలో జగన్ ప్రస్తావన లేకపోవడాన్ని చూసి ముగతమ్మ తట్టుకోలేకపోయారు. సినిమా చూసి వచ్చిన వెంటనే హాల్ బయట తన మనసులో మాటను మీడియా ముందు స్పష్టంగా చెప్పారు. తమ వారిని విడిపించి తీసుకువస్తానని చేతిలో చేయి వేసి జగన్ చెప్పారని, చెప్పినట్టుగానే తీసుకుని వచ్చారని తెలిపారు. అంతేకాకుండా ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు. జగనన్నతో పాటు అప్పటి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, గ్రామ సర్పంచ్, సర్పంచ్ కుమార్తె, న్యాయవాది గురుమూర్తి కృషి కూడా ఉందని తెలిపారు. సినిమాలో అవేవీ లేకపోయినా బయట చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని, అందుకే అన్ని విషయాలు వివరంగా చెబుతున్నానని అన్నారు.

చెప్పినట్టుగానే హామీలు అమలు

194 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లాలో మౌలిక సదుపాయాలు లేక మత్స్యకారులు వలసపోయేవారు. దీన్ని నివారించేందుకు జిల్లాలోని మూలపేటలోనే ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70 కోట్లతో సీ పోర్టు తొలి దశ, బుడగట్లపాలెంలో రూ.366 కోట్లతో ఫిషింగ్ హార్బర్, మంచినీళ్లపేటలో జెట్టీ పనులకూ శ్రీకారం చుట్టారు. అధికారంలో ఉండగానే చాలా వరకు పనులు పూర్తి చేశారు. వేట నిషేధ కాలంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట 17,136 మందికి రూ.10 వేలు చొప్పున సాయం అందజేశారు. మత్స్యకారుల సంక్షేమం క్షేత్రస్థాయిలో అందుతుందో తెలుసుకునేందుకు 66 మంది సాగర మిత్ర ఉద్యోగులను నియమించారు. గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్‌లను నియమించారు. ఫిష్ ఆంధ్రా షాపులను ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో రూ. 3 కోట్లు ఖర్చు పెట్టి గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి 3,064 మంది మత్స్యకారులను 46 బస్సుల ద్వారా తీసుకు వచ్చారు. ఇదంతా క్లైదుటే జరిగింది. అయినా ఇందులో ప్రధాన ఘట్టాలను సినిమాలో చూపించలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తులసిబాబు బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి/ఒంగోలు టౌన్: గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రధాన అనుచరుడు కామేపల్లి తులసిబాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. గుంటూరు నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తులసిబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ..న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ శుక్రవారం తీర్పు వెలువరించారు. తనను కస్టడీలోకి తీసుకుని టార్చర్ చేశారంటూ శాసనసభ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు గతేడాది గుంటూరు, నగరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు తులసిబాబుతో సహా పలువురిపై కేసు నమోదు చేసి తులసిబాబును అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తులసిబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ విచారణ జరిపారు.



ఒంగోలు జీజీహెచ్ నుంచి బయటకు వస్తున్న తులసిబాబు

గుంటూరు జైలుకు తరలింపు

గుంటూరు జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న తులసి బాబును విచారణ నిమిత్తం ఒక రోజు కస్టడీకి న్యాయస్థానం అనుమతి ఇవ్వడం తెలిసిందే. గురువారం ఆయనను ఒంగోలుకు తరలించి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.30 వరకు విచారించారు. రాత్రి తాలుకా పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి..శుక్రవారం ఉదయం జీజీహెచ్‌లో వైద్య పరీక్షల నిర్వహించిన అనంతరం గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. 3 గంటల పాటు ఎస్పీ దామోదర్ ఆయనను విచారించారు.

2025-26లో పథకాల వారీగా రాష్ట్రానికి వచ్చే నిధులపై ఆర్థిక శాఖ అంచనా

- నాలుగు శాఖలకే దాదాపు 81 శాతం నిధులు



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఉప పథకాలకు, 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రావాల్సిన గ్రాంట్లు కలిపి రాష్ట్రానికి రూ.38,788 కోట్లు నిధులు వస్తాయని ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ నిధుల్లో కేవలం నాలుగు శాఖలకే 81శాతం మేర వస్తాయని తేల్చారు. కేంద్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆయా పథకాలకు కేటాయించిన నిధుల ఆధారంగా మన రాష్ట్రానికి ఎంత వస్తాయనేది అంచనా వేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ముఖ్యంగా ఆయా పథకాల కోసం గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మన రాష్ట్రానికి చేసిన కేటాయింపులను దృష్టిలో పెట్టుకుని ఈ అంచనాలు రూపొందించినట్లు పేర్కొంది. కేంద్ర బడ్జెట్‌లో వివిధ పథకాలకు రూ.5,20,961 కోట్లు కేటాయించగా, వాటిలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.38,788 కోట్లు వస్తాయని రాష్ట్ర ఆర్థిక శాఖ అంచనా వేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.13,750 కోట్లకు ప్రతిపాదనలు కేంద్రానికి పంపింది. అయితే గత రెండేళ్ల కేటాయింపులను పరిశీలిస్తే రాష్ట్రం నుంచి పంపిన ప్రతిపాదనల్లో సగం కన్నా తక్కువగా రూ.6,078 కోట్ల వరకు రావొచ్చని అధికారులు అంచనా వేశారు.

2025-26 కేంద్ర బడ్జెట్‌లో పథకాల వారీగా కేటాయింపులు, మన రాష్ట్రానికి వచ్చే నిధుల అంచనా, ఆయా పథకాల సంఖ్య ఇలా..

శాఖ	కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు (రూ.కోట్లలో)	రాష్ట్రానికి వచ్చే నిధులు అంచనా (రూ.కోట్లలో)	పథకాల సంఖ్య
పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ	2,07,497	18,264	12
జలవనరుల శాఖ	10,901	6,261	5
గృహనిర్మాణ శాఖ	74,698	4,351	3
ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ	53,616	2,510	6
మాధ్యమిక విద్యా విభాగం	61,410	2,037	4
మహిళా, శిశు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ శాఖ	27,207	1,356	7
మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ	25,808	1,081	9
వ్యవసాయ మార్కెటింగ్ -సహకార శాఖ	17,701	828	5
సాంఘిక సంక్షేమ శాఖ	9,541	415	4
పరిశ్రమలు-వాణిజ్య విభాగం	2,000	367	3
గిరిజన సంక్షేమ శాఖ	5,582	267	14
పశుసంవర్థక, మత్స్య శాఖ	3,515	189	6
హోం శాఖ	4,060	171	2
పౌర సరఫరాల శాఖ	7,151	168	5
స్కిల్ డెవలప్‌మెంట్	3,050	128	5
వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ	1,550	122	2
ఉన్నత విద్యా శాఖ	1,815	108	1
మైనారిటీ సంక్షేమ శాఖ	1,914	81	1
న్యాయ శాఖ	1,200	50	3
పర్యావరణం, అటవీ శాఖ	705	30	6
ప్రణాళిక విభాగం	40	4	1
మొత్తం	5,20,961	38,788	104

ఆధ్యాత్మిక సమాచారం

కల్యాణం.. కమనీయం

కడప కల్చరల్ : శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం కమనీయంగా నిర్వహించారు. అమ్మవారు కడప నగగరంలో కొలువు దీరిన రోజును పురస్కరించుకుని ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు 25 కలశాలలోని పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. యాగశాలలో చండీహోమం, ఆలయ మండపంలో నవావరణ శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ క్రతువును నిర్వహించింది.

క్వారీ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాల కోటేశ్వరస్వామి తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్వామి వారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 26వ తేదీన జరిగే తిరునాళ్లకు బందోబస్తు, గుడి వద్ద ఏర్పాట్లు, ఫెన్సింగ్, ట్రాఫిక్, ప్రభలు నిలుపు ప్రదేశాలు తదితరాలను ఆయన పరిశీలించారు. దేవదాయ ఇతరశాఖల అధికారులతో చర్చించారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఎ బరాత్ ప్రార్థనలు

మదనపల్లె సిటీ: ముస్లింలు పరమ పవిత్రంగా భావించి జరుపుకొనే పండుగ షబ్ ఎ బరాత్‌ను పురస్కరించుకుని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మతగురువులు ధార్మికోప్యాసం చేస్తూ షబేబరాత్ పండగ విశిష్టత తెలియజేశారు. వారు మాట్లాడుతూ అందరూ సన్మార్గంలో నడవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

వేణుగోపాల ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: పల్నాడు జిల్లా రెంటచింతలలోని శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ తృతీయ వార్షిక మహోత్సవాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి శాంతిక ల్యాణాన్ని తిలకించి భక్తులు పులకించారు.

వైభవంగా భావనాఋషి పెళ్లి కుమారుడి ఉత్సవం

మంగళగిరి: పాత మంగళగిరి భావనాఋషి స్వామి వారి పెళ్లి కుమారుడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి ఉత్సవాన్ని తిలకించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్లుకు అభిషేకం నిర్వహించి భావనాఋషి స్వామి, శ్రీ భద్రావతి దేవి వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా పురోహితులు వేదమంత్రాల మధ్య అలంకరించారు.



• వన్యప్రాణులు

ఏనుగమ్మా ఏనుగు బడికొచ్చింది ఏనుగు

ఇంతకు పూర్వం ఊళ్లోకి ఏనుగు వస్తే పిల్లలకి సంబరం. 'ఏనుగమ్మా ఏనుగు మా ఊరొచ్చింది ఏనుగు'... అని పాడేవారు. ఏనుగులను పట్టుకుని, మచ్చిక చేసుకుని అనేక పనులకు ఉపయోగిస్తుంటారు మనుషులు. ఏనుగులను ఎంత ప్రేమగా చూసుకున్నా వాటికి సంకెళ్లు వేసి బంధించడం, తక్కువ ఆహారం పెట్టడం, అంకుశంతో గుచ్చడం ఇవన్నీ బాధపెట్టే అంశాలే. సఫారీల్లో షికార్లకు ఏనుగు మీద ఎక్కి తిరిగిగే ఏనుగు వెన్నుకు



సంబంధించిన సమస్యలు వస్తాయి. ఏనుగులు అడవుల్లో స్వేచ్ఛగా ఉండాలి. ఈ ఎరుక మనందరికీ ఉండాలి. అందుకే 'పెటా' (మూగజీవుల కోసం పని చేసే సంస్థ) అచ్చు ఏనుగులాంటి మిషన్ ఏనుగును తయారు చేసి స్కూళ్లకు తీసుకు వస్తున్నారు. ఈ ఏనుగుకు వారు 'ఎలీ' అని పేరు పెట్టారు. ఎలీ బెంగళూరులోని ఒక స్కూలు వస్తే పిల్లల సంబరం ఈ ఫోటోలు. ఎలీ నిజం ఏనుగులాగా కనురెప్పలు కొట్టగలదు... తొండం ఊపగలదు.... అంతే కాదు తనను మనుషులు ఎంత ఇబ్బంది పెడతారో చెప్పగలదు. అవన్నీ విన్న పిల్లలు వన్యప్రాణుల పట్ల ఎంత దయగా ఉండాలో తెలుసుకుంటారు.

• మహనీయులు

బ్రిటిష్‌ను ఎదిరించిన కిత్తూరు చెన్నమ్మ



పిల్లలూ! బ్రిటిష్ వారికి ఎదురు నిలిచి పోరాడిన ఝాన్సీ లక్ష్మీబాయి గురించి మీకు తెలుసు. అలాంటి వ్యక్తే మరొకరున్నారు. ఆమె పేరు కిత్తూరు చెన్నమ్మ. ఝాన్సీ లక్ష్మీబాయి కంటే ముందే ఆమె బ్రిటిష్ వారిని ఎదురించి సత్తా చాటారు. ఆమె గురించి ఇవాళ తెలుసుకుందాం.

కిత్తూరు చెన్నమ్మ పుట్టింది కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లాలోని కాకతి అనే ఊళ్లో. ఆమె తండ్రి ధూళప్ప దేశాయ్, తల్లి పద్మావతి. చిన్ననాటి నుంచే చెన్నమ్మ ఎంతో ధైర్యంతో మెలిగేది. గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం, విలు విద్యలో శిక్షణ పొందింది. 9 ఏళ్ల వయసులో రాజా మల్ల సర్జాతో పెద్దకు ఆమెకు పెళ్లి చేశారు. ఆయన కిత్తూరు రాజ్యానికి రాజు. చెన్నమ్మకు 38 ఏళ్ల వయసులో ఆమె భర్త మరణించారు. ఆ దు:ఖంలో నుంచి ఆమె కోలుకోక ముందే మరికొన్నేళ్లకు ఆమె ఒక్కాగానొక్క కొడుకు కూడా మరణించాడు. దీంతో ఆమె ఒంటరిదైపోయింది. రాజు మరణించి వారసులు లేని రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని బ్రిటిష్ అధికారులు పన్నాగం వేశారు. వారి నుంచి తన రాజ్యాన్ని కాపాడుకోవడం కోసం ఆమె ఆలోచించి, శివలింగప్ప అనే అబ్బాయిని దత్తత తీసుకుని వారసుడిగా ప్రకటించింది.

దీన్ని బ్రిటిష్ అధికారులు ఒప్పుకోలేదు. శివలింగప్పను బహిష్కరించాలని, రాజ్యాన్ని తమకు అప్పగించాలని ఒత్తిడి తెచ్చారు. కానీ ఆమె వారిని తలొంచలేదు. తాను బతికుండగా తన రాజ్యప్రజలు మరొకరి కింద బానిసలుగా బతకడం తాను సహించనని తేల్చి చెప్పింది. దీంతో బ్రిటిష్ వారు యుద్ధం ప్రకటించారు. యుద్ధంలో తన సైనికులతో కలిసి బ్రిటిష్ సేనల మీద పోరు జరిపింది. ఎంతోమందిని నేలకూల్చింది. బ్రిటీష్ వారు రెండోసారి మరింత సైన్యాన్ని రప్పించి యుద్ధం చేశారు. ఆమె ఏమాత్రం భయపడకుండా వారిని అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. చివరకు వారి చేతిలో బందీగా మారి, కోటలో ఉండిపోవాల్సి వచ్చింది. అక్కడే ఆమె ఆరోగ్యం క్షీణించడంతో 50 ఏళ్ల వయసులో మరణించింది.


కిత్తూరు చెన్నమ్మ ధైర్యసాహసాలను, త్యాగాన్ని స్మరిస్తూ నేటికీ కర్ణాటక మొత్తం ఆమెను స్మరించుకుంటారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 22–24 తేదీలలో కిత్తూరు ఉత్సవం జరుపుకుని ఆమె వీర గాథను అందరికీ వినిపిస్తారు.

• పెద్దల మాట


తెలిసినా దాని గురించి
వాదించకపోవడం,
శక్తి సామర్థ్యాలు ఉండీ
ఇతరుల తప్పులు క్షమించడం,
చేసిన దానాన్ని
మరచిపోగలగడం
ఉన్నతుల గొప్ప గుణం

ఓర్పు ఓటమి ఎరుగదు.
సహనంతో సాధ్యం
కానిది లేదు.
ఈ రెండూ ఉన్న వాళ్ళు
జీవితంలో
ఎప్పటికీ ఓడిపోరు

ధనంతో ముడిపడిన బంధం
ధనం ఉన్నంతవరకే
దగ్గరగా ఉంటుంది.
మనసులలో ముడిపడిన బంధం
మనిషి ఉన్నంత వరకు
తోడుగా ఉంటుంది







• చల్లటి వింత

మంచుకొండలు.. మనింటి ముందుకొస్తాయ్

మంచుకొండల మధ్య ఎప్పుడైనా ఉన్నారా? బయట మంచుతో ఉండగా గుహలో కూర్చుని ఆ వాతావరణాన్ని ఆనందించారా? అమ్మో! అదంతా మా వల్ల ఎలా అవుతుంది అనుకుంటున్నారా? అలా అనుకునేవారికోసమే అమెరికాకు చెందిన బ్రెన్ట్ క్రిస్టెన్‌సెన్ అనే ఆయన 'Ice Castles' అనే సంస్థ స్థాపించారు. ఈ సంస్థ ప్రత్యేకతేమిటంటే, మీరున్న చోటే మంచుకొండల్ని ఏర్పాటు చేస్తారు. మిమ్మల్ని ఒక కొత్త లోకంలోకి తీసుకెళ్తారు. మంచుకొండల్లోకి వెళ్లి, ఆ అనుభూతి పొందలేని వారి కోసం వారున్న చోటే అందంగా వాటిని సృష్టించి ఇస్తారు. ఈ ఫొటోల్లో ఉన్నది అలాంటి మంచు కొండలే. అసలిది ఎలా మొదలైంది?

బ్రెన్ట్ క్రిస్టెన్‌సెన్‌కు ఆరుగురు పిల్లలు. చిన్నతనంలో వారి ఆనందం కోసం ఏదైనా చేయాలని ఆయన అనుకున్నారు. రకరకాల ఆలోచనల తర్వాత, వారికోసం మంచుకొండల్ని, ఆ వాతావరణాన్ని సృష్టిస్తే ఎలా ఉంటుందని అనిపించింది. వెంటనే ఐసుముక్కలు, స్నో వంటివాటిని ఉపయోగించి, తన ఇంటి పెరట్లో ఒక మంచుకొండను తయారుచేశారు. దాన్ని చూసి ఆ పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకున్నారు. వాళ్లలాగే చాలామంది అలా ఆడుకోవాలని ఆయనకు అనిపించింది. దీంతో 2011లో 'Ice Castles' ప్రారంభించారు.

మీరున్న చోటికి ఈ సంస్థ ప్రతినిధుల్ని పిలిస్తే మంచుకొండల్ని, ఆ వాతావరణాన్ని అందంగా తయారుచేసి ఇస్తారు. అందుకోసం ఫీజు తీసుకుంటారు. అయితే ఇది కేవలం అమెరికా వరకే పరిమితం. పెళ్లిళ్ల, పుట్టినరోజులు, ఈవెంట్లు వంటివాటికి వీరి చేత చాలామంది అలాంటి మంచువాతావరణాన్ని ఏర్పాటు చేయించుకుంటున్నారు. పిల్లలు అక్కడ కేరింతలు కొడుతూ ఆడుతుంటే, పెద్దలు వారిని చూసి ఆనందపడుతున్నారు.

ఈ పని తాను మొదలుపెట్టినా, విజయవంతంగా కొనసాగడానికి అనేకమంది కళాకారులు పనిచేస్తున్నారని అంటున్నారు బ్రెన్ట్ క్రిస్టెన్‌సెన్. రకరకాల డిజైన్లు, కొత్త కొత్త థీమ్స్‌తో మంచుకొండలు, గుహల్ని రూపొందిస్తూ పిల్లల్ని అలరించడమే తమ లక్ష్యం అని ఆయన వివరిస్తున్నారు.

• ఇన్‌స్పిరేషన్

ఈ అమ్మాయి లక్ష మొక్కలు నాటింది



'ప్రసిద్ధి సింగ్‌'ను 'చెట్ల అమ్మాయి' అని పిలవొచ్చు. ఎందుకంటే ఎక్కడ ప్రసిద్ధి ఉంటే అక్కడ ఒక చెట్టయినా ఊపిరి పోసుకుంటుంది. తమిళనాడులోని చెంగల్పట్టుకు చెందిన 14 ఏళ్ల ప్రసిద్ధి ఇప్పటికి లక్ష మొక్కలు నాటిందంటే నమ్ముతారా? కాని నిజం. ఇటీవల కేరళలో నిర్వహించిన 'మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' తన లక్ష్యం పది లక్షల మొక్కలు నాటడం అని తెలిపి అందరిలో స్ఫూర్తి నింపింది.

2016లో ప్రసిద్ధికి ఆరేళ్లు ఉన్నప్పుడు తుపాను వారి ప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. అనేక చెట్లు నేలకూలాయి. ఆ వయసులోనే ప్రసిద్ధి నేలకూలిన మొక్కలను చూసి బాధపడింది. తర్వాత కొన్ని స్వచ్ఛంద సంస్థలు మొక్కలు నాటే కార్యక్రమం చేపడితే ఉత్సాహంగా తనూ పాల్గొంది. రెండేళ్ల పాటు తమిళనాడులోని రకరకాల ప్రాంతాలకు వెళ్లి మొక్కలు నాటింది. నాటే కొద్దీ ఆ అమ్మాయికి మొక్కల కోసం పని చేయాలనిపించి లక్ష మొక్కలు నాటాలని నిర్ణయించుకుంది.



ఆ వయసులో అది సాధ్యమా అని ఎవరైనా తనని అడిగితే, 'చిన్న కొవ్వొత్తి ఇంటికంతా వెలుగు ఇవ్వడం లేదా? ఇది కూడా అంతే. సంకల్పం బలంగా ఉంటే తప్పక సాధ్యమవుతుంది' అని చెప్పేది.

ఆ తర్వాత అనేక కార్యక్రమాల్లో పాల్గొని మరికొంతమందిని కలుపుకొని 'ప్రసిద్ధ ఫారెస్ట్ ఫౌండేషన్' ప్రారంభించింది. అందులో కార్యక్రమాలు నిర్వహించేందుకు నిధుల కోసం తోటి పిల్లలకు పెయింటింగ్, యోగా నేర్పేంది. అలా వచ్చిన డబ్బుతో కార్యక్రమాలు నిర్వహించేది. ఈ క్రమంలో ఎన్నో పాఠశాలలకు వెళ్లి, అక్కడి పరిసరాల్లో మొక్కలు నాటేందుకు అనుమతి కోరింది. ఇంత చిన్నపిల్ల ఏం చేస్తుందా అని వారు ఆశ్చర్యపోయినా, తనకు అవకాశం ఇచ్చేవారు. అలా అనేక పాఠశాలల్లో మొక్కలు నాటింది. మెల్లగా తన గురించి అందరికీ తెలిసింది. తన సంకల్పానికి మరి కొందరు తోడయ్యారు. అలా ఇప్పటికి 110 ప్రాంతాల్లో 1.3 లక్షల కంటే ఎక్కువ మొక్కలు నాటింది.

పర్యావరణం కోసం, అడవుల సంరక్షణ కోసం ఆమె చేస్తున్న పనికి మెచ్చుకుంటూ 2021లో పీఎం రాష్ట్రీయ బాల్ పురస్కార్ అందించారు. తమిళనాడు వాతావరణ సదస్సు 3.0లో ఆమెను చైల్డ్ ఛాంపియన్ స్పీకర్‌గా యునిసెఫ్ గుర్తించింది. త్వరలో తమిళనాడులోని 200 పాఠశాలల్లో 'Green Brigade' కార్యక్రమం మొదలుపెట్టి, విద్యార్థులకు అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ గురించి వివరించి, వారిని అందులో భాగస్వాములను చేయనుంది.

• పాడుదాం గేయం

అంకెలన్నీ ఒక్కటై



ఒకటి.. ఒకటి.. ఒకటి
మనుషులంతా ఒక్కటి
రెండు.. రెండు.. రెండు
కష్టించే చేతులు రెండు

మూడు.. మూడు.. మూడు
రోజుకు పూటలు మూడు
నాలుగు.. నాలుగు.. నాలుగు
బండికి చక్రాలు నాలుగు

ఐదు.. ఐదు.. ఐదు
చేతికి వేళ్లు ఐదు
ఆరు.. ఆరు.. ఆరు
రుతువులు మనకు ఆరు

అంకెలన్నీ కలిసి ఒక్కచోట చేరి
అందరమూ కలిసి ఒక్కటై నిలిచి
ఆనందంగా గడపాలి
అనురాగంతో బతకాలి

• జాతీయం

అలతి అలతి పదాలు...

అలతి అలతి తునియల కాహళ సంధించిన విధంబున కవిత్వం ఉండాలి అని ఒక కవి అంటాడు. అంతదాకా ఎందుకు.. అన్నమయ్య గురించి చెప్పేటప్పుడు అలతి అలతి పదాలతో కవితలల్లుతాడని చెబుతారు. ఇంతకీ అలతి– అంటే చిన్న, మృదు మధురమైన అని అర్థం.

● తెలుగులో దీర్ఘ సమాసాల తోడి రచన, చిన్ని చిన్ని పదాల కూర్పు తోడి రచన రెండూ చాలా కాలంగా ఉన్నాయి.

● తేలిక పదాలతో ఉండే వేమన, పోతులూరి వీరబ్రహ్మం పద్యాలలో, తత్వాలలో అలతి అలతి పదాలెన్నో ఉన్నాయి. అయితే వాటి గురించి వివరించి చెప్పవలసిన నిగూఢ విషయాలూ ఎన్నో ఉన్నాయి.

• మన సినిమా

మొసలిని పెంచుకుందామా?



ఎవరినైనా మీకిష్టమైన పెట్ ఏంటి అనడిగితే కుక్కో, పిల్లో అని చెబుతారు. లేదా చిలుక, పావురం అని చెబుతారు. కొందరు కుందేళ్లను పెంచుకుంటారు. కాని ఎవరైనా మొసలిని పెట్‌లా ఇంట్లో పెంచుకోవాలనుకుంటారా? ఈ సినిమాలో అదే జరిగింది. పేరు 'లైల్ లైల్ క్రొకడైల్. పేరు కాస్త చిలిపిగా ఉంది కదూ...మూవీ కూడా అంతే.. స్టోరి గురించి చెప్పాలంటే న్యూయార్క్ సిటీలోని ఫేమస్ మెజీషియన్ హెక్టర్ పి వాలంటి నేషనల్ టాలెంట్ షోలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంటాడు. ఈసారి ఎలా అయినా గెలవాలని ఓ పెట్ స్టోర్‌కి వెళతాడు. అక్కడ పాటలు పాడే చిన్ని క్రొకడైల్‌ని చూసి తన ఇంటికి తీసుకొస్తాడు. దానికి లైల్ అని పేరు పెడతాడు. మెజీషియన్ ఎలా అయినా లైల్‌తో స్టేజ్ మీద పాడించి రిచ్‌మాన్ అవుదామనుకుంటాడు. కాని లైల్‌కి స్టేజ్ ఫియర్ వల్ల పాడలేకపోతుంది. ఇక చేసేది లేక మెజీషియన్ లైల్‌ని తన ఇంట్లో వదిలేసి డబ్బు సంపాదిద్దామని వేరే ప్రదేశానికి వెళతాడు. 18 నెలల తరువాత అదే ఇంట్లో జోష్ ఫ్యామిలీ దిగుతుంది. అప్పటికి బాగా పెద్దదయిన లైల్‌ను చూసి హడలిపోతారు. అయితే మెల్లగా ఆ కుటుంబానికి, లైల్‌కు దోస్తీ కుదురుతుంది. తర్వాత ఏమవుతుందనేది కథ. నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న లైల్ లైల్ క్రొకొడైల్‌ను చూడండి. ఇది యానిమేటెడ్ ఫ్యాంటసీ ఫిల్మ్. సో కిడ్స్ లెట్స్ పెట్ ది క్రొకడైల్ విత్ యువర్ రిమోట్.

- ఇంటూరు హరికృష్ణ

• కథ

పిసినారి ముసలామె



ఒక వూరిలో ఒక పిసినారి వుండేటోడు. అతను తన దగ్గర పని చేసే వాళ్లు ఏ తప్పూ చేయకపోయినా ఏదో ఒక తప్పు చూపించి జీతం ఎగ్గొట్టేవాడు.

ఒకసారి ఒక ముసలామె పని వెదుక్కుంటా పిసినారి వద్దకు వచ్చింది. పిసినారి ఆమెతో 'ఇల్లంతా తుడిచి పెట్టాలి. ఈగగానీ, దోమగానీ కనబడకూడదు. కనబన్నాయనుకో ఈగకు వంద చొప్పున జీతంలో పట్టుకుంటా. ఏం సరేనా' అన్నాడు. ముసలామె సరే అనింది. ఆ రోజు నుంచీ రోజూ పొద్దున్నే ఇల్లంతా ఫినాయిలు వేసిన నీళ్ళతో కడిగేది. ఎక్కడా చెత్త, దుమ్ము లేకుండా చూసుకునేది. అలా నెలరోజులు గడచిపోయినాయి. జీతం ఇచ్చే రోజు వచ్చింది.

పిసినారి ఒక బెల్లం ముక్క తెచ్చినాడు. ముసలామెకు కనబడకుండా అలమరాలోఒక మూలకు పెట్టినాడు. తీపివాసన తగలగానే ఎక్కడెక్కడి ఈగలు వచ్చి వాలతాయి గదా... కాసేపటికే ఝుమ్మని ఐదు ఈగలు లోపలికి వచ్చేసినాయి. పిసినారి వాటిని చూపించి ముసలామెను కోప్పడతా 'నీకు ముందే చెప్పాను. ఒక్కో ఈగకు వంద జీతంలో పట్టుకుంటా అని' అంటా ఐదు ఈగలు చూపించి చేతిలో ఐదు వందలు పెట్టినాడు. అలా నాలుగు నెలలు గడచిపోయినాయి. నెలంతా ఎక్కడా కనబడని ఈగలు జీతాలరోజే కనబడతా వున్నాయంటే ఏదో మోసం వుందని అనిపించింది ముసలామెకు. ఒక రోజు పిసినారి బెల్లం ముక్క అలమరాలో పెట్టడం చూసింది. 'అమ్మ దొంగా... ఇదా సంగతి' అనుకోనింది.

తరువాత రోజు పిసినారి నిద్రపోతుంటే బెల్లం పొడి తడి చేసి ముక్కు మీద పూసింది. కాసేపటికి బెల్లం వాసన తగిలి ఒక ఈగ రయ్యిమని వచ్చి పిసినారి ముక్కు మీద వాలింది. అతను లేచాడు. అంతే... ముసలామె ఒక లావు కట్టె తీసుకోని వురుక్కుంటా 'సామీ... కదలొద్దు... నీ ముక్కు మీద ఈగ వుంది. దాని సంగతి చూసుకుంటా' అనింది కట్టె పైకెత్తి.

'ఓ ముసలమ్మా... దాంతో కొడితే ఈగ సంగతేమో గానీ నా ముక్కు పచ్చడి ఐపోతాది. వదిలేసెయ్' అన్నాడు. దానికామె 'అమ్మా... వదిలితే నా జీతంలో వందా పోతాది. ఈ రోజు దీని అంతు చూడవలసిందే' అనింది పళ్ళు పటపటా కొరుకుతా.



ఆ మాటలకు పిసినారి అదిరిపోయినాడు. ఆమెకు ఎందుకు అలా చేస్తున్నదో అర్థమైంది. 'తల్లీ... తప్పయిపోయింది. నీకు ఎగ్గొట్టిన జీతం నీ చేతిలో పెడతా. ఈ ఒక్కసారికి వదిలేయ్' అంటా దండం పెట్టినాడు. అప్పుడు ఆ ముసలామె 'సరే అయితే' అని లోపల్లోపల నవ్వుకుంటా కట్టె దించింది.

పిసినారి గమ్మున లోపలికి పోయి డబ్బు తెచ్చి ఆమె చేతిలో పెట్టినాడు.

- డా.ఎం.హరికిషన్

బిజినెస్ రీల్

జియోహాట్‌స్టార్ వచ్చేసింది..


జియోసినిమా, డిస్నీప్లస్ హాట్‌స్టార్ ప్లాట్‌ఫాంల విలీనం



న్యూఢిల్లీ: జియోసినిమా, డిస్నీప్లస్ హాట్‌స్టార్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంల కలయికతో తాజాగా జియోహాట్‌స్టార్ అందుబాటులోకి వచ్చింది. వయాకామ్18, స్టార్ ఇండియా విలీనం ద్వారా కొత్తగా ఏర్పాటైన జాయింట్ వెంచర్ సంస్థ జియోస్టార్ ఈ విషయం వెల్లడించింది. దీనితో 50 కోట్ల మంది పైగా యూజర్లకు సుమారు 3 లక్షల గంటల వినోదం, లైవ్ స్పోర్ట్స్ కవరేజీ మొదలైనవి అందుబాటులో ఉంటాయని పేర్కొంది. యూజర్ల అవసరాలకు అనుగుణంగా రూ. 149 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లు ప్రారంభమవుతాయని తెలిపింది. ప్రస్తుత జియోసినిమా, డిస్నీప్లస్ హాట్‌స్టార్ యూజర్లు తమ జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌కు సులువుగా మారొచ్చని వివరించింది. డిస్నీ, వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ హెచ్‌బీవో, పారామౌంట్ మొదలైన వాటన్నింటికీ సంబంధించిన హాలీవుడ్ కంటెంట్‌ను కూడా వీక్షించవచ్చని పేర్కొంది.

ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌లు వెనక్కి

- స్వాధీనం చేసిన 20 సంస్థలు
- మరో 17 సంస్థల లైసెన్స్‌ల రద్దు



ముంబై: రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ తమ ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌లను వెనక్కిచ్చేశాయి. ఇలా మొత్తం 20 బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ (సీవోఆర్)లను స్వాధీనం చేసినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. ఇందులో మనోవే ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేటు లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ ఎన్‌బీఎఫ్‌సీ వ్యాపారం నుంచి తప్పుకున్నాయి. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్, ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్ హోల్డింగ్ కంపెనీ లిమిటెడ్ తదితర 16 సంస్థలు విలీనాల కారణంగా సీవోఆర్‌ను స్వాధీనం చేశాయి. వీటికి అదనంగా ఆర్‌బీఐ తనంతటగా 17 ఎన్‌బీఎఫ్‌సీల సీవోఆర్‌లను రద్దు చేసింది. వీటి రిజిస్టర్డ్ కార్యాలయం పశ్చిమబెంగాల్‌లో ఉన్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. మరోవైపు కామధేను ఫైనాన్స్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ లైసెన్స్‌ను పునరుద్ధరించినట్టు ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-2-2025

విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BRITANNIA	4,935.00	0.95
ICICIBANK	1,259.00	0.81
NESTLEIND	2,194.00	0.76
INFY	1,853.00	0.53
HCLTECH	1,711.60	0.5

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,060.05	-4.63
BEL	250	-4.42
ADANIENT	2,149.00	-4.26
TRENT	5,105.00	-2.89
GRASIM	2,423.00	-2.69

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,491
ఎన్‌ఎస్‌ఈ	85,659
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,79,902
ఎఫ్‌ఐఐ	- 4,295
డీఐఐ	+ 4,364

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	70.76	$	71.29
బ్రెంట్	74.75	$	75.02

భారత ఫార్మాకు కొత్త అవకాశాలు



25 ఔషధాలకు ముగియనున్న పేటెంట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ రంగంలో ఉన్న భారతీయ కంపెనీలకు 2025–26లో మరిన్ని కొత్త అవకాశాలు అందనున్నాయి. భారీ అమ్మకాలను నమోదు చేస్తున్న సుమారు 25 ఔషధాల పేటెంట్ల గడువు ముగియనుండడమే ఇందుకు కారణం. భారతీయ సంస్థలకు మరింత సరసమైన ప్రత్యామ్నాయాలను అంతర్జాతీయంగా పరిచయం చేయడానికి ఇదొక పెద్ద అవకాశం కానుంది. ప్రపంచ జెనరిక్ ఔషధ మార్కెట్లో తయారీ, ఎగుమతుల పరిమాణం పరంగా ఇప్పటికే అగ్రస్థానంలో నిలిచిన భారత్ 20 శాతంపైగా ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. భారత్ బలమైన స్థానాన్ని కైవసం చేసుకుని తన హవాను కొనసాగిస్తోంది. వచ్చే 14 నెలల్లో పేటెంట్ల కాల పరిమితి ముగిసే ఔషధాలు భారత్ పాత్రను మరింత మెరుగుపర్చనున్నాయి.

ఏటా రూ. 25.80 వేల కోట్లకుపైగా..

క్యాన్సర్ ఇమ్యునోథెరపీ కోసం యూఎస్ ఫార్మా దిగ్గజం మెర్క్ అభివృద్ధి చేసిన కీట్రూడా, అలాగే మధుమేహం, స్థూలకాయం చికిత్సకై డెన్మార్క్ కంపెనీ నోవో నార్డిస్క్ ఉత్పత్తి చేసిన ఓజెంపిక్ వంటి కీలక ఔషధాల పేటెంట్లు 2025–26లో ముగుస్తాయి. కీట్రూడా ఒక్కటే 2024లో రూ.2,15,000 కోట్లకుపైగా అమ్మకాలను ఆర్జించింది. బ్రిస్టల్-మేయర్స్ స్క్విబ్ తయారీ బ్లడ్ థిన్నర్ అయిన ఎలిక్విస్, నోవార్టిస్ ఉత్పత్తి చేసిన ఇమ్యునాలజీ డ్రగ్ కోసెంటిక్స్ వంటి ఇతర ముఖ్య ఔషధాలు సైతం ఈ జాబితాలో ఉన్నాయి. 2023–2029 మధ్య క్యాన్సర్, మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక వ్యవస్థకు వచ్చే రుగ్మతల చికిత్సలో ఉపయోగించే 100 కంటే ఎక్కువ క్లిష్ట ఔషధాల పేటెంట్ల గడువు ముగుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మందుల వార్షిక అమ్మకాలు రూ.25,80,000 కోట్లకు పైమాటే. ఇది జెనరిక్స్, బయోసిమిలర్ల తయారీలో ఉన్న దేశీయ కంపెనీలకు అదనపు అవకాశాలను సృష్టించనుందని అనడంలో అతిశయోక్తి కాదు.

వార్షిక వృద్ధి 7 శాతంపైగా..

యూరోపియన్ ఫార్మాస్యూటికల్ రివ్యూ ప్రకారం ప్రధానంగా ఈ పేటెంట్ల గడువు ముగియడంతో జెనరిక్స్ డిమాండ్ ప్రపంచవ్యాప్తంగా సగటు వార్షిక వృద్ధి 7 శాతంపైగా నమోదవుతుందని అంచనా. సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, బయోకాన్, అరబిందో, హెటిరో, లీ ఫార్మా వంటి భారతీయ సంస్థలు దీని నుండి లాభపడతాయి. బయోసిమిలర్ల విభాగంలోనూ దేశీయ కంపెనీలు ముందుకు దూసుకెళ్తున్నాయి. అయినప్పటికీ ఈ కంపెనీలు చవక జెనరిక్స్ తయారీదారుల నుండి ముఖ్యంగా చైనాలో ఉన్న సంస్థల నుంచి పోటీని ఎదుర్కొంటున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. యూఎస్ వంటి మార్కెట్లలో ధరల ఒత్తిడి, ఫార్మసీల నుండి గణనీయ తగ్గింపుల కోసం డిమాండ్లు కంపెనీల లాభాలను ప్రభావితం చేయవచ్చని నివేదికల ద్వారా తెలుస్తోంది.

డిసెంబర్‌లో రూ.21,183 కోట్లు..

భారత్ నుంచి ఔషధాల ఎగుమతులు 2024 డిసెంబర్‌లో రూ.21,183 కోట్లు నమోదయ్యాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇవి 2.69 శాతం అధికం అయ్యాయి. ఏప్రిల్–డిసెంబర్‌లో ఎగుమతులు 7.85% దూసుకెళ్లి రూ.1,82,021.36 కోట్లకు చేరాయి. ఫార్మా దిగుమతులు డిసెంబర్‌లో 12.85% పెరిగి రూ.7,033 కోట్లను తాకాయి. ఏప్రిల్–డిసెంబర్ కాలంలో ఇవి 7.94% ఎగసి రూ. 55,551.4 కోట్లు నమోదు చేశాయి. దేశం నుంచి 2023–24లో సుమారు రూ.2,36,300 కోట్ల విలువైన ఔషధాలు పలు దేశాలకు సరఫరా అయ్యాయి.

జెనరిక్ మెడిసిన్ అంటే..

బ్రాండెడ్ మెడిసిన్ అనేది పేటెంట్ పొందిన, బ్రాండ్ పేరుతో విక్రయించే ఒక కొత్త ఔషధం. నూతన ఔషధాన్ని నిర్ణీత వ్యవధిలో తయారు చేయడానికి, అలాగే విక్రయించడానికి ప్రత్యేక హక్కును చట్టపరంగా కల్పించడమే పేటెంట్. పేటెంట్ పొందిన ఔషధం యొక్క కాపీయే జెనరిక్ మెడిసిన్. పేటెంట్ గడువు ముగిసిన తర్వాత నియంత్రణ సంస్థల అనుమతితో జెనరిక్స్ ఔషధాలు తయారు చేసి విక్రయించవచ్చు. భారతీయ ఔషధ కంపెనీలకు యూఎస్, యూకే, రష్యా, దక్షిణాఫ్రికా ప్రధాన మార్కెట్లు.

బీహెచ్‌ఈఎల్‌కు రూ.6,700 కోట్ల ఆర్డర్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్‌ఈఎల్ తాజాగా సింగరేణి కాలరీస్ కంపెనీ నుండి రూ.6,700 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు తెలిపింది. ఇందులో భాగంగా తెలంగాణలోని మంచిర్యాల వద్ద 800 మెగావాట్ల సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రాజెక్ట్ డిజైన్, ఇంజనీరింగ్, తయారీ, సరఫరా, నిర్మాణం, కార్యరూపంలోకి తేవడంతోపాటు సివిల్ పనులను చేపడుతుంది. ప్రతిపాదిత యూనిట్ ప్రస్తుతం పని చేస్తున్న 2 x 600 మెగావాట్ల యూనిట్లకు ఆనుకొని ఏర్పాటు చేస్తారు. ఈ రెండు యూనిట్లను బీహెచ్‌ఈఎల్ 2016 ప్రారంభించడం విశేషం. ముఖ్యంగా తెలంగాణలోని వివిధ విద్యుత్ సంస్థల కోసం 75 శాతానికి పైగా బొగ్గు ఆధారిత సెట్స్‌ను బీహెచ్‌ఈఎల్ విజయవంతంగా ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా 1,70,000 మెగావాట్లకుపైగా సామర్థ్యం గల విద్యుత్ ప్రాజెక్టుల ను ఏర్పాటు చేసింది.

ఐవోసీ భారీ కాంట్రాక్ట్

- యూఏఈ నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి
- డీల్ విలువ 7–9 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) భారీ డీల్‌కు తెరలేపింది. ఇందులో భాగంగా యూఏఈ నుంచి లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌ను (ఎల్ఎన్‌జీ) దిగుమతి చేసుకోనుంది. 14 ఏళ్ల ఈ దీర్ఘకాలిక కాంట్రాక్ట్ విలువ 7–9 బిలియన్ డాలర్లు. ఏడీఎన్ఓసీ గ్యాస్‌తో ఈ మేరకు ఐవోసీ ఒప్పందం చేసుకుంది. 2026 నుంచి ఏటా 1.2 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని ఏడీఎన్ఓసీ గ్యాస్ సరఫరా చేయనుంది. ఇండియా ఎనర్జీ వీక్ సందర్భంగా ఇరు సంస్థల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌తోనూ (బీపీసీఎల్) ఏడీఎన్ఓసీ ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం 2025 ఏప్రిల్ నుంచి అయిదేళ్లలో 2.4 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్‌కు 10 ఏళ్ల పాటు ఏటా 4,00,000 టన్నుల ఎల్ఎన్‌జీ విక్రయించేందుకు ఫ్రెంచ్ దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ చేతులు కలిపింది. బీపీసీఎల్ ఈ సందర్భంగా బ్రెజిల్‌కు చెందిన పెట్రోబ్రాస్‌తో 6 మిలియన్ బ్యారెళ్ల వరకు ముడి చమురు కొనుగోలుకై ఒప్పందాన్ని చేసుకుంది. దేశంలో తొలిసారిగా అలల నుంచి విద్యుత్ ఉత్పత్తికై ముంబై వద్ద 100 కిలోవాట్ సామర్థ్యంతో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ఎకో వేవ్ పవర్‌తో బీపీసీఎల్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

క్యూ3 ఫలితాలు

ఈజ్‌మైట్రిప్ లాభం క్షీణత

క్యూ3లో రూ. 34 కోట్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఈజ్‌మైట్రిప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 34 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో దాదాపు రూ. 46 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 165 కోట్ల నుంచి రూ. 154 కోట్లకు నీరసించింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 105 కోట్ల నుంచి రూ. 108 కోట్లకు పెరిగాయి.

ఈజీ ట్రిప్ ప్లానర్స్ షేరు బీఎస్ఈలో 3% నష్టంతో రూ. 12 వద్ద ముగిసింది.

గ్లాక్సోస్మిత్‌క్లెయిన్ లాభం జూమ్

క్యూ3లో రూ. 229 కోట్లు



న్యూఢిల్లీ: గ్లోబల్ హెల్త్‌కేర్ దిగ్గజం గ్లాక్సోస్మిత్‌క్లెయిన్ ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 రెట్లు జంప్‌చేసి రూ. 229 కోట్లకు చేరింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 45 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 805 కోట్ల నుంచి రూ. 949 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో గ్లాక్సోస్మిత్‌క్లెయిన్ ఫార్మా షేరు బీఎస్ఈలో 1.1 శాతం బలపడి రూ. 2,018 వద్ద ముగిసింది.

హిందుజా గ్లోబల్‌కు నష్టాలు

రూ. 9 కోట్లు



న్యూఢిల్లీ: బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ కంపెనీ హిందుజా గ్లోబల్ సొల్యూషన్స్(హెచ్‌జీఎస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో లాభాలను వీడి దాదాపు రూ. 9 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 8 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 12 శాతం క్షీణించి రూ. 1,064 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో రూ. 1,204 కోట్ల టర్నోవర్ అందుకుంది. 2024 డిసెంబర్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 18,169గా నమోదైంది. 2025 జనవరిలో బెంగళూరులో టెక్నాలజీ డెలివరీ సెంటర్‌ను ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌జీఎస్ షేరు బీఎస్ఈలో 5% జంప్‌చేసి రూ. 595 వద్ద ముగిసింది.

రియల్టీ వైపు క్విప్ చూపు..

- గతేడాది రూ. 22,320 కోట్లు సమీకరించిన రియల్ ఎస్టేట్ సంస్థలు
- అన్ని రంగాలకు రూ. 1,41,482 కోట్ల నిధులు
- అనరాక్ నివేదిక



న్యూఢిల్లీ: క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్విప్) మార్గంలో ఇన్వెస్టర్లకు ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా రియల్ ఎస్టేట్ డెవలపర్లు గతేడాది రూ. 22,320 కోట్లు సమీకరించాయి. 2024లో అన్ని రంగాలు కలిసి 99 క్విప్ ఇష్యూల ద్వారా మొత్తం రూ. 1,41,482 కోట్లు సమకూర్చుకున్నాయి. ఇందులో రియల్ ఎస్టేట్ రంగం అగ్రస్థానంలో నిల్చింది. 8 డెవలపర్లు, 1 రీట్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) కలిసి రూ. 22,320 కోట్లు సమీకరించాయి. క్విప్ ద్వారా వచ్చిన మొత్తం నిధుల్లో ఇది 16 శాతం. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మార్కెట్లలో హెచ్చుతగ్గులు నెలకొన్నప్పటికీ క్యాపిటల్ మార్కెట్లు పటిష్టంగానే ఉన్నాయని, కంపెనీలు భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగం వృద్ధి అవకాశాలపై సంస్థాగత ఇన్వెస్టర్లు అత్యంత బుల్లిష్‌గా ఉన్నట్లు వివరించారు. వివిధ రంగాలు 2020లో ఆల్‌టైం గరిష్ట స్థాయిలో క్విప్ మార్గంలో రూ. 80,816 కోట్లు సమీకరించాయి. 2024 గణాంకాలు దానిన్నా 75 శాతం అధికం కావడం గమనార్హం. 2025లో క్విప్ ఫండింగ్ మిశ్రమంగా ఉండొచ్చని పురి తెలిపారు. నివేదిక ప్రకారం .. గోద్రెజ్ ప్రాపర్టీస్ రూ. 6,000 కోట్లు, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ రూ. 5,000 కోట్లు, బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రీట్ రూ. 3,500 కోట్లు, మ్యాక్రోటెక్ డెవలపర్స్ రూ. 3,300 కోట్లు, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ రూ. 1,500 కోట్లు సమీకరించాయి.

ఐపీవో బాటలో యశోద హాస్పిటల్స్?



న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా హెల్త్‌కేర్ సేవలు అందిస్తున్న ప్రముఖ సంస్థ 'యశోద హాస్పిటల్స్' ఐపీవో సన్నాహాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) రూపంలో రూ.4,000 కోట్ల వరకు సమీకరించే యోచనతో ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ ప్రముఖ వార్తా సంస్థ కథనం ప్రచురించింది. మార్కెట్ పరిస్థితులు, వ్యాల్యూషన్, ఇతర కీలక అంశాలపై ఇటీవలే బ్యాంకర్లతో సంప్రదింపులు నిర్వహించినట్టు పేర్కొంది. తాజా ఈక్విటీ షేర్ల జారీతోపాటు కంపెనీలో ఇప్పటికే వాటాలు కలిగిన వారు కొంత మొత్తాన్ని ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో విక్రయించన్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను త్వరలో నియమించనున్నట్టు తెలిపాయి. యశోద హాస్పిటల్స్‌కు సుమారు 4,000 పడకల సామర్థ్యం ఉంది. నాలుగు స్వతంత్ర ఆస్పత్రులు నిర్వహిస్తోంది. నాలుగు హార్ట్ ఇనిస్టిట్యూట్‌లు, నాలుగు కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లను కలిగి ఉంది.

మనపై సుంకాల ప్రభావం అంతంతే..

- ట్రంప్ ప్రతీకార టారిఫ్ ప్రతిపాదనలపై జీటీఆర్ఐ వ్యాఖ్య
- రెండు దేశాల ఎగుమతుల తీరుతెన్నులు భిన్నంగా ఉండటమే కారణమని వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికా ప్రతిపాదిత ప్రతీకార టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండకపోవచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. ఇరు దేశాలు ఎగుమతుల తీరుతెన్నులు భిన్నంగా ఉండటమే కారణమని ఆయన చెప్పారు. ఉదాహరణకు అమెరికా నుంచి దిగుమతయ్యే పిస్తాలపై భారత్ 50 శాతం సుంకాలు విధిస్తోందనుకుంటే, మన దగ్గర్నుంచి దిగుమతయ్యే వాటి మీద కూడా అమెరికా అదే స్థాయిలో టారిఫ్‌లు వడ్డిస్తానంటే ఉపయోగం ఉండకపోవచ్చన్నారు. ఎందుకంటే భారత్ అసలు పిస్తాలే ఎగుమతి చేయదు కాబట్టి నష్టపోయేదేమీ ఉండదని శ్రీవాస్తవ చెప్పారు. అమెరికా నుంచి దిగుమతుల విలువకు సంబంధించి 75 శాతం భాగానికి టారిఫ్‌లు సగటున 5 శాతం లోపే ఉంటున్నాయని ఆయన తెలిపారు. ఇక జౌళి, దుస్తులు, పాదరక్షలులాంటి కార్మిక శక్తి ఎక్కువగా ఉండే ఉత్పత్తుల ఎగుమతుల విషయంలో అమెరికా అత్యధికంగా 15–35 శాతం సుంకాలు విధిస్తోందని వివరించారు. 'రెండు దే ఎగుమతుల ప్రొఫైల్స్ భిన్నంగా ఉంటాయి కాబట్టి ప్రతీకార టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా తుది నిర్ణయం కోసం ఏప్రిల్ వరకు ఎదురు చూసి, అప్పుడు అవసరమైతే 2019 జూన్‌లోలాగే మనం కూడా తగిన చర్యలు తీసుకోవచ్చు' అని శ్రీవాస్తవ పేర్కొన్నారు. వ్యాపార భాగస్వామ్య దేశాలతో వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయా దేశాలపై ప్రతీకార టారిఫ్‌లను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.

స్పష్టత రావాలి

పరిశ్రమపై విధిస్తుందా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంటుందని శ్రీవాస్తవ చెప్పారు. ఉదాహరణకు అత్యంత ప్రాధాన్య దేశాలకు (ఎంఎఫ్ఎన్) వ్యవసాయోత్పత్తుల మీద తాము 5 శాతం సుంకాలు విధిస్తుంటే.. భారత్ సగటు ఎంఎఫ్ఎన్ టారిఫ్ 39 శాతంగా ఉంటోందని అమెరికా వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ వెల్లడించింది. అలాగే తమ మోటర్‌సైకిళ్లపై భారత్ 100 శాతం టారిఫ్‌లు విధిస్తుంటే, భారత మోటర్‌సైకిళ్లపై తాము 2.4 శాతం మాత్రమే విధిస్తున్నట్లు అమెరికా పేర్కొంది. దీనిపై స్పందిస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకునేందుకు అమెరికా ఏదో ఒక అంశాన్ని, అంటే, ఉత్పత్తి లేదా రంగాన్ని ప్రామాణికంగా పరిగణించాలని శ్రీవాస్తవ చెప్పారు. లేకపోతే అత్యధికంగా పారిశ్రామికోత్పత్తులను సరఫరా చేసే చైనాకు ప్రయోజనం చేకూర్చినట్లవుతుందని పేర్కొన్నారు.

వాణిజ్యంలో కీలక భాగస్వామి...

కీలక వాణిజ్య భాగస్వామిగా ఉంటోంది. అమెరికాకు భారత్ గణనీయంగా ఎగుమతి చేస్తుండగా, అక్కడి నుంచి దిగుమతులు తక్కువగానే ఉంటూ.. వాణిజ్య మిగులు భారత్ పక్షాన సానుకూలంగా ఉంటోంది. 2023–24లో 119.71 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంతో భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది. అప్పట్లో భారత్ 77.51 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయగా, 42.19 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. 35.31 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు సాధించింది. మరోవైపు, 2024–25 ఏప్రిల్–నవంబర్ మధ్య కాలంలో 82.52 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంతో భారత్‌కు అమెరికా రెండో అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది. భారత్ 52.89 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 29.63 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. భారత్ పక్షాన 23.26 బిలియన్ డాలర్ల మిగులు నమోదైంది.

శాంతించిన కూరగాయలు, ఆహార ధరలు



న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం జనవరి నెలలో స్వల్పంగా క్షీణించింది. 2024 డిసెంబర్ నెలలో 3.7 శాతంగా ఉండగా, అక్కడి నుంచి 2.31 శాతానికి దిగొచ్చింది. ఆహారోత్పత్తులు, ముఖ్యంగా కూరగాయల ధరలు శాంతించడం సానుకూలించింది. 2024 జనవరి నెలకు ఇది 0.33 శాతంగా ఉండడం గమనార్హం.

విభాగాల వారీగా..

- గత డిసెంబర్‌లో ఆహార వస్తువల ద్రవ్యోల్బణం 8.47 శాతం స్థాయిలో ఉంటే, జనవరిలో 5.88 శాతానికి శాతించింది.
- కూరగాయల ద్రవ్యోల్బణం 28.65 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గింది. ఈ విభాగంలో టమాటాల ధరలు 18.9 శాతం తగ్గాయి. ఆలుగడ్డల ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయిలో 74.28 శాతంగా ఉంది. ఉల్లిగడ్డల ఆధారిత ద్రవ్యోల్బణం 28.33 శాతానికి పెరిగింది.
- గుడ్లు, మాంసం, చేపల విభాగంలోనూ 5.43 శాతం నుంచి 3.56 శాతానికి దిగొచ్చింది.
- ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం 3.79 శాతం నుంచి 2.78 శాతానికి చల్లబడింది.
- తయారీ వస్తువుల టోకు ద్రవ్యోల్బణం మాత్రం 2.14 శాతం నుంచి 2.51 శాతానికి పెరిగింది.

పెరిగే రిస్క్..

"టోకు ద్రవ్యోల్బణం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సగటున 2.4 శాతంగా ఉండొచ్చు. కానీ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2025–26) ఇది 3 శాతానికి పెరగొచ్చు" అని ఇక్రా సీనియర్ ఆర్థికవేత్త రాహుల్ అగర్వాల్ తెలిపారు.



ప్రణయ్

ఈసారి క్వార్టర్స్‌లోనే...

జపాన్ చేతిలో భారత్ ఓటమి

కింగ్‌డావో (చైనా): ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు కథ ముగిసింది. 2023లో సెమీఫైనల్లో ఓడిపోయి తొలిసారి కాంస్య పతకాన్ని సాధించిన భారత జట్టు ఈసారి మాత్రం క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. జపాన్ జట్టుతో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 0–3తో పరాజయం పాలైంది. తొలి మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయం 13–21, 21–17, 13–21తో ప్రపంచ 12వ ర్యాంక్ హిరోకి మిదోరికావా-నత్సు సైతో జోడీ చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో మాళవిక బన్సోద్ 12–21, 19–21తో ప్రపంచ 8వ ర్యాంకర్ తొమోకా మియాజకి చేతిలో ఓటమి పాలైంది. మూడో మ్యాచ్‌లో భారత స్టార్ హెచ్‌ఎస్ ప్రణయ్ 14–21, 21–15, 12–21తో ప్రపంచ 16వ ర్యాంకర్ కెంటా నిషిమోటో చేతిలో ఓడిపోవడంతో భారత పరాజయం ఖాయమైంది. ఫలితం తేలిపోవడంతో మహిళల డబుల్స్, పురుషుల డబుల్స్ మ్యాచ్‌లు నిర్వహించలేదు.

జపాన్ 'వాకర్' ఇకెడాపై నాలుగేళ్ల నిషేధం



మొనాకో: జపాన్‌కు చెందిన రేస్ వాకర్ కోకి ఇకెడాపై నాలుగేళ్ల నిషేధం పడింది. టోక్యో ఒలింపిక్స్ రేస్ వాక్‌లో రజత పతకం దక్కించుకున్న ఇకెడా.. డోపింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య అతడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. 2023 జూన్ నుంచి అతడు పాల్గొన్న పోటీల ఫలితాలను పరిగణించకూడదని నిర్ణయించింది. 2023 జూన్, ఆగస్టు, సెప్టెంబర్‌లో సేకరించిన నమూనాల్లో ఇకెడా రక్త మార్పిడి చేసుకున్నట్లు తేలింది.

మేఘాలయలో కలుద్దాం!

తదుపరి జాతీయ క్రీడలు 2027లో ● ఉత్తరాఖండ్‌లో ముగిసిన 38వ జాతీయ క్రీడలు



ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో తదుపరి జాతీయ క్రీడలు జరిగే మేఘాలయ రాష్ట్ర ప్రతినిధికి మస్కట్ అందజేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో అలరించిన జాతీయ క్రీడలు అట్టహాసంగా ముగిశాయి. తదుపరి మేఘాలయ జాతీయ క్రీడల ఆతిథ్యానికి సిద్ధం కానుంది. 2027లో అక్కడ 39వ నేషనల్ గేమ్స్ జరుగనున్నాయి. శుక్రవారం మేఘాలయ ముఖ్యమంత్రి కొంగ్‌కల్ సంగ్మా క్రీడాజ్యోతి అందుకోవడంతో దీనికి సంబంధించిన లాంఛన ప్రకియ కూడా ముగిసింది. 18 రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన తాజా జాతీయ క్రీడల్లో సర్వీసెస్ 121 పతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకుంది. సర్వీసెస్ క్రీడాకారులు 68 స్వర్ణాలు, 26 రజతాలు, 27 కాంస్యాలు గెలిచారు. మహారాష్ట్ర అత్యధికంగా 198 పతకాలు గెలిచినప్పటికీ పసిడి వేట (54 స్వర్ణాలు)లో వెనుకబడిపోవడంతో రెండో స్థానంలో నిలిచింది. 71 రజతాలు, 73 కాంస్యాలు మరాఠా క్రీడాకారులు చేజిక్కించుకున్నారు. హరియాణా 153 పతకాలు (48 పసిడి, 47 రజతాలు, 58 కాంస్యాలు) మూడో స్థానంలో నిలువగా, ఆతిథ్య ఉత్తరాఖండ్ 24 స్వర్ణాలు, 35 రజతాలు, 44 కాంస్యాలతో మొత్తం 103 పతకాలు సాధించి ఏడో స్థానంలో నిలిచింది. తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ (14 పతకాలు) 18వ స్థానంలో, తెలంగాణ (18 పతకాలు) 26వ స్థానంలో నిలిచాయి.

2036 ఒలింపిక్స్‌కు సిద్ధం: అమిత్ షా

జాతీయ క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విశ్వక్రీడల నిర్వహణకు భారత్ సిద్ధంగా ఉందని చెప్పారు. 'క్రీడల్లో భారత్‌కు బంగారు భవిష్యత్తు ఉంది. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు రెడీగా ఉంది. ఉత్తరాఖండ్ అంటేనే దేవభూమిగా ప్రసిద్ధి. అయితే తాజా ఈవెంట్ నిర్వహణ ద్వారా ఖేల్ భూమి అయ్యింది. కేవలం క్రీడల నిర్వహణే కాదు. ఆటగాళ్లు రాటుదేలిన తీరు సాధించిన ప్రగతి రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంలో చేసిన విశేష కృషికి నిదర్శనం. గత జాతీయ క్రీడల్లో ఉత్తరాఖండ్ 21వ స్థానంలో నిలిచింది. తాజా క్రీడల్లో ఏడో స్థానానికి ఎగబాకింది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం వల్లే క్రీడారంగంలో ఆ రాష్ట్రం ఇంతలా ఎదిగింది. ఇదే జోరు ఇకమీదటా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి, కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష, మేఘాలయ ముఖ్యమంత్రి కొంగ్‌కల్ సంగ్మా తదితరులు పాల్గొన్నారు. పీటీ ఉష మాట్లాడుతూ 'ఈ మహత్తర ప్రయాణం ఇక్కడితో ముగిసేది కాదు. ఎల్లప్పుడు దిగ్విజయంగా సాగేది. భారత క్రీడల ప్రగతిని చాటేది' అని ఆమె కితాబిచ్చారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మాట్లాడుతూ '2036 విశ్వక్రీడల్లో టాప్–10లో నిలిచేందుకు ఇదొక గొప్ప ఆరంభం. దేశంలో క్రీడాసంస్కృతి పెరుగుతుందనడానికి ఇదో నిదర్శనం' అని అన్నారు.



న్యూజిలాండ్‌దే 'ముక్కోణపు' సిరీస్

ఫైనల్లో పాకిస్తాన్‌పై 5 వికెట్లతో గెలుపు

కరాచీ: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు సొంతగడ్డపై జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో పాకిస్తాన్ పరాజయం పాలైంది. గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన పాకిస్తాన్... న్యూజిలాండ్‌తో తుదిపోరులో అదే జోరు కనబర్చలేకపోయింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై విజయం సాధించి టైటిల్ సొంతం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 49.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (76 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్), సల్మాన్ ఆఘా (65 బంతుల్లో 45; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. గత మ్యాచ్‌లో సెంచరీలతో కదంతొక్కిన ఈ ఇద్దరూ... తాజా పోరులో భారీ ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయారు. తయ్యబ్ తాహిర్ (38), బాబర్ ఆజమ్ (29) పర్వాలేదనిపించారు. న్యూజిలాండ్ బౌలర్లలో రూర్కే 4 వికెట్లు పడగొట్టగా... సాంట్నర్, బ్రాస్‌వెల్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 45.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 243 పరుగులు చేసింది. డారిల్ మిషెల్ (58 బంతుల్లో 57; 6 ఫోర్లు), టామ్ లాథమ్ (64 బంతుల్లో 56; 5 ఫోర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకోగా... కాన్వే (48), కేన్ విలియమ్సన్ (34) రాణించారు. పాకిస్తాన్ బౌలర్లలో నసీమ్ షా 2 వికెట్లు తీశాడు. రూర్కేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సల్మాన్ ఆఘాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

చాంపియన్స్ ట్రోఫీకి సియర్స్ దూరం

క్రైస్ట్‌చర్చ్: చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఆటగాళ్ల జాబితాలో మరో పేస్ బౌలర్ చేరాడు. న్యూజిలాండ్ ఆటగాడు బెన్ సియర్స్ గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. బుధవారం ప్రాక్టీస్ సెషన్ తర్వాత పిక్క కండరాల నొప్పితో ఇబ్బంది పడిన అతనికి పరీక్షలు చేయించగా చీలిక ఉన్నట్లు తేలింది. దాంతో రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. సియర్స్ స్థానంలో జేకబ్ డఫీని ఎంపిక చేసినట్లు కివీస్ క్రికెట్ బోర్డు ప్రకటించింది.



హర్మన్ ప్రీత్

'ప్రతీ మ్యాచ్ గెలవడమే లక్ష్యం'

- 'ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్'పై భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వ్యాఖ్య
- తొలి పోరులో నేడు ఇంగ్లండ్‌తో 'ఢీ'
- స్టార్ స్పోర్ట్స్–3, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

భువనేశ్వర్: వచ్చే ఏడాది హాకీ ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... నేరుగా మెగా టోర్నీకి అర్హత సాధించేందుకు ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్‌లో ప్రతీ మ్యాచ్ గెలవాలనుకుంటున్నామని భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నాడు. లీగ్‌లో మంచి ప్రదర్శన కనబర్చి అగ్రస్థానంలో నిలవడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని హర్మన్‌ప్రీత్ అన్నాడు. లీగ్‌లో భాగంగా శనివారం తొలి పోరులో స్పెయిన్‌తో భారత్ తలపడుతుంది. అనంతరం ఆదివారం స్పెయిన్‌తో మరో మ్యాచ్ ఆడుతుంది. ఈ నెల 18న, 19న జర్మనీతో 21, 22న ఐర్లాండ్‌తో... 24, 25న ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లు ఆడుతుంది. 'హాకీ ఇండియా లీగ్ నుంచి మా శిక్షణ సాగుతూనే ఉంది. ఫిట్‌నెస్ కాపాడుకుంటూ ప్రాక్టీస్ చేస్తున్నాం. ఆటగాళ్లంతా మంచి ఉత్సాహంగా ఉన్నారు. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రొ లీగ్‌లో అన్నీ మ్యాచ్‌లు గెలవడమే మా ప్రధాన లక్ష్యం' అని హర్మన్‌ప్రీత్ అన్నాడు. 2026 ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా హాకీ వరల్డ్ కప్ జరగనుంది. 'హాకీ ఇండియా లీగ్ ద్వారా దేశవాళీ ఆటగాళ్ల ప్రతిభ వెలుగులోకి వచ్చింది. వారిని సక్రమంగా వినియోగించుకుంటే భవిష్యత్తులో మరింత మంచి ప్లేయర్లుగా ఎదుగుతారు. స్పెయిన్ గట్టి ప్రత్యర్థి, వారిని తక్కువ అంచనా వేయడం లేదు. మా వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంపైనే దృష్టి పెడతాం' అని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు.

భారత అంచె షెడ్యూల్

ఫిబ్రవరి 15	భారత్ X స్పెయిన్	రాత్రి 7:30 నుంచి
ఫిబ్రవరి 16	భారత్ X స్పెయిన్	రాత్రి 7:30 నుంచి
ఫిబ్రవరి 18	భారత్ X జర్మనీ	రాత్రి 7:30 నుంచి
ఫిబ్రవరి 19	భారత్ X జర్మనీ	సాయంత్రం 5:15 నుంచి
ఫిబ్రవరి 21	భారత్ X ఐర్లాండ్	రాత్రి 7:30 నుంచి
ఫిబ్రవరి 22	భారత్ X ఐర్లాండ్	రాత్రి 7:30 నుంచి
ఫిబ్రవరి 24	భారత్ X ఇంగ్లండ్	రాత్రి 7:30 నుంచి
ఫిబ్రవరి25	భారత్ X ఇంగ్లండ్	రాత్రి 7:30 నుంచి

ఇంగ్లండ్‌తో భారత మహిళల తొలి పోరు

మరోవైపు మహిళల ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్‌లో భాగంగా నేడు జరగనున్న తొలి పోరులో ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది. ఆదివారం రెండో మ్యాచ్‌లోనూ ఇంగ్లండ్‌తో ఆడుతుంది. ఫలితాలతో సంబంధం లేకుండా మెరుగైన ఆటతీరు కనబర్చడమే తమ ముందున్న లక్ష్యమని భారత మహిళల హాకీ జట్టు సారథి సలీమా టిటె పేర్కొంది. మెరుగు పర్చుకోవాల్సిన అంశాలపై దృష్టి పెట్టేందుకు ఈ లీగ్ ఎంతగానో ఉపయోగపడుతుందిన సలీమా వెల్లడించింది. ఈ నెల 18, 19న స్పెయిన్‌తో... 21, 22న జర్మనీతో... 24, 25న నెదర్లాండ్స్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడుతుంది. 'మా ఆటపైనే ప్రధానంగా దృష్టి పెడతాం. పలువురు ప్లేయర్లు తొలిసారి ప్రొ లీగ్ మ్యాచ్‌లు ఆడనున్నారు. గెలుపోటములు ఆటలో భా గం. మా వరకు అత్యుత్తమ ప్రదర్శన చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. హరేంద్ర సింగ్ చీఫ్ కోచ్‌గా వచ్చినప్పటి నుంచి గేమ్‌ప్లాన్ మెరుగైంది. ప్లేయర్ల మధ్య అనుబంధం కూడా పెరిగింది. అదే మైదానంలో ప్రస్ఫుటమవుతోంది' అని సలీమా వెల్లడించింది.

భారత అంచె షెడ్యూల్

ఫిబ్రవరి 15	భారత్ X ఇంగ్లండ్	సాయంత్రం 5:15 నుంచి
ఫిబ్రవరి 16	భారత్ X ఇంగ్లండ్	సాయంత్రం 5:15 నుంచి
ఫిబ్రవరి 18	భారత్ X స్పెయిన్	సాయంత్రం 5:15 నుంచి
ఫిబ్రవరి 19	భారత్ X స్పెయిన్	రాత్రి 7:30 నుంచి
ఫిబ్రవరి 21	భారత్ X జర్మనీ	సాయంత్రం 5:15 నుంచి
ఫిబ్రవరి 22	భారత్ X జర్మనీ	సాయంత్రం 5:15 నుంచి
ఫిబ్రవరి 24	భారత్ X నెదర్లాండ్స్	సాయంత్రం 5:15 నుంచి
ఫిబ్రవరి 25	భారత్ X నెదర్లాండ్స్	సాయంత్రం 5:15 నుంచి



సలీమా టిటె



శ్రీలంకదే సిరీస్

- రెండో వన్డేలోనూ ఆస్ట్రేలియా ఓటమి
- కుశాల్ మెండిస్ సెంచరీ
- మెరిసిన అసలంక, వెల్లలాగె, హసరంగ

కొలంబో: చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా జట్టు... శ్రీలంకతో వన్డే సిరీస్‌లో 'వైట్ వాష్'కు గురైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆతిథ్య శ్రీలంక జట్టు తమ వన్డే చరిత్రలో ఆస్ట్రేలియాపై పరుగుల పరంగా అతిపెద్ద విజయాన్ని నమోదు చేసుకుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన రెండో వన్డేలో శ్రీలంక 174 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘనవిజయం సాధించింది. తద్వారా 2–0తో సిరీస్ 'క్లీన్‌స్వీప్' చేసింది. స్వదేశంలో శ్రీలంక జట్టు వరుసగా ఆరో వన్డే సిరీస్‌ను దక్కించుకోవడం విశేషం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (115 బంతుల్లో 101;11 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కగా... కెప్టెన్ చరిత అసలంక (66 బంతుల్లో 78 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), నిశాన్ మధుష్క (70 బంతుల్లో 51; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ వంటి ప్రధాన ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడంతో యువ పేసర్లతో బరిలోకి దిగిన ఆసీస్... లంక బ్యాటర్లను కట్టడి చేయలేకపోయింది. ముఖ్యంగా మెండిస్, మధుష్క, అసలంక... కంగారూ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 24.2 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (29; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... మాథ్యూ షార్ట్ (2), మెక్ గుర్క్ (9), ట్రావిస్ హెడ్ (18), మ్యాక్స్‌వెల్ (1), ఆరోన్ హార్డీ (0) విఫలమయ్యారు. లంక స్పిన్నర్ దునిత్ వెల్లలాగె 35 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అసిత ఫెర్నాండో (3/23), హసరంగ (3/23) చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. కుశాల్ మెండిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', అసలంకకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.



బెనెట్ 169

- జింబాబ్వే ఓపెనర్ భారీ సెంచరీ
- తొలి వన్డేలో ఓడిన ఐర్లాండ్

హరారే: ఓపెనర్ బ్రియాన్ బెనెట్ (163 బంతుల్లో 169; 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ సెంచరీతో కదంతొక్కడంతో... ఐర్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో జింబాబ్వే ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి వన్డేలో జింబాబ్వే 49 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. మొదట జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన బెనెట్ చివరి ఓవర్ వరకు క్రీజులో నిలిచి జట్టుకు భారీ స్కోరు సాధించి పెట్టాడు. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (61 బంతుల్లో 66; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు)... బెనెట్‌కు చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరు ఐర్లాండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టారు. ఏకైక టెస్టులో ఐర్లాండ్ చేతిలో పరాజయం పాలైన జింబాబ్వే తొలి వన్డేలో దానికి బదులు తీర్చుకుంది. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఐర్లాండ్ 46 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టిర్లింగ్ (32), క్యాంఫెర్ (44), టెక్టర్ (39), టకర్ (31), డాక్‌రెల్ (34), మెక్‌బ్రైన్ (32) తలా కొన్ని పరుగులు చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్బానీ నాలుగు వికెట్లు, ఎన్‌గరవా మూడు వికెట్లు పడగొట్టారు. బెనెట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో వన్డే జరగనుంది.

మరో ర్యాంకింగ్ టోర్నీకి భారత రెజ్లర్లు దూరం

సమాఖ్య, క్రీడాశాఖల మధ్య సమన్వయలేమి

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాశాఖ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)ల మధ్య కొరవడిన సమన్వయంతో రెజ్లర్లు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికే ఈ సీజన్‌లో తొలి ర్యాంకింగ్ సిరీస్ టోర్నీకి దూరమైన భారత రెజ్లర్లు... మళ్లీ ఇప్పుడు రెండో ర్యాంకింగ్ సిరీస్ టోర్నీకి వెళ్లలేని పరిస్థితి వచ్చింది. డబ్ల్యూఎఫ్ఐ నిర్ణీత సమయంలోగా అవసరమైన డాక్యుమెంట్లు సమకూర్చకపోవడంతో అల్బేనియాలో జరగనున్న అంతర్జాతీయ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్‌కు రెజ్లర్లను పంపలేక పోతున్నామని క్రీడాశాఖ ... సమాఖ్య తీరుపై విమర్శించింది. 'డబ్ల్యూఎఫ్ఐ ప్రతిపాదిత జాబితాను గడువులోగా పంపడంలో తాత్సారం చేసింది. భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్)కి చాలా ఆలస్యంగా జాబితా చేరడంతో తదుపరి ప్రక్రియను చేపట్టలేకపోయాం. ఏదైనా అంతర్జాతీయ టోర్నీలకు వెళ్లాలంటే ఓ పద్ధతి ఉంటుంది. ముందస్తు ప్రతిపాదన, తదుపరి డాక్యుమెంట్ల పరిశీలన తదనంతరం తుది జాబితా ఆమోదించబడాలి. కానీ సమాఖ్య నిర్వాకం వల్లే జాబితా ఆలస్యమైంది. ఆమోదానికి దూరమైంది. దీంతో అథ్లెట్లు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయారు' అని క్రీడాశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. గతంలో క్రీడాశాఖ సస్పెన్షన్ వల్ల జాగ్రెబ్ ర్యాంకింగ్ సిరీస్‌కు భారత జట్టు దూరమైంది. ఇప్పుడు ఇరు సమాఖ్యల మధ్య సమన్వయలేమి వల్ల ఈ నెల 26 నుంచి మార్చి 2 వరకు టిరానాలో జరిగే ఈవెంట్‌కూ గైర్హాజరు అవుతోంది. ఇక భారత రెజ్లర్లు సీనియర్ ఆసియా చాంపియన్‌షిప్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. జోర్డాన్‌లో మార్చి 25 నుంచి 30 వరకు ఆసియా ఈవెంట్ జరుగుతుంది.



డాలర్‌తో గేమ్స్ ఆడితే 100% సుంకాలు!

బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

- వాటితో లావాదేవీలన్నీ బంద్
- బ్రిక్స్ ఇప్పటికే ఓ మృత కూటమి
- మోదీతో భేటీకి ముందు సంచలన వ్యాఖ్యలు



వాషింగ్టన్: భారత్‌తో పాటు బ్రిక్స్ కూటమిలోని ఇతర సభ్య దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఘాటు హెచ్చరికలు చేశారు. డాలర్‌తో ఆటలాడాలని చూస్తే వాటిపై వంద శాతం టారిఫ్ విధిస్తామని పునరుద్ఘాటించారు. డాలర్‌ను వేరే కరెన్సీతో భర్తీ చేయాలని చూస్తే బ్రిక్స్ దేశాలతో అమెరికా ఇకపై ఎలాంటి వర్తక లావాదేవీలూ జరపబోదని స్పష్టం చేశారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీకి రెండు గంటల ముందే ట్రంప్ ఈ మేరకు సంచలన ప్రకటన చేశారు. తాను తొలిసారి 100 శాతం టారిఫ్‌ల హెచ్చరికలు చేసినప్పుడే బ్రిక్స్ మృతప్రాయ కూటమిగా మిగిలిపోయిందని చెప్పుకొచ్చారు! దాని ఏర్పాటులోనే దురుద్దేశం దాగుందని ట్రంప్ ఆరోపించారు. ''బ్రిక్స్ కూటమి కొనసాగాలని దాని సభ్య దేశాలే కోరుకోవడం లేదు. బ్రిక్స్ గురించి మాట్లాడేందుకు కూడా భయపడుతున్నాయి''అని చెప్పుకొచ్చారు. ఎందుకంటే, ''డాలర్‌తో గేమ్స్ ఆడొద్దు. అలా చేస్తే మీపై 100 శాతం టారిఫ్‌లు తప్పవు. అప్పుడు మీరే అలా చేయొద్దంటూ వేడుకుంటారు''అని హెచ్చరించానన్నారు. బ్రిక్స్ కూటమిని రూపుమాపాలనుకుంటున్నారా, లేక అందులో భాగం కావాలని భావిస్తున్నారా అన్న విలేకరుల ప్రశ్నకు బదులుగా ట్రంప్ ఈ మేరకు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దాని విషయంలో గత అధ్యక్షులు జో బైడెన్, బరాక్ ఒబామా ఇలా కఠినంగా వ్యవహరించలేకపోయారని ఆక్షేపించారు. బ్రిక్స్ కూటమిలో భారత్‌తో పాటు రష్యా, చైనా, బ్రెజిల్, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండొనేసియా, ఇరాన్ సభ్య దేశాలు. బ్రిక్స్‌పై 100 శాతం టారిఫ్‌లు తప్పవని ట్రంప్ రెండోసారి అధికారంలోకి రాకముందు నుంచీ హెచ్చరిస్తూ వస్తున్నారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌కు బదులుగా తమ సొంత కరెన్సీల్లోనే లావాదేవీలు నెరపాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2023లో బ్రిక్స్ శిఖరాగ్రంలో ప్రతిపాదించారు. మరుసటేడాది బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల భేటీ కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చింది.



ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రొమేనియా రాజధాని బుఖారెస్ట్‌లోని ఓ కేఫ్ ఎంట్రన్స్ వద్ద ఆకట్టుకునేలా అలంకరించారిలా..

'పుల్వామా' అమరులకు ప్రధాని మోదీ ఘన నివాళులు

న్యూఢిల్లీ/హల్ద్వానీ: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14వ తేదీన జరిగిన ఉగ్ర దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రధాని మోదీ శుక్రవారం నివాళులర్పించారు. దేశం పట్ల వారు అచంచలమైన విశ్వాసాన్ని కనబరిచారని కొనియాడారు. వారి త్యాగాలను భవిష్యత్తు తరాలు గుర్తుంచుకుంటాయని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఉగ్రవాదులను ఏరిపారేసేందుకు మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పుల్వామా ఉగ్ర ఘటనలో అసువులు బాసిన జవాన్లకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. వీరి త్యాగాల వల్లే మన దేశ సరిహద్దులు భద్రంగా ఉన్నాయన్నారు. మానవీయతకే అతిపెద్ద శత్రువైన ఉగ్రవాదంపై పోరుకు నేడు ప్రపంచమే ఏకమైందని శుక్రవారం హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్'లో తెలిపారు. పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌ని ఆత్మాహుతి దళ బాంబర్ వాహనంతో ఢీకొట్టడంతో 40 మంది జవాన్లు అసువులు బాసిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు ప్రతీకారంగా వైమానికదళం యుద్ధ విమానాలు పీఓకేలోని బాలాకోట్ ఉగ్ర స్థావరాన్ని నేలమట్టం చేశాయి.

ఫెడరల్ ఏజెన్సీలకు మంగళమే: మస్క్

వాషింగ్టన్: ఫెడరల్ ఏజెన్సీలన్నింటినీ అమెరికా వదిలించుకోవాల్సిన సమయం వచ్చేసిందని టెక్ దిగ్గజం, డోజ్ సారథి ఎలన్ మస్క్ గురువారం స్పష్టం చేశారు. ప్రభుత్వ పనితీరును సమూలంగా పునర్ వ్యవస్థీకరించడంలో భాగంగా ఈ చర్య తప్పదన్నారు. దుబాయ్‌లో జరిగిన వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్‌లో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 'టెక్ సపోర్ట్'అని ముద్రించిన నల్ల టీషర్టు ధరించి కన్పించారు. ''ప్రజాపాలన స్థానంలో ఉద్యోగస్వామ్యం (బ్యూరోక్రసీ) పాలన నడుస్తోంది. ఈ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్నే మించిపోయింది''అంటూ ఆక్షేపించారు. ఫెడరల్ ఏజెన్సీలు సాధారణంగా నిర్దిష్ట ప్రయోజనం నిమిత్తం అమెరికా ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్ర ప్రభుత్వ సంస్థలు. అంతరిక్ష సంస్థ నాసాతో పాటు న్యాయ శాఖ వంటివి కూడా ఇలా ఏర్పాటు చేసినవే కావడం విశేషం! వృథా ఖర్చుల తగ్గింపు, సామర్థ్య పెంపు కోసం ఏజెన్సీల సామూహిక మూసివేతలు తప్పవని మస్క్ తాజా ప్రసంగంలో స్పష్టం చేశారు. ''పరిస్థితి చేయి దాటిపోయింది. ఇప్పుడిక ఈ ఏజెన్సీల్లో చాలా వాటిని పక్కన పెట్టినా పెద్దగా ఒరిగేదేమీ ఉండబోదు. మెరుగైన ఫలితాలు కనిపించాలంటే వాటిని మొత్తంగా తొలగించాల్సిందే. ఎందుకంటే కలుపును కూకటివేళ్లతో సహా తొలగించకపోతే మళ్లీ మళ్లీ పుట్టుకొస్తూనే ఉంటుంది''అని వ్యాఖ్యానించారు. అమెరికా ఇతర దేశాల వ్యవహారాల్లో మితిమీరి జోక్యం చేసుకోకుండా సొంత వ్యవహారాలపై దృష్టి పెట్టాలని మస్క్ వాదిస్తున్నారు. ఆ దిశగా మొత్తంగా అమెరికా విదేశాంగ విధానంలోనే భారీగా మార్పుచేర్పులు తెచ్చేందుకు మస్క్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.



డోజ్ దూకుడు

మస్క్ నేతృత్వంలో ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డోజ్) ఇప్పటికే ఫెడరల్ ఉద్యోగుల్లో వీలైనంత మందిని తొలగించే పనిలో పడింది. ట్రంప్ ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచీ దూకుడుగా వ్యవహరిస్తోంది. అనేక విభాగాలకు బడ్జెట్లను ఇప్పటికే తగ్గించింది. చాలాకాలంగా విదేశాలకు సాయమందిస్తున్న యూఎస్ ఎయిడ్ వంటి పలు ఏజెన్సీలను మూసేసింది. విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు బేరీజు వేసే స్వతంత్ర పరిశోధన సంస్థ అయిన విద్యా శాఖ కాంట్రాక్టుల విభాగానికి నిధులను ఏకంగా 100 కోట్ల డాలర్ల మేర తగ్గించే దిశగా మస్క్ తాజాగా చర్యలు చేపట్టారు. ఇది కార్యరూపం దాలిస్తే ఆ విభాగం దాదాపుగా మూతపడ్డట్టే. ఏజెన్సీల ఉద్యోగుల సామూహిక తొలగింపును వేగవంతం చేయడానికి మస్క్ వివాదాస్పద విధానాన్ని ప్రవేశపెట్టారు. దాన్ని చట్టపరంగా సవాలు చేసిన పలు ఉద్యోగ సంఘాలకు తాజాగా కోర్టులోనూ చుక్కెదురైంది. ఆ విధానాన్ని సవాలు చేసే హక్కు వారికి లేదని డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి జార్జ్ ఓ టూల్ జూనియర్ బుధవారం తీర్పు వెలువరించారు. దానిపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ హర్షం వెలిబుచ్చారు కూడా.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కుల రిజర్వేషన్లు ఇవ్వలేం: సుప్రీం

న్యూఢిల్లీ: లాయర్ల సంఘం ఎన్నికల్లో కులం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బార్ అసోసియేషన్ సభ్యులు కులాలు, మతాల వారీగా విడిపోతామంటే తాము అంగీకరించబోమని స్పష్టంచేసింది. కులాలవారీగా లాయర్ల సంఖ్యపై సరైన గణాంకాలు అందుబాటులోని లేవని, అలాంటప్పుడు కులం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. లాయర్ల సంఘం ఎన్నికలను రాజకీయపరమైన అంశంగా మార్చడం సమంజసం కాదని పేర్కొంది. త్వరలో జరగబోయే బెంగళూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కులం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ అడ్వొకేట్స్ ఫర్ సోషల్ జస్టిస్ అనే సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని విన్నవించింది. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సరైన గణాంకాలు లేకుండా కులం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం అనేది చాలా సున్నితమైన అంశమని పేర్కొంది. మహిళలకు కొన్ని సీట్లు రిజర్వు చేయడం భిన్నమైన వ్యవహారమని వెల్లడించింది. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.

జయలలిత వస్తువుల అప్పగింత షురూ!

బెంగళూరుకు చేరుకున్న తమిళనాడు అధికారులు

- ఆస్తి పత్రాలు, విలువైన అభరణాలు అప్పగిస్తున్న కర్ణాటక అధికారులు
- రెండు రోజుల్లో పూర్తికానున్న అప్పగింత ప్రక్రియ

సాక్షి, బెంగళూరు: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితకు సంబంధించిన ఆస్తి పత్రాలు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. కోర్టు ఆదేశాల మేరకు జయలలిత వస్తువులను తీసుకెళ్లేందుకు తమిళనాడు పోలీసులు, అధికారులు కర్ణాటక రాజధాని బెంగళూరుకు చేరుకున్నారు. జయలలితకు సంబంధించిన ఆస్తి పత్రాలు, 11,344 పట్టు చీరలు, 750 జతల పాదరక్షలు, గడియారాలు, 7,040 గ్రాముల బరువైన 468 రకాల బంగారు, వజ్రాభరణాలు, 700 కిలోల వెండి ఆభరణాలు, 250 శాలువాలు, 12 రిఫ్రిజిరేటర్లు, 10 టీవీసెట్లు, 8 వీసీఆర్లు, ఒక వీడియో కెమెరా, 4 సీడీ ప్లేయర్లు, 2 ఆడియో డెక్‌లు, 24 టూ ఇన్ వన్ టేప్‌రికార్డర్లు, 1,040 వీడియో క్యాసెట్లు, 3 ఐరన్ లాకర్లతోపాటు ఇతర విలువైన వస్తువులను కర్ణాటక అధికారులు న్యాయమూర్తి సమక్షంలో తమిళనాడు అధికారులకు అప్పగిస్తున్నారు. ఈ సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ అప్పగింత ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తికానుంది.

జయలలిత బంధువులమంటూ దీప, దీపక్ అనే వ్యక్తులు గతంలో కర్ణాటక ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. జయలలితకు సంబంధించిన ఆభరణాలు, వస్తువులను తమకు అప్పగించాలంటూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేసింది. అవన్నీ తమిళనాడు ప్రభుత్వానికే చెందుతాయని తేల్చిచెప్పింది. ఈ మేరకు 2024 ఫిబ్రవరి 19వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. 2024 మార్చి 6, 7 తేదీల్లో వాటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారిక బృందాన్ని ఏర్పాటు చేయాలని తమిళనాడు ప్రభుత్వానికి సూచించింది. అంతలోనే దీప, దీపక్ ప్రత్యేక కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. దీంతో జయలలిత వస్తువుల అప్పగింతపై గతేడాది మార్చి 5న హైకోర్టు స్టే విధించింది. ఆ తర్వాత దీప, దీపక్‌ల పిటిషన్‌ను కొట్టివేసింది. దాంతో ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాల మేరకు వస్తువుల అప్పగింత ప్రక్రియ ప్రారంభమైంది. అక్రమాస్తుల కేసులో దోషిగా తేలిన జయలలితకు స్పెషల్ కోర్టు 2014 సెప్టెంబర్ 27న నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.100 కోట్ల జరిమానా విధించింది.

అదానీ అవినీతిపై మౌనమెందుకు: రాహుల్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ అవినీతిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కప్పిపుచ్చుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. స్వదేశంలోనే కాదు విదేశీ పర్యటనల్లోనూ అదానీ అవినీతిపై నోరుమెదపడం లేదని విమర్శించారు. ఈ మేరకు రాహుల్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. స్వదేశంలో ప్రశ్నిస్తే మౌనం పాటిస్తున్నారని, విదేశాల్లో ప్రశ్నిస్తే వ్యక్తిగత వ్యవహారం అంటూ దాటవేస్తున్నారని ఆక్షేపించారు. అమెరికా పర్యటనలో సైతం అదానీ అవినీతిని దాచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ దృష్టిలో దేశ నిర్మాణం అంటే కేవలం అదానీ జేబులు నింపడమేనని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. లంచాలు తీసుకోవడం, దేశ సంపదను లూటీ చేయడం వ్యక్తిగత వ్యవహారం ఎలా అవుతుందని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ కూడా 'ఎక్స్'లో పోస్టు చేసింది. అదానీ అవినీతి గురించి అమెరికా జర్నలిస్టు ప్రశ్నించగానే మోదీ ముఖం పాలిపోయిందని, సమాధానం చెప్పలేక తడబాటుకు గురై వెంటనే మరో విషయం ఎత్తుకున్నారని విమర్శించింది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో అదానీ అవినీతిపై దర్యాప్తు జరుగుతోందని గుర్తుచేసింది. నరేంద్ర మోదీ మాత్రం పర్సనల్ మ్యాటర్ అంటూ వెనకేసుకొస్తున్నారని, ఇది నిజంగా సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

18న సీఈసీ రాజీవ్ కుమార్ పదవీ విరమణ

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ ఈ నెల 18వ తేదీన రిటైరవనున్నారు. దీంతో, తదుపరి సీఈసీ పేరును ఖరారు చేసేందుకు ప్రధాని మోదీ సారథ్యంలోని ప్యానెల్ ఈ నెల 17న సోమవారం భేటీ కానుంది. ఇందులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, హోం మంత్రి అమిత్ షా తదితరులు సభ్యులుగా ఉన్నారు. ప్రధానమంత్రి అధికార నివాసంలో జరిగే సమావేశంలో అర్హులైన అభ్యర్థుల జాబితా నుంచి ఒక పేరును ప్రతిపాదిస్తారు. ఈ ప్రతిపాదన మేరకు నూతన సీఈసీని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించనున్నారు. రాజీవ్ కుమార్ తర్వాత సీనియర్ మోస్ట్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్. ఆయన పదవీ కాలం 2029 జనవరి 26వ తేదీ వరకు ఉంటుంది. మరో ఈసీ సుఖ్‌బీర్ సింగ్ సంధూ. సీఈసీ రిటైరైతే అత్యంత సీనియర్ అయిన ఎన్నికల కమిషనర్‌ను సీఈసీగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, గత ఏడాది సీఈసీ, ఈసీల నియామకానికి సంబంధించిన నిబంధనలను కేంద్రం సవరించింది. దీని ప్రకారం కార్యదర్శి స్థాయి ఐదుగురు అధికారుల పేర్లను న్యాయశాఖ మంత్రి అధ్యక్షతన ఏర్పాటైన సెర్చ్ కమిటీ ప్రధాని సారథ్యంలోని ప్యానెల్‌కు సిఫారసు చేస్తుంది. అదనంగా మరో పేరును కూడా ప్రతిపాదించే అధికారం ఈ కమిటీకి ఉంది. ప్రస్తుతం, సీఈసీతోపాటు రాజీవ్ కుమార్ స్థానంలో ఖాళీ అయిన పోస్టులో ఒక ఈసీని కూడా నియమించాల్సి ఉంది. మారిన నిబంధనల ప్రకారం సీఈసీ, ఈసీ పోస్టులకు ప్రస్తుత లేదా రిటైరైన కార్యదర్శి స్థాయి అధికారులు అర్హులు. సెర్చ్ కమిటీ పంపించిన పేర్లలో నుంచే సీఈసీని, ఈసీని ప్రధాని సారథ్యంలోని ప్యానెల్ ఎంపిక చేయాల్సి ఉంటుంది.

నోటాకు అత్యల్పంగా 2024 ఎన్నికల్లో ఓట్లు

- బిహార్‌లో అత్యధికం..నాగాలాండ్‌లో అత్యల్పం
- గణాంకాలను వెల్లడించిన ఎన్నికల కమిషన్

న్యూఢిల్లీ: 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలలో నోటా (నాన్ ఆఫ్ ది ఎబవ్) ఆప్షన్‌కు ఓటింగ్ శాతం అత్యల్పంగా నమోదైందని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఇందుకు సంబంధించి ఈసీ శుక్రవారం అట్లాస్-2024ను విడుదల చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలలో మొదటిసారిగా నోటాను ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన మూడు లోక్‌సభ ఎన్నికల్లో క్రమేపీ నోటా ఓటింగ్ శాతాల్లో క్షీణత నమోదవుతూ వచ్చిందని ఈసీ వివరించింది. 2014 ఎన్నికల్లో అత్యధికంగా నోటాకు 1.08 శాతం ఓట్లు పోలవగా, 2024 ఎన్నికలకు వచ్చే సరికి ఇది 0.99 శాతానికి తగ్గిందని తెలిపింది. నోటాకు బిహార్‌లో అత్యధికంగా 2.07 శాతం ఓట్లు పోలవగా, తర్వాత దాద్రా నగర్ హవేలీ, డయ్యూ డామన్‌లో 2.06 శాతం, గుజరాత్‌లో 1.58 శాతం ఓట్లు పడ్డాయని తెలిపింది. అదేసమయంలో, నాగాలాండ్‌లో నోటాకు కేవలం 0.21 శాతం ఓట్లే పోలయ్యాయని చెప్పింది.

రైతు సంఘాలతో కేంద్రం చర్చలు

చండీగఢ్: పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సారథ్యంలోని బృందం శుక్రవారం చండీగఢ్‌లో రైతు సంఘాల ప్రతినిధులతో చర్చించింది. రెండున్నర గంటలకుపైగా జరిగిన ఈ చర్చల్లో సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాలకు చెందిన 28 మంది సభ్యుల ప్రతినిధి బృందం పాల్గొంది. పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరీల్లో ఈ రెండు రైతు సంఘాలు ఏడాదికిపైగా నిరసనలు సాగిస్తున్నారు. పంజాబ్ ప్రభుత్వం తరఫున వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుద్దియన్, ఆహారం, పౌరసరఫరా శాఖ మంత్రి లాల్ చంద్ తదితరులు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్(ఎంజీఎస్ఐపీఏ)లో జరిగిన చర్చలు సుహృద్భావ వాతావరణంలో సాగాయన్నారు. రైతుల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా రైతు నేతలకు వివరించామని ప్రహ్లాద్ జోషి చెప్పారు. తదుపరి రౌండ్ చర్చలు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సారథ్యంలో 22న జరుగుతాయని మంత్రి చెప్పారు. నిరశనదీక్ష సాగిస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఖనౌరీ నుంచి ఆయన్ను అంబులెన్సులో తీసుకువచ్చారు. ఆయన ప్రయాణానికి నాలుగు గంటల సమయం పట్టిందని రైతు నేత కాకా సింగ్ కొట్రా చెప్పారు.



ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో మాతృ-పితృ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం ఓ స్కూల్‌లో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సాష్టాంగ ప్రణామాలతో పూజలు చేసినప్పటి దృశ్యమిది

మహాకుంభ్‌లో 50 కోట్ల మంది పవిత్ర స్నానాలు

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడి

మహాకుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13వ తేదీన మహాకుంభ మేళా ప్రారంభం కాగా శుక్రవారం సాయంత్రం వరకు 50 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. అమెరికా, రష్యా జనాభా మొత్తంతో ఇది సమానమని తెలిపింది. మానవ చరిత్రలో అతిపెద్ద మత, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమం ఇదేనని పేర్కొంది. శుక్రవారం ఒక్కరోజే సాయంత్రం 6 గంటల వరకు 92 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు చేశారని వివరించింది. ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగే ఈమహాక్రతువులో భాగంగా గంగ, యమున, అంతర్వాహిని అయిన సరస్వతీ నదులు కలిసే సంగమ ప్రాంతంలో పవిత్ర స్నానాలు చేయడం ఎంతో పుణ్యకార్యమని హిందువుల విశ్వాసం.

చట్ట సభల్లో ఉద్దేశపూర్వక ప్రతిష్టంభన మంచిది కాదు: ఓం బిర్లా

చండీగఢ్: ప్రజాస్వామ్యానికి చర్చలు, సంప్రదాయాలు ఆత్మ వంటివని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. అదే సమయంలో, అసెంబ్లీ లేదా పార్లమెంట్‌లో ఉద్దేశపూర్వకంగా ప్రతిష్టంభన నెలకొనేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. సభా కార్యక్రమాలకు, చర్చలకు కావాలని ఆటంకం కలిగించడమనే కొత్త ఒరవడి ఏ దేశానికి లేదా ఏ రాష్ట్రానికీ మేలు కలిగించదని చెప్పారు. శుక్రవారం ఓం బిర్లా హరియాణా అసెంబ్లీ సభ్యులకు రెండు రోజుల పునశ్చరణ తరగతులను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'చర్చలు, సంప్రదింపులు ప్రజాస్వామ్యానికి ఆత్మ వంటివి. అంగీకారం లేదా అనంగీకారం ప్రజాస్వామ్యానికి బలం. కానీ, విధాన సభ లేదా పార్లమెంట్‌లో పథకం ప్రకారం ప్రతిష్టంభన నెలకొనేలా చేయడం సరికాదనేది నా ఉద్దేశం. సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడితే ఎంతో అమూల్యమైన సమయం వృథా అవుతుంది'అని చెప్పారు.

సాక్షి ప్లస్
శనివారం । 15-2-2025

నైతికపర నియమావళే ఆధారంగా..

సామాజిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, గౌరవం లాంటి వాటిని ఉదాత్తమైన మానవీయ పరిపక్వతా లక్షణాలుగా పేర్కొంటారు. సమాజం ద్వారానే వ్యక్తి అన్ని లక్షణాలను, స్వభావాలను అలవర్చుకుంటాడు. అదేవిధంగా సమాజం నుంచి అనేక ప్రయోజనాలు పొందుతాడు. దీనికి ప్రతిగా సమాజానికి సేవలను, సహాయాన్ని అందించాల్సిన కనీస బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక విధులు

విధి అంటే ఒక వ్యక్తి ఇతరుల కోసం నిర్వర్తించాల్సిన పని లేదా బాధ్యత అని అర్థం. విధులు సమాజ వికాసానికి, దేశాభివృద్ధికి, సామాజిక స్పృహ కల్పించడానికి దోహదం చేస్తాయి. ఇవి దేశ ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయి. ప్రాథమిక హక్కులనే ఫలాలు విధులుగా పరిపక్వం చెందినప్పుడే సమాజ జీవనం సాఫల్యం అవుతుంది.

విధులు – రకాలు: సాధారణంగా విధులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

ఎ) నైతిక విధులు

బి) చట్టబద్ధమైన విధులు

నైతిక విధులు అనేవి ప్రజల నైతిక విలువలు, సామాజిక స్పృహపై ఆధారపడి ఉంటాయి. **ఉదా:** పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం; అభాగ్యులను, విధివంచితులను ఆదుకోవడం.

చట్టబద్ధమైన విధులు సమాజంతో ఆమోదం పొంది, ప్రభుత్వం గుర్తించిన బాధ్యతలు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారు.

ఉదా: ట్రాఫిక్ నియమాలు పాటించడం, పన్నులు సక్రమంగా చెల్లించడం.

భారత రాజ్యాంగం - ప్రాథమిక విధులు

ప్రతి పౌరుడు దేశం పట్ల, తన తోటి పౌరుల పట్ల కొన్ని కనీస బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అందువల్ల వీటిని ప్రాథమిక విధులు అంటారు. వీటిని రష్యా రాజ్యాంగం నుంచి గ్రహించారు. మౌలిక రాజ్యాంగంలో ప్రాథమిక విధుల ప్రస్తావన లేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో పొందుపర్చారు. ప్రారంభంలో పది ప్రాథమిక విధులు ఉండేవి. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని రాజ్యాంగంలో చేర్చడంతో వీటి సంఖ్య పదకొండుకు పెరిగింది. ప్రాథమిక విధులు 1977 జనవరి 3 నుంచి అమల్లోకి వచ్చాయి. అందువల్ల ఈ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా పరిగణిస్తారు.

ప్రాథమిక విధులు - లక్షణాలు

ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. అవి..

- ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఇవి నేరుగా అమల్లోకి రావు. వీటి అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాలు చేయాలి.
- ప్రాథమిక విధులు కేవలం పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక విధులు నైతికపరమైన బాధ్యతలు, మరికొన్ని పౌర బాధ్యతలు.
- కొన్ని ప్రాథమిక విధులను భారత సనాతన సంప్రదాయాలు, మత విలువలు, పురాణాల ఆధారంగా తీసుకున్నారు.

ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలోని 4-ఎ భాగంలో నిబంధన 51-ఎలో పొందుపర్చారు.

51-ఎ:

ఎ) రాజ్యాంగానికి కట్టుబడి ఉండి దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి.

బి) జాతీయ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉన్నత ఆదర్శాలను పాటించాలి.

సి) భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించాలి.

డి) దేశ రక్షణకు, జాతీయ సేవకు సదా సన్నద్ధంగా ఉండాలి.

ఇ) భారత ప్రజల మధ్య మత, భాష ప్రాంతీయ, వర్గ వైవిధ్యాలకు అతీతంగా సోదర భావాన్ని, స్ఫూర్తిని పెంపొందించాలి. స్త్రీల గౌరవాన్ని భంగపరిచేవాటిని త్యజించాలి.

ఎఫ్) భారత మిశ్రమ సంస్కృతి, ఔన్నత్యం, సంప్రదాయాలను గౌరవించి, పరిరక్షించాలి.

జి) అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులు సహా ప్రకృతిలోని పరిసరాలను కాపాడాలి, అభివృద్ధి చేయాలి, జీవులపట్ల కారుణ్యాన్ని కలిగి ఉండాలి.

హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.

ఐ) ప్రజల ఆస్తిని సంరక్షించాలి, హింసను ప్రేరేపించే చర్యల్లో పాల్గొనకూడదు.

జె) వ్యక్తిగత, సమష్టి చర్యల ద్వారా ప్రతి కార్యరంగంలోనూ అత్యున్నత స్థానాన్ని పొందడానికి కృషి చేయాలి. తద్వారా దేశ అత్యున్నత అభ్యుదయానికి తోడ్పడాలి.

కె) 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించే బాధ్యతను తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు నిర్వర్తించాలి.

ప్రాథమిక విధులు - సుప్రీంకోర్టు తీర్పులు

శ్యాం నారాయణ్ చౌక్సీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా

ఈ కేసులో జాతీయ పతాకాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రచారం కోసం వినియోగించరాదని సుప్రీం కోర్టు పేర్కొంది.

బిజో మాన్యూవల్ Vs కేరళ (1986)

ఈ కేసులో సుప్రీం కోర్టు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జాతీయ గీతాలాపన అనేది మత విశ్వాసాలకు విరుద్ధమైతే ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. జాతీయ గీతాన్ని ఆలపించినప్పుడు మాత్రం అందరూ గౌరవ సూచకంగా నిలబడాలని పేర్కొంది.

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ Vs స్టూడెంట్ యూనియన్ (2002)

ప్రాథమిక విధులను విస్మరించరాదని, అవి దేశ సమగ్రతకు, సామాజిక జీవనానికి ఆదర్శంగా ఉంటాయని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంది.

డాక్టర్ దాశరథి Vs ఆంధ్రప్రదేశ్

ఈ కేసులో ఆస్థాన కవుల హోదా చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?
   1) 8 2) 9 3) 10 4) 11
2. ఏ కమిటీ సూచనల మేరకు ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు?
   1) రాజమన్నార్ 2) సర్కారియా
   3) స్వరణ్ సింగ్ కమిటీ
   4) బల్వంత్ రాయ్ కమిటీ
3. ప్రాథమిక విధులకు సంబంధించి కిందివాటిలో సరైన వాక్యం ఏది?
   1) ప్రాథమిక హక్కులతోపాటే వీటిని ప్రవేశ పెట్టారు
   2) ఆదేశిక సూత్రాల స్థానంలో వీటిని ప్రవేశ పెట్టారు
   3) వీటిని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు
   4) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో కలిపి ప్రవేశ పెట్టారు
4. కిందివాటిలో ప్రాథమిక విధులేవి?
   1) జాతీయ గీతాన్ని గౌరవించడం
   2) మన సుసంపన్న సంస్కృతి, వారసత్వాన్ని గౌరవించడం, పరిరక్షించడం
   3) వన్యప్రాణులను కాపాడటం
   4) పైవన్నీ
5. ప్రాథమిక విధులను రాజ్యాంగంలో గుర్తించిన మరో ప్రజాస్వామిక దేశం?
   1) అమెరికా 2) ఆస్ట్రేలియా
   3) కెనడా 4) జపాన్

సమాధానాలు: 1) 4 2) 3 3) 3 4) 4 5) 4

విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చడంపై అనేక విమర్శలున్నాయి.

- దేశంలో భారత పౌరులు సహజంగా చట్ట విధేయులు, క్రమశిక్షణ ఉన్నవారు అయినప్పుడు వారి బాధ్యతలను ప్రత్యేకంగా గుర్తు చేయడం సమంజసం కాదని కొంతమంది అభిప్రాయం.
- అత్యంత ముఖ్యమైన విధులైన సక్రమంగా పన్నులు చెల్లించడం, కుటుంబ నియంత్రణ, ఎన్నికల్లో ఓటు వేయడం లాంటి వాటిని ప్రాథమిక విధుల్లో పొందుపరచలేదు.
- ఈ విధులు కేవలం నైతికపరమైన నియమావళిపైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని పాటించకపోతే శిక్షించే ఆస్కారం లేదు.
- ప్రాథమిక విధుల్లో పేర్కొన్న కొన్ని పదాలకు స్పష్టత లేదు. **ఉదా:** శాస్త్రీయ దృక్పథం, మిశ్రమ సంస్కృతి, పరిశోధనా స్ఫూర్తి అనే పదాలకు నిర్దిష్ట అర్థాలు లేవు. వీటిని నాలుగో భాగంలో కాకుండా మూడో భాగంలోనే చేర్చి ఉండాల్సింది.
- సాధారణంగా ప్రాథమిక విధులు ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అంతర్భాగంగా ఉండవు. నియంతృత్వ దేశాల రాజ్యాంగంలో మాత్రమే ఇవి ఉంటాయి.
- ఇవి చట్ట నిర్దేశానికి, ఆత్మ ప్రబోధానికి మధ్య వైవిధ్యాన్ని కలిగించవచ్చు.

ప్రాథమిక విధుల ప్రయోజనాలు

- ప్రాథమిక విధులకు న్యాయసంరక్షణ లేకపోయినా, కొన్ని లోపాలున్నా.. వీటిని రాజ్యాంగంలో చేర్చడం సమంజసమే. ఎందుకంటే విధులు లేకుండా హక్కులను మాత్రమే గుర్తిస్తే అది బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది. అదేవిధంగా హక్కులు లేని బాధ్యతలు బానిసత్వానికి ప్రతీక అవుతాయి. కాబట్టి హక్కులు, విధులు, పరస్పర పోషకాలు. అవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల లాంటివి.
- ప్రాథమిక విధులు కూడా ఆదేశిక సూత్రాల్లా ప్రభుత్వ విధానాలు, కార్యాచరణను ప్రభావితం చేస్తాయి.
- ఆచరణాత్మకమైనవి కాకపోయినా నిరంతరం పౌరుల నైతిక బాధ్యతలను గుర్తు చేస్తాయి.
- అనేక వైవిధ్యాలున్న భారతదేశంలో పౌరులు చిత్తశుద్ధితో విశాల దృక్పథంతో బాధ్యతాయుత పౌరులుగా దేశ ఐక్యతకు, సమగ్రతకు, కృషి చేసేలా దోహద పడతాయి.
- ప్రాథమిక విధులను, ప్రాథమిక హక్కులపై ఉన్న హేతుబద్ధమైన పరిమితులుగా పరిగణించవచ్చని 1992లో సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

గ్రామీణ వ్యాజ్యాల హక్కుల కేంద్రం Vs ఉత్తరప్రదేశ్ (1986)

పర్యావరణ పరిరక్షణలో ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

నవీన్ జిందాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2004)

జాతీయ జెండాను ఎగురవేయడం భావ వ్యక్తీకరణ కిందకి వస్తుందని, పౌరులకు స్వేచ్ఛగా జెండా ఎగురవేసే హక్కు ఉంటుందని పేర్కొంది.

ప్రాథమిక విధులు - జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సూచనలు

1999లో నియమించిన వర్మ కమిటీ ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని సిఫారసులు చేసింది. అవి..

- జాతీయ పతాకం, జాతీయ గీతం, భారత రాజ్యాంగ పరిరక్షణకు, గౌరవానికి సంబంధించి 1971లో చేసిన చట్టం సరిపోతుందని పేర్కొంది. అదేవిధంగా భారత శిక్షాస్మృతిలో ఉన్న చట్టాల ద్వారా కొన్ని విధులను అమలు చేయవచ్చని చెప్పింది. ఉదాహరణకు..
  పౌర హక్కుల పరిరక్షణ చట్టం – 1955,
  ప్రజాప్రాతినిధ్య చట్టం – 1951,
  చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం–1967,
  వన్యప్రాణి సంరక్షక చట్టం – 1972,
  అడవుల పరిరక్షణ చట్టం – 1980,
- ఏటా జనవరి 3ను ప్రాథమిక విధుల దినోత్సవంగా పాటించాలి.
- అన్ని విద్యా ప్రణాళికల్లో ప్రాథమిక విధులను పాఠ్యాంశంగా చేర్చాలి.
- అన్ని విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలను తప్పక ప్రవేశపెట్టాలి.
- ప్రసార మాధ్యమాల ద్వారా ప్రాథమిక విధుల గురించి విస్తృత ప్రచారం కల్పించాలి.

ప్రముఖుల వ్యాఖ్యానాలు

ఆదేశిక సూత్రాల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఆధారపడి ఉన్న విధంగానే ప్రాథమిక విధుల అమలు అనేది వ్యక్తుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది **– దుర్గాదాస్ బసు**

ప్రాథమిక విధులు కేవలం అలంకార పూర్వకమైనవి **– జస్టిస్ కె.పి. ముఖర్జీ**

హక్కులు, విధులనేవి ఒకే నాణేనికి ఉన్న పార్శ్వాలు (Two sides of a same coin) **– హెచ్.జె. లాస్కీ**

ప్రాథమిక విధులు అసంబద్ధంగా, గందరగోళంగా ఉన్నాయి **– నానీ పాల్కీవాలా**

జగన్నాథ పండితరాయల కావ్య నిర్వచనం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

కావ్య స్వరూపం - ప్రయోజనాలు - శైలి

కావ్య స్వరూపం

- 'కవిః కర్మమ్ కావ్యమ్' – కవి కలం నుంచి జాలువారిన అపూర్వ సృష్టి కావ్యం. కవి ఆర్మీయతలు కావ్యంలో ప్రతిఫలిస్తాయి. ప్రాచీనుల దృష్టిలో కవిత్వం అంటే కేవలం ఛందోబద్ధ రచనగా రూఢమైంది. పద్యం, గద్యం, పద్య గద్యాత్మక చంపూ కావ్యమైనా కావ్యమే.
- కాంతా సమ్మితమైన కావ్యానికి భారతీయ ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాల ద్వారా కావ్య స్వరూపాన్ని నిర్ధారించొచ్చు.

భారతీయ ఆలంకారికుల కావ్య నిర్వచనాలు

- **భరతుడు:** 'ఇతివృత్తంతు కావ్య శరీరమ్'.. నాట్యశాస్త్రంలో ఇతివృత్తమే కావ్య శరీరమని చెప్పారు.
- **దండి:** 'కావ్యాదర్శం'లో 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యమ్'.. మనోహరమైన అర్థంతో కూడిన పదాల సమూహమే కావ్యమన్నారు.
- **భామహుడు:** 'కావ్యాలంకారం'లో 'శబ్దార్థౌ సహితౌ కావ్యమ్'.. హితంతో కూడిన శబ్దార్థాల సమూహమే కావ్యమని చెప్పారు.
- **రుద్రటుడు:** శబ్దార్థాల సమాహారమే కావ్యమన్నారు.
- **భోజుడు:** సరస్వతీ కంఠాభరణంలో 'నిర్దోషం గుణవత్కావ్యమలంకృతై రలంకృతమ్ రసాన్వితం కవిః కుర్వన్ కీర్తిం ప్రీతించవిదంతి'.. దోషరహితంగా, గుణసహితంగా, అలంకార యుక్తంగా రసాన్వితమైన కావ్యాన్ని రచించిన కవి యశాన్ని, ఆహ్లాదాన్ని పొందగలడు.
- **మమ్మటుడు:** 'తదదోషౌశబ్దార్థౌ సగుణావనలంకృతే పునఃక్వాపికావ్యమ్'.. దోష రహితంగా, గుణ సహితంగా ఉన్న శబ్దార్థాలే కావ్యమని, ఒక్కొక్కసారి అలంకార రహితమైనా దాన్ని కావ్యంగా పరిగణించవచ్చని చెప్పారు.
- **హేమచంద్రుడు:** మమ్మటుడిలా మరింత స్పష్టంగా 'అదోషౌసగుణౌ సాలంకారౌచ శబ్దార్థౌ కావ్యమ్'.. దోష రహితమైన, గుణసహితమైన, సాలంకారమైన శబ్దార్థాలే కావ్యమని చెప్పారు.
- **విశ్వనాథుడు:** సాహిత్య దర్పణంలో మమ్మటుడు, హేమచంద్రుడు చెప్పిన నిర్వచనాలను ఖండించారు. ఆయన అభిప్రాయంలో రస సంబంధ దోషమే దోషమని, శాబ్దిక దోషాలున్నా కావ్యత్వ హాని జరగదని రస ప్రాధాన్యంలో 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నారు. రస ప్రాధాన్య దృష్టితో రసవత్తరమైన ఒక మహావాక్యమే కావ్యమన్నారు.
- **జగన్నాథ పండిత రాయలు:** విశ్వనాథుడి నిర్వచనంలో అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలున్నాయని జగన్నాథ పండిత రాయలు విమర్శించారు. రసం లేకున్నా లోకోత్తర చమత్కార జనకాలైన వ్యంగ్య రచనలు లోకంలో కావ్యాలుగా గొప్పగా విలసిల్లుతున్నాయన్నారు. ఆయన 'రమణీయార్థక ప్రతిపాదక శబ్దఃకావ్యమ్'.. రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దాల సమూహమే కావ్యమన్నారు.
- రమణీయమైంది రసవత్తరం కాకపోదని, విశ్వనాథుడి రస ప్రాధాన్యం కూడా ఇందులో ఉన్నందువల్ల దీన్ని నిర్దుష్టమైన నిర్వచనంగా ఆలంకారికులు నిర్ధారించారు.
- వామనుడు 'రీతి'ని కావ్యాత్మగా నిర్వచించారు. ఆనంద వర్ధనుడు 'ధ్వని' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పీయూష వర్ధనుడు పండిత రాయల అభిప్రాయానికి అనుగుణంగా కావ్యాన్ని నిర్వచించారు. శౌద్ధోదని.. విశ్వనాథుడి రస సిద్ధాంతానికి అనుగుణంగా కావ్యాన్ని ప్రతిపాదించారు. కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని వ్యక్తీకరించారు. క్షేమేంద్రుడు ఔచిత్య సిద్ధాంతాన్ని నిర్వచించారు.
- భారతీయ ఆలంకారికుల అభిప్రాయాలను అనుసరించి దోష రహితమైన, గుణ సహితమైన, రసవత్తరమైన రమణీయ శబ్దార్థాల సముదాయాన్ని కావ్యంగా పరిగణించడం సమంజసంగా ఉంటుంది.

పాశ్చాత్య విమర్శకులు - కావ్య నిర్వచనాలు

- **శామ్యూల్ జాన్సన్:** కవిత్వమంటే ఛందోబద్ధమైన రచన అన్నారు. బుద్ధి భావనలతో ఆనంద సత్యాలను సమైక్యంగా సంఘటించే కళగా పేర్కొన్నారు.
- **వర్డ్స్‌వర్త్:** ప్రశాంత మానసిక స్థితిలో ఉద్రిక్తత నుంచి ఆవిర్భవించే తీవ్ర అనుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వమని చెప్పారు.
- **షెల్లీ:** సాధారణంగా భావానుగుణమైన వ్యక్తీకరణమే కవిత్వం అన్నారు.
- **హాజ్లిట్:** షెల్లీ అభిప్రాయాన్ని మరికొంత స్పష్టంగా వివరిస్తూ భావనాశక్తికి అనుకూలమైన శబ్ద సముదాయమే కవిత్వం అని చెప్పారు.
- **కార్లయిల్:** సంగీత లయాత్మక భావనే కవిత్వం అన్నారు.
- **మాథ్యూ ఆర్నాల్డ్:** 'సత్య నిబంధనలతో కూడిన జీవిత విమర్శనమే కవిత్వం' అన్నారు.
- **కోల్‌రిడ్జ్:** ఉత్తమ పదాలను సముచిత రీతిలో అమర్చడమే కవిత్వం అని చెప్పారు.
- **ఎడ్గార్ ఎలెన్ పో:** లయాత్మక సౌందర్య సృష్టి కవిత్వం అని చెప్పారు.
  పాశ్చాత్య విమర్శకుల్లో ఎడ్గార్ ఎలెన్ పో నిర్వచనాన్ని ఉత్తమమైందిగా విమర్శకులు పరిగణించారు.

కావ్య ప్రయోజనాలు

- ఆలంకారికుల్లో మమ్మటుడు, అభినవ గుప్తుడు, ఆనంద వర్ధనుడు, భామహుడు, జగన్నాథ పండిత రాయలు వంటివారు కావ్య ప్రయోజనాలను సవివరంగా చర్చించారు. పాశ్చాత్య విమర్శకులు లోవెల్, జాన్ డ్రైడెన్, స్కాలిజర్ వంటి వారు కావ్య ప్రయోజనాలను వివరించారు. వాటిని పరిశీలిద్దాం.
- **మమ్మటుడు:**
  1) యశస్సు, అర్థం లభిస్తుంది.
  2) వ్యవహార జ్ఞానం సిద్ధిస్తుంది.
  3) అమంగళ పరిహారం కలుగుతుంది.
  4) జీవన్ముక్తి ప్రదాయకాలైన ఆహ్లాద తన్మయత్వాలు కలుగుతాయి.
- **అభినవ గుప్తుడు:** కావ్యం కాంతా సమ్మితంగా ఉపదేశం చేస్తుంది.
- **భామహుడు:**
  1) సత్కావ్యం ధర్మార్థ కామమోక్షాదులైన చతుర్విధ పురుషార్థాలను కలిగిస్తుంది.
  2) లలిత కళా పరిజ్ఞానాన్ని అందిస్తుంది.
  3) సత్కీర్తిని, నిరంతర ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.
- **జగన్నాథ పండిత రాయలు:** సాహితీవ్రతుడైన కవికి ఎనలేని గౌరవం కలుగుతుందని చెప్పారు. సాహితీవ్రతుడు కానివాడు వ్యాసుడైనా, గౌతముడైనా, పతంజలైనా కానిమ్ము వానికి తిరస్కారం, పురస్కారం చూపక నా శిరస్సు ఉదాసీనతను ప్రకటిస్తుందన్నారు.
- **లోవెల్:** కావ్యంలో తత్వబోధ ఉండాలన్నారు. తత్వబోధ లేని కావ్యం తనకు పాథేయం కాదన్నారు.
- **జాన్ డ్రైడెన్:** కావ్యానికి ముఖ్య ప్రయోజనం ఆనందం అని, అనుషంగిక ప్రయోజనం ఉపదేశమని చెప్పారు.
- **స్కాలిజర్:** 'ఆనందకరమైన బోధనే' కావ్య ప్రయోజనం అన్నారు.
- పాశ్చాత్య విమర్శకులు ఆనందం, ఉపదేశం, తాత్వికత, బోధనలను కావ్య ప్రయోజనాలుగా భావించారు.

కావ్య శైలి

- ఆలంకారికులు కావ్య శైలికి సంబంధించి గుణాలు, రీతులు, పాకాలను పేర్కొన్నారు. ప్రాచీన, ఆధునిక పద్య కావ్యాల శైలికి సంబంధించి ఇవి ప్రామాణికాలు. ఆధునిక సృజనాత్మక వచన ప్రక్రియలైన కథానిక, నవల, నాటకం వంటి వాటిలో శైలికి సంబంధించి కథన చాతుర్యం, పాత్రలు, సంభాషణలు వంటివి ప్రధానమైనవి. ఆంగ్లంలో 'స్టైల్' అనే పదానికి సమానార్థకంగా 'శైలి' పదాన్ని విమర్శకులు పరిగణిస్తున్నారు.
- ఆలంకారికుల్లో భామహుడు మూడు కావ్య గుణాలను పేర్కొన్నారు.
  1) ప్రసాదం 2) ఓజస్సు 3) మాధుర్యం.

1. **ప్రసాదం:** ప్రసిద్ధ పదాల ప్రయోగంతో, సులువుగా అర్థాన్ని స్ఫురింపజేసే రచన ప్రసాద గుణం. **ఉదా:** మొల్ల, వేమన, కరుణశ్రీ వంటి వారి పద్య రచనలు ప్రసాద గుణభరితాలు.
2. **ఓజస్సు:** క్లిష్టమైన అక్షరాల కూర్పుతో, దీర్ఘ సమాస భూయిష్టమైన రచన ఓజో గుణం. **ఉదా:** శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు, భట్టుమూర్తి వంటి వారి పద్య రచనలు ఓజో గుణ ప్రధానాలు.
3. **మాధుర్య గుణం:** స్పష్టంగా అర్థమయ్యే విడివిడి పదాలతో కూడిన రచన మాధుర్య గుణం. తిక్కన, పోతన, కరుణశ్రీ వంటి వారి రచనలు మాధుర్య గుణభరితాలు.

- **రీతులు:** వామనుడు కావ్యాత్మగా రీతిని ప్రతిపాదించాడు. విశిష్ట పద రచనతో కూడిన కావ్యం రీతి ప్రధానం. రీతులు మూడు విధాలు. అవి..
  1) వైదర్భీ రీతి 2) గౌడీ రీతి
  3) పాంచాలి రీతి

1. **వైదర్భీ రీతి:** సమాస రహితమైన, సరళమైన అక్షరాల కూర్పుతో కూడిన రచన వైదర్భీ రీతి. **ఉదా:** మొల్ల రామాయణం, వేమన పద్యాలు.
2. **గౌడీ రీతి:** పరుషమైన అక్షరాల కూర్పుతో, మహా ప్రాణాక్షరాల బంధంగా, దీర్ఘ సమాస భూయిష్టమైన రచన గౌడీ రీతి. కాశీఖండం, భీమ ఖండం, ఆముక్తమాల్యద, వసు చరిత్ర, పాండురంగ మహాత్మ్యం, శ్రీమద్రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు ఈ రీతికి ఉదాహరణలు.
3. **పాంచాలి రీతి:** కొంత సరళంగా, కొంత కఠినంగా, పై రెండు రీతులు కలయికగా ఉండే రచన 'పాంచాలి రీతి'. తిక్కన భారతం, పోతన భాగవతం, శివ భారతం వంటి కావ్యాలు ఉదాహరణలు.

- **వృత్తులు:** ఆలంకారికులు మూడు వృత్తులను పేర్కొన్నారు. కావ్య శైలికి సంబంధించిన రచనా విధానాలు వృత్తులు.
  1) కైశికీ వృత్తి 2) సాత్వతీ వృత్తి
  3) ఆరభటీ వృత్తి

1. **కైశికీ వృత్తి:** సరళమైన విడి పదాలతో కూడిన రచనా శైలి కైశికీ వృత్తి. శృంగార రస శైలికి అనువైంది.
2. **సాత్వతీ వృత్తి:** మరీ క్లిష్టంగా, మరీ సరళంగా కాకుండా మధ్యస్థంగా ఉండే శైలీ విధానానికి సంబంధించింది.. సాత్వతీ వృత్తి. వీర రస ప్రధానమైన రచనలకు అనువైంది.
3. **ఆరభటీ వృత్తి:** ప్రౌఢమైన సమాస భూయిష్టమైన రచనా శైలికి సంబంధించింది.. ఆరభటీ వృత్తి. బీభత్స, భయానక రసాలకు అనువైంది.

- **పాకాలు:** రసోచిత శబ్దార్థాల సమ్మేళనాలే కావ్య శైలికి సంబంధించిన పాకాలు. కావ్య గుణాలు, కావ్య రీతులు, వృత్తులు కలిపి పాకాలుగా ఏర్పడతాయి. ఆలంకారికులు మూడు పాకాలను పేర్కొన్నారు.
  1) ద్రాక్షాపాకం 2) కదళీపాకం
  3) నారికేళపాకం

1. **ద్రాక్షాపాకం:** సులువుగా అర్థమయ్యే రచనా శైలి ద్రాక్షాపాకం. మాధుర్య గుణం + వైదర్భీ రీతి + కైశికీ వృత్తుల సమ్మేళనమే ద్రాక్షాపాకం. శృంగార రసానికి అనువైన శైలి ద్రాక్షాపాకం.
2. **కదళీపాకం:** కొంత కఠినంగా, కొంత సరళంగా ఉండే రచనా శైలి కదళీపాకం. ప్రసాద గుణం + పాంచాలి రీతి + సాత్వతీ వృత్తుల కలయిక కదళీపాక శైలి. వీర రస స్ఫోరకమైన రచనలకు అనుకూలమైంది.
3. **నారికేళపాకం:** ప్రౌఢ రీతిలో ఉన్న పద్య శైలీ రచన నారికేళ పాకం. ఓజో గుణం + గౌడీ రీతి + ఆరభటీ వృత్తుల కలయిక నారికేళ పాకం. బీభత్స, భయానక రసాలకు అనువైన శైలి.

గత డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. విశ్వనాథుడి కావ్య నిర్వచనం?
   1) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   2) రమణీయార్థక ప్రతిపాదక శబ్దం కావ్యం
   3) శబ్దార్థౌ సహితౌ కావ్యం
   4) వాక్యం రసాత్మకం కావ్యం
2. వేద పురాణ కావ్యాలు వరుసగా?
   1) ప్రభు కాంతా మిత్ర సమ్మితాలు
   2) కాంతా ప్రభు మిత్ర సమ్మితాలు
   3) మిత్ర కాంతా ప్రభు సమ్మితాలు
   4) ప్రభు మిత్ర కాంతా సమ్మితాలు
3. జగన్నాథ పండితరాయల కావ్య నిర్వచనం?
   1) నను శబ్దార్థేః కావ్యం
   2) నిర్దోష లక్షణ వతీస కావ్య శబ్దభాక్
   3) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   4) రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం

సమాధానాలు

1) 4; 2) 4; 3) 4.

మాదిరి ప్రశ్నలు

1. 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విశ్వనాథుడు 2) దండి
   3) భోజుడు 4) భామహుడు
2. 'శబ్దార్థౌ సహితౌ కావ్యం' అని నిర్వచించిన ఆలంకారికుడు?
   1) అభినవ గుప్తుడు 2) దండి
   3) భామహుడు 4) భరతుడు
3. 'నిర్దోషం గుణ వత్కావ్య మలంకారై రలంకృతమ్' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) రుద్రటుడు 2) భోజుడు
   3) వామనుడు 4) మమ్మటుడు
4. 'అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విద్యాధరుడు 2) భట్టతౌతుడు
   3) ఆనంద వర్ధనుడు 4) వామనుడు
5. శృంగార రసానికి అనువైన కవిత్వ పాకం?
   1) నారికేళ పాకం 2) కదళీ పాకం
   3) ద్రాక్షాపాకం 4) కైశికి పాకం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 3.

వనరుల కొరత వల్ల ఏర్పడే సమస్య?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

అర్థశాస్త్రం - పరిధి

- అర్థశాస్త్రం అనే పదం గ్రీకు భాషలోని 'OIKOS', 'NEMEIN' అనే రెండు పదాల నుంచి ఆవిర్భవించింది. OIKOS అంటే ఇల్లు, NEMEIN' అంటే నిర్వహణ. గృహ, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో నైపుణ్యమని అర్థం. అర్థశాస్త్ర పితామహుడు 'ఆడమ్‌స్మిత్' అర్థశాస్త్రాన్ని సంపదకు సంబంధించిన శాస్త్రంగా నిర్వచించారు. ఆయనకు ముందు అర్థశాస్త్రాన్ని రాజనీతి ఆర్థిక వ్యవస్థగా పిలిచేవారు. ఆడమ్ స్మిత్ రచించిన 'దేశాల సంపద, స్వభావం, కారణాల పరిశోధన' 1776లో ప్రచురితమైన తర్వాత అర్థశాస్త్రం ప్రత్యేక శాస్త్రంగా రూపొందింది. 'సామాజిక శాస్త్రాల్లో అర్థశాస్త్రం రాణి వంటిది' అని పాల్ శామ్యూల్‌సన్ పేర్కొన్నారు.
- మానవుడు, అతని శ్రేయస్సును గురించి అధ్యయనం చేసే శాస్త్రం.. అర్థశాస్త్రమని ఆల్‌ఫ్రెడ్ మార్షల్ నిర్వచించారు.
- అమర్త్యసేన్ - సంక్షేమ ఆర్థిక శాస్త్రం గురించి వివరించారు. ఆడమ్ స్మిత్‌తో సహా సంప్రదాయ ఆర్థికవేత్తలందరూ అర్థశాస్త్రం సంపదకు సంబంధించిన శాస్త్రమని అభిప్రాయపడ్డారు. అర్థశాస్త్రానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనాన్ని ఇచ్చిన మొదటి వ్యక్తి ఆడమ్‌స్మిత్. సంపద నిర్వచనాన్ని బలపర్చినవారు జె.బి.సే, జె.ఎస్.మిల్, వాకర్ మొదలైన ఆర్థికవేత్తలు. ఆడమ్ స్మిత్ సంపదకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వగా మార్షల్ శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. కార్లే, రస్కిల్‌లు సంపద నిర్వచనాన్ని విమర్శిస్తూ కేవలం సంపద అనే ఒకే విషయాన్ని గురించి చర్చించే శాస్త్రం శాస్త్రమే కాదని అది ఒక శూన్య శాస్త్రమని పేర్కొన్నారు. లయోనెల్ రాబిన్స్ 1932లో ప్రచురించిన ప్రఖ్యాత పుస్తకం 'యాన్ ఎస్సే ఆన్ ది నేచర్ అండ్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ఎకనామిక్ సైన్స్' లో వనరుల కొరతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.
- **పరిధి:** అర్థశాస్త్రం ముఖ్యంగా సంపదకు సంబంధించిన శాస్త్రం. మానవుడు కోర్కెలను సంతృప్తి పర్చుకోవడానికి ధనాన్ని ఏ విధంగా ఉపయోగిస్తాడో తెలియచేస్తుంది. మానవుల కోర్కెలు తీర్చే వస్తు సేవల ఉత్పత్తి ఎలా జరుగుతుంది? తయారైన వస్తువులు మార్కెట్ల ద్వారా వ్యక్తులకు ఎలా చేరతాయి? వాటి ధరలను ఎలా నిర్ణయిస్తారు వంటి విషయాలను అర్థశాస్త్రం తెలుపుతోంది. ఉద్యోగిత, ఆదాయ పంపిణీ, ధరల పెరుగుదల, వస్తుమార్పిడి మొదలైన అంశాల్లో వ్యక్తులు, ప్రభుత్వ ప్రవర్తనను అర్థశాస్త్రం వివరిస్తుంది. ఆధునిక కాలంలో అర్థశాస్త్ర ప్రాముఖ్యత పరిధి పెరిగింది.



ప్రాముఖ్యత, ఆవశ్యకత

- అర్థశాస్త్రం ఒక సామాజిక, మానవీయ శాస్త్రం. ఇది శాస్త్రరూపం దాల్చి 200 ఏళ్లే అయినప్పటికీ దీన్ని 'సామాజిక శాస్త్రాల రాణి'గా పరిగణిస్తున్నారు. ఈ శాస్త్రంలో విశేషమైన ప్రతిభ కనబర్చిన వారికి 1969 నుంచి అత్యున్నత పురస్కారమైన నోబెల్ బహుమతి ఇస్తున్నారు. మనదేశానికి చెందిన భారతరత్న అవార్డ్ గ్రహీత అమర్త్యసేన్‌కు 1998లో నోబెల్ బహుమతి లభించింది. ప్రస్తుత ప్రణాళికా యుగంలో ఆర్థికాభివృద్ధికి ఈ శాస్త్ర అధ్యయనం ఎంతో ఉపయోగకరం. భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి, వనరుల సమతౌల్య వినియోగానికి అర్థశాస్త్రం ఉపయోగపడుతుంది. దేశ ఆర్థిక వనరులు పరిమితంగా ఉంటాయి. కాబట్టి ఆర్థిక వనరులను వినియోగ వస్తువుల తయారీకి ఎక్కువగా ఖర్చు చేస్తే ఆర్థికాభివృద్ధికి అవసరమైన వస్తువుల తయారీకి కావాల్సిన వనరుల కొరత ఏర్పడుతుంది. అందువల్ల వనరుల వాడకంలో సమతూకాన్ని పాటించాల్సి ఉంది.
- వస్తువుకు ఉండే కోరికలను తీర్చగలిగే శక్తిని ఉపయోగ విలువ అంటారు. ఉదాహరణకు గాలి, నీరు, ఆహారం, వస్త్రం, ఇల్లు, కారు వీటన్నింటికీ ఉపయోగ విలువ ఉంటుంది.
- ఒక వస్తువు కొనుగోలు శక్తిని వినిమయ విలువ అంటారు. ఇది ఆ వస్తువు మారక విలువకు సంబంధించింది. అర్థశాస్త్రంలో మారక విలువ ఉన్న వస్తువులను అధిక వస్తువులు అంటారు. ఉత్పత్తి అయిన వస్తు సేవలు వాటి ఉత్పత్తికి కారణమైన కారకాల మధ్య ఎలా సరఫరా అవుతాయో పంపిణీ తెలుపుతుంది. భూమికి, శ్రమకు, మూలధనాలకు చెల్లించే ప్రతిఫలాలు వరుసగా భాటకం, వేతనం, వడ్డీ. వ్యవస్థాపనకు చెల్లించే ప్రతిఫలం లాభాలు.
- వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తులకు ఆదాయం వస్తుంది. ద్రవ్య రూపంలో వచ్చే ఆదాయాన్ని 'ద్రవ్య ఆదాయం' అంటారు. ద్రవ్య ఆదాయాన్ని అది కొనుగోలు చేయగల వస్తు సేవల రూపంలో చెప్పినట్లయితే దాన్ని 'నిజ ఆదాయం' అంటారు.
- ఆర్థిక వ్యవస్థలో అమలులో ఉన్న వేతనస్థాయి వద్ద పనిలో చేరడానికి ఇష్టపడిన వారందరికీ పని కలిగించగలిగే స్థితిని 'సంపూర్ణ ఉద్యోగిత' స్థితి అంటారు.
- నార్వేలోని ఓస్లో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాగ్నర్ ఫ్రిష్ 1933లో మొదటిసారిగా సూక్ష్మ, స్థూల అర్థశాస్త్రాలు అనే భావనలను అభివృద్ధి చేశారు. అర్థ శాస్త్రంలో నోబెల్ బహుమతిని 1969 నుంచి ఇస్తున్నారు. మొదటి విజేత రాగ్నర్ ఫ్రిష్.
- సూక్ష్మ అర్థశాస్త్రం అనేది 'మైక్రాస్' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. మైక్రో అంటే చిన్న అని అర్థం. సూక్ష్మ అర్థశాస్త్రం వైయక్తిక ఆర్థిక యూనిట్లను అధ్యయనం చేస్తుంది. దీనికి ఎక్కువ ప్రాచుర్యం కల్పించిన వారు మార్షల్. ఆయన రచించిన గ్రంథం 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్'. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని ధరల సిద్ధాంతం అని కూడా అంటారు.
- స్థూల అర్థశాస్త్రం మాక్రోస్ అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. మాక్రో అంటే పెద్ద అని అర్థం. స్థూల అర్థశాస్త్రం మొత్తం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేస్తుంది. ఉదా: జాతీయాదాయం, మొత్తం వినియోగం, మొత్తం రాబడి, మొత్తం ఉద్యోగిత మొదలైన సమష్టి అంశాలను స్థూల అర్థశాస్త్రం వివరిస్తుంది. జె.ఎం. కీన్స్ స్థూల అర్థశాస్త్రానికి ఎక్కువ ప్రాధాన్యాన్ని కల్పించారు. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని మార్షల్, స్థూల అర్థశాస్త్రాన్ని కీన్స్ వివరించారు. ధరల సిద్ధాంతాన్ని సూక్ష్మ అర్థశాస్త్రం అని, ఆదాయ ఉద్యోగిత సిద్ధాంతాన్ని స్థూల అర్థశాస్త్రం అని పిలుస్తారు.
- ప్రజల కోరికలను సంతృప్తి పర్చగలిగే దృశ్యరూప పదార్థాలన్నింటినీ వస్తువులుగా పరిగణించొచ్చు. ప్రకృతి పరంగా అందరికీ అందేవాటిని ఉచిత వస్తువులని అంటారు. వీటి విషయంలో డిమాండ్ కంటే సప్లయ్ ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. వీటికి ఉపయోగితా విలువ ఉంటుంది. వినిమయ విలువ ఉండదు. **ఉదా:** సూర్యరశ్మి, నదిలో నీరు, గాలి. పెద్ద నగరాల్లో నీటిని ఉచిత వస్తువుగా చెప్పలేం.
- కొరతగా ఉన్న వస్తువులన్నీ ఆర్థిక వస్తువులే. డిమాండ్‌తో పోల్చి చూసినప్పుడు సప్లయ్ ఎప్పుడూ తక్కువగా ఉండి ధర చెల్లించాల్సిన వస్తువులను ఆర్థిక వస్తువులని అంటారు. పబ్లిక్, ప్రైవేట్ వస్తువులు అన్నీ ఆర్థిక వస్తువులే. ప్రజలు కోరే వస్తువులను ఉత్పత్తి చేసేందుకు వనరులను అత్యుత్తమ పద్ధతిలో వాడుకోవడాన్ని ఆర్థిక సామర్థ్యం అంటారు. ప్రస్తుతం ఉపయోగించుకోవడానికి ఉత్పత్తి చేసే వస్తువులను వినియోగ వస్తువులంటారు. ఇతర వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగపడుతూ మానవుని కోర్కెలను పరోక్షంగా తీర్చగలిగే వస్తువులను ఉత్పాదక వస్తువులు లేదా మూలధన వస్తువులు అని అంటారు. **ఉదా:** యంత్రాలు, పరికరాలు. పూర్తిగా తయారు కాకుండా ఉత్పత్తి ప్రక్రియలో వివిధ దశల్లో ఉన్న వస్తువులను మాధ్యమిక వస్తువులు అంటారు.
- **ఉదా:** సిమెంట్, ఇటుకలు, ఉక్కు.
- అర్థశాస్త్రంలో ఆర్థిక వస్తువులన్నింటినీ సంపదగా పరిగణిస్తారు. ఒక వినియోగదారుడు లేదా సంస్థ కలిగి ఉన్న ఆదాయాన్ని ఆర్జించడానికి అవకాశం ఉన్న ఆస్తుల నిల్వ.. సంపద. ఆదాయానికి మూలం సంపద. సంపద ఒక విలువ. దీని ద్వారా ఆదాయం ప్రవాహం రూపంలో వస్తుంది. ప్రతి ఆర్థిక వ్యవస్థలో ఆదాయం కుటుంబాల నుంచి వ్యాపార సంస్థలకు, వ్యాపార సంస్థల నుంచి కుటుంబాలకు ప్రవహిస్తుంది. మానవుని కోరికలను సంతృప్తి పర్చగలిగే వస్తు, సేవల శక్తిని ప్రయోజనం అంటారు. ఒక వస్తువు ఆకారం, రంగు, పరిమాణం మొదలైనవి మార్చడం ద్వారా ఆ వస్తువుకు మానవుని కోరికను తీర్చగలిగే శక్తి పెరిగినట్లయితే దాన్ని రూప ప్రయోజనం అంటారు. **ఉదా:** చెక్కతో కుర్చీ లేదా టేబుల్ తయారు చేసినప్పుడు దాన్ని రూప ప్రయోజనం అంటారు. అదేవిధంగా స్థల, కాల, సేవల ప్రయోజనం కూడా ఉంటుంది.
- వ్యక్తులు తమ ప్రస్తుత కోరికలను తీర్చుకోవడానికి వస్తు సేవలను ఉపయోగించడాన్నే వినియోగం అంటారు. వస్తువులు ఉపయోగించే వ్యక్తిని వినియోగదారుడంటారు.
- అర్థశాస్త్రంలో ఉత్పత్తి అంటే ముడి పదార్థాలకు ప్రయోజనం చేకూర్చి అంతిమ వస్తువులుగా మార్చే ప్రక్రియ. వస్తువులను ఉత్పత్తి చేసేవారు ఉత్పత్తిదారులు.
- ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించే ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రతినిధి. ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనే వారందరూ ఉత్పత్తిదారులే. సేవలను ఉత్పత్తి చేసే వర్తకుడు కూడా ఉత్పత్తిదారుడే. ప్రత్యక్ష వినియోగానికి తోడ్పడే ఉత్పత్తులను అంతిమ ఉత్పత్తులు అంటారు. వస్తువు లేదా సేవలను ఉపయోగించుకొనే ప్రతి వ్యక్తి వినియోగదారుడే. వస్తు ఉత్పత్తికి ఉపయోగపడే వస్తువులను ఉత్పాదక వస్తువులు అంటారు. చిల్లర వర్తకులు విక్రయించే ధరను చిల్లర ధర అంటారు.
- వ్యాపారానికి కావాల్సిన పెట్టుబడిని వాటాలుగా (షేర్స్)గా విభజించి వాటిని ఎంపిక చేసిన కొంతమందికి, ప్రజలకు అమ్మి ఆ ధనంతో వ్యాపార వ్యవస్థను నిర్వహించడాన్ని 'జాయింట్ స్టాక్ కంపెనీ' అంటారు. ఈ కంపెనీలను 'లిమిటెడ్' అనడానికి కారణం వాటాదారు బాధ్యత పెట్టిన పెట్టుబడి మేరకే పరిమితంగా ఉంటుందని అర్థం.
- ప్రతి ధరకు, డిమాండ్‌కు సంబంధాన్ని డిమాండ్ ఫలం అంటారు. అంటే 'డిమాండ్ పరిమాణానికి ఆధారం ధర. కాబట్టి ధర తగ్గినప్పుడు డిమాండ్ పెరుగుతుంది. ధర పెరిగినప్పుడు డిమాండ్ తగ్గుతుంది. ధరకు డిమాండ్‌కు మధ్య విలోమ సంబంధం ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఏ నిర్వచనం వల్ల అర్థశాస్త్రానికి సార్వజనీనత లభిస్తుంది?
   1) కొరత 2) శ్రేయస్సు
   3) సంపద 4) అన్నీ
2. సూక్ష్మ అర్థశాస్త్రానికి మరొక పేరు?
   1) క్షీణోపాంత ప్రయోజన సూత్రం
   2) ఆదాయ ఉద్యోగితా సిద్ధాంతం
   3) ధరల సిద్ధాంతం 4) ఏదీకాదు
3. 'Wealth of Nations' గ్రంథాన్ని ఎవరు రాశారు?
   1) పిగూ 2) వాల్రస్
   3) మార్షల్ 4) ఆడం స్మిత్
4. 1970లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత?
   1) రాబిన్స్ 2) అమర్త్యసేన్
   3) మార్షల్ 4) పాల్ శామ్యూల్‌సన్
5. వనరుల కొరత వల్ల ఏర్పడే సమస్య?
   1) ఎంపిక 2) కొరత
   3) ఆర్థిక 4) శ్రేయస్సు
6. పూర్తిగా తయారుకాకుండా ఇంకా తయారీలో ఉన్న వస్తువులను ఏమంటారు?
   1) వినియోగ వస్తువులు
   2) మాధ్యమిక వస్తువులు
   3) ఆర్థిక వస్తువులు
   4) ఉచిత వస్తువులు
7. 'ఉద్యోగిత, వడ్డీ, ద్రవ్య సాధారణ సిద్ధాంతం' అనే పుస్తకాన్ని ఎవరు రాశారు?
   1) కె.ఇ. బోల్డింగ్ 2) రాగ్నర్ ఫ్రిష్
   3) జె.ఎం. కీన్స్ 4) స్టిగ్లర్
8. అర్థశాస్త్రంలో 'సూక్ష్మ అర్థశాస్త్రం', 'స్థూల అర్థశాస్త్రం' భావనలను 1933లో అభివృద్ధి చేసినవారు?
   1) కీన్స్ 2) ఆడమ్ స్మిత్
   3) రాగ్నర్ ఫ్రిష్ 4) రాబిన్స్
9. ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్ అనే గ్రంథాన్ని రచించింది?
   1) మార్షల్ 2) కీన్స్
   3) ఆడమ్ స్మిత్ 4) రాబిన్స్
10. చెక్కతో కుర్చీ తయారు చేసినప్పుడు దానికి ఏ ప్రయోజనం చేకూరుతుంది?
    1) రూప ప్రయోజనం
    2) స్థల ప్రయోజనం
    3) సేవల ప్రయోజనం
    4) కాల ప్రయోజనం
11. అర్థశాస్త్రాన్ని 'సామాజిక శాస్త్రాల్లో రాణి' వంటిదని చెప్పినవారు?
    1) జాకోబ్ వైనర్ 2) మార్షల్
    2) ఆడమ్ స్మిత్ 4) పాల్ శామ్యూల్ సన్
12. అర్థశాస్త్రానికి కొరత నిర్వచనాన్ని ఇచ్చిన ఆర్థికవేత్త?
    1) రాబిన్స్ 2) ఆడమ్ స్మిత్
    3) మార్షల్ 4) జాకోబ్ వైనర్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 4;
5) 1; 6) 2; 7) 3; 8) 3;
9) 1; 10) 1; 11) 4; 12) 1;

Audit adopted by banking company is?



BANK EXAMS

BANKING AWARENESS

Model Questions

1. Which of the following is most important contributing factor affecting the profitability of banks?
   a) Deteriorating productivity
   b) Heavy establishment expenses
   c) Huge "dead credit" in sick industries and the mounting NPAs
   d) Heavy losses on investment portfolio
   e) None of these
2. No license from RBI is required for:
   a) Opening a new bank branch in India
   b) Opening a new bank branch outside India
   c) Shifting an existing branch outside the city, village or town
   d) Shifting an existing branch within the same city, village or town
   e) None of these
3. "Pure Banking Nothing Else" is a slogan raised by:
   a) ICICI Bank b) HDFC Bank
   c) SBI d) Axis Bank
   e) None of these
4. How much bad loans was accumulated with the public sector banks by 31[st] March 2015, as disclosed by the Finance Ministry on 21[st] July 2015?
   a) Rs.4.50 lakh crores
   b) Rs.1.50 lakh crores
   c) Rs.2.67 lakh crores
   d) Rs.3.57 lakh crores
   e) Rs.5.50 lakh crores
5. What are the RBI guidelines for the development of interest rate swaps (IRS):
   a) Banks can use IRS for hedging and trading both
   b) MIFOR is a benchmark for IRS
   c) Under ISDA agreement Banks can opt for dual jurisdction i.e; Indian as well as common law
   d) All of the above
   e) None of these
6. Which bank has become the first to launch Watch Banking in India?
   a) ICICI b) HDFC c) Axis
   d) SBI e) None of these
7. Which of the following countries are top three largest shareholders in Asian Infrastructure Investment Bank (AIIB)?
   a) China, India and Australia
   b) China, Australia and Canada
   c) China, India and Russia
   d) China, Russia and India
   e) None of these
8. Which of the following is NOT a banking related term?
   a) SME finance b) Overdraft
   c) Drawing power
   d) Term Loan e) None of these
9. Which of the following agencies is associated with business of Insurance sector as a regulator?
   a) NPCI b) IRDA c) SEBI
   d) AMFI e) None of these
10. Which of the following is the major function of an ATM installed by banks:
    a) To determine cash by way of withdrawl from one's account
    b) To transfer money from one place to another place
    c) To detect fake currency notes
    d) To arrange currency notes in serial order and count them
    e) None of these
11. Khandelwal Committee relates to study of _____ issues in public sector banks:
    a) Capital Adequacy Ratio
    b) Human Resources
    c) Branch Expansion
    d) Foreign Exchange
    e) None of these
12. Which among the following country has least contribution in the capital of the New Development Bank (NDB)?
    a) Brazil b) India
    c) South Africa d) Russia
    e) None of these
13. Liquidty ratio is fixed by Reserve Bank of India under the powers conferred on it by:
    a) Reserve bank of India Act, 1934
    b) Companies Act, 1956
    c) Bank Regulation Act, 1949
    d) Special Powers given by the Union Ministry of Finance
    e) None of these
14. Which of the following is not a member of the World Bank Group:
    a) International Bank for Reconstruction and Development
    b) International Development Association
    c) Bank of International Settlement
    d) International Finance Corporation
    e) None of these
15. The growth of commercial banks advances has proportionately been less than that in deposits. This is because:
    a) The commercial banks follow a conservative credit policy
    b) The reserve Bank of India always apply a restrictive credit policy
    c) There has been a progressive increase in the statutory liquidity ratio which banks are required to maintain
    d) The demand for bank credit has not increased correspondingly
    e) None of these
16. Audit adopted by banking company is:
    a) Regular Audit & Concurrent Audit
    b) Periodical Audit
    c) Internal Audit
    d) Balance Sheet Audit
    e) None of these
17. Financial literacy is a serious issue for RBI because:
    a) It would enable better understanding of banking business
    b) With better understanding more and more people can utilize the banking services
    c) It would mean banks can do more business
    d) It would mean the maximum number of people
    e) None of these
18. The function of back office are:
    a) It verifies and settles the deals
    b) It maintains proper record if Book keeping
    c) It submits financial returns of RBI
    d) All of the above
    e) None of these
19. "Brown projects" means:
    a) Projects envisaged in metropolitan cities
    b) Projects where capital infusion is of a very high order
    c) Any project other than those for Agricultural activities
    d) Projects aimed at modernization, diversification and expansion
    e) None of these
20. The government of India has signed a USD 300 million loan pact to support the National Urban Health Mission (NUHM) with which of the following?
    a) World Bank
    b) Asian Development Bank
    c) New Development Bank
    d) All of the above
    e) None of these
21. For a foreigner temporarily residing in India, type of account to be opened is:
    a) Resident account
    b) NRO Account
    c) NRE Account
    d) All of these
    e) None of these
22. Medium-term loan will be granted:
    a) To meet working capital deficit
    b) For acquisition of fixed assets
    c) To clear short-term debts
    d) To pay public depositors
    e) None of these
23. RBI is the apex Bank of India, similarly the apex Bank of USA is called:
    a) Federal Reserve
    b) The Central Bank of USA
    c) Bank of America
    d) All of these e) None of these
24. To commemorate the International Day of Yoga, the Reserve Bank of India (RBI) recently announced to issue coins of which denominations?
    a) Rs. 2 b) Rs. 5 c) Rs. 10
    d) Rs. 50 e) Rs. 25
25. What is the government equity in the proposed Rs. 20,000 crore National Investment and Infrastructure Fund (NIIF)?
    a) 26% b) 49% c) 51%
    d) 75% e) 85%
26. Exports in India get insurance cover and risk cover from which of the following organizations?
    a) SIDBI b) NABARD
    c) ECGC d) RBI
    e) None of these
27. Which of the following banks have launched 'Dhanchayat', an educational film to raise awareness on the dangers of borrowing money from unorganised sources?
    a) State bank of India
    b) Bhartiya Mahila Bank
    c) HDFC Bank
    d) Axis Bank
    e) None of these
28. Which of the following is NOT the name of multinational bank?
    a) BNP Paribas
    b) British bank of Middle East
    c) Standard Charted Bank
    d) Cathay Pacific
    e) None of these
29. How much capital would be infused in Public Sector Banks by Union Government over a period of four years to improve capital ratio and fight with rising bad loans?
    a) Rs. 1,00,000 crore
    b) Rs. 1,75,000 crore
    c) Rs. 70,000 crore
    d) Rs. 54,000 crore
    e) Rs. 10,000 crore
30. Which of the following cannot be called as a Debt Instrument as referred in financial transactions?
    a) Certificate of Deposits
    b) Bonds c) Stocks
    d) Commercial Papers
    e) None of these
31. The bank which has launched 'PayZapp' app with a complete payment solution?
    a) IDBI b) HDFC
    c) Laxmi vilas Bank
    d) AXIS e) ICICI

Answers

1) c; 2) d; 3) c; 4) c; 5) d;
6) b; 7) a; 8) e; 9) c; 10) a;
11) b; 12) c; 13) c; 14) c; 15) c;
16) a; 17) b; 18) d; 19) d; 20) b;
21) b; 22) b; 23) a; 24) c; 25) b;
26) c; 27) c; 28) d; 29) c; 30) c;
31) b.